

మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.10.2026
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



కన్నప్ప పై కరుణ

మిసిమి

చింతనాత్మక సారస్వతం



శివ కుటుంబం

మాసపత్రిక, నవంబర్, 2026 ₹ 60/-

ISSN 2454-4329



ఆలపాటి రవీంద్రనాథ్



హర పరివార ప్రయాణం

మిసిమి

మాసపత్రిక

సంపుటి 37 సంచిక 11

నవంబరు - 2026

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

Published by

BAPANNA ALAPATI

Plot # 196, Road No. 13,
Jubilee Hills,
Hyderabad - 500 033.

Editor: **V. ASWINI KUMAR**
Ph: 994 951 6567

చందా వివరాలు:

రూ. 720/- (సంవత్సర చందా),
రూ. 1,440/- (రెండు సంవత్సరాలకు),
రూ. 2,160/- (మూడు సంవత్సరాలకు).

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

LIBRARY OF CONGRESS
LCCN 91-903060

PEER REVIEWED

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com

www.misimimonthly.com


YouTube **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

మిసిమి


నవంబరు నెల సూచికలు...

మిసిమి డైరి : రవీంద్ర స్మృతి ... 3
అక్షర వెలుగుల ఆరాధ్యుడు : ఎన్. విజయరాఘవ రెడ్డి ... 5
అశ్వఘోషుడు : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ... 7
ఆంజనేయరెడ్డి గారితో : **మిసిమి** ... 15
27వ స్నాతకోత్సవం : వి. అశ్వినీకుమార్ ... 29
జీవన మకరందం : వి. అశ్వినీకుమార్ ... 30
భారతీయ చిత్రకళారీతులు : రాయన గిరిధర్ గౌడ్ ... 31
చెలిమి కలిమికి చంద్రుడు-రవీంద్రుడి అంతరంగం : సి.ఎస్. రాంబాబు ... 33
సువర్ణపథం-మొదటి అధ్యాయం : యన్. విజయరాఘవ రెడ్డి...36
నవ్వు గెలిచింది! : ప్రకాష్‌రాజ్ ... 41
దార్శనికునికి వ్యాస షష్టి నీరాజనం : టి.వి. ప్రసాద్.... 43
బిభూతి భూషణ్-నీరద్ సి. చౌధురి : బి.వి. రామిరెడ్డి ... 44
బేతవోలు రామబ్రహ్మం : **అదిగో శీతాద్రి** : మాకినీడి సూర్య భాస్కర్... 48
రవీంద్ర మానస పుత్రిక-**మిసిమి** మాస పత్రిక : ప్రొ. తంగెడ కిషన్‌రావు ... 54
పసిమి కాంతుల **మిసిమి**-ఆలపాటి రవీంద్రనాథ్ : చెన్నూరి శివరామకృష్ణ ప్రసాద్ ... 57
సుబ్రహ్మణ్య భారతి : ప్రొ. యన్.లక్ష్మి అయ్యర్ ... 59
నూరేళ్ళనిండనున్న **గాంధీజీ ఆత్మకథ** : వేలూరి కృష్ణమూర్తి ... 63
మాలతి చందూర్ నవలలు : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి... 66
నాగేటి చాల్లల్ల : ఆర్వీ ఎన్ ... 71
రంగుల్లో రాసిన తత్త్వగ్రంథం-**రమణీయం** : ఎన్వీఆర్ ... 73
మనిషి అంతరంగాన్ని ప్రశ్నించిన **చలం** : డా. మునగా రామమోహన రావు ... 76
నాగరకత అస్తిత్వానికి నిశ్శబ్ద దర్పణం-**కళ-నాడు నేడు** : విజయ ... 78



ఆంజనేయ రెడ్డి

అట్టమీది బొమ్మలు




శివ కుటుంబం



ఆలపాటి రవీంద్రనాథ్



హర పరివార ప్రయాణం




కన్నప్పపై కరుణ

రవీంద్ర స్మృతి

మనకు లబ్ధప్రతిష్ఠులయిన సంపాదకులున్నారు. ఖాసా సుబ్బారావు, చలపతిరావు, నార్ల వెంకటేశ్వర రావు, ఎబికె ప్రసాద్, పురాణం సుబ్రహ్మణ్యశర్మ – అందరినీ మించి శివలెంక శంభుప్రసాద్ గారు తెలుగు తల్లికి ఎనలేని సేవలందించారు – తెలుగు భాషను, పలుకును కొత్తపుంతలు తొక్కించారు. అయితే ఇందులో ఒక భిన్న స్వరం మనం వింటాం – అదే **ఆలపాటి రవీంద్రనాథ్** – ఆయన సంపాదక ప్రచురణకర్త– స్వీయ శిక్షకుడు – రచయితలను పోషించి, ప్రోత్సహించిన అరుదైన సాధకుడు – మానవవాదాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించిన క్రియాశీలి–

సంపాదకులు, లబ్ధప్రతిష్ఠులని పైన చెప్పాం – ఎందుకంటే వీరు విపరీతంగా చదువుతారు – రాస్తారు – రాయిస్తారు – రచయితలకు దారి చూపుతారు – సాహిత్య సేద్యంలో కలంతో సాళ్లు వేస్తారు – డిగ్రీలు తలపై ధరించరు! నీకు ప్రతిభ లేకపోతే – డిగ్రీలు – బిరుదులు అలంకారాలే కదా!

ఈ సందర్భంగా – నార్ల పుట్టినరోజు డిశెంబరు ఒకటవ తేదీ. బెజవాడ నుండి వచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశాను రోడ్ నెం. 7, బంజారాహిల్స్‌లో వున్న **లుంబిని**కి వెళ్ళి – నాతో మరో ఇద్దరు మిత్రులున్నారు *(నార్ల జర్నల్ వాల్యూమ్ 12లో)*. సులోచన గారు పాయసం తెచ్చింది. ఆరోజు నార్ల నాతో చెప్పిన ఎన్నో విషయాలలో ఇప్పటి సందర్భానికి – వారికి ఆంధ్ర విశ్వకళాపరిషత్తు (ఆంధ్రాయూనివర్శిటీ) డాక్టరేట్ ఇచ్చి తనను తాను గౌరవించుకుంది. నార్లను సాదరంగా ఆహ్వానించి అందించారు ఆ పత్రాన్ని – నార్ల గారు ఆ తంతు పూర్తయిన తర్వాత – బయటకు వచ్చి ఒక టెలిఫోన్‌బూత్ నుంచి సులోచన గారికి ఫోన్ చేశారు. 'డా. నార్ల స్పీకింగ్' అని మొదటిసారి – చివరిసారి 'డాక్టర్' అని తన పేరుముందు వుపయోగించారు – తర్వాత ఎప్పుడూ ఎక్కడా – 'డాక్టర్' పదం తన పేరు ముందు రాయనివ్వలేదు – అదీ నార్ల నాతో చెప్పిన సంగతి.



అన్ని పత్రికలు – వ్యాపారం కాకపోయినా – ప్రకటనలు లేకుండా ఏ పత్రికా ప్రచురించిన దాఖలాలు లేవు – అందుకు మినహాయింపు **మసిమి**. పూర్తిగా వ్యాపార రహితంగా – కార్యాన్ని సాధించే యజ్ఞం – అక్షర యజ్ఞం!!

ఆ మధ్యన ఎవ్వరో శ్రేయోభిలాషి నాతో నాలుగు గంటలు కూర్చున్నారు – వందకు మించి ప్రశ్నలు వేస్తూనే వున్నారు – నేను ఏదో పని చేసుకుంటూనే వున్నాను. సినిమాలు, రాజకీయాలు, కథలు – కవితలు – వేయరా? మరి మీ పత్రిక ఎలా నడుపుతున్నారు – ప్రకటనలు తీసుకోరా? మరి నెలనెలా దినవెచ్చమెవ్వరిస్తారు? ఇదీ వారి సందేహంలో కొంత భాగం– మా పత్రిక చదవండి – ఏమి ప్రచురించి పేజీలు నింపుతున్నామో – ఏవిధంగా పాఠకులు స్పందిస్తున్నారో తెలుస్తుంది – అంటే – మీ పాలసీ ఏమిటో తెలియడం లేదని మరో పాటగాడు – గొంతెత్తి అరిచి వెళ్లాడు – ఆయన పాటలు ప్రచురించలేదని !! ఎంతోసేపు నాతో ప్రశ్నావళిని నడిపిన శ్రేయోభిలాషి – చివరిగా ఒక్కటి అడిగాడు – మీరేమి చదివారు? అని కాస్త గట్టిగానే. నేను చేస్తున్న పనిని ఆపి ఆయనవంక చూశాను. ఆయన కుతూహలాన్ని దాచుకోలేదు – నేను నవ్వి – మీరు చాలా చదివినట్లున్నారు – ప్రహ్లాదుని కథ తెలుసుకదా భాగవతంలో – **పోతనామాత్యుడు** ఏమన్నాడు? 'చదువులలో సారమెల్ల చదివితి తండ్రీ!' అని. మీకు నా సమాధానం తెలిసినట్లుంది కదా – ఆ తర్వాత ఆయన స్నేహపూర్వకంగానే శలవు తీసుకున్నాడు –

మళ్లీ సంపాదకుల దగ్గరకు వస్తే – ఎక్కువశాతం స్వీయ శిక్షకులే! ఆలపాటి రవీంద్రనాథ్ తన మేధకు సానపెట్టింది రచయిత కోసం – పాఠకుల కోసం. **చదువులో సారమెల్ల** తెలుసుకొని కీర్తి కిరీటాలకై వెంపర్లాడలేదు – పత్రికలతో కాసులవేట చేయలేదు.

తను నమ్మిన సత్యాన్ని పదిమందికి తెలిపేందుకు తపించారు –

జీవితానికి ఒక అర్థం – పరమార్థం వుండాలని అలాగే జీవించారు.

వారి **రవీంద్ర స్మృతి** చదివి ఈ మధ్య ఒక మిత్రుడు – ఇలాంటి వ్యక్తిని కలవలేకపోయాను అని వాపోయాడు. వారితో సన్నిహిత సమయాలు గడిపిన నాలాంటి వారెందరో – జ్ఞాపకాలు పదిలంగా గుర్తు చేసుకుంటారు – మాకు చోదక శక్తి **రవీంద్ర స్మృతి.**

నవంబర్ 4 శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ 105వ జయంతి



ముప్పై ఏడు సంవత్సరాలు పైగా నిరాటంకంగా వెలువడుతున్న **మిసిమి** మాసపత్రిక సంస్థాపకులు ఆలపాటి రవీంద్రనాథ్ – ఆయన – 'నేను పట్టుదలతో పనిచేస్తే ఏదైనా కాగలను, కానీ అన్నీ నేను కాలేను. మామూలు జీవితంలో పడి ఈ కాగలిగే శక్తిని విస్మరిస్తాం. నీవు నీలాగా బ్రతుకు, నీవు నీలాగా ఆలోచించు, నీవు నీలాగా ప్రేమించు – ఇలా జీవించటంలోనే అసలు నీవు ఉంటావు – అదే నీవు' – అని తన జీవితాన్ని నిర్వచించుకున్నారు ఆలపాటి. చివరికి తన జీవితం అబద్ధంగా మిగిలి పోకూడదు! ఇవాన్ ఇల్యుచ్‌లాగా! అని ఆయన అనేవారు. పూర్వాశ్రమంలో **జ్యోతి, రేరాణి, సినిమా** మాసపత్రికలు నడిపి, రావూరి భరద్వాజ, చలం, ఆరుద్ర, శారద, చౌడేశ్వరీదేవి, భుజంగరావు, శార్వరి, తాళ్ళూరి నాగేశ్వరరావు – ఇలా ఎందరో రచయితలను ప్రోత్సహించి, పారితోషికం ఇచ్చి రచనలు చేయించారు. అజ్ఞాత ప్రతిభామూర్తులు చాలామంది ఉంటారు. వారిని పసిగట్టి, లోకానికి పరిచయం చేయాలని ఆయన తపన పడేవారు.

మిసిమి ని ప్రారంభించినప్పుడు – **మిసిమి** అంటే బంగారు మెరుగు – వెన్నెల – వెన్న – ఇలా బహుళార్థాల మిళితం – అందుకు తగినట్లుగానే సంపాదక విధివిధానాలు నిర్దిష్టంగా రూపొందించారు.

హేతుబద్ధంగా – విజ్ఞానపరంగా – పరిశోధనావకాశాలతో చింతనాత్మక సారస్వతాన్ని తెలుగు పాఠకులకు అందించడమే **మిసిమి** లక్ష్యం. అయితే ఈ లక్ష్యాన్ని ఒక యజ్ఞంగా గత ముప్పై ఏడు సంవత్సరాలకు పైగా ప్రకటనలు తీసుకోకుండా – ప్రకటనలు చేయకుండా – **మిసిమి** మాస పత్రికను ప్రచురించి, పాఠకులకు అందించడం **కళాజ్యోతి యాజమాన్యం** ఎంతో ఔదార్యంగా నిర్వహిస్తోంది.

ఇప్పుడు జూబిలీహిల్స్‌లో కార్పొరేట్ కార్యాలయంలో **మిసిమి** కి ప్రత్యేక స్థానాన్ని కల్పించింది!

మిసిమి విధి విధానాలు మీకు చెప్పాలి. ఆలపాటి రవీంద్రనాథ్ ప్రత్యామ్నాయ విలువల కోసం తపించారు. ఈనాటికీ సంపాదకులు త్రికరణ శుద్ధిగా ఆ దిశలోనే పయనిస్తున్నారు.

ఏమిటి ఈ ప్రత్యామ్నాయ విలువలు? అవి సాధారణీకరించకూడదు కూడా! ఎవరి విలువలు వారివి. ఒకరు శాకాహారి – మరొకరు మాంసాహారి – అయినా వారి విలువలు వారు గౌరవించుకుంటూ ఉంటారు. సనాతన సంప్రదాయ విలువలు అందరికీ శిరోధార్యం కాకూడదని, కాలంతోపాటు ఆర్థిక విధానాలతో పాటు, సాంఘిక జీవనం పరివ్యాపకం చెందుతుంటుంది. నగర జీవితపు అస్తిత్వ వేదనలో తలోరకంగా మగ్గిపోతుంటాం. ఇక్కడ ఏ నిర్దిష్ట విలువలు అమలు కావు. కేవలం చట్టపరంగా జీవించ గలగడమే గగనమైపోతుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక పలాయనం ఒక వ్యసనం అయిపోతుంటుంది. సినిమా, మరి ఇతర క్షణిక ఆనందాల కోసం వ్యక్తి పరుగులు పెడతాడు. సరిగ్గా ఇక్కడే సారస్వతపు ఆసరా కావాలి. ఒక సినిమా – రెండు గంటలు మిమ్మల్ని మైమరపించవచ్చు – మద్యం – మత్తు పదార్థాలు కూడా కొంతసేపే – కానీ వీటికి దూరంగా బాధ్యతాయుతంగా మీకు సారస్వతాన్ని, చిత్రకళ, నాటకం, సాహిత్యం, నాట్యం, చరిత్ర, సాంఘిక జీవనం, సంగీతం – ఇలా పాఠకుల్ని బౌద్ధికంగా, ఉన్నతంగా తీర్చిదిద్దగలిగిన వ్యాసాలను, రచనలను అందించడమే **మిసిమి** లక్ష్యం. పాఠకులను ఆలోచింప చేయగలగటమే పరమార్థం. అందరికీ ఎన్నో బహుళార్థసాధకాలైన మేలిమి రచనలు **మిసిమి** ద్వారా తెలుగు పాఠకులకు అందిస్తున్నాం.

ఉదాహరణకు : కొన్ని శీర్షికలు – యుగాంత, పర్వ, ఆరోహణ (ఎస్సెంట్ ఆఫ్ మాన్), జీనోమ్ కథనమ్, షోపెన్ హావర్ రచనలు (రచయితల బాధ్యతలు), దశాబ్దాలుగా తెలుగు కవితావలోకనం – ఆలయాల నిర్మాణ విశేషాలు, తిరుమల చరిత్ర, తూర్పు దేశాల కవితా రీతులు, విశ్వదర్శనం (గ్రాండ్ డిజైన్), యాత్రాకథనాలు – విజయనగర చరిత్ర – ఇలా ఎన్నో పాఠకులందించాం! ప్రస్తుతం **విలియం డాల్రింపుల్** చారిత్రక పరిశోధక రచన **ద గోల్డెన్ రోడ్ (సువర్ణపథం)** పరంపర ఇస్తున్నాం. కథలు – కవితలు – సినిమాలు – రాజకీయాలకు దూరంగా ఉంటూ – లాభాపేక్ష లేకుండా **మిసిమి** ద్వారా గత ముప్పై ఏడు సంవత్సరాలకు పైగా సారస్వత సేవ చేస్తున్నాం. ఇందుకు మాకు ఎంతోమంది రచయితలు, మరెంతోమంది పాఠకులు వారి సహాయ సహకారాలందిస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఎందరో ప్రముఖ వ్యక్తులను **సంభాషణ** ద్వారా పరిచయం చేస్తున్నాం. ఈ అక్షర యజ్ఞానికి కర్త, కర్మ, క్రియగా **చక్రవర్తి పోషకులు కళాజ్యోతి యాజమాన్యం** – వారికి నీరాజనాలు!!

ఈ సందర్భంగా కొన్ని ప్రత్యేక వ్యాసాలు ప్రముఖ రచయితలు రాసినవి చదవండి!




– ఎన్. విజయరాఘవ రెడ్డి

అక్షరంతో సహజీవనం చేసిన మహనీయుడు : సమాజంలో కొందరు వ్యక్తులు చరిత్రలో తమకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుంటారు. మరికొందరు తమ జీవితాన్నే ఒక తెరిచిన పుస్తకంగా మారుస్తారు. కానీ, అరుదైన కొద్దిమంది మాత్రమే అక్షరాల నడుమ జీవిస్తూ, పుస్తకాలను కేవలం వస్తువులుగా కాక ఒక ప్రాణశక్తిగా భావిస్తారు. అలాంటి అరుదైన, మహోన్నతమైన వ్యక్తిత్వమే **దివంగత ఆలపాటి రవీంద్రనాథ్.**

ఆలపాటి వారి జీవితాన్ని పరిశీలిస్తే, అది కేవలం ఒక సాధారణ జీవితచరిత్రలా కనిపించదు. ప్రతి పేజీలోనూ ఒక అక్షర సైనికుడి గుండెచప్పుడు కనిపిస్తాయి. ఆయన ప్రయాణం కేవలం వ్యక్తిగత విజయాల సమాహారం కాదు, అదొక నిరంతర అక్షర యజ్ఞం.

చాలామంది ఆలపాటి రవీంద్రనాథ్‌ను ఒక ప్రచురణకర్తగా మాత్రమే చూస్తారు. కానీ అది ఆయన వ్యక్తిత్వంలో కేవలం ఒక కోణం మాత్రమే. ఆయన పుస్తకాలను మార్కెట్ సరుకులా అమ్మలేదు, పాఠకులను ప్రేమించే సంస్కారాన్ని పంపిణీ చేశారు. ఒక మంచి పుస్తకం చేతికి అందితే ఒక మనిషి ఆలోచనా విధానం మారుతుందని, ఒక గొప్ప రచన కుటుంబాన్ని నిలబెడుతుందని, ఒక గ్రంథాలయం సమాజాన్ని సంస్కరిస్తుందని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు.ఆయన ప్రతీ ప్రయత్నం వ్యాపార లాభనష్టాల సరిహద్దులను దాటి, విజ్ఞాన వికాసం గురించిన పరిపూర్ణ దృక్పథంతో సాగింది.


1963లో భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో ఆలపాటి రవీంద్రనాథ్

ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు నేలకు అనుసంధానించిన వారధి : తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ మేధస్సుతో అనుసంధానించాలనేదే ఆయన జీవితాశయం. ప్రపంచ సాహిత్యంలో వెలుగులు విసిరిన మేధావుల తత్వాలు, చరిత్రను మలుపు తిప్పిన విప్లవాత్మక ఆలోచనలు, మానవ మనస్తత్వాన్ని ఆవిష్కరించే తాత్విక గ్రంథాలను తెలుగు పాఠక లోకానికి అందించడంలో ఆయన దేదీప్యమానమైన పాత్ర పోషించారు. ఆయన చేసింది కేవలం అనువాద ప్రచురణ కాదు, రెండు భిన్న సంస్కృతుల మధ్య జరిగిన భావుకతతో కూడిన సార్థక సంభాషణ అది.

ఆలపాటి గారి దృష్టిలో గ్రంథాలయం అంటే కేవలం అతుకులు లేని గోడల మధ్య పేర్చిన పుస్తకాల అల్మారాలు కావు. అది ఆలోచనలు శాఖలు వికసించే విజ్ఞాన వనం. నందేహాలు మొలకెత్తే సారవంతమైన నేల. స్వేచ్ఛ స్వేచ్ఛగా శ్వాసించే పవిత్ర స్థలం.మానవ జీవితాన్ని మళ్లీ మళ్లీ సరిచూసుకునే ఒక సజీవ ప్రయోగశాల. అందుకే ఆయన ఎక్కడికి వెళ్లినా, ఏ వేదికపై మాట్లాడినా అక్షరం గురించే, గ్రంథాలయాల ప్రాధాన్యత గురించే మాట్లాడారు.

పాఠకుడిని గౌరవించిన ధన్యజీవి : సాధారణంగా ప్రచురణకర్తలు రచయితల వరకే ఆలోచించడం పరిపాటి. కానీ ఆలపాటి రవీంద్రనాథ్ రచయితతో పాటు పాఠకుడి సంక్షేమాన్ని కూడా సమానంగా భుజాన వేసుకున్నారు. పుస్తకం చూడగానే ఆకట్టుకునేలా అందంగా ఉండాలి. ఏ వర్గం వారైనా కొనుగోలు చేసేలా ధర అందుబాటులో ఉండాలి. తరతరాలుగా భద్రపరుచుకునేలా ముద్రణ నాణ్యత అత్యుత్తమంగా ఉండాలి.

ఈ నైతిక సూత్రాలే ఆయన ప్రచురణలను కాలం నిలబెట్టిన సజీవ గ్రంథాలుగా మార్చాయి.

రచయితలను చేయిపట్టి నడిపించిన నిశ్శబ్ద శక్తి : చరిత్రలో చాలామంది రచయితల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయి. కానీ ఆ రచయితలను వెలుగులోకి తెచ్చి, వారి వెనుక నిలబడి నడిపించిన ప్రచురణకర్తల త్యాగాలు చాలాసార్లు అగోచరంగా మిగిలిపోతాయి. ఆలపాటి రవీంద్రనాథ్ అలాంటి ఒక నిశ్శబ్ద శిల్పి. ఎంతోమంది యువ రచయితలకు వెన్నుదన్నుగా నిలిచి, భయాలను తొలగించి, అక్షర రూపమిచ్చి, సమాజం ముందు నిలబెట్టిన ఆయన రుణం తెలుగు సాహిత్య లోకం ఎప్పటికీ తీర్చుకోలేనిది.

నేడు మన చుట్టూ సమాచారం విపరీతంగా లభిస్తున్నా, నిజమైన జ్ఞానం మాత్రం కరువవుతోంది. స్క్రీన్ల హోరులో పుస్తకం వాసన మరుగవుతున్న ఈ కాలంలో ఆలపాటి రవీంద్రనాథ్ ఆదర్శాలు మరింత అత్యవసరం. "ఏది చదవాలి? ఎలా చదవాలి?" అనే వివేకాన్ని అందించే సంస్కృతిని ఆయన మనకు మిగిల్చారు. ఆ వివేకం లేకపోతే సమాచారం కేవలం శబ్దంగా మారుతుంది తప్ప, మానవత్వాన్ని మేల్కొల్పే జ్ఞానంగా రూపాంతరం చెందదు.

చరిత్రలో కొందరి పేర్లు శిలాఫలకాల మీద చెక్కబడతాయి; మరికొందరు విగ్రహాల రూపంలో నిలుస్తారు. కానీ ఆలపాటి రవీంద్రనాథ్ వంటి మహానుభావులు చదువుకునే ప్రతి పుస్తకపు పుటలోనూ, వికసించే ప్రతీ ఆలోచనలోనూ జీవిస్తారు.

మిసిమి ద్వారా ఆయన విత్తిన విజ్ఞాన బీజాలు నేడు మహావృక్షాలై తెలుగు నేలను చల్లబరుస్తున్నాయి. ఆయన మనకు వదిలివెళ్ళిన వారసత్వం కేవలం ప్రచురణల జాబితా కాదు–అదొక పఠన సంస్కృతి, ఒక గ్రంథాలయ ఉద్యమం, ఒక మేధో సంప్రదాయం.

"పుస్తకాలు మనుషులను తయారు చేస్తాయి, కానీ ఆ పుస్తకాలను మన చేతుల్లోకి చేరవేయడానికి తమ జీవితాలను త్యాగం చేసేవారు నాగరకతకు కనిపించని మహా శిల్పులు." ఆ శిల్పుల పరంపరలో ఆలపాటి రవీంద్రనాథ్ ఎప్పటికీ ఒక ధృవతారగా వెలుగొందుతూనే ఉంటారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, **మిసిమి** రూపంలోనూ, ప్రతి పాఠకుడి చేతిలోని పుస్తక రూపంలోనూ ఆయన గుండెచప్పుడు నిత్యం మారుమోగుతూనే ఉంటుంది.

యన్. విజయరాఘవ రెడ్డి
(విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి, ఆకాశవాణి,
ఫోన్ : 944 123 9803)

గాంధీజీ – నా జేబు

ఈ రోజు
నా ఫ్యాంటు జేబులో నుండి
పాతాళంలోంచి వచ్చిన ప్రతిధ్వనిలా
ఒక అరుపు వినిపించింది
తొంగి చూసాను –

విమానంలోనూ,
కారులోనూ,
ఐదు నక్షత్రాల గదుల్లోనూ
నా వెంట ప్రయాణించే
కరెన్సీ నోట్లు
ఒకదానిపై ఒకటి ఎగబడి
గాంధీజీ గొంతును
పాముల్లా చుట్టుకుని
నులిమేస్తున్నాయి

గాంధీజీ ముఖం
మడతలుపడిన నోట్లపై
ఒక ఎండిపోయిన ఆకులా
వణుకుతోంది


నా జేబుకు ఆత్రం ఎక్కువ –
ఎంత తాగినా తీరని ఎడారి దాహంలా
ఎన్ని నదులు చేరినా నిండని సముద్రంలా
కూడబెట్టే పనిలో అది తలమునకలయ్యింది

దాని చెవులకు ఏ అరుపూ చేరడం లేదు –

ఈసారి అరుపు మరింత గట్టిగా –
మబ్బుల గుండెను చీల్చిన
మెరుపులా ...

ఆ అరుపులో ఓ పిలుపు –
"నీ అవసరానికి నేనెప్పుడూ ఉన్నాను –
నన్ను పంచితే దీపాన్నవుతాను
దాచితే ఊపిరాడని ఖైదీనవుతాను
నా గొంతు ఎందుకు నులుముతున్నావ్?"

- కిల్లాడ సత్యనారాయణ



తత్వాన్నీ కవిత్వాన్నీ పెనవేసిన అశ్వఘోషుడు

పి. ఆర్. హరినాథ్



అశ్వఘోషుడు

ఆయన చేతిలో ఖడ్గం లేదు అయినా లోకాన్ని జయించాడు. ఆయన వెంట సైన్యం లేదు. అయినా చక్రవర్తులు ఆయన ముందు మోకరిల్లారు. ఆయన మాంత్రికుడు కాదు. అయినా అతడి మాటలకు పశు పక్ష్యాదులు సహితం సమ్మోహితమైపోయాయి. ద్రాక్ష పళ్ళను తేనెలో ముంచి ఎత్తినట్టుగా తత్వాన్ని కవిత్వంలో ముంచి ప్రపంచానికి ప్రసాదించాడు. ఆయన మహాకవి అశ్వఘోషుడు. బౌద్ధ సాహిత్యాన్ని, తత్వాన్ని గగనాలకు ఎత్తిన జగజ్జేగీయమాన ప్రతిభామూర్తి అక్షరకీర్తి. అశ్వఘోషుడు కేవలం ఒక కవి మాత్రమే కాదు. తాత్వికుడు, తార్కికుడు, సంగీతజ్ఞుడు కూడా. ఆయన పలికితే పండిత లోకం పల్లకీలలో ఊరేగించింది. ఆయన పాడితే సభాగారాలు సమ్మోహితమై సాష్టాంగ పడ్డాయి.

క్రీ.శ.1910-11 ప్రాంతాల్లో తుర్ఫాన్ లో దొరికిన నాటకానికి సంబంధించిన కొన్ని ఖండికలను జర్మన్ పండితుడు లూడర్స్ ప్రచురించాడు. ఇందులో భాగంగానే అశ్వఘోషుడి శారద్వతీ ప్రకరణం అచ్చయింది.అప్పటిదాకా తెలియని ఒక రహస్యం బయటపడింది. అశ్వఘోషుడిని బౌద్ధమత దార్శనికుడిగా, వేదాంతిగా మాత్రమే భావిస్తూ వచ్చిన ప్రపంచానికి ఆయనలోని అపురూపమైన సృజనాత్మకత బయటపడింది. ఒక్కసారిగా సాహిత్య లోకం ఉద్విగ్న భరితమై, ఉత్తేజితమైంది. ఆ తర్వాత అశ్వఘోషుని కాలం గురించి, రచనల గురించి ఎన్నో చర్చలు జరిగాయి. అశ్వఘోషుడు కాళిదాసు కంటే మునుపు వాడని కొందరు అనినప్పటికీ , కాళిదాసు తర్వాతనే అశ్వఘోషుడు వచ్చాడని మరికొందరు భావిస్తారు.

అశ్వఘోషుడి అసలు పేరు సునేత్రుడు. దీని గురించి పూర్తిగా చారిత్రక ఆధారాలు దొరకవు. బుద్ధ చరితంలో కూడా ఆయన గురించిన వ్యక్తిగత సమాచారం లేదు. సౌందర నందం చివరి సర్గలో ఉన్న ఒక శ్లోకంలోని **"సౌందర నందే మహాకావ్యే ఆజ్ఞా వ్యాకరణో నామాష్టదశః సర్గః ఆర్య సువర్ణాక్షి పుత్రస్య సాకేతస్య భిక్షో రాచార్య భదంతాశ్వఘోషస్య మహాకవేర్మహోవాదినః కృత్యం"**-అనే మాటల ఆధారంగా ఆయన గౌరవనీయ వ్యక్తి, సువర్ణాక్షి అనే పేరు కలిగిన వ్యక్తికి కొడుకు, సాకేతం లేదా అయోధ్యనివాసి, గురువు, విశిష్ట బౌద్ధ సన్యాసి, మహాకవి, గొప్ప తార్కికుడు అని తెలుస్తుంది. సారనాథ్‌లో ఉండే అశోక స్తంభ శాసనంలో 'అశ్వఘోష రాజ' అనే మాట ఉంది. మఠాధిపతులను, పురోహితులను, గురువులను మహారాజ శబ్దంతో పేర్కొనడం సాధారణంగా జరుగుతుంది. ఆ దృష్టితో అశ్వఘోషునికి కూడా గురు స్థాయిలో గౌరవం ఉందని తెలుస్తుంది. ఒక ఆధ్యాత్మిక గురువు ఒక మహాకవిగా ఉండడం చాలా అరుదైన విషయం. దీనికి తోడు ఆయన గొప్ప వాదనా పటిమ ఉన్నవాడు కూడా. ఇవన్నీ ఒకదానికొకటి భిన్నమైన అంశాలు. కల్పనను దూరంగా పెట్టే తర్కం-కల్పనా వైభవాలు ఉన్న కావ్యం, విరక్త జీవితాన్ని ప్రేరేపించే తాత్విక గురుత్వం-జీవన మాధుర్యాన్ని తెలిపే సౌందర్య దృక్పథం ఇలా పరస్పర వైరుధ్యం ఉన్న విషయాలు ఆయనలో కనిపిస్తాయి.

అశ్వఘోషుడు ఇంకా బౌద్ధం స్వీకరించని నాటి గాథ ఒకటి ఉంది. ఆ రోజులలో బౌద్ధ భిక్షువులు ఆహారం కోసం ఇంటిముందు కొయ్య పాత్రను మోగించేవారట. అలా మోగిస్తే ఊరిలో ఉన్నవాళ్ళు ఆ బౌద్ధ భిక్షువుకు ఆహారం ఇచ్చేవారు. అశ్వఘోషుడు దీనిని గమనించి ఒక షరతు విధించాడు. ఏ బౌద్ధుడైనా సరే తనతో వాదించి నెగ్గితేనే వారికి ఆహారం ఇవ్వాలి అని. ఆ రోజులలో



వాదనా పటిమలో అశ్వఘోషుడిని మించిన వాళ్ళు లేరు. పాత్రను మోగించడానికి వచ్చిన ప్రతి బౌద్ధ భిక్షువు ఆయనతో వాదించి గెలిస్తేనే ఆహారం. ఆయనతో వాదించడానికి వచ్చిన వాళ్ళెతే ఉన్నారు కానీ గెలిచిన వాళ్ళు లేరు. వాదానికి వచ్చిన అందరినీ ఆయన పరాజితులను చేసేవారు. ఆయన తార్కిక ప్రతిభ అలాంటిది. అలాంటి రోజులలో ఒక వృద్ధ పండితుడు వచ్చాడు.ఆయన కూడా బౌద్ధుడే.ఈ నియమం గురించి విన్నాడు.అశ్వఘోషుడితో వాదించడానికి ముందుకు వచ్చాడు. ఆ వచ్చిన పండితుడికి అశ్వఘోషుడికి ఇద్దరికీ మధ్య వాదన ఆరంభమైంది. వచ్చినవాడు సామాన్యుడు కాడు.అపారమైన తెలివితేటలతో అశ్వఘోషుడిని ఓడించాడు. ఆ వచ్చిన వ్యక్తి ఆ నాటికి బౌద్ధ మతంలో పరమ ప్రసిద్ధుడైన పార్శ్వుడు. ఆ వాదనను ఎదిరించలేక అశ్వఘోషుడు ఆయనకు శిష్యుడైపోయి బౌద్ధాన్ని స్వీకరించాడు. బౌద్ధమత ప్రచారానికి పూనుకున్నాడు కూడా.

అశ్వఘోషుడిని అమితంగా గౌరవించి ఆదరించిన కనిష్కుడు, కుషాన్ వంశంలో ప్రసిద్ధుడైన రెండవ కార్డ్ ఫైసిస్ తర్వాత (క్రీస్తుశకం 125 నుంచి 152 దాకా) సింహాసనానికి వచ్చాడు. ఇతను తూర్పు దిక్కు పాటలీపుత్రం దాకా, ఉత్తరం వైపు తుర్కిస్తాన్ ప్రాంతం దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. ఆ తర్వాత ఆయన సింధు నదీ ముఖద్వారం దాకా వెళ్లి అక్కడ పరిపాలిస్తున్న పార్థియన్ రాజును గెలిచాడు. ఆ తర్వాత కాశ్మీర్ ప్రాంతాన్ని గెలుచుకున్నాడు.అక్కడ ఒక పట్టణాన్ని స్థాపించి దానికి కనిష్కపురం అని పేరు పెట్టాడు.అది ప్రస్తుతం శ్రీనగర్ నుంచి బారాముల్ల (వరాహమూల)కు వెళ్ళే దారిలో ఒక పల్లెగా ఉంది.ఆ తర్వాత కనిష్కుడు పాటలీపుత్రంపై దాడి చేశాడు. యుద్ధంలో పాటలీ పుత్ర రాజు ఓడిపోయాడు. ఆ రాజుకు కనిష్కునికి మధ్య ఒక ఒప్పందం జరిగింది. దాని ప్రకారం ఓడిన రాజు కొంత ధనాన్ని, కానుకలను కనిష్కుడికి ఇవ్వాలి. అలా కనిష్కుడు అడిగినంత ధనం పాటలీపుత్ర రాజు దగ్గర లేదు. అందువల్ల కొంత ధనం మాత్రమే ఇవ్వగలిగాడు. దాదాపుగా లక్ష సువర్ణ నాణేలు ఇంకా ఇవ్వాల్సి ఉంది. దానికి సమాన విలువగా బౌద్ధ మత గురువు అశ్వఘోషుడిని ఒక కానుకగా తాను తీసుకుంటానని కనిష్కుడు అన్నాడు. ఒక సన్యాసి లక్ష సువర్ణ నాణేల విలువ చేస్తాడా అని కనిష్కుని మంత్రులు సందేహ పడ్డారు. అశ్వఘోషుడి ప్రతిభ ఎంతటిదో తెలియపరచడం కోసం మంత్రులను, పురప్రముఖులను పిలిపించి మహారాజు ఒక సభ ఏర్పాటు చేసి అందులో అశ్వఘోషుడి చేత బౌద్ధ ధర్మ పఠనం చేయించాడు. అశ్వఘోషుడు సంగీతం కూడా తెలిసినవాడు. గంభీరమైన, మధురమైన, శ్రావ్యమైన కంఠ ధ్వనితో బౌద్ధ ధర్మవైభవాన్ని విన్పించాడు. ఆ స్వర మాధుర్యానికి అక్కడ ఉన్న గుర్రాలు కూడా గడ్డి తినడం ఆపి చెవులు రిక్కించి ఆయన పలుకులను విన్నాయట. అప్పటి నుంచి ఆయన పేరు అశ్వఘోషుడు అయింది. ఆయన ఎంతటి మహానుభావుడో ఎంతటి మహా తత్వజ్ఞుడో తెలిశాక మంత్రులు ఆయనకు కైమోడ్చి తమ అజ్ఞానానికి చెంపలు వేసుకున్నారు.

ఆ తర్వాత రోజుల్లో కనిష్కుడికి అశ్వఘోషుడు గురువయ్యాడు. మహాయాన సంప్రదాయానికి మూల పురుషుల్లో ఒకడయ్యాడు. మహాయాన శ్రద్ధోత్పాదము, వజ్రసూచి, సౌందరనందము, బుద్ధచరిత, గండీ స్తోత్రము, శారిపుత్ర ప్రకరణము వంటివి ఆయన రచనలుగా పేరుపొందాయి. బౌద్ధ సంప్రదాయాన్ని దీప్తిమంతం చేసిన మహా ప్రతిభా మూర్తి అశ్వఘోషుడు. ఇతని కావ్య రచనలే తర్వాత వాళ్ళకు దారి దీపాలయ్యాయి. కొంతమంది అశ్వఘోషుడికి 'మాతృచేతుడు' అనే పేరు ఉంది అని చెబుతారు. 'శత పంచాశతిక' అనే పుస్తకాన్ని రాసింది ఈ అశ్వఘోషుడే అంటారు. కానీ దానికి బలమైన సాక్ష్యాలు లేవు. అలాగే, బోధనకు భాషా శక్తి, అలంకార వైభవం, వాక్ చాతుర్యం ఉండాలని తెలుపుతూ, వీటి ప్రయోగ విధానం గురించి అశ్వఘోషుడు ''సూత్రాలంకారం' రాశాడు. 'ఆర్య సూర్యుడు' అని అశ్వఘోషుడికి మరో పేరుగా ఉంది. సరళ శైలిలో బౌద్ధ ధర్మం గురించి చెప్పడంలో ఆయన ప్రవీణుడు. అశ్వఘోషుడి ప్రభావం చాలా విస్తృతమైనది.

సర్వాస్తివాదులకు రెండు రకాల వినయ గ్రంథాలు ఉన్నాయి. మధురలో ఒకటి, కాశ్మీర్లో మరొకటి. మొదటి దానిలో కథా భాగాలు ఉన్నాయి. వీటికి అవధానం లేదా జాతకం అనే పేర్లు ఉన్నాయి. కాశ్మీర శైలిలో అవధానాలు లేవు. సంస్కృతంలో దివ్యావధానం అనే గ్రంథం ఉంది. ఇందులోని కథా భాగాలు ధర్మ స్వరూప చిత్రణ చేస్తాయి.

వీటన్నిటికీ మూలం అశ్వఘోషుని బుద్ధచరితము, సౌందరనందము.

కనిష్కుడు విరామ సమయంలో బౌద్ధ గ్రంథాలను చదివేవాడు. దానికోసం ప్రతిరోజు ఒక బౌద్ధ సన్యాసి వచ్చేవారు. ఆ సన్యాసి పర్యవేక్షణలో అధ్యయనం సాగేది. అయితే ఇలా అధ్యయనం చేస్తున్నప్పుడు బౌద్ధానికి సంబంధించి వివిధ రకాల వరంవరలకు చెందిన అంశాలు పరస్పరం సంవదించకపోవడంతో కనిష్కుడికి అయోమయంగా అనిపించింది. అతడి ప్రధాన సలహాదారుడు ప్రసిద్ధ గురువు అయిన పార్శ్వుడిని పిలిచి ఒక సూచన చేశాడు. ఇన్ని రకాల సిద్ధాంతాలలో దేనిని అనుసరించాలి? సత్యశోధనకు మార్గం ఏది? ఎలా నిర్ణయించాలి? 'దీని కోసం ఒక పండిత సభను ఏర్పాటు చేసి నిర్ణయం చేయండి' అన్నాడు. పార్శ్వుడు దానికి అంగీకరించి ఏర్పాట్లు చేయడం మొదలుపెట్టాడు. పండిత సభను ఎక్కడ జరపాలి అనే ప్రశ్న తలెత్తింది. ఈ సభను రాజధాని గాంధార దేశంలో జరవమని కనిష్కుడు అన్నాడు. అయితే అక్కడ వేడి వాతావరణం తట్టుకోవడం కష్టం అని అందరూ అభ్యంతర పెట్టారు. ఆ తర్వాత మరొకరు మగధలోని రాజగృహను సూచించారు. ఇక్కడే మొదటి సభ జరిగింది. ఆ తర్వాత చివరికి కాశ్మీర్ దగ్గర ఉండే 'కుందలవనం' అనే బౌద్ధారామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సభ జరపాలి అని నిశ్చయమైంది. దీనికి వసుమిత్రుడు అధ్యక్షుడు. ఈ ప్రతిష్టాత్మకమైన సభకు ఉపాధ్యక్షుడిగా పాటలీపుత్రం నుంచి తీసుకురాబడిన అశ్వఘోషుడిని నియమించారు. దాదాపుగా ఐదువేల మంది పండితులు ఈ సభకు వచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతోమంది వచ్చారు. క్షుణ్ణంగా వ్యాఖ్యానాలు రచించారు. మహావిభాష అనే గ్రంథం ఇలాగే రూపుదిద్దుకుంది. ఇది ఇప్పటికీ చైనా భాషలో లభ్యమవుతుందని ప్రతీతి. ఇలా పండితులు చేసిన వ్యాఖ్యానాలను రాగి పలకలపై భద్రపరిచి దీని కోసమే నిర్మించిన ఒక స్తూపంలో ఆ పలకలను నిక్షిప్తం చేశారు. ఈ స్తూపం శ్రీనగర్‌కు సమీపంలో ఉంది.

ఒక ఆధ్యాత్మిక గురువు మహాకవిగా ఉండడం ఒక అరుదైన విషయం. అశ్వఘోషుడిలో తాత్వికుడికి ఉండే చింతన ఉంది. మేధావికి ఉండే తర్కం ఉంది. కవికి ఉండే సృజనాత్మకత ఉంది. విరాగికి ఉండే విరక్త చిత్తం కూడా ఉంది. ఇవన్నీ కలిసిన ఒక అపురూపమైన వ్యక్తిత్వం ఆయనది. వైదిక ధర్మశాస్త్రం గురించిన అంశాలను ఎంతగా అధ్యయనం చేశాడో బౌద్ధానికి సంబంధించిన అంశాలను కూడా అంతే లోతుగా అధ్యయనం చేశాడు. అందుకే బుద్ధచరితలాంటి కావ్యాలలో ఈ రెంటి గురించిన వివేచన కనిపిస్తుంది.

బుద్ధుడు చెప్పిన కవుల్లో తనను ఒకనిగా చెప్పుకున్నాడు అశ్వఘోషుడు. కవుల గురించి బుద్ధుడు నాలుగు భేదాలను తెలిపాడు. "చత్తారో ఇమే భిక్ఖవే కవి కథమే చత్తారో చింతా కవి, సూత కవి, అత్త కవి, పతిబాణ కవి. మొదటి రకం చింతా కవి-అంటే చింతన చేసేవాడు, పరిశీలించేవాడు, మౌలికమైన ఆలోచనచేసేవాడు, సృజనకర్త. రెండవ రకం-సూత కవి-అంటే శ్రుత పాండిత్యం ఉన్నవాడు, సంప్రదాయమార్గంలో నేర్చుకున్న విద్యను అనుసరించి అభ్యాసవశాత్తూ కవి అయినవాడు. మరోరకం అత్త కవి. అంటే అర్థ కవి. భావ ప్రధానంగా, బోధాత్మక కవిత్వాన్ని రాసేవాడు. చివరి వర్గం పతిబాణ కవి. అంటే ప్రతిభావంతుడైన కవి. సహజ ప్రతిభ, సద్య స్ఫురణం ఉన్నవాడు. వీటి గురించి అశ్వఘోషుడు నేను ఈ కవులలో అత్త కవిని. అర్థాన్ని, బోధను మనస్సులో ఉంచుకొని రచన చేసే కవిని అని స్పష్టం చేశాడు.

సౌందరనంద కావ్యం వెలువడడానికి ముందే పాళి భాషలో దానికి సమాంతర రూపాలు చాలా వెలువడ్డాయి. ఈ కావ్యంలో కనిపించే విశిష్టమైన అంశం-సన్యాసం. ఇంద్రియ మోహాన్ని వదిలిపెట్టడం, సంసార బంధం నుంచి విముక్తి పొందడం బౌద్ధ మార్గాన్ని స్వీకరించడానికి ఒక తప్పనిసరి అంశంగా ఆయన చూపిస్తాడు. అయితే ఇదే విషయంలో నందుడు నుందరిని విడిచిపెట్టి బౌద్ధంలోకి ప్రవేశించే ఘట్టాన్ని ఎంతో వేదనతో కూడిన అంశంగా చిత్రీకరించాడు. అశ్వఘోషుడి కావ్య దృష్టి ఇక్కడే ప్రత్యేకంగా కనిపిస్తుంది. విరక్తి అన్నది భిక్షుకత్వంలో తప్పనిసరి. సన్యాసంలో వైరాగ్యం ఒక తప్పనిసరి అంశం. అయితే అత్యంత మోహబద్ధుడైన మనిషి తన భార్యను సంసార జీవితాన్ని ఒకసారిగా విడిచిపెట్టడం సులభం కాదు. తనకు శిరోముండనం జరుగుతున్నప్పుడు నందుడు దుఃఖించాడు. భార్యను విడిచి రావడం గురించి తనలో



తాను బాధ పడ్డాడు దీనిని అశ్వఘోషుడు చాలా గాఢంగా పరిశీలించాడు. ఇందులో ఒక మానవీయమైన బంధం ఉంది అని గుర్తించాడు. ఆ చిత్రణలో ఆయన సఫలీకృతుడయ్యాడు.

సౌందర నందం అంటే కేవలం బౌద్ధ ధర్మోపదేశం చేసే గ్రంథంలా అశ్వఘోషుడు రచించలేదు. దానిని ఒక మహాకావ్యంగా నిర్మించాడు. అందులో ప్రేమ ఉంది. నాయికా నాయకుల విరహ వేదన ఉంది. సంసారం నుంచి సన్యాసం వైపు మనసును మళ్ళించే ఒక బలమైన ప్రయత్నం ఉంది. అందులోనే అప్సరసల పట్ల మోహం, ఆ ఆకర్షణ పరిహాసానికి గురి కాగా చివరికి మనసులో కలిగే వైరాగ్యం అన్నీ వరుసగా ఒకదాని తర్వాత ఒకటి వస్తాయి. ఇది జీవితం. ఆ జీవితాన్ని చిత్రించడంలో అశ్వఘోషుడి ప్రతిభ అసాధారణ స్థాయిని చేరుకుంది. దీని గురించి ఈవియాటర్ షుల్మన్ లోతుగా చర్చించారు. ఆయన ప్రకారం, పాళీ భాషలో కథనాలు చాలా ఉన్నాయి. ఉదానలో కథ చాలా చిన్నది. అక్కడ సందేశమే ప్రధాన విషయం. అందువల్ల ఆ కథ కూడా చాలా చిన్నది. బ్రహ్మచర్య జీవితంతో సంతోషంగా లేను–ఈ పవిత్ర జీవితాన్ని నేను భరించలేకపోతున్నాను–కాబట్టి తిరిగి గృహ జీవితానికి వెళ్తాను అని నందుడు బుద్ధుడితో అంటాడు. ఉదానలో ఉన్న కథ ప్రకారం అతని మనసులో ఉన్న ప్రియురాలు జనపద కళ్యాణి. నందుడు బుద్ధుడితో వెళ్తున్నప్పుడు ఆమె 'త్వరగా తిరిగి రమ్మంటుంది. ఆ మాట నందుని మనసులో మారుమ్రోగుతూ ఉంటుంది. ఇక్కడ మోహాన్ని గుర్తించిన బుద్ధుడు స్వర్గానికి తీసుకెళ్లి అప్సరసలను చూపించాడు. 'నీ భార్య జనపద కళ్యాణితో పోలిస్తే వీరు ఎలా ఉన్నారు' అని అంటాడు. అక్కడ నందుడు తన భార్య పట్ల ఏవగింపు కలిగి అప్సరసల పట్ల ఆకర్షితుడు అవుతాడు. జనపద కళ్యాణిని ఒక కాలిపోయి అవయవాలు దెబ్బతిన్న ఆడ కోతితో పోలుస్తాడు. ఇప్పటిదాకా భార్య ఒక్కతే తన ప్రపంచం అనుకుంటున్న వ్యక్తి అంతకంటే అందగత్తె కనిపించేసరికి అటువైపు మనసు మళ్ళించాడు. ఇది ఇంద్రియ ఆకర్షణ. అశాశ్వతమైన ఆకర్షణ గురించి నందుడికి స్పష్టమయ్యేలాగా బుద్ధుడు ఈ అప్సరసల మాయను కల్పించాడు–అని ఉదాన కథ. ఆ తర్వాత కామాన్ని గుర్తించి నందుడు పరివర్తన చెందాడన్నది కథాంశం. ఇక తేరి గాథలో మరో నందుడు కనిపిస్తాడు. అక్కడ చాలా నంద అనే పేరుతో కనిపించే స్త్రీల గాథలు ఉన్నాయి. రూప నంద, సుందరీ నంద ఇలాంటి పేర్లు కనిపిస్తాయి. ఇందులో కూడా శరీరం, సౌందర్యం నశ్వరమైనవని చెప్పడమే కనిపిస్తుంది. జాతక కథలో మరొక నందుని కథ ఉంది. నందుడు అప్సర స్త్రీలను పొందడం కోసం ధ్యానం చేస్తుంటాడు. భిక్షువులు అతన్ని ఎగతాళి చేస్తారు. అప్పుడు అతనికి తన ప్రవర్తన వ్యర్థమైనదిగా తెలుస్తుంది. ఆ కోరికను వదిలిపెట్టి అర్హత్వాన్ని పొందుతాడు. ఇక్కడ ఇంత వేగంగా మార్పు ఎలా సంభవించింది? దీనికి జాతక కథ ఒక కారణాన్ని చెబుతుంది. సాధారణంగా జాతక కథలు గత జన్మల గురించి మాట్లాడుతూ ఉంటాయి. ఆ ప్రకారం గత జన్మలో నందుడు ఏనుగు. బోధిసత్వుడు దానికి శిక్షకుడు. బోధిసత్వుడు ఆ ఏనుగుకు ధైర్యాన్ని చెబుతాడు. సంకోచాలను తొలగిస్తాడు. యుద్ధంలో శత్రువుల మధ్య దూసుకెళ్లే శక్తిని ఇస్తాడు. ఇవన్నీ బోధిసత్వుని ప్రభావంతో కలిగాయి. ఆ గత జన్మ సంస్కారం ప్రస్తుతం నందునిలో ఉండి చాలా త్వరగానే అతడు తన సంకోచాలను దాటి విముక్తి పొందాడు.

ధర్మపాద అట్ట కథలో నందుని ఘట్టం కాస్త భిన్నంగా ఉంటుంది. నందుడు బుద్ధుడి వెంట నడుస్తూ ఉంటాడు. సన్యాసం తీసుకోవడానికి వెనుకాడుతూ ఉంటాడు. కానీ చేతిలో భిక్షా పాత్ర ఉంది. ముందు నడుస్తున్న బుద్ధుడు వెనక్కు తిరుగుతాడనీ, తన చేతిలో ఉండే భిక్షా పాత్రను తిరిగి తీసుకుంటాడనీ నందుడు ఆశపడుతూ ఉంటాడు. కానీ బుద్ధుడు అలా చేయడు. నీవు భిక్షుకుడిగా మారు అని చెబుతాడు. నందుడికి 'కా'దనే ధైర్యం లేదు. 'అలాగే' అంటాడు. ఈ ఘట్టం అశ్వఘోషుని కల్పనకు భిన్నమైనది. ధర్మపాద అట్ట కథలో బుద్ధుడు ఆధ్యాత్మిక అధికారం కలిగిన నాయకుడు. ఇక అశ్వఘోషుని ప్రత్యేకత ఎక్కడి నుంచి వచ్చింది అని విశ్లేషించి చివరికి షుల్మన్ ఇక్కడ స్పష్టం చేశాడు. నందుడు–ఉదానలో కోరికకు బానిసైపోయిన వ్యక్తి; జాతకంలో గత సంస్కారాలతో ముడిపడ్డవాడు; ధర్మపాద అట్ట కథలో బుద్ధుని ఆజ్ఞకు లోబడి ప్రవర్తించే శిష్యుడు; అశ్వఘోషుని సౌందర నందంలో మాత్రం ప్రేమించేవాడు, బాధపడేవాడు, తిరుగుబాటు చేసేవాడు,

తప్పు చేసేవాడు, తప్పు నుంచి నేర్చుకునేవాడు, చివరకు తనంతట తానే విముక్తి మార్గాన్ని పొందే ఒక సంపూర్ణ మానవుడు.ఇది సౌందర నందంలో ఉండే ప్రత్యేకత.

శ్రీ ఈవియాటర్ షుల్మన్ చేసిన విశ్లేషణ ప్రకారం, సౌందరనందంలో బుద్ధుడు అంతర్గతమైన సత్యానికి ప్రతీక. కవి బుద్ధుడిని ఉదయిస్తున్న సూర్యుడితో పోల్చి చెప్పాడు. సూర్యుడు చీకటిని తొలగిస్తాడు. అలాగే నందుడి విషయంలో తదితర శిష్యుల విషయంలో వారి అజ్ఞాన తిమిరాన్ని బుద్ధుడు తొలగిస్తాడు.. విముక్తికి అవసరమైన జ్ఞాన బీజం నందుడిలో బలహీనంగా ఉందని అది బంధాలతో పెనవేసుకుని క్లేశాల ధూళితో మకిలి పట్టి ఉందని బుద్ధుడు గ్రహిస్తాడు. దానిని తొలగించడానికి ఒక గురువుగా అతడు జోక్యం చేసుకున్నాడు. నందుని మనసులో ఉన్న వైరాగ్య భావాన్ని వెలికి తీయడానికి ఒక మార్గదర్శకుడిగా ఆయన చూపిన ఒక దారి అది.

శైశవే అభ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణాం వార్ధకే ముని వృత్తీణాం యోగేనాంత్యే తనుత్యజాం (వారు బాల్యంలో విద్యలను అభ్యసిస్తారు. యవ్వనంలో గార్హస్థ్య జీవితాన్ని అనుభవిస్తారు. వృద్ధాప్యంలో వానప్రస్థం అవలంబిస్తారు. అంత్య సమయంలో యోగమార్గంలో దేహత్యాగం చేస్తారు) అని భారతీయ సంప్రదాయ మార్గం. వైదిక సాహిత్యం మనిషి జీవితాన్ని బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అని నాలుగు ఆశ్రమాలుగా విభజించింది. అశ్వఘోషుడికి ఈ నేపథ్యం ఉంది. అయితే ఆయన కావ్య నాయకులైన బుద్ధుడు, నందుడు ఇద్దరూ యవ్వనంలో ఉండగానే సన్యాసులయ్యారు. ప్రముఖ ఇండాలజిస్ట్ శ్రీ పాట్రిక్ ఒలివేలే ప్రకారం, ఇక్కడ అశ్వఘోషుడు ఒక తాత్విక విరోధాన్ని సృష్టిస్తాడు. అడవికి వెళ్తున్న బుద్ధుడితో తండ్రి అడిగాడు. 'ఎందుకు వెళ్తున్నావు? 'బుద్ధుడు అన్నాడు 'ధర్మాన్ని అన్వేషించడానికి.' శుద్ధోదనుడు అన్నాడు నువ్వు ధర్మాన్ని అనుసరించాలనే ఉద్దేశంతో వెళ్తున్నావు కానీ నీవు వెళ్ళడమే అధర్మం. ఇది సన్యాసం స్వీకరించాల్సిన దశ కాదు. ఇది గృహస్థుగా ఉండవలసిన దశ అని తండ్రి మాటల్లోని అంతరార్థం. ఇక్కడ వివిధ కోణాల నుంచి కవి వివేచింప చేస్తాడు. యవ్వనం అనేది భోగించాల్సిన కాలం. ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం ప్రాథమిక పురుషార్థాలనీ, వీటిని నిర్లక్ష్యం చేయకూడదనీ ఉదయి అంటాడు. నీకు యవ్వనం వచ్చింది. రాజ్యం ఉంది. సంపద ఉంది. సౌందర్యం, భోగాలు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ వదిలిపెట్టి అడవికి వెళ్ళడం దేనికి? ఇది అక్కడ ప్రశ్న. ఇది కేవలం భోగాన్ని ప్రేరేపించే మాట కాదు. చతుర్విధ ఆశ్రమాల క్రమం పాటించాలనీ, తర్వాతే వెళ్ళాలనీ ఆయన ఉద్దేశం. శుద్ధోదనుడు మాట్లాడుతున్న మాటలకు నేపథ్యంగా ఉదయి వాదన కూడా కనిపిస్తుంది. భారతీయ ధర్మంలో గృహస్థాశ్రమం చాలా ముఖ్యమైనది. అది కేవలం భోగం కాదు. గృహస్థాశ్రమంలో చాలా బాధ్యతలున్నాయి. ఈ దృష్టితో శుద్ధోదనుడు వ్యతిరేకించాడు. సిద్ధార్థుని నిర్ణయం సరైంది కాదన్నాడు. పై తర్కం ప్రకారం భోగాలన్నీ అనుభవించిన తర్వాత వైరాగ్యం రావాలి. ఇక్కడ బుద్ధుడు తిరుగులేని ప్రశ్న వేస్తాడు. "జీవితం అనిత్యమైందనీ తెలుసు. అశాశ్వతమైందననీ తెలుసు. మరి మోక్షం కోసం చేసే ప్రయత్నాన్ని వృద్ధాప్యం దాకా ఎందుకు వాయిదా వేయాలి? ముసలితనం వస్తుందనీ, మరణం వస్తుందనీ, దుఃఖం తప్పదనీ ముందే తెలిసినప్పుడు-భోగాల ననుభవించి, దాని నుంచి దుఃఖాలననుభవించి ఆ తర్వాత నేను ఎప్పుడో మోక్షాన్ని వెతుక్కుంటాను అనడంలో ఏ మాత్రం సామంజస్యం ఉంది?". ఆయన ప్రశ్న భోగాలపైన అనహనం కాదు. నిత్య చంచలశీలమైన మనిషి జీవితంలోని అనిత్యత గురించి ఆలోచన. అందుకని బుద్ధుడు బ్రహ్మచర్యం, యౌవనం, వానప్రస్థం, సన్యాసం అనే చతుర్విధ ఆశ్రమక్రమాన్ని మార్చేశాడు. యవ్వనంలోనే జీవితపు అనిత్యతను దర్శించడం వైరాగ్యాన్ని పొందడం, సన్యాసాన్ని సాధించడం అనే క్రమాన్ని పెట్టాడు. మోక్షానికి అర్హత వయసుతో నిర్ణయించబడుతుందా? లేక జ్ఞానానికి సిద్ధపడిన మనసుతో నిర్ణయించబడుతుందా? అనే ప్రశ్న బుద్ధుడిది. అశ్వఘోషుడు ఈ విషయాన్ని ఒక ఉపన్యాసం లాగా చెప్పకుండా తండ్రి, కొడుకు, మిత్రుడు, పురోహితుడు, రాజకుమారుడు ఇలాంటి పాత్రలను సృష్టించి వాళ్ళ సంభాషణల ద్వారా శ్రోత మనసులో నాటుకునేలాగా నాటకీయంగా చెబుతాడు. ధర్మానికి, మోక్షానికి జరిగే ఒక తాత్విక సంఘర్షణను ఆయన పాత్రల సంభాషణలో ఆవిష్కరించాడు. అశ్వఘోషుడు వైదిక సంప్రదాయాన్ని వ్యతిరేకించడు. తార్కికంగా ఆలోచించమని



చెబుతాడు-'ఎవడో ముసలివాళ్ళయ్యాక సన్యాసం తీసుకొమ్మని మీరంటారు - వృద్ధాప్యం వచ్చేవరకు జీవితం ఉంటుందని ఎవరు హామీ ఇచ్చారు? విముక్తి అవసరం తెలిసినప్పుడు దానిని రేపటి వరకు ఎందుకు వాయిదా వేయాలి?'. అనే ఈ విషయాన్ని కవి చాలా నిపుణంగా చెబుతాడు. ఉదయి కామం గురించి మాట్లాడతాడు. శుద్ధోదనుడు ధర్మం గురించి మాట్లాడతాడు. రాజ సలహాదారు ధర్మార్థ కామాల గురించి మాట్లాడతాడు. యశోధర దాంపత్యం గురించి మాట్లాడుతుంది. పురోహితుడు గృహస్థ ధర్మం గురించి మాట్లాడతాడు అశ్వఘోషుడు ముందుగా ప్రత్యర్థుల వాదాలను ప్రవేశపెడతాడు. వీరి మాటలన్నిటినీ పరాస్తం చేస్తూ సమాధానం దొరకని ప్రశ్నను నంధిస్తాడు. ఇదీ అశ్వఘోషుని వాదనాపటిమ. ఇంత గొప్ప కవి అయిన అశ్వఘోషుడు తరువాతి సంస్కృత సాహిత్య సంప్రదాయంలో దాదాపు ఎందుకు కనుమరుగయ్యాడు? విమర్శకులు శ్రీ ఆర్ ద్వివేది దీనికి ప్రధానమైన కారణాలను మూడింటిని ఊహిస్తున్నారు.

1. సంస్కృత రససంప్రదాయంలో శాంత రసానికి చాలా ఆలస్యంగా ప్రాముఖ్యత వచ్చింది. అశ్వఘోషుడి కవిత్వంలో శాంతరసం పెనవేసుకుని ఉంటుంది. కానీ ఆ రసానికి తగిన స్థానం ఏర్పడే సమయానికి ఆ కవిత్వం విస్మృతిలోకి వెళ్లిపోయింది.
2. **అశ్వఘోషుడి ప్రధాన కవితా ప్రయోజనం :** శృంగారం - వైరాగ్యం-మోక్షం అనే క్రమంలో సాగుతుంది. అందువల్ల తరువాత వచ్చిన శృంగారకేంద్రిత సాహిత్య సంప్రదాయానికి ఆయన కవిత్వం అంతగా అనుకూలంగా కనిపించకపోయి ఉండవచ్చు.
3. క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి వామనుడు వంటి ఆలంకారికులు తమ గ్రంథాలలో ఇతర కవుల ఉదాహరణలను విస్తృతంగా ఉల్లేఖించారు. దురదృష్టవశాత్తూ అప్పటికి అశ్వఘోషుడు దాదాపు విస్మృతుడయ్యాడు. అంతకుముందు ఉన్న భామహుడు, దండి, ఉద్భటుడు వంటి ఆలంకారికులు తమ స్వీయ రచనల నుంచి ఉదాహరణలనిచ్చారు. ప్రత్యేకంగా శాంతరసానికి సంబంధించిన అశ్వఘోషుడి కవితా వైశిష్ట్యాన్ని వారు గుర్తించినట్లు కనిపించదు. అశ్వఘోషుడి రచనలలో కథాపరంగా చూస్తే సౌందరనందం తొలి రచనగా బుద్ధ చరితం దానికి కొనసాగింపుగా అనిపించడం సహజం. కీత్ వంటి పరిశోధకులు సౌందరనంద కావ్యాన్ని తొలిరచనగా భావించారు. విమర్శకుల ప్రకారం కావ్య నిర్మాణ చాతుర్యం, దక్షత వంటి లక్షణాలు బుద్ధచరితంలో కంటే సౌందరనందంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కవితా సౌందర్యం, కళాత్మక వ్యక్తీకరణ పరంగా బుద్ధచరితం కంటే నిస్సందేహంగా సౌందరనందం ఉన్నతమైనదనీ మరికొందరు అభిప్రాయపడ్డారు.

అశ్వఘోషుడు కవిగా తాత్వికుడిగా ఎదిగే కొద్దీ అభివ్యక్తికూడా పదునెక్కింది. ప్రాపంచిక సమస్యలని చిత్రిస్తున్నప్పుడు ఆయన కేవలం ఒక వేదాంతిలాగానో, కవి లాగానో చెప్పడు. యదార్థ జీవనానుభవాల పట్ల కళ్లు మూసుకోడు. జీవితాన్ని చిత్రిస్తాడు. అందులోని సంఘర్షణను ఆవిష్కరిస్తాడు. ఆయన రచనలలో గుర్తుండిపోయే శ్లోకాలు ఎన్నో ఉన్నాయి. మనసుని కలవరపరిచే వృద్ధాప్యం, మరణం వంటి విషయాల గురించి బుద్ధుడు చింతించిన సన్నివేశాన్ని వర్ణిస్తూ కవి అంటాడు :

ఇత్యేవముక్తే చలితః స కించిద్రాజాత్మజః సూత మిదం బభాషే
కిమేష దోషో భవితా మమాపీత్యస్మై తతః సారథిరభ్యువాచ

(ఈ మాటలనీ విని రాకుమారుడు కదిలిపోయాడు. సారథితో అన్నాడు 'ఈ దోషం నాకు కూడా కలుగుతుందా?') పాఠకుడి మనస్సులో బుద్ధుని ప్రశ్న ప్రతిధ్వనిస్తుంది. తన రచనా వ్యూహాన్ని ప్రకటిస్తూ కవి అంటాడు :

ఇత్యేషావ్యుపశాంతయే న రతయే మోక్షార్థగర్భా కృతిః
శ్రోత్రాణాం గ్రహణార్థమన్య మనసాం కావ్యోపచారాత్మృతా
యన్మోక్షాత్మృతమన్యదత్ర హి మయా తత్కామ్య ధర్మాకృతం
పాతుం తిక్తమివౌషధం మధుమయం హృద్యం కథం స్యాదితి

(ఈ రచన మోక్షమార్గంతో నిండింది. కేవలం ఆనందం కోసం కాదు. శ్రోతలను ఆకర్షించడానికి అందమైన కావ్యధర్మాన్ని అనుసరించాను. వైద్యుడు చేదు మందును ఇచ్చేటప్పుడు దానికి తేనెను కలిపినట్లుగా వైరాగ్యాన్ని కవిత్వంతో అద్ది చెప్పాను)

బుద్ధచరితం 17 సర్గల మహా కావ్యం. అందులో 13 సర్గలు దొరికాయి.తక్కినవి అలభ్యం కావడంతో మిగిలిన నాలుగు సర్గలను అమృతానందుడు అనే నేపాల కవి 1830 ప్రాంతంలో పూరించాడు. కావ్యం చాలా సరళ శైలిలో నడుస్తుంది. చిన్న చిన్న సమాసాలు ఉంటాయి. కొన్ని శ్లోకాల్లో సమాసాలు ఉండవు. తేలిక మాటలే ఉంటాయి. నాలుగు శబ్దాల కంటే ఎక్కువ సమాసాలు ఉండవు. ఉపమాలంకారం ఎక్కువగా కనిపిస్తుంది. ఆలంకారిక అభివ్యక్తి కావ్యంలో అనేకత్ర ఆవిష్కృతమైంది. మచ్చుకు ఒక ఉదాహరణ. బుద్ధుడి తపోదీక్షను భగ్నం చేయాలని మారుడు యత్నించాడు. అతని బాణాలు విఫలమయ్యాయి. ఆ సందర్భంలో కవి అంటాడు–

శైలేంద్ర పుత్రీం ప్రతియేన యిద్దో దేవోపి శంభుశ్చలితో బభూవ
న చింతయతి ఏషా తమేవ బాణం కింస్యాత్ అచిత్తో న శరః స ఏషః

(ఏ బాణం తగిలి శివుడు పార్వతిని చూసి చంచలించి పోయాడో ఆ బాణాన్ని బుద్ధుడు లెక్క చేయడం లేదే బుద్ధుడికి మనస్సు లేదా లేక ఈ బాణం ఆ బాణం కాదా)

తస్తుస్య పరివార్యై నం మన్మధాక్షిప్త చేతసః
నిశ్చలైః ప్రీతివికచైః పిబంత్యైవ లోచనే

(అప్పుడు ఆ స్త్రీలు బుద్ధుడి చుట్టూ నిలిచారు. వారి మనస్సులన్నీ మన్మథగ్రస్తమైనాయి. కళ్లు ఇష్టంతో విప్పారి ఉన్నాయి. నేత్రాలతోనే తాగుతున్నారా అన్నట్లు చూస్తున్నారు.)

ముహుర్ముహు మద వ్యాజ ప్రస్త నీలాంశుకాపరా
అలక్ష్య రసనా రేజే స్ఫురత్ విద్యుదివ క్షపా

(మరొక స్త్రీ నీలిరంగు వస్త్రాలను కట్టుకుని ఉంది. ఉద్దేశ్యపూర్వకంగానే మత్తులో ఉన్నట్లు నటిస్తూంది. కావాలనే వస్త్రాలను జారుస్తూంది. రాత్రివేళ మెరుపు మెరిసినట్లు నాలుకను చూపుతూ కవ్విస్తూంది.)

ఫుల్లం కురువకం పశ్య నిర్ముక్తాలక ప్రభం
యో నఖ ప్రభయా స్త్రీణాం నిర్భర్పిత ఇవానతః

(బాగా విచ్చుకున్న ఈ గోరింట పువ్వును చూడు ఈ స్త్రీల గోళ్ళ రంగును చూసి సిగ్గుతో అవమాన భారంతో తలదించుకున్నట్టుగా లేదూ) బుద్ధుడిని దారి మళ్ళించడానికి స్త్రీలు విఫల ప్రయత్నాలు చేశారు. స్త్రీ సౌందర్యానికి ఎవరైనా వశం కావాల్సిందే అని చెప్తూ, పురాణ ఋషుల గురించి గురుపుత్రుడు ఉదాయి స్త్రీలతో చెప్తాడు .

శక్తాశ్చాలయితుం యూయం వీతరాగానృషీనపి
అప్సరోభిశ్చ కలితాన్ గ్రహీతు విబుధానపి

(వీతరాగి అయిన ఋషి కూడా చలించి మీ వెంటపడేలా చేయగలరు. అప్సరలని వలచే దేవతలు కూడా మీకై ఆరాటపడేలా చేయగల శక్తి మీది)

విశ్వామిత్రో మహర్షిశ్చ విగాధోపి మహత్తపాः
దశవర్షాణ్యరణ్యస్థో ఘృతాచ్యాప్సరసా హృతః

(విశిష్ట తపస్సు చేసిన విశ్వామిత్రుడు కూడా ఘృతాచి అనే అప్సర వ్యామోహంలో పదేళ్ల పాటు అడవిలో మోహపరవశుడైపోయాడు.)

సా పద్మరాగ వసనం వసానా పద్మానినా పద్మదళాయతాక్షీ
పద్మా విపద్మా పతితేవ లక్ష్మీः శుశోష పద్మస్రగివాతపేన

(ఆమె పద్మరాగం వన్నెతో ఎర్రగా ఉన్న వస్త్రాలను కట్టుకుని ఉంది. ఆమె వదనం పద్మం లాగా ఉంది కళ్ళు విశాలంగా పద్మాల రేకులలాగా ఉన్నాయి. పద్మంలో ఉండాల్సిన లక్ష్మీదేవి పద్మం నుండి పడిపోయినట్లు ఆమె కళ తప్పింది. ఎండకు వాడిపోయిన పద్మాల మాలలా ఉంది). ఈ శ్లోకం అంతటా ఒక్క పద్మమే ఉపమానం. కానీ అన్వయం మాత్రం భిన్నభిన్న అంశాలకు చెందింది.

స కామ రాగేణ నిగృహ్యమాణో ధర్మానురాగేణ చ కృష్యమాణः
జగామ దుఃఖేన వివర్తమానः ప్లవः ప్రతిస్రోత ఇవాపగాయాः

(నందుడిని ప్రేమానురాగం వెనక్కు లాగుతూంది. ధర్మానురాగం ముందుకు లాగుతూంది. దుఃఖంతో వెనక్కు తిరిగి చూస్తూ ముందుకు నడుస్తూ, ప్రవాహానికి ఎదురు వెళ్ళే పడవ లాగా ఉన్నాడు)

తం గౌరవం బుద్ధగతం చకర్ష భార్యానురాగः పునరాచకర్ష
సోనిశ్చయాన్నపి యయౌ నతస్థౌతరంస్తరంగేష్వివ రాజహంసः

(బుద్ధుని మీద గౌరవం ముందుకు తోస్తూంది. సుందరి మీద అనురాగం మళ్ళీ వెనక్కు లాగుతూంది. ఎటూ నిశ్చయించుకోలేక ఊగిసలాడుతూ ఉన్న నందుడు అలల మధ్య ఉన్న రాజహంసలా ఉన్నాడు.)

బుద్ధచరిత్రంలో చెప్పని అంశాలను కవి సౌందరనందంలో చెప్పాడు. ఒక విధంగా ఇవి పరస్పర పూరకాలు.ఒక సంసారి సన్యాసి కావడం సాధ్యమా అనే

ప్రశ్నకు సమాధానంగా ఒక సద్గురువు దొరికితే సాధ్యమే అని చెప్పినట్లు ఈ రెండు కావ్యాలూ కనిపిస్తాయి. కావ్య రచనకు సంబంధించి అశ్వఘోషుడు విభిన్న ఛందో ప్రయోగాలు చేశాడు. అనుష్టప్, శిఖరిణి, వంశస్థం, మందాక్రాంత వంటి ఛందోభేదాలు ఉన్నాయి. ఉపమాలంకారం విస్తృతంగా ఉంది. ఆ తర్వాత యమకం, దీపకాలంకారం కనిపిస్తాయి అర్థాంతరన్యాసం మృగ్యం. **చరతే భిక్షవే చారికం బహుజన హితాయ బహుజన సుఖాయ లోకానుకంపా యథాయ హితాయ సుఖాయ దేవ మనుష్యాణాం**

(ఓ భిక్షువులారా, అందరి శ్రేయస్సును కోరండి. ప్రపంచం పట్ల దయతో ఉండండి. దేవతలకు మనుషులకు కూడా హితాన్ని సుఖాన్ని కలిగింపజేయండి. అందరికీ మంచి కలిగిస్తూ ధర్మయాత్ర చేయండి) అని వినయపిటకం చెప్పింది. అశ్వఘోషుడు ఈ లోకానుకంపం గురించి విస్తారంగా చెప్పాడు.

అశ్వఘోషుడి రచనలలో రాష్ట్రపాల నాటకం ఒకటి. దీని గురించి ఒక ఆసక్తికరమైన వివరం తెలుస్తోంది. అశ్వఘోషుడు పాటలీపుత్ర నగరంలో ధర్మాన్ని బోధిస్తూ సంచారం చేస్తూ ఉండేవాడు. ఆ సందర్భంలో రాష్ట్రపాల అనే పేరుతో ఒక రమ్యమైన పాటను రచించాడు. ఆ గీతంలో దుఃఖం, శూన్యత, అనాత్మ మొదలైన అంశాలున్నాయి. మాయామయమైన ఈ సంసారం గురించి కవి మనోహరంగా చెప్పాడు. 'రాజపదవులు గొప్పగా కనిపిస్తాయి. కానీ అవి ఏనాడైనా అదృశ్యం అయిపోవచ్చు. అవి అశాశ్వతమైనవి. ఆకాశంలో మేఘాలలాగా చూస్తూండగానే కరిగిపోతాయి. అంతా శూన్యం. ఈ శరీరం ఒక గజ దొంగ. మనలను కొల్లగొడుతుంది. ఈ దేహం మన మిత్రుడు కాదు. అది విషసర్పం దాగిన పంజరం లాంటిది.'. ఈ విధంగా సాగే ఈ గీతంలో అశ్వఘోషుడు జీవితంలోని దుఃఖం గురించి చెప్పాడు. దీనిని ఒక కళారూపంగా ప్రదర్శించాలని ఆయన ఆశపడ్డాడు. అలా తయారు చేసి ప్రదర్శనకు కూడా సిద్ధం చేశాడు. అయితే అభినయం చేయడానికి వచ్చిన కళాకారులకుఆ పాట అంతరార్థం తెలియలేదు. వారికి తత్త్వం గురించిన అవగాహన లేదు. కవి ఉద్దేశించిన భావాన్ని వాళ్లు అభినయించలేక పోతున్నారు. అశ్వఘోషుడు ఇక వీరితో ప్రయోజనం లేదనుకున్నాడు. తానే ఒక గృహస్థు లాగా వేషం వేసుకుని రంగప్రవేశం చేశాడు. స్వయంగా అపురూప స్వరమాధుర్యం ఉన్నవాడు, సంగీతంలో ప్రతిభావంతుడు కావడంతో వాయిద్యాలను తానే వాయిస్తూ పాడాడు. పాటలోని భావాన్ని అద్భుతంగా అభివ్యక్తీకరించాడు. జీవన విషాదం గురించి అతడు చేసిన బోధ ఆనాడు ఎంత ప్రభావం చూపిందంటే, ఆ ప్రదర్శనకు వచ్చిన అయిదు వందలమంది రాజకుమారులు సంసారం పట్ల విరక్తులై బౌద్ధాన్ని స్వీకరించారు. కవిగా అది అశ్వఘోషుడి విజయం. ఈ విషయం తెలిసిన పాటలీపుత్ర రాజు భయపడి పోయాడు. అందరూ ఇలా సన్యాసులైపోతే రాజ్యం ప్రజా శూన్యమైపోతుంది-పాలన సాగదు-అని ఆ నాటకాన్ని నిషేధించాడు

కాలం కొంతమంది కవులను సృష్టిస్తుంది. మరికొంతమంది కవులు కాలాన్నే పునఃసృష్టిస్తారు. అశ్వఘోషుడు ఈ రెండవ కోవకు చెందినవాడు. బుద్ధుని జీవితం ఆయనకు ఒక కథ కాదు-ఒక ఉజ్జ్వలప్రేరణ. బౌద్ధం ఆయనకు ఒక సిద్ధాంతం కాదు-మానవ అంతరంగ అన్వేషణామార్గం. ఆ నిరంతరతార్కిక చైతన్యం ఆయనలో మహాకవిత్వ జ్వాలా విస్ఫోటనకు దారితీసింది.

ఏకస్య తిష్ఠతి కవేర్గృహ ఏవ కావ్యమన్యస్య గచ్ఛతి సుహృద్భవనాని యావత్
న్యస్యా విదగ్ధపదనేషు పదాని శశ్వత్ కస్యాపి సంచరతి విశ్వకుతూహలీవ

'ఒక కవి కావ్యం రచిస్తాడు. అది అతడి ఇల్లు దాటదు. మరొక కవి రాస్తాడు. అది అతడి మిత్రుల ఇంటిదాకా వెళ్తుంది. మరి కొందరు రచిస్తారు. అవి ప్రపంచ యాత్ర చేస్తాయి'. అశ్వఘోషుడి కవిత్వం అలాంటిది. ఆయన కవిత్వంలో తత్త్వం తళతళలాడుతుంది. సౌందర్యం మిలమిలలాడుతుంది. అశ్వఘోషుడు భారతీయ సంస్కృత కావ్యసంప్రదాయంలో ఒక సామాన్య కవి కాదు -తత్త్వానికీ కవిత్వానికీ మధ్య మనోహర వారధి. బంధం నుంచి మోక్షానికి నడిపే మహిత మనోసారథి.

ఆచార్య పి. ఆర్. హరినాథ్,
తెలుగు ఆచార్యులు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,
మైసూర్, ఫోన్ : 948 044 3108

మతమెప్పుడూ నైతికతను బోధించాలి

చెన్నూరి ఆంజనేయ రెడ్డి

- మిసిమి



ఆంజనేయ రెడ్డి


మిసిమి పాఠకులకు చెన్నూరి ఆంజనేయరెడ్డిగారు కొత్తేమీ కాదు. పత్రికకు ఆయన దిక్సూచిగా ఎప్పుడూ ఉన్నారు. ఐపిఎస్ అధికారిగా ఆయనది మచ్చలేని కెరీర్. వ్యక్తిగా అణువణువునా బుద్ధుని బోధలను నింపుకున్న నిండుమనిషి. నైతికత మనిషికి ముఖ్యం. ఆ నైతికత బౌద్ధంతోనే సాధ్యమంటారు. ఆయన్ని కదిపితే మతంపై ఆయన వెలిబుచ్చే అభిప్రాయాలు మనకు కటువుగా తోస్తాయి. దేన్నయినా సూటిగా వాడిగా చెప్పటం ఆయన నైజం.. ఢిల్లీలో సివిల్స్‌కు కోచింగ్ తీసుకున్న ఆయన అటువంటి సౌకర్యం తెలుగు అభ్యర్థులకుండాలని యాభై ఏళ్ళ కితమే (1976) హైదరాబాద్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఎంతోమందికి సాయపడ్డారు. మనిషి మెత్తగా మృదువుగా కనిపిస్తారు కానీ ఆచరణలో మాత్రం కఠినంగా ఉండటమే విశేషం. మహేంద్రగిరి హిల్స్ (సికింద్రాబాద్)లో "మహాబోధి బుద్ధవిహార" ఏర్పాటుచేయటంలో ఆయన పాత్రమరువలేనిది. దీనికోసం థాయ్‌లాండ్ నుంచి బుద్ధుని అవశేషాలు తెప్పించి భద్రపరిచారు. ఆయన టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్.డి.గా ఉన్నప్పుడే నాగార్జున సాగర్ వద్ద బుద్ధవనం ఏర్పాటు చేశారు.

మిసిమి వ్యవస్థాపకులు ఆలపాటి రవీంద్రనాథ్ గారికి అత్యంత ఆప్తులు ఆంజనేయరెడ్డిగారు. అందువల్లనే మిసిమితోను, రవీంద్రనాథ్ గారితోనూ వారిది విడదీయరాని అనుబంధం. నవంబర్ నెల రవీంద్రనాథ్ గారి జయంతి నెల. ఆ సందర్భంగా ఆంజనేయరెడ్డిగారితో అశ్వినీకుమార్ జరిపిన సంభాషణ మిసిమి పాఠకులకు అందించటం ఆనందం కలిగించే విషయం కదా. ఈ సంభాషణలో చాలా విషయాలను ఇరువురూ చాలా నిశితంగా చర్చించారు. ఆంజనేయరెడ్డిగారి నిజాయితీని బౌద్ధం పట్ల, బౌద్ధంలోని నైతికతపట్ల వారికున్న అచంచల విశ్వాసాన్ని మనం చూడవొచ్చు. బౌద్ధం వారినెందుకంత ఆకర్షించిందంటే కారణం వారి నిరంతర గ్రంథ పఠనమనిపిస్తుంది. ఎనభైమూడేళ్ళ వయసులో చరిత్రపై వారికి తగ్గని ఆసక్తి, చరిత్ర పరిశోధనపై వస్తున్న సరికొత్త పుస్తకాలను ఆయన ఉటంకించిన తీరు ముచ్చట కలిగించింది. ఈ ఇద్దరి మధ్యా ఉత్కంఠభరితంగా సాగిన సంభాషణలో కొంత వైవిధ్యం, కొంత వైరుధ్యం ఉన్నట్టు తోచినా అందులో అంతర్లీనంగా ఉండే ఆత్మీయత మిమ్మల్ని అబ్బురపరుస్తుందని మా నమ్మకం.. ఇంకెందుకు ఆలస్యం..

మిసిమి: ఆంజనేయరెడ్డి గారు.. మిసిమికి స్వాగతం. మిసిమి మీకు కొత్త కాదు. ఇప్పటికీ మిసిమి సంపాదక మండలికి ప్రధాన సలహాదారు. మీకెన్నో వ్యాపకాలు.. బుద్ధవిహార్, బుద్ధవనం నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బౌద్ధకేంద్రాల బాధ్యతలు, ఎన్నో సేవా కార్యక్రమాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎక్కడాపాలో కూడా తెలియదు.. మీ జీవితాన్ని ఎన్నో పాయలుగా ఒక సేవా ప్రవాహంగా చూస్తాను నేను. అవన్నీ బుద్ధుడనే మహాసాగరంలో పునీతంగా సంగమం చెందుతుంటాయి. మీగురించి చెప్పాలంటే ఇదొక భాగం మా?త్రమే. మీరు ఐపియస్ అధికారిగా పోలీసు శాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించారు. ఏపి యస్.ఆర్.టి.సి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్లకు చైర్మన్‌గా ఉన్నారు. వాటిల్లో మౌలికమైన మార్పులు తెచ్చి అభివృద్ధి పథంలో నడిపారు. నిస్వార్థంగా వేలమందికి ఉపాధి కల్పించారు. పద్మాలు బురదలోంచే వస్తాయి. కానీ స్వచ్ఛంగా ఉంటాయి. చుట్టూ నీరు

ఉన్నా ఆ నీరు తామరాకును అంటుకోదు. ఇదెందుకు చెబుతున్నానో మీకు తెలుసు. పదిహేనేళ్ళుగా మిమ్మల్ని గమనిస్తున్నాను. మీ పరిచయం అదృష్టం అనుకుంటాను. మిమ్మల్ని పరిశీలిస్తే ఆశ్చర్యం అనిపించింది. అందుకని మీ వ్యక్తిత్వాన్ని పట్టి చూపే రెండు భాగాలకు పరిమితమై మీతో సంభాషణ సాగిస్తాను. ఎందుకంటే మీ జీవితంలోని అన్ని పార్శ్వాలను తడిమి చూడటం సాధ్యం కాదనుకుంటాను. అందులో మొదటిది మీ చదువు, మీరు సివిల్ సర్వీసెస్‌లోకి ఎలా వచ్చారు? ఎందుకంటే వ్యాపారం నుంచి విద్యవరకు, సినిమాలనుంచి రాజకీయాలవరకు వారసత్వ పరంపర దాపరికం లేకుండా సాగుతోంది. అంటే నిస్సిగ్గుగా వారసులను ప్రమోట్ చేసుకుంటున్నారు. మీరు ఐపిఎస్‌లోకి ఎలా వచ్చారు? మీ కుటుంబంలో ఎవరైనా ఉన్నారా? రెండవది మీలోకి బుద్ధుడు ఎలా ప్రవేశించాడు? మీరు చదివిన సాహిత్యం కారణమా? ఏదైనా మొనాస్ట్రీలో ఉన్నారా? వైదికమతధోరణులపై వ్యతిరేకతా? బౌద్ధసేవా కార్యక్రమాల ప్రచారంకై బుద్ధుడే మిమ్మల్ని ప్రేరేపించాడా? ఇవన్నీ *మిసిమి* పాఠకులకు వివరంగా చెప్పాలి. "మీరు ఎంతోమందిని పరిచయం చేస్తున్నారు. అంజనేయరెడ్డిగారిని ఎందుకు చేయరని" నన్ను చాలామంది అడిగారు. మా రాంబాబు కూడా అడిగాడు. ఈ సంభాషణ ప్రధానంగా పాఠకుల కోరికపైనే అని చెప్పక తప్పదు. నాకు మీ వ్యక్తిత్వం గురించి, మీ ఆచరణ గురించి సందేహాలు లేవు. కానీ *మిసిమి* పాఠకులకు చెప్పాలి కదా. మీరు విపులంగా చెప్పండి, వివరంగా చెప్పండి. ఒక పోలీసు అధికారిని ఈవిధంగా ఎన్నడూ చూడలేదు.

అంజనేయ రెడ్డి : సేవారంగంలో చాలామంది ఉన్నారు, నేనొక్కడినే కాదు. ఉదాహరణకు నారాయణరెడ్డి అనే సబ్ ఇన్స్పెక్టర్. డియస్పీగా రిటైర్ అయ్యాడు. ఒకపక్క ఉద్యోగం చేస్తూనే మరోపక్క ఆయన గుహల పరిశోధన (speleologist)గా తనకున్న ఆసక్తితో చేస్తుండేవాడు. ఆయన అంతర్జాతీయంగా గుహలను శోధించే నివుణుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఇలాంటివారు చాలామందున్నారులెండి.



చెన్నూరికి చెన్నూరి సమ్మానం

***మిసిమి*: మీరు సివిల్ సర్వీసెస్‌లో ఫామిలీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఎలా వచ్చారు?**

అంజనేయరెడ్డి : మా కుటుంబంలో మొదటగా హైస్కూల్ వరకూ వెళ్ళింది నేనే. అలాగని మావాళ్ళంతా నిరక్షరాస్యులు కాదు. మా నాయనకు ఆయన అన్నదమ్ములకు సంప్రదాయంగా నేర్చుకున్నవేవో వచ్చు. మనుచరిత్రము, వసుచరిత్ర ఇవన్నీ కంఠస్థం వచ్చు. అలాగే భర్తృహరి సుభాషితాలు కూడా. వారంతా వ్యవసాయం వృత్తిగా కలిగినవారే. అంటే భూస్వాములు కాదు. వారు వ్యవసాయం చేసే మధ్యతరగతి రైతులు. మాది గూడూరు పక్కనున్న చెన్నూరు అనే గ్రామం. చాలా పురాతనమైనది. అక్కడినుంచి మా పూర్వీకులు ఇప్పుడున్న మత్తాపురం గ్రామానికి వలస వచ్చారు. ఇది పెన్నానది ఒడ్డున ఉంటుంది. కాబట్టి నీటి వసతికి కొదవలేదు. మా పూర్వీకులతో పాటు, ఆ గ్రామంలోని ఇతర కుటుంబాలవాళ్ళు కూడా వలస వచ్చారు. ఇదెప్పుడనుకున్నారు 1857ప్రాంతంలో. నెల్లూరుకు ఇరవైకిలోమీటర్ల దూరంలో దువ్వూరు గ్రామం ఉంటుంది. అక్కడినుండి పెన్నా నదివైపు మూడుకిలోమీటర్ల దూరంలో మత్తాపురం గ్రామం ఉంటుంది.

***మిసిమి*: మీ పాఠశాల విద్య ఎక్కడ జరిగింది?**

అంజనేయ రెడ్డి : బుచ్చిరెడ్డిపాలెంలో. అది బెజవాడ గోపాలరెడ్డిగారి ఊరు. మా హైస్కూలు కట్టించింది బెజవాడ రామచంద్రారెడ్డి. ఆయన మద్రాసు ప్రెసెడెన్సీలో స్పీకరుగా ఉండేవాడు. వీళ్ళిద్దరూ బంధువులు

కాదు. నెల్లూరు తరవాత ఆరోజుల్లో హైస్కూలున్నది బుచ్చిరెడ్డిపాలెంలోనే. మేం ముగ్గురం సోదరులం. నేను పెద్దవాడిని. రెండోవాడు ఇక్కడే ఒక ఇండస్ట్రీ నడుపుతున్నాడు. మూడోవాడు ఇంకా వ్యవసాయం చేస్తున్నాడు. మా తండ్రిగారి హయాంలో.. ఆరోజుల్లో వారి తరం వారికి సంప్రదాయ విద్య ఉండేది. కొంచెం సంస్కృతం వచ్చేది, కావ్యాలను కంఠస్థం చేయించటం, రైతుకు అవసరమైనంత మేర గణితం నేర్పటం ఉండేవి. దాంతోటి పిల్లలను చదివించాలన్న కోరిక కూడా వాళ్ళకు ఉండేది. మా అమ్మగారి నాయన అంటే మాతాతది ఆసక్తికరమైన నేపథ్యం. ఆయన గ్రామ మునసబుగా ఉండేవారు. వారి ఊరు కూడా నెల్లూరు పక్కనే. ఆ ఊరిలో వీరశైవ గుళ్ళు, శివాలాయాలు, చెన్నకేశవ ఆలయం ఉన్నాయి. దాదాపు వెయ్యేళ్ళ నాటి గ్రామం. ఆ ఊరిలో కులాలవారీగా వీధులుండేవి. ఒకవీధిని బ్రాహ్మణశ్రేణి అనేవారు. అక్కడ బ్రాహ్మల ఇళ్ళు మాత్రమే ఉండేవి. ఇంకోటి రెడ్ల వీధి. ఈ రకంగా అన్నికులాలకు వీధులుండేవి. మా తాత గ్రామ మునసబు అని చెప్పానుకదా. ఆయనకు మా అమ్మ ఒక్కతే సంతానం. ఆయనకు కొడుకులు లేకపోవటంతో వీలునామాలో ఆయన తదనంతరం మునసబు పదవి తన మనవడికి దక్కాలని రాశాడు. ఆ రోజుల్లో మునసబు పదవి వంశపారంపర్యం. దాన్ని మా అమ్మ తరఫు బంధువులందరూ తిరస్కరించారు. మద్రాసు హైకోర్టుకు వెళ్ళారు. అది ఆంధ్రప్రదేశ్ ఏర్పడి హైదరాబాద్ కోర్టు ఏర్పడేవరకూ ఆ లిటిగేషన్ కేసు సాగింది. అప్పటికి మా నాయన మున్సిఫ్ పరీక్ష పాసయి ఉన్నాడు. ఆయన కేసు గెలిచి ఆర్నెల్లు మాత్రమే ఆ ఉద్యోగంలో ఉన్నాడు. ఆ తర్వాత ఆ పోస్టును ఆయన దగ్గర మిత్రుడు చదలవాడ నరసయ్య (ఆయన్ని నర్సన్న అనేవాడు మా నాయన. వాళ్ళది కోస్తానుంచి వచ్చి సెటిలయిన కమ్మ కుటుంబం)కు ఇవ్వమని ప్రభుత్వానికి అప్పీలు చేశాడు. ఎందుకంటే నరసయ్య కూడా మున్సిఫ్ పరీక్ష పాసయి ఉన్నాడు. విచిత్రమేమిటంటే ప్రభుత్వం ఆ అప్పీలును అంగీకరించి ఆ పదవి లేదా ఉద్యోగం ఆయనకు (నరసయ్యకు) కట్టబెట్టింది. మొదట్లో ఆడవారికి ఈ పదవి ఇచ్చేవారు కాదు, తర్వాత వారికి కూడా అవకాశం కల్పించటం మొదలుపెట్టారు. ఇక మానాయన తండ్రి అంటే paternal grandfather చాలా తెలివిగలవాడని అంటారు. ఆయన నలభైఐదేళ్ళకే కాలం చేశాడు కానీ చాలా చురుకైనవాడు. ఆయన పశువుల అమ్మకాలు చేస్తుండేవాడు. అంటే cattle business. నెల్లూరి నుండి బర్రెలను కర్నాటకకు తీసుకువెళ్ళ అమ్మేటువంటి ఈ వ్యాపారం చేస్తుండేవాడు. ఈ తీసుకువెళ్ళేవారికి సర్దార్లని, డ్రైవర్లని వారికి పేర్లుండేవి. వాళ్ళని క్యాటిల్ వాకర్సనేవారు. అక్కడక్కడా ఒకటి రెండురోజులు ఆగి వాటి ఆలనాపాలనా చూస్తుండేవారు వారు. అదంత ఈజీ బిజినెస్సయితే కాదు. ఆశ్చర్యపోతారు మీరు. వాటికి వాయిదాల పద్ధతిలో డబ్బు చెల్లిస్తూ ఉండేవారు. ఒకేసారి డబ్బివ్వకపోవటానికి పేదరికం కారణం కావొచ్చు. కానీ ఆరోజుల్లో మనుషులను ఎంతగా నమ్మేవారో చూడండి. అలాగే మైసూరునుంచి ఎడ్లను కొనుగోలు చేసి తెస్తుండేవాడు. ఆయనకు కన్నడం బాగా వచ్చు. మా ఊరికి మొదటిసారి కాఫీ తెచ్చింది ఆయనే. మనదగ్గర కాఫీతోటలు లేవు. అవన్నీ కర్నాటకలోనే ఉన్నాయి. ఇంకో విషయమేమిటంటే ఎండ వలన పశువులను రాత్రిపూట నడిపించే వారుట. ఉదయమంతా ఎండుంటుందని. ఈరకంగా డబ్బు సంపాదించినా హార్డ్ లైఫ్ ఆయనది అని నాకనిపిస్తుంది. మా నాయన వాళ్ళు నలుగురు బ్రదర్స్. ఒకతను చనిపోయాడు. వాళ్ళ ఇంకో అంకుల్ కూడా చనిపోయాడు. వాళ్ళిద్దరి పేర్లూ శంకరరెడ్డి. అప్పటి నుండీ మా ఫ్యామిలిలో శంకరరెడ్డి పేరు పెట్టరు. సెంటిమెంట్ అంత బలంగా ఉండేదప్పుడు. అలాగే మా ఫాదర్ సోదరులంతా కలిసికట్టుగా ఉండేవారు. వీళ్ళకో అరవై ఎకరాల భూమి ఉండేది. వీళ్ళంతా కష్టపడి ముఖ్యంగా రాత్రులు బాగా వర్క్ చేసి ఆ భూమిని చదును చేసి డెల్టాలోకి తీసుకొచ్చారు. ఇరవై ఎకరాలు మామిడితోట ఉండేది. మిగిలింది పశువుల మేతకోసం ఉపయోగించేవారు. వరి పంట వేసినప్పుడు పశువుల మేత కోసం నల్లమల పంపించేవారు. అక్కడ మూడు, నాలుగు నెలలుండేవి ఆ



పశువులు. ఆవిధంగా మా గ్రామం సంపన్నమైనదనే చెప్పాలి. మా ఊరిలో పాలు, పెరుగు అమ్మేవారు కాదు. ఊరికినే పాలు, పెరుగు అలాగే కూరగాయలు ఒకళ్ళకొకళ్ళకు ఇచ్చిపుచ్చుకునేవారు. పాల సహకార సంఘాలు వచ్చాక ఊరిలోని వారి ఆర్థిక పరపతి మరింత పెరిగింది.

తొలిరోజుల్లో నెల్లూరు జిల్లాలో క్రైస్తవం ప్రభావం ఎక్కువ. అమెరికన్ బాప్టిస్టు మిషన్, రోమన్ కేథలిక్ మిషన్.. ఇలాంటి సంస్థలు చురుకుగా ఉండేవి. దానివలన చాలామంది షెడ్యూల్డు కులాల వారు క్రైస్తవాన్ని పాటించేవారు. మా ఊళ్ళో మొదటి గ్రాడ్యుయేట్ షెడ్యూల్డు కులాలకు చెందిన వ్యక్తే.. పి.ఎస్.రెడ్డి అని వేరుశనగ పంటలో స్పెషలిస్టు అయిన రైతు ఒకాయన ఉండేవారు. ఆయన మా ఊరిలో రెండవ గ్యాడ్యుయేటు. ఆయన పుస్తకాలు లండన్‌లో పబ్లిష్ అయినాయి. నేను గ్రాడ్యుయేట్ అయిన మూడోవ్యక్తిని. మా ఊరి జనాభా రెండువేలుంటుంది. ఇదీ నా నేపథ్యం. ఇంకో ఇంట్రెస్టింగ్ విషయమేమిటంటే మా అమ్మకు ముగ్గురు మగపిల్లలు కావటంతో ఆమె ముగ్గురినీ చూసుకోలేదని, నేను మా అమ్మమ్మ, తాతయ్యల దగ్గరే ఎక్కువగా పెరిగాను. అక్కడ చెరువు చెంచయ్య అనే బ్రాహ్మిన్ ఉండేవాడు. టెన్త్ పాసయ్యాడో, ఫెయిలయ్యాడో కానీ పోస్టాఫీసులో ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగంలో చేరాడు. చదువుతున్నప్పుడే ఉద్యోగం వచ్చింది. చేరిపోయాడు. కొంచెం మనిషికి కోపమెక్కువ. ఆయన భార్య సావిత్రమ్మని మంచావిడ. వాళ్ళకి పిల్లలు లేరు. ఆయన్ని నాకు ట్యూషన్ టీచర్‌గా ఏర్పాటుచేశారు. ఆయనకి ఇష్టం లేదు ట్యూషన్ చెప్పటం. ఆయన మీదున్న ఒత్తిడి వలన కాదనలేక నన్ను ట్యూషన్ విద్యార్థిగా ఒప్పుకున్నాడు. ఆయనకు కొంచెం భూముండేది. ఒకటో రెండో బర్రెలున్నాయి. ఆయనకి ఉద్యోగం అంటే కూడా ఇష్టం లేదు. తరవాత మానేసినట్టున్నాడు. ఆయన బర్రెలను మేపటానికి ఊరు బయటకు పోతుండేవాడు.ఆయనతోపాటు నన్నుకూడా తీసుకుపోయేటోడు.అమరకోశం చదివించేవాడు. ముప్పై నలభై శ్లోకాలు నేర్పించాడు. ఆయనకొచ్చిన ఇంగ్లీషు నేర్పించేవోడు. ఒకపక్కన మాణిక్యం, ప్రకాశం, దేవదానం నాకు తెలిసిన వీళ్ళంతా స్కూల్‌కు పోతుండేవారు. నేను మాత్రం స్కూలుకు వెళ్ళేవాడిని కాను. నా తొలిరోజుల చదువంతా ఈయన నేర్పిందే. ఈలోగా మా నాయన నన్ను వెనక్కి తీసుకొచ్చేశాడు. ఆయనకేంటంటే వీడిని స్కూల్‌లో వేయాలి.. లేకపోతే కష్టమని అనుకున్నట్టున్నాడు. అప్పట్లో ప్రవేశపరీక్షరాసి పాసయితే స్కూళ్ళో సీటిచ్చేవారు. నేను, మా అత్త కొడుకు (నాకన్నా మూడేళ్ళు పెద్ద ఆయన), ఇంకో కజిన్ ఆ పరీక్ష కోసం పోయినాం. నేను ఆరోక్లాసులో చేరతానని అనుకున్నాను. నాకప్పుడు పదేళ్ళు కూడాలేవు. మిగిలిన ఇద్దరూ ఒకడు ఏడో తరగతి, ఇంకోడు ఎనిమిదో తరగతి అనుకున్నారు. కానీ జరిగిందేంటంటే అందరిచేత ఎనిమిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష రాయించేశారు. నేనూ నా కన్నా మా పెద్ద వయసున్న కజిన్‌కి ఎనిమిదో తరగతిలో సీటొచ్చింది. ఇంకొకడు ఏడోతరగతికి అర్హత సంపాదించాడు. అలా ముగ్గరం స్కూల్లో చేరాం. ప్రాక్టికల్‌గా చూస్తే నేను స్కూల్లో ఎనిమిదో తరగతిలో 1952వ సంవత్సరంలో చేరాను.1956వరకూ స్కూలింగ్ జరిగింది. అంటే మీరు చెప్పినట్టు ఎస్సెసెల్సీ (పదకొండోతరగతి), తర్వాత నెల్లూరులో నాలుగేళ్ళు చదివాను. ఇందులో రెండేళ్ళు ఇంటర్మీడియెట్, రెండేళ్ళు గ్రాడ్యుయేషన్. ఎనిమిదేళ్ళలో చదువు పూర్తిచేసి అప్పుడు యూనివర్సిటీ చదువు కోసం సాగర్ యూనివర్సిటీ (మధ్యప్రదేశ్)లో చేరాను. నాకు అండర్ ఏజ్ సమస్య ఉంది. నాపేరున్న డాక్టర్ దగ్గరే అయిన ఆంజనేయరెడ్డి గారి దగ్గర కావలసిన ఏజ్ సర్టిఫికెట్ తీసుకున్నాను. సాగర్ యూనివర్సిటీలో తెలుగువాళ్ళెక్కువ. దాదాపు రెండు వందలమంది తెలుగువాళ్ళుండేవారు. అక్కడినుండి ఏడెనిమిది మంది తెలుగువాళ్ళు IASకి సెలక్టయ్యారు. నిజానికి బెనారస్, సాగర్, అలహాబాద్, నాగ్‌పూర్ యూనివర్సిటీల్లో ఆరోజుల్లో తెలుగువారెక్కువగా చదువుతుండేవారు. విచిత్రమేమిటంటే నాకు ఆంధ్రా యూనివర్సిటీలో న్యాయశాస్త్రం (law)లో సీటొచ్చింది కానీ నేను మేధమేటిక్సు కోసం ఇక్కడ చేరాను. నిజానికి నాకు కెమిస్ట్రీ అంటే ఆసక్తి.

మళ్ళీ మరోపక్క ఆర్గానిక్ కెమిస్ట్రీ అంటే భయం. నేను డిగ్రీలో మేథమేటిక్సు (మెయిన్) ఇంగ్లీషు లిటరేచర్, తెలుగు లిటరేచర్ మిగిలిన సబ్జెక్ట్స్. ఇంగ్లీషులో పన్నెండు టెక్స్ట్ పుస్తకాలుండేవి. టైం సరిపోయేది కాదు చదవటానికి. తెలుగు కాస్త నయం. ఆరు టెక్స్ట్ బుక్కులుండేవి. మామిడిపూడి వెంకట రంగయ్య, నేలటూరి వెంకట రమణయ్య నెల్లూరు కాలేజీలో లెక్చరర్లుగా ఉండేవారు. పి.సి.అలెగ్జాండర్ (శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో PMO సెక్రటరీగా చేశారు) కూడా లెక్చరర్‌గా చేశారు నెల్లూరులోని వి.ఆర్.కళాశాలలో.

మిసిమి : సాగర్ యూనివర్సిటీలో చదివిన మీరు IPS ఆఫీసర్ ఎలా అయ్యారు?

అంజనేయ రెడ్డి : సాగర్ యూనివర్సిటీ వెళ్ళాక నా ఆలోచనా ధోరణిలో మార్పొచ్చింది. నేను సరిగ్గా చదవలేదని సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ రాయలేదు. జనరల్ బుక్స్ చదవటం ఎక్కువయింది. మేథమేటిక్స్ బుక్స్ చదవటం తగ్గిపోయింది. రాజగోపాలాచారి "స్వతంత్ర పత్రిక" ఎక్కువ చదువుతుండేవాడిని. మాకు బోధించేందుకు సరైన ఫాకల్టీ ఉండేవారుకాదు. దాంతోటి మేథమేటిక్సు నాకు సరిపడదనే ఆలోచనకు వచ్చేశాను. నేను చదివింది 1963 ప్రాంతం. అప్పుడు పంచవర్ష ప్రణాళికల అమలు తీరు గురించి వ్యాసరచన పోటీ పెట్టారు. (అప్పటికే నాకు స్వరాజ్యలో ఆర్టికల్స్ రాసేవారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేవాడిని. వారిలో ప్రొఫెసర్ అప్పలస్వామి అని ఒకాయన ఉండేవారు. రాజాజీకి కూడా రాశాను. ఆయన నాకు సమాధానమిచ్చాడు.ఆ లెటర్ కాపీ నాదగ్గరింకా భద్రంగా ఉంది.). ఆ పోటీ నిజానికి ఆర్థికశాస్త్రం చదివే విద్యార్థుల కోసం నిర్వహించారు. నేనేదో రెండు మూడు పేజీల నోట్సు రాసిపెట్టుకుంటే ఎకనామిక్స్ చదువుతున్న పూర్ణచంద్రరావనే మిత్రుడు (అతనిది బెజవాడో, గుంటూరు గుర్తులేదు. తర్వాత అమెరికాలో సెటిలైపోయాడు) అది చదివి నాకివ్వు అని తీసుకున్నాడు. దాన్ని నాపేరుతోనే సబ్మిట్ చేశాడు. అది ఆ పోటీలో మొదటి మూడు స్థానాలలో నిలిచింది. IAS కోచింగ్ ఇచ్చేటటువంటి Rao's study circle "రావు గారి" సోదరుడు భాస్కరరావు నాకు మంచి స్నేహితుడు. నా పేపర్ చదివి కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాయి, పనికొస్తావని సలహా ఇచ్చాడు. ఆయన అప్పటికే సివిల్ సర్వీసెస్ పరీక్ష రెండు మూడుసార్లు రాసి ఫెయిల్ అయ్యి చివరికి ఎమ్.ఏ.లిటరేచర్‌లో చేరాడు. నేను కష్టపడి ఎమ్మెస్సీ మేథమేటిక్స్ రెండోసంవత్సరం పరీక్షరాసి బయటపడ్డా. అందులో ఎనిమిది పేపర్లు ఉండేవి. అన్నీ కష్టంగా ఉండేవి. ఒక పేపర్ కొత్తగా ప్రవేశపెట్టారు. ఆ పేపర్ theory of real and complex varible. దానికి బుక్స్ కూడా సరిగ్గా లేవు. యుకె నుంచి దానికి కావలసిన పుస్తకాన్ని పది కాపీలు తెప్పించి ఫ్రెండ్స్‌కి ఇచ్చాను. అది చాలా కష్టమైన పేపర్. దాంట్లో నాకు హైయ్యస్ట్ మార్క్ వచ్చాయి. ఎంతో తెలుసా.. డెబ్భై ఎనిమిది శాతం చాలా ఈజీ అనుకున్న పేపర్‌లో ముప్ఫైశాతం వచ్చాయి. అయితే అక్కడ మొత్తమ్మీద వచ్చిన మార్కుల సరాసరి తీసుకుని పాస్ లేదా ఫెయిల్ అనేది నిర్ణయిస్తారు. అలా సెకండ్ క్లాసుతో బయటపడ్డాను. అప్పుడు ఉద్యోగాలేమున్నాయి. ఎక్కడో ఒకచోట లెక్చరర్‌గా చేరటం. అది నాకిష్టం లేదు. నాకే సరిగ్గా రాదు.. నేనేం చెప్పగలనని నా ఫీలింగ్. నాకు మిగిలిన ఆప్షన్లు రెండు. లా కోర్సన్నా చేయాలి.. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాయాలి. లా చేయటమంటే నాచదువయ్యి నేను ప్రాక్టీసులో సెటిలయ్యేసరికి ఆరేడేళ్ళు పడుతుంది. అంతవరకు మా ఫాదర్ మీద ఆధారపడాలి. కానీ నేను లా చేయటం ఆయనకు ఇష్టమే. ఊళ్ళలో లాయర్ల అవసరం ఎక్కువగా ఉండేదప్పుడు. నాకు ఆంధ్రాయూనివర్సిటీ, మద్రాసు యూనివర్సిటీలో సీటొచ్చింది కానీ నేను చేరలేదు.అప్పుడు ఏ కోర్సుకైనా అడ్మిషన్ ఈజీగా దొరికేది. లా కోర్సులో చాలామంది చేరేవాళ్ళు కాదు. అప్పుడు నాకు భాస్కరరావు గుర్తుకొచ్చాడు.తనేకదా నువ్వు కాంపిటీటివ్ పరీక్షలకు పనికొస్తావని గుర్తించింది. మా నాయనకు చెబితే రాయమన్నాడు. ఆయన నన్ను మద్రాసుకు వెళ్ళి ప్రిపేర్ అవ్వమన్నాడు. ఆరోజుల్లో అన్నిటికీ మద్రాసుకు వెళుతుండేవాళ్ళం. మాకు మద్రాసు దగ్గర కావటమో కారణం. కానీ నాకు మద్రాసుకు

వెళ్ళటం ఇష్టం లేదు. నేను ఢిల్లీకి వెళతానన్నాను. ఢిల్లీకి వెళితే రావు గారిని కలవొచ్చుకదాని నాకు ఎక్కడో లోపల ఉన్నట్టుంది (నవ్వు)

మసిమి : **మీ జీవితాన్ని మలుపు తిప్పింది మీరు ఢిల్లీకి వెళ్ళటమేమోనేమో..**

అంజనేయ రెడ్డి : ఆరోజుల్లో సివిల్ సర్వీసెస్ అంటే ఎక్కువగా కనిపించేది ఐసిఎస్ ఆఫీసర్ల పిల్లలు, చిన్నపాటి జమీందార్లు, రాజాల పిల్లలు మధ్యతరగతి కుటుంబాలవారు తక్కువ. ఢిల్లీలో RAO'S కోచింగ్ సెంటర్‌కు వెళ్ళాను. అక్కడ రావు గారికి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఆయన దాన్ని కోచింగ్ సెంటర్ అనదు. గైడెన్స్ సెంటర్ అనేవాడు. ఆయన మొత్తం పన్నెండు క్లాసులు తీసుకునేవాడు. నెలకు నాలుగు చొప్పున ఉండేవి. ఒక్కో క్లాసు రెండు, రెండున్నర గంటలుండేది. ఆయన మాకేం చెప్పాడో తెలుసా! పరీక్ష ఎలా రాయాలి, రాసే టెక్నిక్స్ ఏమిటి, ఎలా రాస్తే మార్కులొస్తాయి, ఎలా ప్రిపేర్ అవ్వాలి వంటి అంశాలమీద చాలా బాగా మాట్లాడేవాడు. ఇప్పటిలాగా సివిల్ సర్వీసెస్ రాసేవారికి వయోపరిమితి ఎక్కువుండేది కాదు. మీరు నమ్మరు.. గరిష్ఠ వయసు ఇరవైనాలుగు సంవత్సరాలు. రెండుసార్లు మాత్రమే రాసే అవకాశముంది. నాకప్పుడు వయసు ఇరవైమూడు సంవత్సరాలు. కేవలం నాకు పధ్నాలుగు నెలలు మాత్రమే ఉంది పరీక్ష రాయటానికి. ఇది పూర్తయ్యేలోపు రాసేయాలి. ఆ తర్వాత నేను ఏజ్ బార్ అయిపోతాను. అయితే నేను మేథ్స్ సబ్జెక్టుగా తీసుకోలేను. హిస్టరీ, పొలిటికల్ సైన్స్ లాంటివి ప్రిపేర్ అవ్వాలంటే టైం కావాలి. ఎందుకంటే ఆ సబ్జెక్టులన్నీ పిజి స్థాయిలో ఉంటాయి. నాతోపాటు కోచింగ్ తీసుకోవటానికి వచ్చిన తెలుగువారిలో అర్జునరావు (తి.తి.దే ఈవోగా చేశారు), సి.యస్.రావు (ప్రిన్సిపల్ కార్యదర్శిగా చేశారు), బివిగౌడ్ (ఐడిబిఐలో చేశారు), స్టాన్లీ (SCR జనరల్ మేనేజర్‌గా చేశారు) ఇంకా మరికొంతమంది మిత్రులుండేవారు. వారిలో కొంతమంది సాగర్ యూనివర్సిటీలో చదివినవారే. నా దురదృష్టం కొద్దీ నాకో సంవత్సరం వయసు ఎక్కువపడటంతో వాళ్ళు నాకన్నా చిన్నవారయిపోయారు. నేను పధ్నాలుగు నెలల్లో ప్రిపేరయ్యి రాసేయాలి. ఇది నా ముందున్న టార్గెట్ నాకు. అందుకని ఆ పధ్నాలుగు నెలలని చాలా జాగ్రత్తగా ఉపయోగించుకున్నాను. ఇప్పటిలాగా ఆరోజుల్లో ఇంత సెక్యూరిటీ లేదు. ఎవరో ఒక ఎమ్.పి.లెటర్ తీసుకుని పార్లమెంట్ సెషన్స్‌లోని డిబేట్లను చూడొచ్చు. రామమనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్ వంటి వారు ఢిల్లీకి వచ్చి సభల్లో మాట్లాడుతుండేవారు. ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వంటి చోట చక్కటి సెమినార్లు జరుగుతుండేవి. వీటికి కూడా అటెండ్ అయి ఎవరు ఎలా మాట్లాడుతున్నారో గమనించేవాడిని. ఆచార్య ఎన్.జి.రంగా గారి ప్రసంగం వినే అవకాశం లభించింది. పండిట్ నెహ్రూ 1964లోనే మరణించారు. కాబట్టి చూడలేకపోయాను. కానీ కృష్ణ మీనన్‌ని చూడగలిగాను. నేను ఢిల్లీలో ఉన్నప్పుడు పద్మనాభయ్య అనే ఆయనతో కలిసి ఉండేవాడిని.ఆయనది నెల్లూరు దగ్గర గూడూరు.ఆయన హిందూ పేపర్ కు లీగల్ కరస్పాండెంట్ గా ఉండేవాడు.ఆయన నేను సౌతిండియన్ బ్రాహ్మిణ్స్ నిర్వహించే మెస్ కం లాడ్జింగ్‌లో ఉండేవాళ్ళం. ఆయన పనిమీద వెళ్ళిపోయిన తర్వాత నాకు చదువుకోవటానికి ఆ రూం ఉపయోగంగా ఉండింది. ఆయనతో కలిసి ఉండటం కూడా లాభించేది. చాలా విషయాలు తెలిసేవి. రామమనోహర్ లోహియా కేసులాంటివి వివరంగా చెబుతుండేవాడు. లక్కీగా ఆయన కూడా ఒంటరే (ఇంకా పెళ్ళికాని ప్రసాదు). ఢిల్లీలో ఉండగానే నాకు నృత్యం పట్ల ఆసక్తి ఏర్పడింది. యామినీ కృష్ణమూర్తి కూచిపూడి నృత్యం, ఇతర కళాకారులచే కథక్, భరతనాట్య నృత్య ప్రదర్శనలు చూసే అవకాశం కలిగింది. వేదాంతం సత్యనారాయణ గారిచే కూచిపూడి యక్షగానం చూసే అవకాశం త్రుటిలో జారిపోయింది. రావు గారు కోచింగ్ ఇచ్చే పద్ధతి చెప్పాను కదా. ప్రశ్న చదివి అర్థం చేసుకుని రాయటం ముఖ్యమని చెప్పేవాడు. అలాగే

ఎవరు ఏ సబ్జెక్టు తీసుకుంటే మంచిది, ఏం పుస్తకాలు చదవాలి ఇవన్నీ చకచకా చెప్పటం ఆయన ప్రత్యేకత. ఎస్సే (వ్యాసం) ఎలా ఉండాలి, సబ్జెక్ట్‌కు ఎలా ఇంట్రడొక్షన్ చెప్పాలి, మిడిల్ ఎలా ఉండాలి, ముగింపు ఎలా ఉండాలో ఆయన చెప్పినట్టు మరొకరు చెప్పలేరు. నాలాంటి మేథ్స్ వాడికి ఆయన చెప్పినవి చాలా ఉపయోగపడ్డాయి. ఒకసారి టెంపుల్స్ ఇన్ ఇండియా అనే టాపిక్ మీద మమ్మల్ని ఎస్సే రాయమన్నాడు. చెప్పానుకదా.. అక్కడున్న వారందరూ ఐసిఎస్ ఆఫీసర్ల పిల్లలేనని. నేను రాసిన వ్యాసం ఆయనకు ఎంతగా నచ్చిందంటే.. దాన్ని మోడల్‌గా చదవండి అని కాపీలు తీసి ఇచ్చాడందరికీ. నువ్వు ఇదేవిధంగా రాస్తే నీకు ఎస్సేలో డెబ్భై శాతం మార్కులొస్తాయన్నాడు. అలాగే మెయిన్స్ పరీక్షలో వచ్చాయి. అప్పుడు ప్రిలిమినరీ ఎగ్జాం లేదు. డైరక్ట్‌గా మెయిన్ ఎగ్జాం ఆ తర్వాత viva voce. ఇంకో విషయమేమిటంటే అప్పుడు ఐయ్యేఎస్‌కి ఐపిఎస్‌కి తేడా ఏమిటంటే, ఐయ్యేఎస్‌కి ఇంకో రెండు పేపర్లు ఎక్స్‌ట్రా ఉండేవి.ఇంటర్వ్యూ (వైవా)లో బోర్డు మెంబర్లు చెప్పేది మొదట వినమనేవాడాయన. వాళ్ళ అభిప్రాయంతో ఏకీభవించకపోతే నేరుగా i don't agree with you అనొద్దనేవాడాయన. కాస్త మర్యాదపూర్వకంగా మీ disagreement చెప్పమనేవాడు. నా viva voce తర్వాత ఆయన్ని కలిసి ఎలా జరిగిందో పూసగుచ్చినట్టు చెప్పాను. అంతా విని నీకు 55% మార్కులొస్తాయన్నాడు. అలాగే వచ్చాయి. ఎవరికీ అరవైశాతం మించి రావని కూడా చెప్పాడు. ఎవరికీ ఆ బెంచ్ మార్కు దాటి రాలేదు. నేను 1965లో పరీక్ష రాస్తే 66లో సెలెక్ట్ అయ్యాను. అంటే నేను ఐపిఎస్ పరీక్ష పాసయి అరవైఏళ్ళయ్యింది. ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో అర్హత పొందాను. నాతోపాటు ఇంకో ఇద్దరు తెలుగువాళ్ళు సెలెక్ట్ అయ్యారు. సుబ్బారావని ఒకతనకి కేరళ కేడర్ రావటంతో వెళ్ళిపోయాడు. ఇంకో అతను రామూ అని కర్నూలతను, షెడ్యూల్డు కులాలకు చెందినతను. ఇలా ముగ్గురం ఏపీ నుంచి ఎంపికయ్యాం. ముగ్గురిలో నాకు ఎక్కువ మార్క్ రావటంతో ఏపీకి అలాట్ అయ్యాను.

మిసిమి : ఐపిఎస్‌లో మీవి కొన్ని అనుభవాలు చెప్పండి?

ఆంజనేయ రెడ్డి : ఐపిఎస్ అధికారులకు ముప్ఫైనెలలపాటు శిక్షణ ఇస్తారు. అందులో మొదటి నాలుగు నెలలు ముస్సోరి అకాడెమీలో ఉంటుంది. తర్వాత ఆరునెలలు మౌంట్ ఆబూలోని సెంట్రల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్‌లో ఉంటుంది. ఐయ్యేఎస్ ఆఫీసర్లకు ముస్సోరీలోనే శిక్షణ ఉంటుంది. రైల్వే అధికారులకు బరోడాలో శిక్షణా కేంద్రం ఉంది. ఇన్‌కంటాక్స్ వాళ్ళకు నాగపూర్‌లో ఉంటుంది. ఆడిట్&అక్కౌంట్స్ వారికి సిమ్లాలో ఉంది. ఇలా గ్రూప్ ఏ అధికారులకు వివిధ ప్రదేశాలలో ఈ శిక్షణా కేంద్రాలున్నాయి. ఈ ట్రైనింగ్ ఒకటి సంస్థాగతశిక్షణ సంవత్సరంపాటు. (ఇప్పుడది నేషనల్ పోలీసు అకాడెమీ హైదరాబాదులో ఉంది.) రెండోది ఫీల్డ్ లెవెల్ ట్రైనింగ్.. ఇంకో సంవత్సరం ఉంటుంది. ఇందులో కానిస్టేబుల్ స్థాయినుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, డియస్పీ ఇలా అన్ని కేడర్లవారితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. వీరే కాకుండా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో, రెవెన్యూ అధికారులతో అనుబంధంగా పనిచేయాలి.

మిసిమి : జ్యుడీషియల్ పవర్స్, మెజీస్ట్రీయల్ పవర్స్ మీకుంటాయా? అవి కలెక్టర్లకేనా?

ఆంజనేయ రెడ్డి : కమీషనర్ స్థాయిలో జ్యుడీషియల్ అధికారాలుంటాయి. ఇప్పుడు ఎస్పీలకు కూడా ఆ అధికారాన్ని కల్పించారు. రంగారెడ్డి జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు మొదటిసారి నాకా అధికారాన్నిచ్చారు. బ్రిటిషువారి కాలంలో రెవెన్యూ వసూలు కలెక్టర్లకు ముఖ్యవిధి. అందుకు వారికా అధికారాన్ని కట్టబెట్టారు. వారికి పోలీసుయంత్రాంగం తోడుగా ఉండేది. ఇప్పుడు పోలీసు వ్యవస్థ స్వతంత్రంగా పనిచేస్తోంది కదా. నేను ట్రైనీ ఏయస్పీగా ఉన్నప్పుడు రెండు అనుభవాలు చెబుతాను. కాకినాడ దగ్గర సర్పవరం



పోలీసుస్టేషన్ ఇన్ ఛార్జ్‌గా ఉన్నప్పుడు ప్రైవేటు బస్సులవారు ఆ పోలీసు స్టేషను దగ్గర రూపాయి నాణాలు విసిరేసిపోతుండేవారు. ఇది నేను గమనించి గంగారాం అనే కానిస్టేబులుని అడిగాను, ఏమిటి విషయం అని. కొన్ని ఖర్చులకు ప్రభుత్వం డబ్బులివ్వదు కదు సర్. అందుకని ఈ పద్ధతి అని నసిగాడు. వాళ్ళ ఉద్దేశంలో పెన్ను పేపర్ నుంచి అండర్ ట్రయల్ ఖైదీలు, క్రిమినల్స్, రిమాండ్ ఖైదీలు, సాక్షులు. వీరందరికి భోజనాలు.. ఇవన్నీ చూడాలి కదా సర్ అంటాడు. గోదావరి జిల్లాల్లో మావాళ్ళేమీ డబ్బులేనివారు కాదు. వీళ్ళు వసూలు చేసే పద్ధతి అప్రతిష్ఠ తెచ్చేట్టుగా ఉంది. ఇక్కడ నేను ఉన్నంతకాలం ఆ పద్ధతికి స్వస్తిచెప్పండని గట్టిగా చెప్పాను. ఇంకోసారి కపిలేశ్వరం జమీందారు పట్టాభిరామారావు (ఆయన మాజీ మంత్రికూడా) నన్ను చూడటానికి వస్తానని కబురుపెట్టారు. ఎందుకు నేనే వస్తాను కదా అన్నా కూడా ఆయన వినిపించుకోకుండా వచ్చేశాడు. పద్ధతిగల మనిషి. తనకంటూ ఓ డిసిప్లిన్ ఉన్నవాడు. ఇంతకీ ఆయన కాకినాడ గ్రాడ్యుయేట్ కాన్సిస్టుయన్సీ నుంచి ఎమ్.ఎల్.సి.గా పోటీ చేస్తున్నాడు. నన్ను ఓటు అడగటం కోసం వచ్చాడు. చాలా విషయాలు మాట్లాడుకున్నాక ఆ విషయం చెప్పాడు. ముప్పైఏళ్ళ కితం మీలాగే ఓ ఏస్పీ ఈసీట్లో కూచున్నాడు. తర్వాత ఐజి అయ్యాడు. మీరు డిజిపి అవ్వాలని విష్ చేసి వెళ్ళిపోయాడు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడగానే ఎస్వీయూనివర్సిటీ బిల్లు ప్రవేశపెట్టింది ఆయనే. అలాగే ఒకసారి మా ఎస్పీ నారాయణస్వామిగారు (ఈమధ్యనే పోయారాయన), ఆయన భార్యా ఇద్దరూ నృత్యాన్ని బాగా అభిమానిస్తారు. నాకు కూడా ఇష్టమని గ్రహించారు. ఒకరోజు నన్నో డ్యాన్సు ప్రోగ్రాం ఉందని రమ్మని నాకు ఆహ్వానం పంపారు. అదెక్కడనుకున్నారు, అన్నవరంలో. ఎవరదనుకున్నారు ఆ డ్యాన్సు. నేను చాలాకాలంగా చూడాలనుకుంటున్న వేదాంతం సత్యనారాయణశర్మగారిది. పండు వెన్నెల తోడుగా ఆలయం మంటపంలో చూసిన ఆ డ్యాన్సును నేను మరచిపోలేను. ఆయన ఆ రోజు రెండు ప్రదర్శనలిచ్చారు. మొదటి ప్రదర్శనలో ఉషాపరిణయం ప్రదర్శించారు. చిన్న విరామం తర్వాత భామా కలాపం ప్రదర్శించారు. ఆ తర్వాత కొన్నేళ్ళకు నేను అనంతపురంలో పనిచేస్తున్నప్పుడు రెండురోజులు వారి బృందంచే నృత్య ప్రదర్శనలిప్పించాం. ఒకరోజు ఉషాపరిణయం.. ఇంకోరోజు భామాకలాపం.

మిసిమి : వారినెప్పుడూ కూచిపూడి వెళ్ళి కలవలేదా..?

ఆంజనేయ రెడ్డి : కలిశాం. నేను మిత్రుడు ప్రసాదు వెళ్ళి కలిశాం. ఎప్పుడంటే ఆయన అనారోగ్యంతో ఉన్న చివరిరోజుల్లో. నిజానికి ఆయన పరిస్థితి అప్పుడు బాగాలేదు, కలవటం కుదరదు అంటే వారిని బయటనుంచి బయటే పలకరించి వెళ్ళిపోతామని బతిమాలితే ఒప్పుకున్నారు. పది నిముషాలకు మించకూడదని వార్నింగ్ ఇచ్చారు. అలాగే అని వెళ్ళాం. మాకోసం వరండాలో కుర్చీలో వారిని కూచోబెట్టారు. పదినిముషాలనుకున్నది నలభైఐదునిముషాలపాటు మా సంభాషణ సాగింది. నేను ఆయన్ని కలిసిన జ్ఞాపకం గురించి, అనంతపురంలో ఆయన ప్రోగ్రాం ఏర్పాటు చేసిన సంగతి గురించి చెప్పాను. అప్పుడు కాస్త లీలగా గుర్తుపట్టారు. మా ప్రసాదుని అసలు గుర్తుపట్టలేదు. ఎన్నో పద్యాలు, పాటలు నెమ్మదిగా అంత అనారోగ్యంలోను పాడి వినిపించారు వారినో ప్రశ్న వేశాను. ఇంతబాగా నాట్యంచేసే మీరు వరూధినీ ప్రవరాఖ్య నృత్యరూపకాన్ని ఎందుకు ప్రదర్శించలేదని. నిజానికి చాలాసార్లు అనుకున్నాను కానీ అదెందుకో ముందుకు సాగలేదని విచార వదనంతో మా సంభాషణ ముగించారు.

మిసిమి : మీరు ఎస్పీగా పనిచేసిన కాలంలో కొన్ని తీపి చేదు గురుతులు చెప్పాలంటే...

ఆంజనేయరెడ్డి : నేను ఎస్పీగా అనంతపురం, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేశాను. నాలుగేళ్ళపాటు డెప్యుటేషన్ మీద సి.బి.ఐ.లో ఉన్నాను. డెబ్భై, డెబ్భై ఒకటి ప్రాంతంలో నేను అనంతపురంలో పదహారునెలలు వనిచేసుంటాను. అప్పటికక్కడ దొర ఎస్పీగా ఉన్నారు. అనంతపురంలో నలుగురు ప్రముఖులుండేవారు. నీలం సంజీవరెడ్డి, అప్పటికాయన రాపష్ట్రపతిగా పోటీచేసి ఓడిపోయారు.

తర్వాత మళ్ళీ 1977లో ఆయన రాష్ట్రపతి అయ్యారు. తరిమెల నాగిరెడ్డి, నక్సలైటు నాయకుడు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్. ఈయన మతమార్పిడులు చేస్తున్నాడన్న వదంతులు లేవదీశారు మహారాష్ట్రలో. అక్కడినుండి అనంతపురం వచ్చి కరువుకాటకాలనుంచి ప్రజలను ఆదుకునేవాడు. ఇక సత్యసాయిబాబా. వీరి ప్రొటెక్షన్ అనలేం కానీ వీరిని దృష్టిలో ఉంచుకోవలసి వచ్చేది. ఒకసారి వి.వి. గిరి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు సత్యసాయిబాబా స్థాపించిన మహిళాకళాశాల ప్రారంభోత్సవానికి వచ్చారు. వి.వి.గిరి గారి శ్రీమతి సరస్వతిగిరి గారిది అనంతపురం. అదికూడా ఒక కారణం. ఎంతోకొంత ఫాక్షనిజం అనంతపురం జిల్లాలో ఉంది. అప్పుడు చల్లా సుబ్బారాయుడు గారు అనంతపురం నుంచి మంత్రిగా ఉండేవారు. పివిగారు ముఖ్యమంత్రి. సుబ్బారాయుడు రాజకీయంగా నిజాయితీపరులే కానీ ఫాక్షన్ ఫైట్లకు మినహాయింపుకాదు. అదిలేకపోతే ఆయనకు మనుగడ ఉండదు. ఆయనకు వెంకట్రామరెడ్డని ఒక ఫాక్షన్ అనుచరుడుండేవాడు. వాడెంత కర్కోటకుడంటే అతని కంట్రోలు ఉన్న పల్లెల్లోని ప్రజలచేత పదివేలు అప్పున్నట్టు పత్రం రాయించుకునేవాడు. వాళ్ళు ఎదురుతిరిగితే వాళ్ళమీద ఈ పత్రంతో కేసువేసేవాడు. దాంతోటి అందరు భయపడిపోయే వారు. లక్ష్మీరెడ్డని మాజీసైనికుడు అదే ఉళ్ళో సెటిలయ్యి బత్తాయి తోటలు పెంచుకుంటున్నాడు. ఈ వెంకట్రామరెడ్డి అనేవాడు అందరికీ ఉపయోగించే ప్రామిసరీ నోటు టెక్నిక్ వాడబోతే అతను తిరస్కరించాడు. దాంతోటి కోపం పెంచుకున్న ఈ వెంకట్రామరెడ్డి అతన్ని అతని పొలంలో హత్య చేయించాడు. యాభై గజాల దూరంలో ఉండి ఆ హత్యాకాండను సూపర్వైజ్ చేశాడు. ఆ ఊరు ఇన్‌ఛార్జ్ డియస్పీ లీవులో ఉండటం వలన ఆకేసు నేను టేకప్ చేయాల్సి వచ్చింది. కానీ కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో ఉన్నట్టు ఎలిబీ చూపించాడు. నేను కర్నూలు హాస్పిటల్ రైడ్ చేసి సంబధింత రిజిస్టర్‌ని సీజ్ చేశాను. ఆ బుక్‌లో ఎంట్రీ తర్వాత వేసినట్టు తెలిసిపోతోంది. కర్నూలు హాస్పిటల్ మీద కేసు పెట్టాను. (అప్పుడే ఇంకో కేసులో మా కానిస్టేబుల్ కూతురు రేప్‌కు గురయ్యింది. స్థానికంగా ఉన్న డాక్టర్ వీళ్ళకి భయపడి అలాంటిదేమీ లేదని రిపోర్ట్ ఇచ్చాడు. ఆ కేసులో కూడా మరొక ఒపీనియన్ తీసుకున్నాం. ఆ డాక్టర్‌పై కూడా కేసు పెట్టాం.) ఈవిధంగా సాక్ష్యాధారాలు బలంగా ఉండటంతో వెంకట్రామరెడ్డి ఒకటో ముద్దాయిగా ఎఫ్ఐఆర్‌లో చేర్చాను. అది అతను ఊహించలేదు. కంగారుపడి సుబ్బారాయుడుని ఆశ్రయించాడు. సుబ్బారాయుడు ఇలాంటివారికోసమే తన మనిషిని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెట్టాడు. నన్ను ట్రాన్స్‌ఫర్ చేయించమని ప్రెషర్ పెట్టసాగాడు. ఈలోగా ఛీఫ్ మినిస్టర్ పివీ గారు అనంతపూర్ వచ్చారు. ఆయనతో మాట్లాడే అవకాశం వచ్చింది. నన్ను ట్రాన్సఫర్ చేయమని సుబ్బారాయుడు అడుగుతున్నట్టు చెప్పారు. ఆయనకు ఈ సుబ్బారాయుడు గురించి తెలుసు. అయినా నీ ఒపినీయన్ ఏమిటి అని అడిగారు. ఆయన మంత్రి కదా సార్. నేను చెబితే బావుండదు అన్నాను. ఆయనకు నన్ను ట్రాన్స్‌ఫర్ చేయటం మంచి చర్య అనుకోలేదు. నన్నో ట్రైనింగ్‌కు పంపించారు. అది ఐదునెలల డ్యూరేషన్ ఉన్న ట్రైనింగ్ మాడ్యూల్. ఎస్పీ ఆపై కెడర్‌కు మాత్రమే ఇచ్చే ట్రైనింగ్. మౌంట్ ఆబూలో ఉంది ఆ ట్రైనింగ్.. మీరడిగారు కాబట్టి ఇది గుర్తుచేసుకో వలసి వచ్చింది (నవ్వు). మీకోసం ఈ మొత్తం ఎపిసోడ్‌ని కుదించి చెప్పాను (మరోసారి నవ్వు)

మిసిమి : **మీలా పోలీసు శాఖలో పనిచేసినవారు బౌద్ధంలోకి రావటం మామూలు విషయం కాదు.. దానికి కారణం మీరు చదివిన సాహిత్యమా? ఏదైనా మొనాస్ట్రీలో ఉండటం వలన కలిగిన ప్రభావమా? వైదిక ధోరణులమీద వ్యతిరేకతా?**

ఆంజనేయరెడ్డి : నాకు చరిత్రపైన వచ్చిన పుస్తకాలంటే చాలా ఇష్టం. అందులో భాగంగానే బుద్ధిజంపై వచ్చిన పుస్తకాలు చదివాను. మేథ్స్ కాకుండా హిస్టరీ సబ్జెక్టులో ఎమ్మే చేసుండాల్సిందనిపిస్తుంది. నాపై రామస్వామి పెరియార్ ప్రభావం ఉంది. ఆయన బ్రాహ్మణ వ్యతిరేకవాదం నాపైన ప్రభావం చూపింది. అలాగే "గోరా" (గోపరాజు రామచంద్రరావు) ప్రభావం కూడా ఉంది. మరోరకంగా చెప్పాలంటే



ఆయన పూలదండలు, పుష్పగుచ్ఛాలు ఒప్పుకునేవాడు కాదు. కాయగూరల దండయితేనే తీసుకునేవాడు. నేరుగా దాన్ని వంటశాలలో ఇచ్చేసేవాడు. ఆయన మద్రాసులోనో ఢిల్లీలోనో ఉంటే ఇంకా బలంగా ఆయన ఆలోచనలు పదిమందినీ చేరేవి. ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతి లభించేది.

మిసిమి : మీపై ఎమ్.ఎన్ రాయ్ ప్రభావం లేదా?

ఆంజనేయరెడ్డి : అప్పటికి ఆయన్ని (ఎమ్.ఎన్.రాయ్) నేను చూడలేదు. ఆయన ప్రసంగాలు వినలేదు. తరవాత ఆయన పుస్తకాలు చదివాను. "గోరా" నన్ను చాలా ప్రభావితం చేశాడు. ఆయన నెల్లూరు వచ్చినప్పుడు ఆయన్ని కాలేజీల్లో ఆయన్ని మాట్లాడనిచ్చేవారుకాదు. ఆయనొకసారి సత్రంలో మాట్లాడుతుంటే విన్నాను. ఆయన 1935లోనే వరల్డ్ ఎథీస్ట్ కాన్ఫెరెన్స్ మద్రాసులో జరిపాడు. ఆయన మళ్ళీ గొప్ప గాంధేయవాది. 'ఏన్ ఎథీస్ట్ విత్ గాంధి' పుస్తకంలో గాంధీజీనే విమర్శించటానికి వెనుకాడలేదు.. అలాగే ధర్మానంద్ కోశాంబి అని బౌద్ధ సన్యాసి, గాంధీజీని భగవద్గీత అనేది బుక్ ఆఫ్ వయొలెన్స్ అని ఒప్పించగలిగాడు. ఇక్కడ జె.కె. గురించి కూడా చెప్పాలి. 1965లో జిడ్డు కృష్ణమూర్తి ఢిల్లీ వచ్చినప్పుడు నేను మిస్ అయ్యాను. కానీ పేపర్లో ఆయన గురించి చదివిన తర్వాత ఆయన పుస్తకాలు చదవటం, ఆయన ప్రసంగాలు వినటం అలవాటు చేసుకున్నాను. ముప్ఫైఏళ్ళపాటు వింటూనే ఉన్నాను. చదువుతూనే ఉన్నాను. నేరుగా చెప్పకపోయినా ఆయనకు ఇంత రాడికల్ ఆలోచనలు ఎక్కడినుండి వచ్చాయని ఆలోచించగా దానికి కారణం బౌద్ధం అని అర్థమయింది.. ఆయన మతానికి వ్యతిరేకి. ఎలాంటి మతాన్ని ఆయన అంగీకరించడు. చిన్నప్పుడు ఆయన థియోసాఫికల్ సొసైటీ వారి ప్రాపకంలో పెరిగాడు కదా. 'థియోసఫీ'ని మనం చూస్తే హిందూయిజం, బుద్ధిజం అతీంద్రియం ఈ మూడింటి కలయికగా మనం చెప్పుకోవచ్చు. జె.కె. ఒకసారొకమాటంటాడు. "ఈరోజున బుద్ధుడు గనక ఎక్కడైనా ప్రసంగిస్తున్నాడని తెలిస్తే, అది వందమైళ్ళ దూరంలో ఉందని తెలిసినా వెళ్ళటానికి నేను సిద్ధం" అని దాని సారాంశం.

1991లోనో 1992లోనో దలైలామా హైదరాబాద్ వచ్చారు. రాజ్‌భవన్‌లో బసచేశారు. అప్పుడు ఆయన్ని కలిశాను. అప్పటికి ధమ్మపదం గ్రంధం చదివాను. అదెలా జరిగిందంటే పురుషోత్తం అనే పోలీసు ఆఫీసరుండేవాడు. ఆయన వైష్ణవుడు. ఆయన బుద్ధిజం పట్ల నాకున్న ఆసక్తి గమనించి నాకా పుస్తకం చదవమని ఇచ్చాడు. అది చదవగానే నాలో ఒక పెనుమార్పు కలిగింది. ఆ గ్రంథాన్ని చాలాసార్లు చదివాను. నా ఉద్దేశంలో అదొక బుక్ ఆఫ్ ఎథిక్స్. ఆ పుస్తకాన్ని చాలామంది పోలీసాఫీసర్లకు కానుకగా ఇచ్చాను. ఎవరో అది మతగ్రంథం కదా అని అభ్యంతరం చెప్పారు. అప్పుడు చెప్పాను. అది సైకాలజీ&ఎథిక్స్‌కు సంబంధించింది. మనకు (పోలీసు శాఖవారికి) చాలా అవసరం ఆ పుస్తకం అని చెప్పాను. ఈ పుస్తకం కాపీలను దలైలామా ఆటోగ్రాఫ్ కోసం ఉంచినప్పుడు ఆయన అడిగాడు ఇక్కడ బుద్ధిస్టులు ఉన్నారా అని. దలైలామాను ఆ తరువాత ఐదారుసార్లు కలిసుంటాను. ఒకసారి ధర్మశాల కూడా వెళ్ళి కలిశాను. హిందూమతం పూజా పునస్కారాల ఆధారంగా ఉంటే, బౌద్ధం నైతికత ఆధారంగా ఉంటుందని ఛార్లెస్ ఇలియట్ అనే రచయిత *Hinduism and Buddhism -An historical sketch* అనే పుస్తకంలో అంటాడు.. మనం చదివే భర్తృహరి సుభాషితాలు, సుమతీ శతకకారుడి పద్యాలు, తిరుక్కురల్ శ్లోకాలు జైనమతంలోంచో బౌద్ధంలోనుంచో అరువు తెచ్చుకున్నవే. అలాగే బౌద్ధం అంటే నాస్తికవాదం కాదు.. నిరీశ్వరవాదం.. అదే చార్వాకులు నాస్తికులు. బౌద్ధంలో దేవుడు అన్న కాన్సెప్ట్ లేదు. మన సమాజం ఇంతగా పాడైపోవటానికి కారణం మనలో నైతికత లోపించటమే అనుకుంటాను. ఆ నైతికతను మనమతం మనకు బోధించలేదు అని బలంగా విశ్వసిస్తాను. మనం ఏం చేయాలో, ఏం చేయకూడదో మనమతం మనకు చెప్పలేదు. బలి చక్రవర్తి కథలో దానం చేసినవాడిని వదిలేసి దానం పుచ్చుకుని తొక్కేసినవాడు దేవుడయ్యాడు. అదెలా అంటాను నేను. ఇవి రాంగ్ సిగ్నల్స్ పంపించవా.. అలాగే పరశురాముడు తండ్రి ఆజ్ఞ మేరకు తల్లిని

సంహరిస్తాడని కథ చెబుతాం. ఏమంటే తండ్రిమాట పాటించటం అంటాం. ఇవన్నీ తప్పేకదా. ఇవికాకుండా మనం వేటినయితే నీతి కథలుగా మనం ప్రచారం చేస్తున్నామో అవన్నీ బౌద్ధం లేదా జైనం నుంచే సంగ్రహించాం. ఈ వాస్తవాన్ని అంగీకరించాలి. బౌద్ధం ఎప్పుడు ఒక చర్యలోని ఉద్దేశ్యం చూడమంటుంది. దానినే కుశలధర్మము, అకుశలధర్మము అంటారు. మనదేశంలో మనకు మూడు పాయలున్నాయి. శ్రమణ సంప్రదాయము, శాక్తేయము, వైదికమతము

మిసిమి : **మీమాటకు అడ్డొస్తున్నాను ఆంజనేయరెడ్డిగారూ.. బౌద్ధం, జైనం వ్యక్తి సంప్రదాయంగా ఏర్పడ్డాయి. హిందూయిజం అలా ఏర్పడలేదు. సాంఘిక అవసరాలను బట్టి వచ్చింది. దానికి వేదాంతం కూడా తోడయ్యింది.**

ఆంజనేయ రెడ్డి : మీరు వేదాంతం అంటున్నారు. వేదాలకు అంతమని కాదక్కడ అర్థం. వేదాలను అంగీకరించనిది వేదాంతం. ఉపనిషత్తులు వచ్చేసరికి శ్రమణ సంప్రదాయ ప్రభావం ఉంది. మీరు చెప్పే షట్దర్శనాలు శ్రమణసంప్రదాయం నుంచి గైకొనబడినవి, వైదిక మతం నుంచి కాదు. వైదిక సంప్రదాయంలో మొదట వానప్రస్థం లేదు. సన్యాసి కావటం అన్న విధానం లేదు. తర్వాత బౌద్ధం నుంచి గ్రహించి పొందుపరిచారు

మిసిమి : **ఒకప్పుడు బౌద్ధ ఆరామాలను ప్రోత్సహించటానికి కారణం.. ఇప్పుడు దూరమవటానికి కారణం? సామాన్య ప్రజలు వెంకటేశ్వరస్వామి దగ్గరకు వెళుతున్నారు కానీ ఆరామాలవైపు రావటం లేదుకదా.**

ఆంజనేయ రెడ్డి : ఆంధ్రదేశంలో ఒకప్పటి మతాలుగా చెప్పాలంటే బౌద్ధం అదేవిధంగా జైనం మాత్రమే. సరే గ్రామదేవతలు మొదటినుంచీ ఉన్నారు. ఇప్పుడు ఉన్నారు. శంకరాచార్య వలన బౌద్ధం క్షీణించిందంటారు. అది కారణం కాదు. భారతదేశంలోని దేవాలయాల్లో కొంతమంది బిచ్చగాళ్ళు బయటుంటే కొంతమంది లోపలుంటారని కొంతమంది పాశ్చాత్య వ్యాఖ్యాతలంటారు. మన మతంలో శ్రమణ సంప్రదాయముంది, వైదిక సంప్రదాయముంది, మూడోది శాక్తేయం, నాలుగవది ఫోక్ రెలిజియన్.. మీరు వెంకటేశ్వరస్వామి దగ్గరకు ఎక్కువగా ఎందుకు వెళుతున్నారన్నారు. దానికి అనేక కారణాలు ఉన్నాయి. ఉత్తరాదివారు బాలాజీ అంటారు. బాలా అనేది జైన్ దేవత. శ్రీలంకన్లు సిరిపాద అంటే బుద్ధుడి పాదం కొలుస్తారు. ఇక్కడ శ్రీపాదం అంటారు. అందుకనే శ్రీలంక బౌద్ధులు తిరుమల దర్శిస్తారు. మొదట్లో శ్రీకాళహస్తి, తిరుమల అర్చకులు ఒకే కుటుంబం వారుండేవారు. రెండూ శైవ మతానికి చెందిన క్షేత్రాలు. రామానుజాచార్యులకు ముందు అది వైష్ణవ క్షేత్రం కాదు. రచయిత దేవరాజు మహారాజు 'అది వెనుకటి ఈశ్వరుడు' అనే పేరుతో ఉండేది. అదే కాలక్రమేణా 'వెంకటేశ్వరుడు' అయిందని రాశాడు. మళ్ళీ బౌద్ధం దగ్గరకొస్తాను. బౌద్ధాన్ని, జైనాన్ని రాజుల కన్నా ఎక్కువ పోషించింది ప్రజలే. వర్తకులనుంచి రైతులవరకూ గుండెల్లో పెట్టుకున్నారు. అందుకనే అవి ప్రజల మతాలు అంటాను నేను. తొలిరోజుల్లో బౌద్ధ విహారాన్ని ఆలయంగా మార్చటాన్ని కర్నాటకలో మనకు దర్శనమిస్తుంది. అనేక నిర్మాణాలలో కనిపించే గజపుష్ఠం అనేది బౌద్ధ చిహ్నం.

మిసిమి : **గజపుష్ఠం అనేది రామప్ప ఆలయంలో కూడా కనిపిస్తుంది మనకు.**

ఆంజనేయ రెడ్డి : ఇక్కడో విషయం చెప్పనా.. 2009లో కెమిస్ట్రీలో నోబుల్ ప్రైజు పొందిన డా. వెంకట్రామన్ "వెంకీ" రామకృష్ణన్ మైసూరు యూనివర్సిటీ సెంటీనరి సెలబ్రేషన్స్‌లో (డిసెంబర్,2015 ప్రాంతంలో) మాట్లాడుతూ ఆసియా దేశాలన్నీ ఏదోరకంగా ఆర్థికంగా బాగుపడ్డాయి. భారతదేశం ఎందుకు వెనకపడింది అనే అంశం మీద ఆయన మాట్లాడాడు. ఆయన చాలా మాట్లాడాడు. ఆయన చెప్పిన ఒక్క కారణం గురించి చెబుతాను శాస్త్రీయ జ్ఞానం పైన ఆధారపడే సమాజం కన్నా మూఢనమ్మకాలపైన ఆధారపడే సమాజం వెనకబడే ప్రమాదముంది అని స్పష్టంగా చెప్పటం గమనించాలి.

మిసిమి : **ముప్పై ఏళ్ళబట్టీ మీరు సమాజాన్ని మార్చాలి, సంస్కరించాలని ప్రయత్నిస్తున్నారు.. ఏమైనా ఫలితం ఉందా?**

ఆంజనేయ రెడ్డి : దలైలామాను ఒకసారి అడిగారు.. మీ జీవితకాలంలో మీరు టిబెట్ వెళతానని అనుకుంటున్నారా. అవును. వెళతాననే అనుకుంటున్నాను. నేను ఆశావాదిని అన్నాడు. మళ్ళీ వెంటనే ఇంకోమాటన్నాడు. అంతా నా జీవితకాలంలోనే అవ్వాలి అనుకోవటం కూడా ఒకరకమైన స్వార్థమే అన్నాడు. మనం చేయగలిగింది మనం చేయాలి అన్నది ఆయన ఉద్దేశ్యం. ఐన్‌స్టీన్, బెట్రాండ్ రస్సెల్ ఇద్దరూ ఒక మాటంటారు. *టెక్నాలజీ యుగంలో బౌద్ధం మాత్రమే నిలబడగలదు* ఇది వారి ఆశ. ఇద్దరూ రెలిజియన్‌ని నమ్మలేదు. ఇది గుర్తుంచుకోవాలి. రామకృష్ణ మిషన్ రంగనాధానంద ఒకసారి నాతో అన్నారు *జాగర్త పైనుంచి దేవుడు చూస్తుంటాడు* అని మూడేళ్ళ పిల్లాడికి చెప్పామనుకోండి. వాడు నమ్మడు. నవ్వుతాడు అన్నారు. అంతెందుకు దలైలామా ఇలా అంటాడు. ఎనిమిదవందలకోట్ల ప్రపంచ ప్రజలలో వందకోట్ల మంది మతాన్ని నమ్మరు. దేవుణ్ణి నమ్మరు. వాళ్ళను కూడా గౌరవించాలి మనం అని.

మిసిమి : **ఇంకో ప్రశ్నకు వద్దాం. నూటయాభైకోట్ల మంది భారతీయుల్లో గుళ్ళకి వెళ్ళేవారెంతమందుంటారు?**

ఆంజనేయ రెడ్డి : ఇప్పటికీ చాలామందే ఉంటారు. కొంతమంది అదొక అలవాటుగా వెళతారు. కొంతమంది గౌరవంతో వెళతారు. హిందూయిజం వేరు. బ్రాహ్మణిజం వేరండీ. మనం అది గుర్తించాలి. *బ్రాహ్మణులు హిందువులేనా?* అనే పుస్తకం ఉంది. ఆరోజుల్లో ఒక బాపట్లాయన రాశాడనుకోండి. సర్వేపల్లి రాధాకృష్ణన్ *Hinduism is a way of life* అని గ్రంథం రాశారు కదా. నేను several ways of life అంటాను. బ్రాహ్మిణ్స్ జీవనవిధానం వేరు. రైతుకులాల జీవన విధానం వేరు. ఎవరి పండగలు వారికున్నాయి.. బ్రహ్మం గారి కథాకటి వ్యాప్తిలో ఉంది. బ్రహ్మం గారు సిద్ధా ఎన్ని లోకాలున్నాయి అని అడిగారుట. మనకు అతల, సుతల, పాతాళ అంటూ అనేక లోకాలున్నాయని చెబుతారుకదా అవి చెబుతాడనుకుటాం. ఎవరి లోకంలో వారున్నారు స్వామీ అంటాడని చెబుతారు. అది హాస్యంగా అనిపించినా అది వాస్తవం. ఒక సమాజం తనకు తానుగా జీవించటానికి, ముందుకు సాగటానికి ఎన్నో సారుప్య అంశాలు ఉండాలి. ఇంతకు ముందు వేదాలు ప్రామాణికంగా తీసుకున్నారు. ఇప్పుడవి చెల్లుబాటవుతున్నాయా!

మిసిమి : **మీరన్నట్టు మనం చాలా అంశాలు అలవాటు వలనో సంప్రదాయం వలనో పాటిస్తున్నాం. సమాజంలో నైతికత నేర్పాలి.**

ఆంజనేయ రెడ్డి : మీరన్న నైతికతను మనం బౌద్ధంలోను జైనంలోను చూడొచ్చు. అంతెందుకు మహాత్ముడి నుంచి వివేకానందుడు వరకు మనలో మార్పు తెచ్చే ప్రయత్నం చేశారు కానీ సక్సెస్ కాలేదు.

మిసిమి : **నిన్న మీతో మహాబోధి విహార్‌కు వచ్చి మూడు గంటలు గడిపాను. అక్కడి ప్రార్థన విన్నా. అక్కడ విద్యనభ్యసిస్తున్న వారిని కలిశాను. బుద్ధుని అవశేషమున్న స్థూపాన్ని తాకాను. ఒక వింత ప్రశాంతమైన అనుభవాన్ని చవిచూశాను. దీనికి కర్త, కర్మ, క్రియ మీరేనని తెలుసు. అలాగే నాగార్జున సాగరంలో బుద్ధవనం ఉంది. ఇవన్నీ చేయటమంటే అదొక హెర్కూలియన్ టాస్క్. ఎంతో నమ్మకం ఉంటేగాని చేయలేని పని. దీనికి చోదకశక్తి ఏమిటి! బౌద్ధాన్ని ప్రచారం చేద్దామనా! సంఘాన్ని సంస్కరించుదామనా!**

ఆంజనేయ రెడ్డి : ఒక సమాజం అభివృద్ధిపథంలో సాగాలంటే ఆ సమాజం తనతో తాను ఘర్షించకూడదు. దానికి బౌద్ధం సరియైనది అని నేను నమ్ముతాను. ఇది నా ప్రాథమిక అవగాహన.

మిసిమి : **మీరన్న కుల వ్యవస్థలో కూడా మార్పులు వస్తున్నాయి కదా! ఈరోజున కులాంతర వివాహాలు జరుగుతున్నాయి కదా.**

ఆంజనేయ రెడ్డి : కులాంతార వివాహాల గురించి "గోరా" కన్న ఎక్కువ ప్రయోగాలు చేసినవారు లేరు. కానీ ఆయన్ని సమాజం పట్టించుకుందా లేదు. ఆయన చేసిన ప్రయోగాలు ఈరోజున ఆయన కుటుంబానికి పరిమితమయిపోయినాయి. మనం కులాన్ని అధిగమించి ఆలోచించాలి. ఆచరణలో అది చేయలేక పోతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఇదివరకు రెండుకులాల మధ్య ఆధిపత్యపోరుండేది. ఇప్పుడు మూడోకులం ఆ పోరులో చేరింది. దీనికి పరిష్కారం సమీకృత సమాజం. అది బౌద్ధం వల్లనే సాధ్యమని నేను

నమ్ముతాను. దేవునితో బేరసారాలు కాదు. నీమీద నమ్మకం పెంచుకో అంటాను. పోరాడితే గెలుస్తానన్న నమ్మకం పెట్టుకో అంటాను. సంస్కృతి వేరు ..మతం వేరు. సావర్కర్‌ని విమర్శించే వారు అతను నాస్తికుడు కానీ భారతీయ సంస్కృతికి కట్టుబడ్డాడని గుర్తించాలి. రంగనాధబాబు అని ఒక గొప్ప వ్యాపారవేత్త అమెరికాలో ఉన్నాడు. ఇప్పుడారోగ్యం బాలేదని విన్నాను. ఆయన ఒకసారి నాతో అన్నాడు వాళ్ళ పిల్లలు మన మతాన్ని సంస్కృతిని విమర్శిస్తున్నారు ఏం చేయాలి అని అడిగాడు.. మన మతం బౌద్ధం, మన కల్చర్ హిందూయిజం అని చెప్పండని చెప్పాను. మనం రేషనల్‌గా ఆలోచించాలని నా అభిప్రాయం. బౌద్ధంలో దేవుడిమీద ఆధారపడటం ఉండదు. నీకు నువ్వే ప్రయత్నించి సాధించాలనుంటుంది. మీరు జాతకకథలు చదవండి.

మిసిమి : **మన వేదాల్లో కూడా దైవప్రసక్తి లేదు. ఆ విషయంపై పప్పు వేణుగోపాలరావు గారితో చాలా వ్యాసాలు రాయించాం. ఆధ్యాత్మికత-మతం ఒకటి కాదని కూడా.**

అంజనేయ రెడ్డి : ఒక అలవాటుగా మనం ఏదైనా చెప్పొచ్చు, నీమీద, నువ్వు నమ్మకం పెట్టుకో అనేది ముఖ్యం. ఇది బౌద్ధంలో ఉంది. ఇది నేర్పాలంటాను.

మిసిమి : **చాలాసేపు చాలా విస్పోటకరమైన విషయాలు మాట్లాడుకున్నాం. ఆలపాటి రవీంద్రనాథ్ గారితో మీకున్న అనుబంధం..మిసిమితో మీ అనుబంధం చెప్పండి?**

అంజనేయ రెడ్డి : రవీంద్రనాథ్ గారు **మిసిమి** పత్రిక ప్రారంభం కాకముందే తెలుసు. ఆయన నేను ఫిలాసఫీ, సైకాలజీ అంశాలమీద మాట్లాడుకునేవాళ్ళం. ఆయనతో మాట్లాడితే ఒక ఇంటలెక్చుయల్‌తో చేసిన సంభాషణలా ఉంటుంది. ఒకరోజాయన **మిసిమి** పత్రిక మొదలుపెట్టానని చెప్పారు. నేను వారించాను. ఈ వయసులో మీకీ తలనొప్పెందుకు అన్నాను. అప్పుడాయనకు అరవైఏళ్ళు ఉన్నాయనుకుంటాను. నేను లేకపోయినా చూసుకోవటానికి మీలాంటివారుంటారు కదా అన్నారు. కానీ ఒక స్టేజిలో **మిసిమి** కష్టాల్లో పడితే విజన్ **మిసిమి** పేరుతో నేనొక నోట్ పంపించాను. అందులో **మిసిమి**ని ఒకప్పటి "భారతి"లా తీర్చిదిద్దాల్సిన అవసరం గురించి చెప్పాను. పత్రిక సైజు మారింది. శీర్షికలు మారాయి. ఎంచుకున్న అంశాలు మారాయి. ఈ విషయంలో కళాజ్యోతి యాజమాన్యం పక్షాన బాపన్న గారికి నా కృతజ్ఞతలు తెలియచేయాలి మనమందరమూ.. ఆ నోట్ తర్వాత **మిసిమి**లో వచ్చిన మార్పులేమిటో పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆర్ట్‌ని తొలిరోజుల్లో రవీంద్రనాథ్ యూరోపియన్ ఆర్ట్‌కే పరిమితం చేశారు. ఇప్పుడు ఆర్ట్‌ని భారతీయత సంతరించుకునేలా చేశాము. ఇంకో విషయమేమిటంటే రవీంద్రనాథ్‌కు సీరియస్ సాహిత్యమంటే ఆసక్తి ఎక్కువ. కథలు, కవిత్వం పట్ల ఆయనకు మోజులేదు. ఆయనపై రాడికల్ హ్యూమనిజం ప్రభావం ఎక్కువ.హేతువాది.

మిసిమి : **మీరు పంపించిన విజన్ డాక్యుమెంట్ తర్వాత ఏం జరిగిందో చెప్పండి?**

అంజనేయ రెడ్డి : వి.నారాయణరెడ్డి అని రవీంద్రనాథ్ గారికి సన్నిహితుడు. ఆయన నా ఫెలో ఐపిఎస్ అధికారి. ఆయన వల్లనే నాకు రవీంద్రనాథ్ గారు పరిచయం. రవీంద్రనాథ్ గారి సమయంలో వెంకటేశ్వరరెడ్డి గారు ఎడిటర్‌గా ఉన్నారు. వయోభారంతో వెంకటేశ్వర రెడ్డి తప్పుకున్నాక నాకున్న మల్టిపుల్ యాక్టివిటీస్ వలన నారాయణరెడ్డిగారిని ఎడిటర్‌గా ఉండమన్నా. ఆయనకు కుదరలేదు.

ఆ తరువాత బాపన్నగారు కళాజ్యోతిలో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. అందులో నేను, బాపన్న, వెంకటేశ్వరరెడ్డి, జితేంద్ర, కాంద్రేగుల నాగేశ్వరరావు, ఈమని శివనాగిరెడ్డి, అశ్వినీకుమార్ కూడా ఉన్నారు. ఆ మీటింగ్ మినిట్స్ ఇప్పటికీ అశ్వినీ దగ్గర ఉన్నాయి. దాని పర్యవసానమే అశ్విని సంపాదకత్వ బాధ్యతలు తీసుకున్నారు. కొద్దిరోజులు నేను, అశ్వినీ తంటాలుపడ్డాం. ఆ తర్వాత పూర్తిగా అశ్వినికి బాధ్యతలు అప్పచెప్పాం. పదిహేనేళ్లుగా ఆ బాధ్యతలు అశ్వినీయే నిర్వహిస్తున్నారు. ఎంతోమంది రచయితలను, ఎన్నో కొత్త శీర్షికలను పరిచయం చేశారు. ప్రముఖ వ్యక్తులతో సంభాషణలు ప్రచురిస్తున్నారు. ఇప్పుడు నేను మీతో మాట్లాడటం కూడా అందులో ఓ భాగమే.

మిసిమి : **ఇప్పటివరకు మిసిమి మీద నాలుగు కోట్లకు పైగా ఖర్చయ్యి ఉంటుందని అంచనా. ఎందుకంటే మిసిమిలో ప్రకటనలుండవు.. మీరేమంటారు?**

ఆంజనేయ రెడ్డి : **మిసిమి**లో ప్రకటనలుండవు. నిజమే. దీన్నొక ట్రస్ట్‌గా మార్చి ప్రకటనలు తీసుకుందామన్న ప్రతిపాదన వచ్చింది. దానికి బాపన్నగారు ఒప్పుకోలేదు.

మిసిమి : **మిసిమికి రాయగలిగిన రచయితలను అన్వేషించాం. కొంతమందిని తయారుచేశాం కదా.**

ఆంజనేయ రెడ్డి : అవును..మీరన్నది నిజమే. సీరియస్ సబ్జెక్టును చిన్నచిన్న పదాలలో రాయటం మామూలు విషయం కాదు. దానికి చాలా నైపుణ్యం కావాలి. ఇంకొక్క విషయం చెప్పి ముగిస్తాను. మనలో ఇంటలెక్చుయల్ ఇంట్రెస్టు అంటే మేధోపరమైన ఆసక్తి తగ్గిపోకూడదు. అదొక దీపంలా ప్రకాశిస్తూనే ఉండాలి. అప్పుడే సర్వమానవ సౌభ్రాతృత్వం వికసిస్తుంది. ఇప్పటి తరం తెలుగు చదవటం మానేస్తోంది. అదికొంచెం ఆందోళన కలిగిస్తోంది. అలాగే సీరియస్ లిటరేచర్ మీద ఆసక్తి తగ్గిపోతోంది. మన భాషలో ఈ సమస్య ఎక్కువ. తమిళం, మళయాళం, కన్నడ భాషల్లో మనకున్నంత సమస్య లేదు. హిందీ బ్రహ్మాండంగా ఉంది.

మిసిమి : **మిసిమిలో ఎలాంటి మార్పులు తేవొచ్చు అంటారు?**

ఆంజనేయ రెడ్డి : ఇంకా మార్పులు తీసుకురావొచ్చు. జాతకకథలు వంటి వాటికి చోటు కల్పించండి. దక్షిణభారత చరిత్ర మీద చాలా రీసెర్చ్ జరుగుతోంది. అనిరుధ్ కానిసెట్టి అనే యంగ్ హిస్టోరియన్ రైటర్ Lords of Deccan: Southern India from the Chalukyas to the Cholas అనే బుక్ రాశాడు. వాటిలోంచి కొన్ని ఛాప్టర్స్ పరిచయం చేస్తే బావుంటుంది. అతను మనకు తెలియని విషయాలు చెప్పాడు. అలాగే ఒక అమెరికన్ లేడీ భారతీయ చరిత్రలో కొత్త పరిశోధనలమీద పుస్తకం తెచ్చింది. అలాంటివి మనం కూడా చెబితే బావుంటుంది. ఇప్పుడు మీరు ప్రచురిస్తున్న **సువర్ణపథం** ప్రతి ఒక్కరు చదవతగినది. చరిత్రను ఎలా వక్రీకరించారో–భారత్‌కు ఎలాంటి అన్యాయం జరిగిందో భారతీయ చరిత్రకారులు **విలియమ్ డాల్రింపుల్** తన పరిశోధనతో మన కళ్లు తెరిపిస్తారు.

మిసిమి : **తప్పకుండా ఆంజనేయరెడ్డి గారూ..చాలా నిర్మొహమాటంగా మీ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బౌద్ధంపై మీకున్న** conviction కూడా చాలా సూటిగా చెప్పారు. **మిసిమి** ప్రయాణంలో మీపాత్ర మరువలేనిది. మీ సూచనలు మాకెప్పుడూ శిరోధార్యమే..సెలవు..

ఆంజనేయ రెడ్డి : థ్యాంక్యూ అశ్వినీ..

రిటైర్డ్ డి.జి.పి. చెన్నూరు ఆంజనేయరెడ్డిగారు, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నప్పుడు స్టాఫ్‌కు తదితరులకు చేసిన సేవలు అన్నీ ఇన్నీ కావు. టూరిజం ఆర్.టి.సి. డిపార్ట్‌మెంట్‌లో ఉన్నప్పుడు కూడా ఆయన అందించిన సేవలు లెక్కలేనన్ని. ఆయన పేరు చెబితే కూడా పోలీస్, టూరిజం, ఆర్.టి.సి. డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు చేతులెత్తి నమస్కరిస్తారు. జైన, బౌద్ధ ధర్మాలపై ఆయనకు ప్రగాఢ విశ్వాసముంది. డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రారంభించిన బౌద్ధ పునఃరాకృతి ఉద్యమం హృదయానికి హత్తుకుని రెడ్డిగారు నాగార్జున సాగర్‌లో బుద్ధవనం నిర్మింపజేశారు. అందువల్ల ఆయనను ఆంధ్ర అశోకుడు అంటారు. ఆయన కవి కాకపోయినా కవితా హృదయమున్నవారు. మంచి చదువరి. ఇంగ్లీషు తెలుగు భాషలలో చక్కని వ్యాసాలు వ్రాసియున్నారు. అందువల్ల ఆయన ఎన్నో మంచి పుస్తకాలు ప్రచురించారు. బుద్ధభూమి మాసపత్రికకు ప్రతి నెల రూ. 10,000/– ఇస్తారు. రెడ్డిగారు ఒక మహానది. రెండు రాష్ట్రాలలో ప్రవహించే జీవనదుల మధ్య ఆ మహానది ధర్మసూత్రాలను ప్రవహింపజేస్తూ ఉంటుంది నిరంతరంగ గతిశీలత్వంతో – ***ముంగర జాషువా.***



మహాబోధి ధర్మచక్రం

సంభాషణ : అశ్వినీకుమార్

ధ్వని ముద్రణకు రాత ప్రతి : ***సి.ఎస్. రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

27వ స్నాతకోత్సవం

మొన్నీమధ్య – అక్టోబరు ఏడవ తేదీన అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ **ఇరవయి ఏడవ కాన్వొకేషన్** జరిగింది. ఆ సందర్భంగా వి.ఐ.పి ఆహ్వానం పంపారు శ్రీ వి.యస్. ప్రసాద్. వారు కాన్వొకేషన్ ఉత్సవానికి చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానితులు – మరొక విశేషమేమిటంటే నాకు మూడు దశాబ్దాలుగా మిత్రులు – ఆత్మీయులు బి. నర్సింగరావు గారికి గౌరవ డాక్టరేట్ ప్రదానం జరుగుతోంది కాన్వొకేషన్‌లో – ఛాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ గౌరవనీయులు శ్రీ శివప్రసాద్ శుక్లా ఆగమనంతో కార్యక్రమం మొదలయింది. కాన్వొకేషన్‌లో పట్టాలందుకునే స్కాలర్లు – ఆఫీస్ బేరర్లు – ప్రత్యేకమైన దుస్తుల్లో పేరేడ్‌లో **భవనం వెంకట్రామ్ ఆడిటోరియం**లో ప్రవేశించారు – ఇంతటి ఘనమైన సభాప్రాంగణంలో అలంకరణ అద్భుతంగా చేశారు. రాష్ట్ర గవర్నరు గారికి సెక్యూరిటీకి లోటేమి వుంటుంది? రవితేజములలరగ సభాప్రవేశం చేశారు.



శ్రీ వి.యస్. ప్రసాద్

నా మిత్రులు – **మిసిమి** అభిమాని, ఒకప్పుడు NAAC డైరెక్టర్, పూర్వ వైస్‌ఛాన్స్‌లర్ వి.యస్. ప్రసాద్ గార్ని ప్రత్యేకంగా కలసి అభివందనలు తెలియజేసాను. అక్కడే గౌరవ డాక్టరేట్ అందుకోబోతున్న బి. నర్సింగ్‌రావు గారిని అభినందించాను. ప్రొ. వెంకటయ్య గారు నన్ను ప్రత్యేకంగా వెంటవచ్చి వి.ఐ.పి వరుసలో కూర్చోపెట్టి వెళ్లారు – మూడుగంటలు సాగిన ఈ స్నాతకోత్సవం కన్నులపండువగా జరిగింది – కొన్ని విశేషాలు చెప్తాను.

వైస్ ఛాన్స్‌లర్ **చక్రపాణి** గారి ఉపన్యాసంతో ప్రారంభమైన కార్యక్రమం అంతా చక్కని క్రమశిక్షణతో జరిగిందని చెప్పాలి. తర్వాత స్కాలర్లతో ఒట్టుపెట్టించి – డిగ్రీలు గవర్నరు – ఛాన్స్‌లర్‌తో ప్రదానం చేయించారు. సగంపైనే స్త్రీ శక్తి కనపడింది. పోలీసు ఉద్యోగంలో వుంటూ పరిశోధనలు చేస్తూ విద్యపై మక్కువతో డిగ్రీలు పొందినవాళ్లున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్షలో వున్న ఒక అరుదైన వ్యక్తి మూడు గోల్డ్‌మెడల్స్ సాధించి – అందుకోవటానికి పోలీసు ఎస్కార్ట్‌తో వచ్చారు – హైద్రాబాద్ నుంచి మరికొందరు ఖైదీలు డిగ్రీలు పొందారు. ప్రప్రథమంగా మిత్రులు నర్సింగరావు గారు గవర్నర్, ఛాన్స్‌లర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నప్పుడు సైటేషన్‌లో–అయిదు దశాబ్దాలుగా వారు లలితకళలకు – ఆసరాగా నిలిచి, చిత్రకళ, కవిత్వం, ఫొటోగ్రఫీ, నాటకరంగం, సంగీతం – ముఖ్యంగా సమాంతర సినిమాకి రెండు రాష్ట్రాల్లో ఒక ఐకాన్‌గా నిల్చారని డి.లిట్ ఇస్తూ కొనియాడారు.



గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా
శ్రీ బి. నర్సింగరావు

ముఖ్య అతిథి ఆచార్య వి.యస్. ప్రసాద్ ప్రసంగిస్తూ – ఓపెన్ యూనివర్శిటీ పుట్టుపూర్వోత్తరాల చరిత్ర చెబుతూ – దేశంలోనే ప్రప్రథంగా ఒకప్పటి ఏ.పి. రాజధాని హైద్రాబాద్‌లో ప్రొ. బి. రామిరెడ్డి నేతృత్వంలో ప్రారంభమయి దేశానికి దిశానిర్దేశం చేసిందని వివరించారు. ఆ సందర్భంలో ఉన్నత విద్య వుండాల్సిన తీరుతెన్నులను విశ్లేషించారు. (అక్టోబరు 2026 **మిసిమి**లో వివరాలున్నాయి). చివరగా గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా చక్కని ఉపన్యాసంలో స్కాలర్లకు – **మీరు పట్టా తీసుకోవడంతో ప్రపంచంలో ప్రవేశిస్తున్నారు – మీమీద ఎంతో సాంఘిక బాధ్యత వుంది – అని ప్రబోధించారు – మీ జీవితం ఇప్పుడే మొదలవుతోంది గుర్తుపెట్టుకోండి** అని సూటిగా హెచ్చరించారు – అంతా ఒక వేడుకలా జరిగింది. గవర్నర్ నిష్క్రమణతో నర్సింగ్‌రావు, ప్రసాద్ గార్ల నుంచి శలవు తీసుకుని లేత ఎండలో ఆడిటోరియం నుంచి మళ్లీ రోడ్ నెం. 45 ఎక్కటానికి రెండు కిలోమీటర్లు నడిచి రాపిడో ఆటోలో **మిసిమి** ఆఫీసుకు చేరాను.



స్నాతకోత్సవ సంరంభం

నాకు ఆంధ్ర విశ్వకళాపరిషత్ డిగ్రీని ఒక గొట్టంలో పెట్టి – పోస్ట్‌లో పంపిన సందర్భం గుర్తుకు వచ్చింది.

జీవన మకరందం



- ప్రయాణాలు మేధోపరంగా నిన్ను భ్రమల నుంచి విముక్తి చేస్తాయి.
- తెల్లని గడ్డాలు పెంచుకుని, చీవరాలతో పంచలతో సంచరించే తత్త్వవేత్తలకు భగవంతునితో పని ఏముంది?
- మనకు న్యాయసూత్రాలు – చట్టాలు తెలిసి వుంటే బాధ్యతలు తెలుస్తాయి.
- స్త్రీలు ఎక్కువగా భావోద్వేగాల సుడులలో జీవిస్తుంటారు.
- విజయాలన్నీ బహిరంగమైనవే – అపజయాలు వ్యక్తిగతమైనవి!
- మనిషి ఎప్పుడు ప్రక్కవాడు ఏమి చేస్తున్నాడా అని చూస్తుంటాడు – తన పని – తనకి నిరుత్సాహం కలిగిస్తుంది.
- ముందు నాకు హృదయం లేదనుకున్నాను – తర్వాత తెలిసింది అది నాకు అంతగా నప్పదని!
- నాకు అనుమానం వస్తుంటుంది – నేను చెప్పేది ఎక్కువమంది అంగీకరిస్తున్నారంటే అది ఖచ్చితంగా తప్పేనని!
- అన్నీ తెలుసుకొనేంత సమయం ఎవరికుంటుంది? వయసు మించిపోదా!?
- ప్రేమిస్తున్నామని చెప్పేవాళ్లు నటులు-నటీమణులు! అదంతా నటనన్నమాట?
- ఎవ్వరైనా వసంతంలోనే పంట కోస్తారా? ఇప్పటి రచయితలు అదే చేస్తున్నారు!



- జీవితంలో విషాదమేమిటంటే – శరీరం వయసుతో వంగిపోతుంటే – మనసు యౌవనంతో గంతులేస్తుంటుంది. నీకు అరవై నిండినా – మనసు పదహారులోనే వుంటుంది. రెండూ నీవే!
- నీవు పల్లెటూరు నుంచి పట్టణానికి వచ్చావా? అయితే వెంకటయ్య – వెంకటేశ్వరరావు అవుతాడు!
- జీవితం చాలా ముఖ్యమైనది. దానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వకూడదు!
- జ్ఞాపకాలలో ఎక్కువశాతం – ఇలా జరగకుండా వుంటే బాగుండేది అనిపిస్తాయి.
- స్వేచ్ఛ వింతగా వుంటుంది – అది ఉన్నప్పుడు మనకు స్పృహలోకి రాదు – అది లేనపుడు దాని అవసరం తెలిసివస్తుంది.
- ఇప్పటి నాగరకతను భరించాలంటే – ఎగతాళి చేస్తూ – వెక్కిరిస్తూ వుండాలి!
- ఇప్పుడు బహుమతులు తెస్తున్న నవలలు – అర్థమూ – పరమార్థము లేనివే!

భారతీయ చిత్ర కళా ధోరణులు

__పరిచయం:__ రాజా రవివర్మ తదనంతర కాలంలో భారతీయ చిత్రకళా ప్రస్థానం తన సహజసిద్ధమైన భారతీయాత్మ నుంచి క్రమంగా పాశ్చాత్య దృక్పథం వైపు అడుగులు వేసింది. ఐరోపా, అమెరికా దేశాల నూతన కళా ధోరణులను అందిపుచ్చుకునే క్రమంలో 'నైరూప్య చిత్రకళ' (Abstract Art), యాదృచ్ఛిక వర్ణ విన్యాసాలు, విరూపిత రూపాల ఆరాధన ప్రాచుర్యం పొందాయి. కళ తన మూలాల నుంచి దూరమవుతున్న అటువంటి సంధియుగంలో-తన కళాత్మక దృష్టిని భారత సరిహద్దులు దాటనీయక, సనాతన సాంస్కృతిక పునాదులపై అచంచలంగా నిలబడిన అరుదైన చిత్రకారుడు రాయన గిరిధర్ గౌడ్. భారతీయ సాంస్కృతిక, తాత్విక వారసత్వాన్ని ఆయన ఒక అమూల్యమైన పెన్నిధిగా భావించారు. ఆ వారసత్వంలోని పవిత్ర ఆధ్యాత్మిక పరిమళాలను తన కుంచెతో ఒడిసిపట్టి, కాన్వాస్‌పై చిత్రాలై వికసించేలా పునర్జన్మనిచ్చారు. ఆయన చిత్రాల్లో ప్రతిఫలించేది పరాయితనం కాదు, యుగయుగాలుగా మన జీవన స్రవంతిని, అంతరంగాన్ని వెలిగిస్తున్న మనదైన సాంస్కృతిక కాంతిపుంజాలు. ఆ చిరపరిచిత భావనలకే తనదైన అపురూప దృష్టిని జోడించి, లలిత వర్ణ శోభలతో నూతనంగా ప్రాణప్రతిష్ఠ చేశారు. గిరిధర్ గౌడ్ చిత్రాల ముందు నిలిచిన ఏ సామాన్యుడైనా సరే-ఎవరూ ఏదీ వివరించనవసరం లేకుండానే-ఆ దివ్య దృశ్య సౌందర్యానికి అబ్బురపడి, తన మూలాలను తాను స్పర్శిస్తూ మంత్రముగ్ధుడై నిలిచిపోతాడు. ఇలా భారతీయ దృశ్య సంస్కృతికి సజీవ ప్రతిరూపంగా నిలిచిన రాయన గిరిధర్ గౌడ్, తన కళా తపస్సు గురించి, కాన్వాస్ వెనుక సాగిన తన అంతరంగ తీర్థయాత్ర గురించి స్వయంగా ఏం చెబుతున్నారో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం...

- సంపాదకులు

నా కళా ప్రస్థానం ఆధునిక సమకాలీన చిత్రకళతో మొదలైనప్పటికీ, అంతర్లీనంగా నాదైన కళాత్మక అస్తిత్వం కోసం సాగిన అన్వేషణ నన్ను తిరిగి భారతదేశపు అపురూపమైన దృశ్య, తాత్విక వారసత్వం వైపు నడిపించింది. మన ప్రాచీన ఆలయాలు, మ్యూజియంలు, తాళపత్ర గ్రంథాలు, సంప్రదాయ కళా ప్రక్రియలలో నిక్షిప్తమై ఉన్న కళాఖండాలలో నేను లీనమైనప్పుడు ఒక చేదు నిజం నన్ను కదిలించింది- శతాబ్దాల చారిత్రక, సాంస్కృతిక అలజడులలో మన స్వదేశీ కళాజ్ఞానం ఎంతో ఛిన్నాభిన్నమై, మరుగునపడిపోయిందన్న స్పృహ నాలో తీవ్రమైంది.

ఈ ఎరుక నా జీవితంలో ఒక గొప్ప మలుపుగా మారింది. నా కళను కేవలం భావవ్యక్తీకరణ సాధనంగా కాక, ఒక పవిత్రమైన అంతరంగ తీర్థయాత్రగా చూడటం ప్రారంభించాను. అది నా ఆధ్యాత్మిక, సాంస్కృతిక అన్వేషణను గుర్తుచేసుకునే,పునరుజ్జీవింపజేసే ప్రయాణం. మన పూర్వీకుల దృశ్య భాషను తిరిగి అనుసంధానించడం, భారతీయ సూక్ష్మ చిత్రకళా (Miniature) సంప్రదాయాల వైభవాన్ని పునరుద్ధరిస్తూ, వాటి సారాన్ని నా సమకాలీన దృశ్య శైలి ద్వారా ముందు తరాలకు అందించడం నా ప్రధాన బాధ్యతగా భావించాను.

నా కళాసృష్టి 'శివ-శక్తి', 'ప్రకృతి-పురుష' అనే మహోన్నత తాత్విక పునాదులపై ఆధారపడి ఉంది. చైతన్యానికి-శక్తికి, నిశ్చలత్వానికి-చలనానికి మధ్య ఉన్న విడదీయరాని బంధాన్ని, సృష్టిని నడిపించే శక్తులను నా చిత్రాల్లో అన్వేషిస్తాను. యోగ శాస్త్ర సూత్రాలు, ప్రకృతి లయలు, జీవవైవిధ్యంలో దాగి ఉన్న అద్భుతమైన పరస్పర అనుసంధానత నాకు నిరంతర స్ఫూర్తినిస్తాయి.

ఆది శంకరాచార్యుల 'సౌందర్యలహరి' నా సాధనకు అమూల్యమైన ప్రేరణ. జగన్మాత దివ్య సృజనాత్మక శక్తి వైభవం, నా చిత్రాలను దర్శించే మరియు ఆవిష్కరించే విధానాన్ని లోతుగా ప్రభావితం చేసింది. రేఖ, వర్ణం, లయ, ప్రతీక (Symbolism), రూపాల ద్వారా కాలాతీతమైన ఈ తాత్విక భావనలను కేవలం కంటికి కనిపించే రూపాలుగా కాకుండా, అంతరంగంలో అనుభూతి చెందే ఒక దివ్య దృశ్యానుభవంగా మార్చడమే నా తపన.

సృష్టి, స్థితి, లయలు అనే సనాతన విశ్వ లయలే నా కళాత్మక తాత్వికతకు మూలాధారాలు. ఈ శాశ్వత చలనాలు నా చిత్రాలలో క్లిష్టమైన రూపాలు, తేజోవంతమైన వర్ణాలు మరియు పవిత్ర జ్యామితి (Sacred Geometry) ద్వారా దృశ్య లయలుగా రూపుదిద్దుకుంటాయి.



'కళారత్న' గిరిధర్‌గౌడ్

నా కళా ప్రయాణం అంతిమంగా 'శ్రీ చక్రం', 'శ్రీ విద్య'ల వైపు సాగుతుంది. ఇక్కడ జ్యామితి అనేది విశ్వైక్యతను పలికించే పవిత్ర భాషగా మారుతుంది. నా దృష్టిలో శ్రీచక్రం కేవలం ఒక రూపమో లేదా ఆకృతి రూపకల్పనయో (Design) కాదు,అది జీవాత్మ-పరమాత్మల, దృశ్య-అదృశ్యాల, చేతన-అచేతనాల మధ్య గల అంతర్గత సంబంధంపై సాగే ఒక నిశ్శబ్ద ధ్యానం.

నా చిత్రకళ ద్వారా సంప్రదాయానికి, ఆధునిక భావవ్యక్తీకరణకు మధ్య ఒక సజీవ వారధిని నిర్మించాలని ఆశిస్తున్నాను.తద్వారా భారతీయ తాత్విక జ్ఞానాన్ని గౌరవిస్తూనే, దానిని నేటి సమకాలీన చైతన్యంతో సజీవంగా వికసించేలా చేయడమే నా సంకల్పం.

హృదయపూర్వకంగా చెప్పాలంటే, నా కళ ఒక పవిత్ర సమర్పణ-మరుగునపడిన దానిని వెలికితీసే అన్వేషణ, నిలిచివున్న వారసత్వాన్ని ఘనంగా జరుపుకునే వేడుక, ముందు తరాలకు తప్పక చేర్చవలసిన వారసత్వ సంపద పట్ల నా అచంచల నిబద్ధత.

ఇది కేవలం నా తపన మాత్రమే కాదు... నా ఆధ్యాత్మిక ప్రయాణం... ఒక తీర్థ యాత్ర...

"నా దృష్టిలో కళ కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు. అది నా జీవన తీర్థయాత్ర."

*నేను **రాయన గిరిధర్ గౌడ్,** దృశ్య కళాకారుడిని (Visual Artist). బరోడాలోని ఎం.ఎస్. విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నుంచి మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (MFA) పూర్తి చేశాను. గత మూడు దశాబ్దాలుగా నా సర్వస్వాన్ని కళాసాధనకే అంకితం చేశాను.*

ఫోన్ : 965 213 9668

*నవంబరు **మిసిమి** మాసపత్రిక - అట్టమీది నాలుగు చిత్రాలు **రాయన గిరిధర్‌గౌడ్** చిత్రించినవి.*



చెలిమి కలిమికి చంద్రుడు
రవీంద్రుడి అంతరంగం

ఆలపాటి రవీంద్రనాథ్

– సి.ఎస్. రాంబాబు

సత్పురుషుల మంచితనం
ఝుంఝూనిల ధాటికాగి
దిగంతాల పర్యంతం
సుగంధాలు పంచుతుంది

– *ధమ్మపదంలో బుద్ధుడు చెప్పిన మాట*

రవీంద్రనాథ్ గారి గురించి ఒక వ్యాసం రాయండని ఎడిటర్ అశ్వినీకుమార్‌గారడిగినప్పుడు కొంత సందేహ పడ్డాను. కొంత సంకోచించాను. ఇది గమనించి నట్టున్నారు.. నాకో పుస్తకమిచ్చి, ఈ పుస్తకం చదవండి.. మీకు కొంత క్లూ దొరుకుతుందని నవ్వుతూ చెప్పారు. ఆ పుస్తకం చదివినప్పుడు నా మనోనేత్రాలు తెరుచుకున్నాయి. ఒక ప్రపంచంలో విహరించి వచ్చాను. దానికి కారణాలేమిటని ఆలోచిస్తే ఆయనలోని స్వేచ్ఛాప్రియత్వం, స్నేహశీలత్వం, సౌందర్యాభిలాష. వీటికితోడు ఆయన అనేక భావజాలాల ప్రభావానికి లోనైన వ్యక్తులను దగ్గరనుంచి చూశారు. కొందరిని అభిమానించారు. కొందరిని ఆరాధించారు. కానీ మోతాదు మించలేదు ఏది చేసినా.. ఒక్కమాటలో ఆయన ఆయనకు నచ్చినట్టు జీవించగలిగారు. ఎవరు మెచ్చుకోలు కోసమో ఏ పనీ చేయలేదు. తనకు నచ్చితేనే ఆ పనిచేశారు.

రవీంద్రనాథ్ గారిపై ఆయన తాత దేవయ్య గారి ప్రభావం ఉంది. దేవయ్య గారు తన గ్రామం గోవాడలో హరిజనుల్ని గ్రామంలోని బావి నీళ్ళను తోడుకోనివ్వడానికి కృషిచేశారు. ఆ ఊళ్ళో గ్రంథాలయం ఏర్పరచి పుస్తకాలు తెప్పించడంలో ఆయన తాతగారి పాత్ర ఉంది. మరోపక్క జస్టిస్ పార్టీవారు ఆంధ్రలో (ముఖ్యంగా గుంటూరు జిల్లాలో) అనేక పాఠశాలలు తెరవడానికి పూనుకున్నారు. ఇందులో భాగంగానే పావులూరి కృష్ణయ్య చౌదరిగారు అనేకమంది ధనికులైన రైతుల దగ్గర నిధులు సేకరించేవారు. ధనిక వితంతువులను కూడా బతిమాలి వారిని కొంత ధనమివ్వటానికి ఒప్పించేవారు. నిజానికి కృష్ణయ్య చౌదరి గారు చదువుకోలేదు కానీ చదువంటే ఆయనకి అమిత గౌరవం. పాఠశాలలు పెట్టడానికి ఆయన పడిన తపన రవీంద్రనాథ్ గారికి కృష్ణయ్య చౌదరి గారిపట్ల ఎంతో గౌరవాన్ని ఏర్పరిచింది. కృష్ణయ్య చౌదరి గారి తపనను కథలు కథలుగా రవీంద్రనాథ్ గారు చెబుతుండేవారు. ఆయనంటే అంతిష్టం రవీంద్రనాథ్ గారికి. ఇంతాచేసి రవీంద్రనాథ్ గారు ఎనిమిదో తరగతి దాటి చదవలేదు. ఆయనదంతా డిగ్రీలు అవసరంలేని పాండిత్యం.

రవీంద్రనాథ్ గారు చదువుకు స్వస్తి చెప్పినా, జీవితం నేర్పే చదువును మాత్రం ఆపలేదు. ఈ క్రమంలో ఆయనపై ప్రభావం చూపిన వ్యక్తులు చాలామందున్నారు. కానీ వాళ్ళనుంచి ఎంత గ్రహించాలో, ఎంత స్వీకరించాలో అంతవరకే. అలా ఆయనపై ప్రభావం చూపిన వారిలో త్రిపురనేని రామస్వామి చౌదరి ఉన్నారు. తాపీ ధర్మారావు ఉన్నారు. తాతాజీతో (తాపీ ధర్మారావు) మాత్రం ఆయన చివరివరకూ తన అనుబంధాన్ని కొనసాగించారు.

ప్రతివ్యక్తికీ జీవితంలో ఓ కీలక మలుపుంటుంది. రవీంద్రనాథ్ గారికి అలాంటి మలుపు తెనాలిలో ప్రెస్ పెట్టడంతో ఎదురయింది. అది వ్యాపారానికే కాకుండా ఆయన వ్యక్తిత్వం విప్పారటానికి దోహదపడింది. ఆరోజుల్లో తెనాలిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు రచయితలు, కళాకారులు, మేధావులను ఒక్కచోటు చేర్చే వేదికలుగా ఉండేవి. అలాంటి ప్రెస్‌ల మధ్య రవీంద్రనాథ్ గారు తన **జ్యోతి ప్రెస్**



స్థాపించారు. ఆ ప్రెస్‌లోనే రాడికల్ హ్యూమనిస్టులు, హేతువాదులు జేరుతుండేవారు.అప్పటికింకా ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు. ఆయన పనులమీద మద్రాసు వెళ్ళాల్సి వస్తుండేది. నెమ్మదిగా మద్రాసు సాంస్కృతిక జీవనంతో పరిచయం ఏర్పడింది కూడాను. అదే ఆయన్ని పత్రికలు స్థాపించటానికి పురికొల్పింది. అందుకు మద్రాసు నగర సాంస్కృతిక వాతావరణం సహకరించింది.

రవీంద్రనాథ్‌పై రాడికల్ హ్యూమనిస్ట్‌గా పేరొందిన ఎమ్.ఎన్.రాయ్ ప్రభావం చాలా ఉండేది. ఆయన (ఎం.ఎన్.రాయ్) భావాలకు ఆకర్షితుడయ్యాన్నది వాస్తవం. ఆయన్ని ఆకర్షించింది ఎం.ఎన్.రాయ్ పెట్టిన పార్టీ కాదని మనం గ్రహించాలి. భారతీయ చరిత్రను, సంస్కృతిని, తత్వాన్ని, ఆఖరికి బౌద్ధాన్ని కూడా శాస్త్రీయదృక్పథంతో చూడాలన్న రాయ్ మాటలు రవీంద్రనాథ్‌కు నచ్చాయి. ఆ స్ఫూర్తితోనే **జ్యోతి, రేరాణి** పత్రికలు ప్రారంభించారు. జ్యోతి పత్రికను కళలు, సౌందర్యశాస్త్రం, విమర్శల కోసం నిర్దేశిస్తే.. సెక్స్‌ను శాస్త్రీయంగా చెప్పటానికి **రేరాణి**ని ఉపయోగించుకున్నారు. ఇది కాకుండా **సినీమా** అనే మరో పత్రికను కూడా నడిపేవారు

నిజానికి **జ్యోతి** పత్రిక కొత్త రచయితలను, అజ్ఞాత రచయితలను వెలికితీయటంలో ముఖ్యపాత్ర పోషించింది. అలా ఆయన వెలికితీసిన వారిలో రచయిత శారద ఉన్నారు. ఆ శారద అనే వ్యక్తి తమిళుడని, హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తున్నాడని అప్పటివరకూ ఎవరికీ తెలియదు.

రేడియో ప్రసారాలపై మొదటిసారి సమీక్ష చేయించింది రవీంద్రధాథ్ గారే. అంతెందుకు రావూరి భరద్వాజకు తొలిరోజుల్లో ఆశ్రయమిచ్చిందీ రవీంద్రనాథ్ గారే. రచయిత పేరూ, ఊరూ లేకపోయినా రచన బావుంటే జ్యోతిలో ప్రచురించేవారు. చలం కథలను కొన్ని అప్పటి పత్రికలు వేయటానికి నిరాకరిస్తుండేవి. అలాంటి సమయంలో చలం భుజం తట్టింది రవీంద్రనాథ్ గారే.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి కర్నూలు రాజధాని కావటంతో మద్రాసు నగరంతో వారికున్న అనుబంధానికి బ్రేకు పడింది. ఎందుకో గాని కర్నూలు నగరం ఆయన్ని ఆకట్టుకోలేకపోయింది.. తిరిగి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఆయన మకాం హైదరాబాదుకి మారింది. ఆయన తెనాలిలో నడుపుతున్న ప్రెస్ కూడా భాగ్యనగర గాలులు పీల్చసాగింది.

రవీంద్రనాథ్ గారికి తను చదివిన మంచి పుస్తకం బాగోగులను మిత్రులతో పంచుకోవటం ఇష్టం. దానితో పాటూ స్నేహితులతో అరమరికలు లేని సంభాషణలూ ఇష్టమే. అబ్బూరి రామకృష్ణరావు ఆయనకు మంచి మిత్రుడు. ఆయనతోపాటు సరిసెట్టి ఇన్నయ్యలాంటి ఇతర మిత్రులను నిజాం క్లబ్‌కు తోడ్కొనిపోయి డిన్నర్ డిప్లొమసీలా, డిన్నర్ సంభాషణలు చేస్తుండేవారు.

ఏతావాతా హైదరాబాద్ వాతావరణం ఆయనకి నచ్చింది. అది పత్రిక పెట్టాలన్న ఆలోచనకు దారితీసింది, అయితే పత్రిక తీరుతెన్నులెలా ఉండాలన్న ఆలోచనలోని స్పష్టత అప్పటికే ఆయనకుంది. తాను పెట్టబోయే పత్రిక పేరు **మిసిమి** అని ఖాయం చేశారు. ఆయనకు ఆ పేరు సూచించింది ఆయన ఆప్త మిత్రుడు బూదరాజు రాధాకృష్ణ. **మిసిమి** అంటే **నూతనకాంతి, నవనీతం** (వెన్నల) దీనికి బూదరాజువారు అల్లసాని వారి మనుచరిత్రనుంచి ప్రామాణికతను ఆలపాటి వారికి చూపించారు.

మిసిమి పరసీమ వలరాజు
వే వెలుంగుల దొర జోడు రే వెలుంగు

ఆయన ఈ పత్రికను చింతనాత్మక సారసత్వంగా తీర్చిదిద్దాలని తన అభిరుచులకు ప్రతిబింబంగా నిలిపారు. సౌందర్యశాస్త్రం, బౌద్ధం, చిత్రకళ, సంగీతం అంశాలు చదువరులకు ముఖ్యమని భావిస్తూ ఉండేవారు.

ఒకవిధంగా ఆయన రాయని భాస్కరుడనుకున్నా **మిసిమి**లో వచ్చే ప్రతి అక్షరంలోనూ ఆయన పరిశీలన ఉండేది. వాదాలు, వాదనలూ రెండూ ఆయనకు నచ్చవు. ఏదైనా పరిమిత స్థాయిలో ఉండాలని (మోడరేషన్) విశ్వసించేవారు. ఆయా రచయితల వ్యాసాలను చిత్రిక పట్టి పాఠకులకు అందించటం ఆయనకిష్టం. ఆయన తన ఆలోచనలను ఏ సిద్ధాంతానికి ముడిపెట్టలేదు! ఆయన ఆలోచనగా వెలువడ్డ **మధురవాణి** ఇంటర్వ్యూలను పురాణం సుబ్రమణ్యశర్మ నిర్వహించినా ముద్ర ఆలపాటి వారిదే. పురాణం వారికి అవసరమైనప్పుడల్లా ముక్కుతాడు వేసేవారు.

రవీంద్రనాథ్ గారి తనయులు దేవేంద్రనాథ్, వెంకట్, బాపన్న గార్లు ప్రెస్ చూసుకుంటుంటే వీరు (రవీంద్రనాథ్) పత్రికతోను, మిత్రులతోను బిజీగా ఉండేవారు. ఎక్కడ మంచి రచన చదివినా రచయిత ఏ స్థాయివాడో అన్నది వారికి అనవసరం. తన ఆనందాన్ని ఫోన్ ద్వారానో,

ఉత్తరం ద్వారానో పంచుకునేవారు. హైదరాబాదులో ఉంటే తమ "నెస్ట్"కు ఆహ్వానించేవారు. చిన్నప్పటినుంచి వారిని చూస్తూ పెరిగినా కలిసే అవకాశం ఒకసారి ఈనాడులో వచ్చిన సంపాదకీయం ద్వారా వచ్చిందని, ఆ తర్వాత ఆయనతో శాశ్వత మైత్రి ఏర్పడిందని రచయిత సహవాసి ఒక సందర్భంలో పేర్కొంటారు.

రవీంద్రనాథ్ గారికి టెన్నిస్ అంటే ఇష్టం. దాదాపు రోజు ఎంతో కొంతసేపు ఆ ఆటలో గడిపేవారు. మిత్రులతో ముచ్చటించటం సరేసరి. ధూమపానం, మద్యపానం (పరిమితంగా) ఆయన ఇతర అలవాట్లు. ఆయనకు అత్యంత ఇష్టమైన వ్యసనం పుస్తకపఠనం. ఆయన అంతర్జాతీయంగా వచ్చే **టైమ్ మేగ్‌జైన్, న్యూస్ వీక్, క్వెస్ట్, ఎన్ కౌంటర్** వంటి ఎన్నో పత్రికలు తెప్పిస్తూ ఉండేవారు. కొన్ని పుస్తకాలు కొని మిత్రులకిచ్చి చదివి తమ అభిప్రాయం చెప్పమనేవారు. వాటినుంచి ప్రేరణ పొంది **మిసిమి**లో శీర్షికలు పెట్టేవారు. ఆ శీర్షికలకనుగుణంగా వ్యాసాలు రాయించేవారు. అలాంటి ఒక పుస్తకంగా పాల్ జాన్సన్ రచించిన Intellectuals పుస్తకాన్ని చెప్పుకోవచ్చు. ప్రపంచంలో సంచలనం సృష్టించిన ఆ పుస్తకంలోని కొన్ని శీర్షికలను అనువాదం చేయించి తెలుగు పాఠకులకు కూడా ఆ పుస్తకాన్ని రుచి చూపించిన క్రెడిట్ రవీంద్రనాథ్ గారిదే. ఎక్కడ పలుకున్నా పట్టేసే గుణం రవీంద్రనాథ్ గారిది. ఈ సందర్భంగా డా.సి.నారాయణరెడ్డి గారన్న మాటలు ఒకసారి గుర్తుచేస్తాను.

పత్రికా సంపాదకుడిగా
ముద్రణాలయ సంస్థాపక నిర్వాహకుడిగా
రవీంద్రనాథ్ ధరించిన పాత్రలు ఒక ఎత్తు.
మౌలిక జిజ్ఞాసువుగా, నిరంతర పాఠకోత్తముడుగా
అతడు సాగించిన జీవిక ఒక ఎత్తు

ఆయనకు సభలు సమావేశాలకు వెళ్ళటం కన్నా ఆ సభల్లో పాల్గొన్న ముఖ్యులను ఆహ్వానించి చర్చించి తగినరీతిలో సత్కరించి పంపేవారు. ఆయనకు డిగ్రీలు లేకపోవచ్చు కాని **మిసిమి** పత్రికతో ఆయన మేధావుల దృష్టిలో పడ్డారు. ఒకనాటి **భారతి** లేని లోటును **మిసిమి** పత్రిక తీరుస్తోందని మేధావులు ఆనందపడేవారు.

రవీంద్రనాథ్ గారిని చూడలేదు కానీ ఆయన గురించి వ్రాసిన పెద్దల అనుభవాలు ఆయన వ్యక్తిత్వాన్ని రూపుకట్టించాయి. ఆయన పుట్టి పెరిగిన ఊరు, ఆ ఊరులోని వ్యక్తులు ఆయనకు మానవత్వాన్ని బోధించారు. మనిషిని శోధించమన్నారు. మనిషిని సౌందర్యారాధన, లలితకళలు నిజమైన మనిషిగా, అంతకుమించి విశ్వమానవుడిగా తీర్చిదిద్దుతాయని నమ్మారాయన. ఎమ్.ఎన్.రాయ్‌ని ఎంతగా అభిమానించారో అంతగా పేదరికంలో బతుకీడుస్తున్న రచయిత శారద (నటరాజన్)ను అక్కున చేర్చుకున్నారు. అతనిలోని రచయితను గౌరవిస్తూ కథలు వేశారు. అతని రచనలను పుస్తకాలుగా తీసుకొచ్చారు. రవీంద్రనాథ్ ఆశ్రయమిచ్చి ప్రోత్సహించిన రావూరు భరద్వాజ జ్ఞానపీఠం అధిరోహించారు!

పుస్తకాలే ఆయనకు దారి చూపాయి. జీవితాన్ని ఆనందమయం చేసుకోవటానికి నలుగురు మిత్రులు అవసరమని చెప్పాయి. బౌద్ధాన్ని మనసా, వాచా, కర్మణా అభిమానించారు. బౌద్ధంలోని ఔన్నత్యాన్ని పదిమందికి **మిసిమి** ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు.

జీవితాన్ని ఆస్వాదించాలని అందరూ చెబుతారు. అయితే జీవితాన్ని అర్థం చేసుకోవటం అంతకుమించి అవసరం. బహుశః రవీంద్రనాథ్ గారికి తెలిసినంతగా ఈవిషయం ఇతరులకు తెలియదేమో అనిపిస్తుంది.

జీవితం పట్ల స్పష్టమైన దృక్పథం, అవగాహన, ఎరుక కలిగిన రవీంద్రనాథ్ గారు లాంటి అరుదైన వ్యక్తిని జీవితంలో కలవలేకపోయానే అన్న అసంతృప్తి మిగిలే ఉంటుంది. ఆ అసంతృప్తిని ఆయన నమ్మిన ఫిలాసఫీతో నింపుకోవాలనుకుంటున్నాను..

నీవు నీవుగా బతుకు
నీవు నీవుగా ప్రేమించు, అనుభవించు
ఇలా జీవించడంలోనే
నీ 'అసలుతనం' ఉంది.
అదే 'నీవు'..అదే 'నేను'

ఈ మాటల్లోని నిగూఢత్వాన్ని అర్థం చేసుకుంటే వారిలా జీవితాన్ని ఆస్వాదించగలుగుతాం. మనిషిని కలవటం కన్నా మనిషిని అర్థం చేసుకోవటం ఎప్పుడూ need of the hour అని రవీంద్రనాథ్ గారు చెప్పినట్లు నాకు అనిపించింది. అలా అనిపించటంలో ఆశ్చర్యంలేదేమో..

చెన్నూరి సీతారాంబాబు
అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి, రిటైర్డ్,
ఫోన్ : 837 481 8961

సువర్ణపథం

మొదటి అధ్యాయం


– యన్. విజయరాఘవ రెడ్డి

నిశ్శబ్దపు మహాతుఫాను : ప్రాచీన భారతదేశం తన ఆలోచనలతో, జ్ఞానంతో ప్రపంచాన్ని ఎలా మార్చిందో గత నెల పరిచయ భాగంలో ఒక స్థూల దృశ్యంగా చూశాం. ఇప్పుడు ఆ మహానాగరికతా ప్రవాహపు తొలి మూలాల్లోకి అడుగుపెట్టే సమయం వచ్చింది.

శతాబ్దాల కాలం మూసివేసిన రాతి తలుపులను తెరుస్తూ, అజంతా గుహల నిశ్శబ్ద గర్భంలోకి మనల్ని నడిపించే ప్రయాణమే మొదటి అధ్యాయం – **A Gale of Stillness**. అక్కడ మౌనంగా ఉన్న రాతి స్తంభాలు, కదలకుండా ఉన్న కుడ్యచిత్రాలు వేలఏళ్ల నాటి జీవననాదాన్ని ఎలా వినిపిస్తాయో, అశోకుని పరివర్తన భారతీయ ఆలోచనకు ఎలా నైతిక పునాది వేసిందో ఆవిష్కరించే ఆ తొలి అధ్యాయంలోకి ప్రవేశిద్దాం.

1819 నాటి చైత్రగ్రీష్మ సంధ్య : దక్కన్ పీఠ భూమి నడిబొడ్డున విస్తరించిన అజంతా అరణ్యాలు నిశ్శబ్దంగా అగ్నిని వర్షిస్తున్నాయి. ఔరంగాబాద్ పరిసరాలలోని పచ్చని మహారణ్యాన్ని చీల్చుకుంటూ మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన 28వ కేవల్రీ దళానికి చెందిన ఆంగ్లేయ వేటగాళ్ళు గుబురు పొదలను దాటుతున్నారు. ఎండ తీవ్రతకు రాళ్లు సైతం పగులుతున్నాయి. ఆ బృందానికి నాయకత్వం వహిస్తున్న యువకెప్టెన్ జాన్స్‌మిత్ తుపాకీ మోతతో గాయపడిన ఒక మహావ్యాఘ్రం, తన రక్తపు చారికలను వదిలి లోయలోకి జారిపోయింది.

ఆ క్రూరమృగం వేసిన నెత్తుటి పాదముద్రలను వెంబడిస్తూ, స్మిత్ వాఘుర్నది ఎండిన రాతి లోయల లోతుల్లోకి దిగాడు. ఎదురుగా కాలం నిర్మించిన ఒక మహావిస్మయం నిలిచి ఉంది. అర్ధచంద్రాకారంలో, గుర్రపునాడావలె వంగి ఉన్న నిటారైన నల్లని బసాల్ కొండ చరియల చెంత అతడు ఆగక తప్పలేదు.



అజంతా గుహ

ముళ్ల పొదలను, శతాబ్దాలుగా అల్లుకుపోయిన తీగలను వేట కత్తితో నరుకుతూ ముందుకు కదిలిన స్మిత్ ఒక్కసారిగా ఊపిరి బిగబట్టాడు. ఎదురుగా కనిపించినది ప్రకృతి సహజంగా ఏర్పరిచిన పర్వతవిలం కాదు.

అది ఒక గండశిలను నేర్పుగా మలిచి సృష్టించిన మహా ప్రవేశద్వారం. రాతిపైన మానవ ఉలిచెక్కిన అద్భుతశిల్పాలు కాలపు ధూళిని, పచ్చినాచును చీల్చుకుని నవ్వుతున్నాయి. శతాబ్దాల తరబడి బాహ్యప్రపంచానికి కనిపించకుండా ప్రకృతి దాన్ని ఒడిలో దాచుకుంది. ప్రాచీన భారతీయుల అమేయమైన మేధోసంపద, వారి కళాసృష్టి ఇంకా ఆ రాతిపొరల్లో సజీవంగానే కొట్టుకుంటోంది.

స్మిత్, అతని అనుచరులు ఎండు గడ్డితో తాత్కాలిక కాగడాలను వెలిగించి, ఆ చీకటి గర్భంలోకి భయంతో కూడిన ఉద్వేగంతో అడుగుపెట్టారు. వారి కళ్లముందు దాదాపు వంద అడుగుల నిడివి, నలభై అడుగుల విస్తీర్ణంలో కొండను తొలిచి నిర్మించిన మహాశిలామండపం సాక్షాత్కరించింది. ఇరువైపులా శిల్పకళాశోభితమైన భారీ రాతిస్తంభాలు గంభీరంగా నిలబడి ఉన్నాయి. ఆ హాలు చివర, నిశ్చల శాంతితో వెలుగొందుతున్న ఒక మహా బౌద్ధస్తూపం కొలువై ఉంది. అటూ ఇటూ ఊగుతున్న కాగడాల పసుపుపచ్చని వెలుగు రాతిగోడలను తాకగానే, ఆ చీకటి గర్భం ఒక్కసారిగా సజీవరంగుల ప్రవాహమై పొంగిపొర్లింది.

కాషాయ, నారింజరంగు వస్త్రాల కాంతులీనే బౌద్ధభిక్షువులు : చేతిలో వికసిస్తున్న నీలికలువను ధరించి, దివ్యత్వపు ప్రశాంతతను చిలికిస్తూ నిలిచిన పద్మపాణి బోధిసత్వుడు, రత్నఖచిత కిరీటాలను ధరించిన రాకుమారులు, అంతఃపుర సుందరులు, రణరంగయోధులు, సామాన్యకర్షకులు, వేట, విరహం, యుద్ధం, శాంతి, త్యాగం, జీవనం, మరణం...

రెండు సహస్రాబ్దాల క్రితం ఏ ప్రాచీనకళాకారుల హృదయస్పందనలోంచి జాలువారినవో గానీ, ఆ చిత్రాలు ఆ కటిక చీకట్లో మళ్లీ ఉచ్ఛ్వాసనిశ్వాసలను తీసుకోసాగాయి.

కాలం కప్పివేసిన ఒక మహోన్నత విశ్వనాగరికత తలుపులు మళ్లీ తెరుచుకున్న క్షణమది. రాతిపలకలపై అజరామరమైన మానవజీవిత మహాకావ్యం అజంతా గుహల్లోని చిత్రాలు కేవలం ఒక మతానికి సంబంధించిన దేవతారూపాలు కావు. అవి భూమిపై మానవ ఉనికికి, జీవన వేదనలకు అద్దం పట్టిన మహాదృశ్య కావ్యాలు.

గోడలపై ఉన్న ముఖాల్లోని భావాలు శిల్పాల్లో ఉండే రాతిజడత్వంతో నిండి లేవు. అవి పచ్చి నెత్తురు, మాంసంతో నిండిన మానవ అంతరంగాన్ని ఆవిష్కరిస్తాయి. **వేటగాడి నిశితచూపుల్లోని తపన :** వేటాడే సమయంలో మానవ నరనరాల్లో ప్రవహించే ఉద్వేగం, ఏకాగ్రత ఆ కళ్లలో స్పష్టంగా కనిపిస్తుంది.

- **శ్రవణ కుమారుడి నిష్కల్మష బాధ్యత :** అంధులైన తల్లిదండ్రుల దాహార్తిని తీర్చడానికి ప్రాణాలను పణంగా పెట్టిన కొడుకు కళ్లలోని అమాయకత్వం, భక్తిభావం గుండెను తాకుతాయి.
- **విషాదంలో మునిగిన రాణివేదన :** ఆసన్న మరణాన్ని ఎదుర్కొంటున్న భర్తను చూస్తూ నేలకొరుగుతున్న రాచకన్య కళ్లలోని కన్నీటి తడి మనల్ని కూడా కంటతడి పెట్టిస్తుంది.
- **వైరాగ్యపు నిశ్చలత్వం :** సర్వరాజభోగాలను తృణప్రాయంగా ఎంచి భిక్షాటనకు బయలుదేరిన సాధువు ముఖంలోని ప్రశాంతత సమస్త తాపత్రయాలను చల్లబరుస్తుంది. ఆ చిత్రాల ముందు నిలబడి చూస్తున్నప్పుడు కాలంగీసిన సరిహద్దులు చెరిగిపోతాయి. రెండువేలఏళ్ల వ్యవధి ఒక్కక్షణంలో శూన్యమవుతుంది. వస్త్రధారణ మారింది, రాజవంశాలు మట్టిలో కలిసిపోయాయి, ఆయుధాలు మారాయి. కానీ మనిషి గుండెల్లో రగిలే ప్రేమ, వేదన, భయం, ఆశ, త్యాగం మాత్రం వీసమెత్తుకూడా మారలేదు. అజంతా చూపిస్తున్నది మనిషి ప్రాథమిక మూలతత్వాన్ని.

బుద్ధనిప్రపంచం : వైరాగ్యం మాత్రమే కాదు, సంపూర్ణ జీవనసౌందర్యం సాధారణంగా బౌద్ధం అనగానే సంసార సుఖాలను తృణీకరించి, అడవుల్లో కఠిన ధ్యానం చేసుకునే ఒక నిశ్చల వైరాగ్యరూపం స్ఫురిస్తుంది. కానీ అజంతా ఆ సంకుచిత భావనను తుత్తునియలు చేస్తుంది. అక్కడ సంసార సౌందర్యం సంపూర్ణంగా వికసించింది. రాజభవనాల అంతఃపుర విలాసాలు, వస్త్రధారణలోని లాలిత్యం, రత్నాభరణాల తళుకులు, వీణానాదాలు, నాట్యగత్తెల పాదాల సవ్వడి, మానవమోహాలు అత్యంత సహజంగా, అద్భుతంగా చిత్రించబడ్డాయి. అయితే, ఆ సుఖాల సరిహద్దుల్లోనే ఒక లోతైన వైరాగ్యం నిశ్శబ్దంగా నడుస్తూ కనిపిస్తుంది.

- **అహింస, కరుణలఅన్వేషణ :** హింసతో, స్వార్థంతో నిండిన ప్రపంచానికి సేదతీర్చే ఔషధంగా మారిన ఆధ్యాత్మిక మార్గం ఇది.
- **అంతర్ముఖప్రయాణం :** జనన-మరణాల భవచక్రాన్ని దాటి, సర్వదుఃఖ విముక్తి కోసం మానవుడు చేసిన అత్యున్నత తాత్వికమథనమది. బౌద్ధం జీవితాన్ని తిరస్కరించడం నేర్పలేదు. జీవితాన్ని సంపూర్ణంగా చూసి, దాని మూలాల్లో ఉన్న తృష్ణను, అనిత్యతను అర్థం చేసుకోవడమే అసలైన విముక్తి అని చాటింది. అజంతా సంసారాన్ని, సన్యాసాన్ని ఒకే కాన్వాస్‌పై సమన్వయం చేసిన అద్భుత దర్శనం.

అశోకుడు : విజయగర్వాన్ని కన్నీటితో కడిగేసిన చక్రవర్తి. చరిత్రలోఎందరో చక్రవర్తులు రక్తపుటేర్లను పారించి రాజ్యాలను గెలిచారు. విజయ స్తంభాలను పాతి, తమ ఆధిపత్యాన్ని శాసనాలపై లిఖించుకున్నారు. కానీ మౌర్య చక్రవర్తి అశోకుని పరిణామం ప్రపంచ చరిత్ర గమనాన్నే మలుపు తిప్పింది. క్రీస్తుపూర్వం 261లో జరిగిన కళింగయుద్ధం రక్తపాతానికి పరాకాష్ట. యుద్ధరంగంలో అశోకుడు సైనికంగా విజయం సాధించాడు. కానీ ఆ శ్మశానవాటికపై అతనికి కనిపించింది విజయోత్సాహం కాదు: తెగిపడిన శరీరాలు, కాలిబూడిదైన పల్లెలు. రక్తపు మడుగుల్లో తమ తండ్రుల శవాలకోసం వెతుకుతున్న చిన్నారి పిల్లల రోదనలు. లక్షలాది మంది బానిసలుగా బంధించబడి రోదిస్తున్న దృశ్యాలు.

"శోకంలేనివాడు" అనే అర్థం కలిగిన అశోకుని అంతరంగం తీవ్రమైన శోకంతో దద్దరిల్లింది. కత్తి పదునుతో భూభాగాన్ని గెలవవచ్చు, కానీ మనుషుల హృదయాలను శాసించలేమని అతడు గ్రహించాడు. ఆ క్షణమే దిగ్విజయం అంతరించి, ధర్మవిజయం ఆవిర్భవించింది. ఆయుధాలను విడనాడి, కరుణను ఆయుధంగా ధరించిన అరుదైన ఏలికగా అతడు నిలిచాడు.

శిలలపై లిఖించిన ఒక సామ్రాజ్యాధినేత పశ్చాత్తాపం : అశోకుని శిలాశాసనాలు కేవలం రాచరికపు శాసనాలు కావు, అవి ప్రజలతో ఒక పాలకుడు జరిపిన అంతరంగిక సంభాషణలు. ప్రపంచ చరిత్రలో ఒక పరమ పరాక్రమవంతుడైన చక్రవర్తి, తాను చేసిన రక్తపాతానికి పశ్చాత్తాప పడుతూ రాతిపై బహిరంగ క్షమాపణలు లిఖించిన దాఖలా మరొకటి లేదు.

అతని పదమూడవ శిలాశాసనం రాజనీతికి సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చింది : ఇతరుల రాజ్యాలను బలాత్కారంగా ఆక్రమించడంలో విజయంలేదు. ప్రజల హృదయాల్లో ధర్మాన్ని ప్రతిష్టించడమే నిజమైన విజయం. తన మతాన్ని పొగుడుతూ ఇతరుల విశ్వాసాలను కించపరిచేవాడు వాస్తవానికి తన మతానికే తీవ్రమైన హాని చేసుకుంటున్నాడు.

రెండు సహస్రాబ్దాల క్రితం అశోకుడు ప్రకటించిన ఈ సర్వమతసామరస్యం, ప్రజాస్వామిక సహనం ఆధునిక రాజ్యాలకు నేటికీ అసలైన మార్గదర్శక సూత్రాలు.

బోధిసత్వతత్త్వం : విశ్వజనీన కరుణాతరంగం : అజంతా చిత్రకళలో అత్యున్నత శిఖరం బోధిసత్వుల చిత్రణ. పద్మపాణి, వజ్రపాణిల ముఖాల్లో తొణికిసలాడేది కేవలం జ్ఞానం మాత్రమేకాదు, సమస్త జీవుల వేదనను తనదిగా భావించే అపరిమితమైన కరుణ. బోధిసత్వభావనలోని అత్యంత ఉదాత్తమైనతత్వం–నాస్వంతమోక్షం కోసం నేను తొందరపడను. విశ్వంలోని చివరి ప్రాణివరకు దుఃఖం నుంచి విముక్తి పొందేంత వరకు, నేను నిర్వాణద్వారం వెలుపలే నిలబడతాను.

ఈ పరమ కరుణాదృక్పథం కేవలం గ్రంథాలకే పరిమితం కాలేదు, అది రాతిని తొలుస్తూ గుహలుగా, ఆశ్రమాలుగా, విశ్వనమాజ రక్షణ కేంద్రాలుగా రూపాంతరం చెందింది.

భాజా, కార్లే : రాతిని తొలిచిన సామాజిక చైతన్యం : పశ్చిమ కనుమల్లోని భాజా, కార్లే గుహలు కేవలం పూజాస్థలాలు మాత్రమే కావు. అవి ఒక సుసంఘటితమైన, సజీవమైన విద్యా, సాంఘిక కేంద్రాలు.

- **చైత్యగృహాలు :** అద్భుతమైన ధ్వనితరంగ వ్యవస్థతో, అపారమైన శిలానైపుణ్యంతో నిర్మించిన సామూహిక ప్రార్థనా మందిరాలు.



అజంతా చిత్రం

- **విహారాలు :** నిరంతరం ప్రయాణించే, సమాజానికి బోధించే బౌద్ధభిక్షువులు వర్షాకాలంలో సేదతీరే నివాసాలు.
- **అధ్యయన గదులు :**లోతైన తాత్విక చర్చలు జరిగే కేంద్రాలు, పుస్తకాల తాళపత్రాల భద్రతకు రాతిగూళ్లు, రాత్రివేళల్లో నూనె దీపాలు పెట్టే చిన్నపాటి అరలు. ఆ రాతి మంచాలను, చెక్కిన దిండ్లను చూస్తుంటే, ఒకప్పుడు అక్కడ రక్తమాంసాలు కలిగిన మనుషులు జీవించారని, వారు ధర్మంపై తీవ్రంగా తర్కించారని, నమాజ శ్రేయస్సు కోసం ఆలోచించారని స్పష్టమవుతుంది. చరిత్ర అంటే కేవలం సింహాసనాల మార్పులు మాత్రమే కాదు, సామాన్య మానవుల దైనందిన జీవన సంస్కృతి కూడా చరిత్రేనని ఈ శిలలు నిరూపిస్తున్నాయి.

ప్రకృతితో సంభాషణ–యక్షులు, నాగులు, పర్యావరణస్పృహ : ప్రాచీన భారతీయ ఆలోచనా విధానంలో మానవుడు ప్రకృతికి పాలకుడు కాదు, ప్రకృతి అనే అనంత విశ్వంలో ఒక భాగం మాత్రమే.

- **యక్షులు, యక్షిణులు :** వృక్షాలు, పర్వతాలు, అడవులకు అధిపతులుగా భావించి పూజించిన వృక్షదేవతలు.
- **నాగులు :** నదులు, భూగర్భజలాలు, ఊటల సంరక్షకులు. బౌద్ధం ఈ స్థానిక అటవీ, జానపద విశ్వాసాలను కూకటివేళ్లతో పెకలించలేదు. వాటిని తన ఆధ్యాత్మిక ప్రపంచంలో అంతర్భాగం చేసుకుంది. అందుకే బౌద్ధకళలో ఏనుగులు,

జింకలు, పాములు, పక్షులు, తీగలు మనుషులతో సమాన గౌరవంతో జీవిస్తున్నట్లు కనిపిస్తాయి. జాతకకథల్లో బుద్ధుడు ఎన్నో జన్మల్లో జంతువుగా జన్మించి త్యాగనిరతిని చాటి చెప్పడం ఈ పర్యావరణ సమతుల్యతకు, సమస్త ప్రాణికోటివట్ల గల ఆత్మీయతకు సజీవ నిదర్శనం.

ఆధ్యాత్మికతకు వెన్నుదన్నుగా నిలిచిన వాణిజ్య విప్లవం: బౌద్ధం కేవలం నిశ్శబ్దగుహలకే పరిమితం కాలేదు. అది ప్రాచీన భారతదేశాన్ని అంతర్జాతీయ వాణిజ్య కేంద్రంగా మార్చిన మహా ఆర్థికవ్యవస్థతో ముడిపడి ఉంది. సుదూర సముద్రతీరాలకు ప్రయాణించే వర్తకులు, నావికులు తమ ప్రాణ, సరుకుల రక్షణకోసం అవలోకితేశ్వరుడిని ఆరాధించేవారు. మహా తుఫానులు, సముద్రపు దొంగలు, భయంకరమైన వ్యాధుల నుంచి రక్షించమని ప్రార్థిస్తూ వర్తకులు బౌద్ధవిహారాలకు భారీ విరాళాలు ఇచ్చేవారు.

- **ఆంధ్రతీరపు నావికులు :** కృష్ణా, గోదావరి ముఖద్వారాలైన ఘంటసాల, వైసోలియా (మచిలీపట్నం) వంటి పురాతన ఓడరేవుల నుంచి ఆంధ్రవర్తకులు సముద్రాలను దాటి సువర్ణభూమికి (ఆగ్నేయాసియా) పయనించేవారు.
- **విహారాలుగా మారిన బ్యాంకులు** : విహారాలు కేవలం మఠాలుగా మాత్రమే కాక, వర్తకులకు మూలధనాన్ని అప్పుగా ఇచ్చే బ్యాంకింగ్ వ్యవస్థలుగా పనిచేశాయి. సముద్ర యానం ముగించుకుని లాభాలతో తిరిగి వచ్చిన వ్యాపారులు తమ సంపదలో భాగాన్ని ఈ విహారాలకు సమర్పించేవారు.

యవనులరాక : విశ్వనరుల సంగమక్షేత్రం : మహారాష్ట్రలోని కార్లే గుహల రాతిస్తంభాలపై గల శాసనాలు ఒక విస్మయకరమైన చారిత్రక వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి. అక్కడ "యవనులు" సమర్పించిన విరాళాల ప్రస్తావనలు చెక్కబడి ఉన్నాయి. యవనులు అంటే గ్రీకు, రోమన్, హెల్లెనిస్టిక్ ఈజిప్టియన్ ప్రాంతాల నుంచి వచ్చిన విదేశీయులు. వారు ఇక్కడికి కేవలం వాణిజ్యం కోసమే రాలేదు. భారతీయ సంస్కృతిలోని మానవతావాదానికి, శాంతికి ముగ్ధులై బౌద్ధాన్ని స్వీకరించారు, భారతీయ పేర్లను పెట్టుకున్నారు, ఆ గుహల నిర్మాణానికి తమ ధనాన్ని సమర్పించారు. ప్రాచీన భారతం ఎన్నడూ సంకుచిత సరిహద్దుల వెనుక దాక్కోలేదు. విదేశీయులను శత్రువులుగా చూడక, వారి కళలను, ఆలోచనలను ఆదరించి తనలో కలుపుకుంది.

రోమన్ సామ్రాజ్యం నుంచి పొంగిపొర్లిన పసిడి ప్రవాహం : భారతీయ నాణ్యమైన సన్నని నూలువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు (ముఖ్యంగా నల్లమిరియాలు – రోమన్లు దీనిని' నల్లబంగారం' అనేవారు), పట్టు, రత్నాలకోసం రోమన్ సామ్రాజ్యం పిచ్చిగా ఆరాటపడింది. ఏటా లక్షలాది రోమన్ బంగారు నాణేలు భారతీయ ఓడరేవుల్లో కుమ్మరించ బడ్డాయి. రోమన్ చరిత్రకారుడు ప్లీనీ, భారతీయ విలాసాల కోసం రోమన్ సామ్రాజ్యపు సంపదంతా కరిగిపోతోంది" అని తన రచనల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు.

కేరళలోని కొట్టాయం వద్ద బయల్పడిన ఒకే ఒక్క కుండలో దాదాపు 8,000 అసలైన రోమన్ బంగారు నాణేలు (ఆరియై) లభించడం ఈ అపార వాణిజ్య వేగానికి తిరుగులేని సాక్ష్యం. అది కేవలం సంపద ప్రవాహం మాత్రమే కాదు, రెండు విభిన్న నాగరికతల మధ్య ఏర్పడిన ఒక అపూర్వ ఆర్థిక సంధానం.

గోల్డెన్‌రోడ్–ప్రపంచాన్ని కలిపిన సాంస్కృతిక రక్తనాళం : విలియం డాల్రింపుల్ ఆవిష్కరించిన "స్వర్ణపథం" సిల్క్‌రోడ్ కంటే ఎంతో ప్రాచీనమైనది, అత్యంత శక్తివంతమైనది.

- **భౌగోళిక విస్తృతి :** గంగానదీ మైదానాల నుంచి తూర్పున ఒడిశా, ఆంధ్ర, తమిళ తీరాల మీదుగా సముద్రమార్గంలో బర్మా, థాయ్‌లాండ్, కాంబోడియా, మలయా, జావా, సుమత్రాల వరకు, పశ్చిమాన ఎర్రసముద్రం మీదుగా అలెగ్జాండ్రియా, రోమన్ వరకు ఈ మార్గం విస్తరించింది.
- **ఆలోచనల ప్రసారం :** ఈ మార్గంలో ప్రయాణించినది కేవలం బంగారం, మసాలా దినుసులు మాత్రమే కాదు. భారతీయ గణితం (సున్నా, దశాంశపద్ధతి), ఖగోళశాస్త్రం, ఆయుర్వేదం, బౌద్ధ–హిందూతత్వాలు, రామాయణ–మహాభారత ఇతిహాసాలు, అద్భుతమైన దేవాలయ నిర్మాణశైలులు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించాయి. ఇది సైనిక ఆక్రమణలతో, రక్తపాతంతో నిర్మించిన మార్గం కాదు, జ్ఞానం, సంస్కృతి పరస్పరమార్పిడితో నిర్మితమైన ఒక శాశ్వత శాంతి వారధి!



పద్మపాణి బోధిసత్వుడు

అజంతా గుహాల్లోని చిక్కటి చీకటి తెరల వెనుక, రెండువేల ఏళ్ల నాటి పద్మపాణి బోధిసత్వుడి ముందు నిలబడితే కాలం నిశ్చలంగా స్తంభించి పోతుంది. ఆ ముఖంలోని దివ్య ప్రశాంతత నేటి ఆధునిక సంక్షోభ ప్రపంచానికి ఒక నిశ్శబ్ద హెచ్చరికను, తిరుగులేని మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది.

నా దృష్టిలో **A Gale of Stillness** అనేది కేవలం అజంతా గుహల గురించో, అశోకుడి గురించో రాసిన పాఠం కాదు. భారతదేశం తన అంతరంగ సంపదను, తాత్వికతను ప్రపంచంతో ఎలా పంచుకుందో చెప్పే ఒక మహా ప్రయాణపు తొలి అడుగు. అశోకుని ఖడ్గం నేలకొరిగింది, కానీ ఆయన నాటిన శాంతిధర్మం ఎల్లలు దాటింది. అజంతాచిత్రాల రంగులు వెలిసిపోతున్నా, వాటిలోని మానవీయభావం నేటికీ సజీవంగాఉంది. ప్రాచీన ఓడలు కాలగర్భంలో కలిసిపోయాయి, కానీ అవి చేరవేసిన ఆలోచనలు తరతరాల మానవాళికి దిశానిర్దేశం చేశాయి. చరిత్రలో కొన్నిమార్గాలు రాళ్లతోనో, మట్టితోనో నిర్మించబడవు. అవి ఆలోచనలతో, సంస్కారంతో నిర్మించబడతాయి. ఆ అమర మార్గమే-'ది గోల్డెన్ రోడ్'. ఆ మార్గంపై శతాబ్దాల మౌనాన్ని ఛేదిస్తూ వినిపించే తొలినాదమే-**A Gale of Stillness**.

ఈ అధ్యాయం చెప్పింది అజంతా గుహల కథ మాత్రమే కాదు. ఇది ఒక ఆలోచన ఎలా పుడుతుందో, ఎలా మారుతుందో, ఎలా ఒక వ్యక్తి అంతర్మథనం నుంచి ఒక సామాజిక ఉద్యమంగా, అక్కడినుంచి ఒక విశ్వవ్యాప్త నాగరికతా ప్రభావంగా పరిణమిస్తుందో చెప్పే కథ.

సిద్ధార్థుడు రాజభవనాన్ని విడిచిపెట్టాడు – దుఃఖానికి కారణం ఏమిటో తెలుసుకోవడానికి.

బుద్ధుడు మధ్యమమార్గాన్ని కనుగొన్నాడు– అతి సుఖానికీ, అతి తపస్సుకీ మధ్య సమతుల్యతను సాధించడానికి .

అశోకుడు కళింగాన్ని జయించాడు – కానీ ఆవి జయమే అతని మనసును ఓడించింది.

యుద్ధంలో గెలిచిన రాజు, తన హింసపై పశ్చాత్తాప పడిన మనిషిగా మారాడు. అతడు కత్తిస్థానంలో ధర్మాన్ని, విజయం స్థానంలో కరుణను, విస్తరణ స్థానంలో మానవతను, అధికార గర్వం స్థానంలో ఆత్మపరిశీలనను ముందుకు తెచ్చాడు. అతని శాసనాలు రాళ్లపై చెక్కబడ్డా, వాటి అనలు సందేశం మనుషుల హృదయాలపై చెక్కబడింది. అయితే బౌద్ధం ప్రపంచమంతా వ్యాపించడానికి రాజుల శక్తిమాత్రమే కారణం కాదు.

వ్యాపారులు, నావికులు, చేతివృత్తుల వారు, రైతులు, గృహిణులు, విదేశీయులు, సాధారణదాతలు– వారందరూ దాని ప్రయాణంలో భాగస్వాములయ్యారు. అజంతా గోడలపై కనిపించే రాజులు, సన్యాసులు, నర్తకీలు, వ్యాపారులు, విదేశీయులు, జంతువులు, దేవతలు– ఇవన్నీ కలిపి ఒకే సత్యాన్ని చెబుతున్నాయి :

ప్రాచీన భారతదేశం ప్రపంచం నుంచి వేరుపడిన నాగరికత కాదు. అది ప్రపంచంతో నిరంతరం సంభాషించిన, ఆలోచనలు స్వీకరించిన, వాటిని మార్చి మళ్లీ ప్రపంచానికి అందించిన విశ్వనాగరిక సమాజం. రెండువేల సంవత్సరాల తరువాత కూడా రంగు కోల్పోని అజంతా చిత్రాల నిశ్శబ్దచూపు.ఆ నిశ్శబ్దమే–ఒక మహాప్రకంపనం. ఇలా ఆధ్యాత్మిక ఆలోచనలు సరిహద్దులు దాటడానికి బలమైన రెక్కలుగా మారినది ప్రాచీన భారతీయ వాణిజ్య నౌకలే. భారతీయ సుగంధ ద్రవ్యాలు, పట్టు, విలాస వస్తువుల కోసం రోమన్ సామ్రాజ్యం తన బంగారాన్నంతా ఎలా ధారబోసింది? ఆ సంపద ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక కేంద్రంగా భారతదేశాన్ని ఎలా నిలబెట్టింది? అనే చారిత్రక సత్యాన్ని ఆవిష్కరించే తదుపరి అధ్యాయమే– India : The sink of the world's most precious metals. రెండువేల సంవత్సరాల క్రితమే ప్రపంచ వాణిజ్య తులాదండాన్ని తన చేతుల్లోకి తీసుకుని, ప్రపంచపు అత్యంత విలువైన లోహాలన్నింటినీ తన ఒడిలోకి చేర్చుకున్న ఆ విశ్వ ఆర్థిక మహా విప్లవాన్ని ఆవిష్కరించే రెండవ అధ్యాయం – **India : The sink of the world's most precious metals**. గురించి వచ్చే నెల తెలుసుకుందాం.

యన్. విజయరాఘవ రెడ్డి
(ఆంగ్లం : విలియం డాల్రింపుల్)
(విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి, ఆకాశవాణి,
ఫోన్ : 944 123 9803)



– ప్రకాష్‌రాజ్

పాత జ్ఞాపకాలు కొన్నిసార్లు మనల్ని గందరగోళంలో పడేస్తాయి. మనం ఎప్పుడో నవ్వించిన ఒక్క క్షణం ఈ రోజు కన్నీరు తెప్పిస్తుంది. మనం ఎప్పుడో ఏడ్చిన ఒక్క క్షణం గుర్తుకొచ్చి నవ్విస్తుంది.

నేను, అమ్మ ఇద్దరం మనస్ఫూర్తిగా నవ్వించిన ఒక సంఘటన గుర్తుకొస్తుంది.

అమ్మ నాకు విషం కలిపి ఇచ్చి చంపాలని ప్రయత్నించిదట ఒకసారి. కొన్ని సంవత్సరాల క్రితం ఈ నిజాన్ని ఏడుస్తూ చెప్పింది అమ్మ. తను ఏడుస్తుంటే నేను నవ్వుతూ ఉన్నాను. నా నవ్వు చూసి తను మరింత ఏడ్వసాగింది. దాన్ని చూసి నేను ఇంకా పెద్దగా నవ్వుతుంటే... నిదానంగా నాతోబాటు తను నవ్వటం మొదలుపెట్టిన ఆ క్షణాలు... ఆహా!!



అందరికీ అమ్మ మొదటి దేవత. అమ్మంటే అలాగే. కొన్ని సంవత్సరాల క్రితం అమ్మ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడింది. మెదడుకి వెళ్లే నరంలో సమస్య. తన బాధని, వేదనని చూడలేకపోయాను. వెంటనే ఆపరేషన్ చేయించాలి. కొంచెం రిస్క్ ఉన్న ఆపరేషన్. అమ్మను ఆస్పత్రిలో అడ్మిట్ చేశాం. ఆరోజుల్లో నేను తెలుగు సినిమాలలో తీరికలేని షూటింగ్‌లో ఉన్నాను. అమ్మను చూసుకోవటానికి చాలా మంది బంధువులు ఉన్నప్పటికీ తోబుట్టువులు తోడుండి చూసుకోవటం సరికదా? నా చెల్లెలు బెంగుళూరు నుండి పనులన్నీ వదిలి పరిగెడుతూ వచ్చింది.

ఆసుపత్రిలో నాది నైట్ షిఫ్ట్. హైదరాబాద్‌లో పగటి షూటింగ్ ముగించుకొని రాత్రి ఫ్లైట్‌కి తిరిగొచ్చేవాడిని. రాత్రంతా అమ్మతో ఉండేవాడిని. మళ్లీ ఉదయం లేచి హైదరాబాద్ ఫ్లైట్ పట్టుకుని షూటింగ్‌కు వెళ్లేవాడిని. రోజంతా అమ్మతో చెల్లెలుండేది. ఇలా కొన్ని రోజులు గడిచాయి. అమ్మకేమో ఆనందం. తన చివరి దశలో, తనవాళ్లు దగ్గరున్నారనుకుందో ఏమో. తోడుగా ఉన్న పిల్లలతో తన జీవితం గురించి మాట్లాడుతూ ఉండేది. బాధలనీ, వేదనలనీ, కష్టాలనీ, అవమానాలనీ, పోరాటాల్ని నిదానంగా చెబుతూండేది.

చిన్న వయసు నుండే అనాథ శరణాలయంలో చదువుకుంది అమ్మ. బెల్గాంలోని 'డివైన్ ప్రావిడెన్స్' అనే క్రైస్తవ ఆశ్రమంలో తనకు దొరికిన ప్రేమ, ఆప్యాయత తను అనాథననే భావం లేకుండా చేసింది. బాగా చదువుకొని బెంగుళూరులో మర్థాస్ ఆస్పత్రిలో నర్స్‌గా ఉద్యోగం చేసింది.

ఎలాంటి పురుష పరిచయం లేని తను, తన మతం, తన సేవ అంటూ జీవిస్తున్న ఆమె జీవితంలో అడుగుపెట్టాడు నా నాన్న. టైఫాయిడ్ జ్వరం అంటూ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన ఆయన, అమ్మను ప్రేమించారు. మనస్సు వద్దని దూరంగా వెళ్లినా తీవ్రంగా ప్రేమించే మాటలకి చివరికి శరణాగతైంది. ఆమె ప్రేమ కులమతాలకి అతీతంగా ఉండేది. కానీ, అది ఒక మంచి అనుభవంగా మిగలలేదు. పెద్ద కలలులేని, గమ్యంలేని, కొంచెం బాధ్యతలేని సాధారణ మనిషి మా నాన్న. పలు వ్యతిరేకాల మధ్యలో ప్రేమను, దేవుడిని నమ్మి అతడిని పెళ్లి చేసుకుంది. కానీ సంసార భారాన్ని, బాధ్యతను భరించలేక నాన్న అప్పుడప్పుడు ఉన్నట్టుండి కనుమరుగైపోయేవారు.

ఇంటిని తనొక్కతే నడపాల్సిన బాధ్యత అమ్మది. కడుపులో నన్నూ, మనస్సులో భర్తను మోసుకొని ఎన్నో అవమానాలని భరిస్తూ జీవించింది. నేను పుట్టినప్పుడు

ఏదో పరిచయంలేని ఊళ్లో ఉన్నాట్ట నాన్న. నా తల్లి అందగత్తె, గుణవంతురాలు. తనని పెళ్లి చేసుకోవడానికి బంధువుల్లో చాలామంది సిద్ధంగా ఉన్నా అందరినీ నిరాకరించిందట. వారి ముందు ఒక బిడ్డ తల్లిగా ఒంటరిగా నిలబడి ఉంది. తన నుండి నిరాకరించబడిన వారి చూపు నుండి ఎదురయ్యే వేదన భరించరానిది.

ఆసరాలేని ఒక ఆడది బ్రతకలేని సమాజం ఇది. వేరువేరు రకాల చూపుల్ని ప్రతిరోజూ, ప్రతిక్షణం సంధించే బాధని... దానికి తన పరిపక్వతలేని తీర్మానాలే కారణమనే నిజాన్ని అమ్మ తట్టుకోలేకపోయింది. అప్పుడు నేనింకా చేతుల్లో బిడ్డని. రేపు పెరిగి పెద్దయిన తర్వాత 'ఎందుకమ్మా ఇలా చేసావు?' అని ప్రశ్నిస్తే జవాబు చెప్పలేను అనిపించింది అమ్మకి.

ఆమెలో ఉద్యమించిన ప్రశ్నలకు తనే జవాబు చెప్పలేక చనిపోవాలనిపించింది. తను చనిపోతే తనలా తన కొడకూ ఈ ప్రపంచంలో ఏదో అనాథ శరణాలయం దయతో పెరగవలసి వస్తుందని ఆలోచించింది. తన బాధ ఇంకా పెరిగిపోయి తనతోబాటు కొడుకుని కూడా చంపాలని నిర్ణయించింది.

ఏదో ఒక ఎలుకల మందు తీసుకొచ్చి నాకివ్వడానికి ప్రయత్నించింది. ఆమె చేతులు వణకటం మొదలుపెట్టగానే, మనస్సు దుఃఖపూరితం అయి, కళ్లల్లో నీరు ఉబికి వస్తూనే అమ్మ నాకు విషం తాగించే ఆ క్షణంలో నేను నవ్వానట. ఆమె ఏడుపు పెద్దదవుతున్నట్లే నేను నవ్వుతూనే ఉన్నానట. ప్రపంచం గురించి తెలియని ఒక చిన్నారికి మృత్యువు తనవైపు వస్తుందని తెలియదు కదా. నన్ను ఈ భూమి మీదకు తెచ్చిన వ్యక్తి మళ్లీ నన్ను భూమిలో పాతిపెడుతుంది అని తెలియడానికి అవకాశమే లేదు. నవ్వుతూనే ఉన్నానట.

ఆ నవ్వు అమ్మను కదిలించింది. చచ్చిపోదామని తీర్మానించే ముందు కూడా తను దేవుడ్ని ప్రార్థించింది. 'ఆ దేవుడు నాకిచ్చిన నా ప్రాణాన్నే తీసుకునే హక్కులేనప్పుడు, నా ద్వారా పుట్టిన నీ ప్రాణాన్ని తీసుకునే హక్కు నా కెక్కడుంది బంగారం?' అని ఆ క్షణం తనికి అనిపించింది. మరుక్షణమే విషం గిన్నె దూరంగా విసిరి నన్ను గుండెలకు హత్తుకుందట. అప్పటికీ నేను నవ్వుతూనే ఉన్నానట.


ఆ క్షణంలో కలిగిన నవ్వు వల్ల నేనూ, అమ్మ ఇంకా బతికే ఉన్నాము. 'నిన్ను చంపాలనుకున్నా కొడకా, కానీ అప్పుడూ నువ్వు నన్ను రక్షించావు,' అంటూ హాస్పిటల్ గదిలో ఆమె ఏడుస్తూనే ఉంది. చిన్నారి నవ్వులోని జీవించే నమ్మకాన్ని స్పర్శించిన అమ్మ. మరణించడానికి ప్రతియొక్కరికీ వెయ్యి కారణాలున్నప్పటికీ జీవించటానికి ఒక్క కారణం మనలోనే మన ఎదుటే ఉంటుందని కనుగొంది అమ్మ. ఆ నవ్వుని ఆమె చూడకుండా ఉండుంటే, ఈరోజు ఈ ప్రకాష్ ఉండేవాడు కాదు. ఈ ప్రపంచంలోకి వచ్చిన ఉనికి లేకుండానే, చిన్న పిల్లవాడిగా చనిపోయి ఉండేవాడిని. పుట్టుకకు కారణం, నేను జీవించిన కారణం తెలియకుండానే గడిచిపోయేది. నన్ను కన్న ఆమె కన్నీటిని నా నవ్వు గెలిచింది.

ఈరోజు అమ్మ తను చంపబోయిన కొడుకు ముంగురులను ఒత్తుతూ నవ్వుతోంది. పడక మీద పడుకున్న ఆ తల్లికి కొడుకు మందులిస్తున్నాడు. ఒక నర్సుగా వందలకొద్దీ చావు పుట్టుకల్ని నేరుగా చూసిన అమ్మతో, 'ఇది చాలా సాధారణమైన ఆపరేషన్ అమ్మ,' అని నాలాంటివాడు చెబుతుంటే నవ్వు రాదా?

తను నవ్వింది. కానీ ఆ నవ్వు కన్నీటిని కరడుగట్టించి సంతోషాన్ని మాత్రం పరిమళించే నవ్వు. గెలిచింది నేను, కానీ గెలుపు తనది.

ప్రకాష్‌రాజ్
కళాకారుడు

కమ్మతెమ్మెర



లీలానాయుడు

జూన్ సంచికలో ఆమె ను చదివాను.
కాదు అంతరంగనయనంతో చూశాను..
లీనం చేసుకున్న, లయం చేసుకున్న లీలను స్పష్టంగా సౌందర్యసార సర్వస్వాన్ని దర్శించాను. లీలానాయుడి గురించి ఎవరికైనా చెప్పాలంటే ఈ రచన చాలు..
పటం కట్టి కలకాలం దాచుకోవలసిన వాణీవిన్నాణం. లీల శాశ్వత నాయకి !
మీరుతప్ప మరెవరూ దృశ్యీకరించలేని అపురూప వచనాత్మక నాదం...

-వి.ఎస్.ఆర్. మూర్తి



– టి.వి. ప్రసాద్



ఆలపాటి రవీంద్రనాథ్

1990లో ఒకే ఒక వ్యక్తి సారధ్యంలో రెండే వ్యాసాలతో, ఇరవై పేజీలతో వెలువడిన ఒక పక్షపత్రిక వ్యవస్థాపక ప్రింటర్, పబ్లిషర్, ఎడిటర్ ఎవరో కాదు, మనం ఈ నెలలో 105వ జయంతిని జరుపుకుంటున్న గొప్ప వ్యక్తి **ఆలపాటి రవీంద్రనాథ్** గారు. ఆనాటి చిన్న పత్రికే నేడు విద్యావేత్తల, మేధావుల అభిమాన మాసపత్రిక **మిసిమి**.

పత్రిక ద్వారా సాహిత్య, సాంస్కృతిక, కళా సంపదను దశదిశలా వ్యాపింపజేయడం ఆశయంగా **మిసిమి**ని, 1990 నుండి 2010 వరకు తొలిదశను దాటి 2010 నుండి రెండవ దశలో ఆంజనేయరెడ్డి గారి దర్శకత్వంలో, అశ్వినీకుమార్ గారి సారధ్యంలో ఒక విశిష్టతను సాధించి నిర్దిష్టస్థాయికి చేరుకుని ఒరవడిని సృష్టించింది. ముఖచిత్రాల విషయంలో చిత్రకళకు ప్రాధాన్యతను ఇవ్వడంలో రవీంద్రనాథ్ గారి నిబద్ధత కొనసాగింపును మనం **మిసిమి**లో చూడగలుగుతాము. చిత్రకళకు ప్రాధాన్యతనిస్తూ తొలి సంచికల్లో ప్రముఖ తెలుగు చిత్రకారుల చిత్రాలను అట్టమీద ప్రచురించడం వారితోనే మొదలైంది.

పత్రికకు ఊపిరిలాంటి ప్రకటనలు లేని పత్రిక మనుగడను ఊహించలేము. ఆలపాటి వారి నిబద్ధతను కొనసాగిస్తూ కఠిన క్రమశిక్షణను పాటించే **మిసిమి**కి అభినందనలు. కరోనా కాలంలో కూడా ఆగకుండా **మిసిమి** వెలువడడం ఆశ్చర్యం. యాదృచ్ఛికమే ఐనా ఫిబ్రవరి 5న 1922లో డివిట్ వాలేస్ స్థాపించిన, వందసంవత్సరాల చరిత్ర కలిగిన **రీడర్స్ డైజెస్ట్** కూడా 33 సంవత్సరాలు ప్రకటనలు లేకుండా నడిచి 1955లో ప్రకటనలు స్వీకరించింది. **మిసిమి** ఆ రికార్డును అధిగమించింది.

2019లో పికాసో వ్యాసంతో ఏర్పడిన **మిసిమి**తో పరిచయం 2026 మార్చి నాటికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం 60వ వ్యాసంతో అనుబంధంగా మారింది. చిత్రకళలోని అనంత వైవిధ్యాన్ని, దేశదేశాల మ్యూజియాలను, కళాకారుల్ని పరిచయం చేసే అవకాశం దక్కింది. దార్శనికుడూ, దొడ్డ మనసు గల గొప్ప వ్యక్తి రవీంద్రనాథ్ గారి గురించి కథలు కథలుగా విని వారిపై గౌరవం పెంచుకున్నాను, వారి స్మృతికి గౌరవసూచకంగా నా వ్యాస షష్టిని వారికి అంకితం చేయడాం నాకు దక్కిన అవకాశంగా భావిస్తాను.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 798 139 8250



– అనువాదం : బి.వి. రామిరెడ్డి

బిభూతి భూషణ్‌తో నా స్నేహం విచిత్రంగా జరిగింది – నేను ఉద్యోగరీత్యా కలకత్తాలో 41 మీర్జాపూరీ వీధిలో ఉండేవాణ్ణి. ఒకరోజు నేను మెట్లెక్కి నా నివాసానికి వెడుతుండగా పైనుంచి ఒక కుర్రాడు క్రిందికి తిగుతూ, దగ్గరగా వచ్చి, 'నీరద్' అని సంభోధించాడు. నేను వెంటనే అతణ్ణి గుర్తించలేకపోయాను. ఒక క్షణం తరువాత అతను నేను చదువుకున్న 'రిప్పన్‌కాలేజి' లో నా సహోధ్యాయిగా గుర్తించాను–1914–16 మధ్యకాలంలో మేం కలిసి చదువుకున్నాం. అతను బాగా చదివేవాడు. అతనితో అప్పుడు అంత చనువుగా వుండేవాణ్ణి కాదు. చాలా కాలానికి మళ్ళీ ఇప్పుడతణ్ణి చూశాను. మాటల్లో మేమిద్దరం ఒకే భవనంలో నివసిస్తున్నామని తెలుసుకున్నాం. అప్పట్నించి రోజూ సాయంత్రం నా దగ్గరికి వచ్చేవాడు. అంతకుముందు రెండుమూడు సంవత్సరాల క్రితం ఇంపీరియల్ లైబ్రరీలో చదువుతుండగా నన్ను చూశాడట. తరువాత తనని గురించి చెప్పుకున్నాడు. అతను ఎమ్. ఎ. చదువుతూ ఆర్థికసమస్యలవల్ల చదువు మానేసి, ఒక పల్లెటూళ్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడట. రోజూ రైల్లో అక్కడికి వెళ్లి వస్తాడట. అతను నాకన్న మూడు సంవత్సరాల సీనియర్. అతను భార్యను పోగొట్టుకుని ఒంటిరిగా జీవిస్తున్నాడు. అతను కాలేజిలో చదువుతుండగానే పెళ్లి చేసుకున్నాడు. ఒక అంటువ్యాధి వల్ల ఆమె చనిపోయింది.

మేమిద్దరం మిత్రులమయ్యాం. పరిచయమైన మొదటి సాయంత్రమే తనొక కథ వ్రాసి పబ్లిష్ చేశాడనీ, అవి అప్పటి బెంగాలీ మ్యాగజైన్ 'విభాగం' లో అచ్చయిందనీ చెప్పాడు. అది చదివిన గుర్తుంది. ఆ కథలో మంచి సెన్సిబిలిటీ, ఒరిజినాలిటీ వుంది. పదేళ్లలోనే అతను మంచి బెంగాలీ రచయితగా పేరు తెచ్చుకున్నాడు. 1928 లో అతను తన మొదటి నవలను ప్రచురించాడు. రచయితగా గుర్తింపుపొందాడు. అతని నవలను ప్రసిద్ధ బెంగాలీ దర్శకనిర్మాత 'సత్యజిత్ రే' చిత్రంగా నిర్మించి ప్రపంచ ప్రసిద్ధికల్పించాడు. అదే 'పథేర్ పాంచాలి' 1924 లోనే ఆ నవల ప్రారంభ పేజీలను నాకు చదివి వినిపించాడు. దాన్ని పూర్తి చేయడానికి అతనికి మూడు సంవత్సరాలు పట్టింది.

అతను ఉన్నత బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. తండ్రి పేదవాడు. హిందూ పురాణ ప్రవచనం చేస్తుండేవాడు. బిభూతి తన తండ్రిని గురించి చెప్పుకోడానికి ఇష్టపడేవాడు కాదు. మేమిద్దరం మానసిక విషయాలను పంచుకునే వాళ్లం. అతని మానసిక విషయాలంటే నాకు గౌరవం. అతను గణితం, భౌతికశాస్త్ర విద్యార్థి కాకపోయినా ఇ.పి.హబుల్ గురించీ మాట్లాడేవాడు. నేనా రచయితని గురించి ఎప్పుడూ వినలేదు. ఉపాధ్యాయుడిగా అతని జీతం చాలా తక్కువే అయినా 'సర్ ఆర్థర్ కెయిత్' వ్రాసిన 'ఎంటిక్విటీ ఆఫ్ మాన్'ని కొనుక్కున్నాడు. కేవలం పరీక్షలకోసమే చదివే వాడు కాదు. తనకు అందిన పుస్తకాలన్నీ చదువుతూ ఉండేవాడు. స్వభావతః అతను రొమాంటిసిస్టు. అందువల్ల రచయిత కాగలిగాడు.

భార్య చనిపోవడం వల్ల, ఉపాధ్యాయ వృత్తిలో ఉండడం వల్ల అతనికి చాలా అవసరాలుండేవి. ఆ రోజుల్లో ఉపాధ్యాయులకి చాలా తక్కువ జీతాలుండేవి. నెలజీతం కేవలం మూడు, రెండు వేలు మాత్రమే. ఆ జీతంతోనే జీవితాన్ని వెళ్లబుచ్చ వలసి వచ్చేది. కలకత్తాకు ఉత్తరంగా, దూరంగా ఉన్న ఆ గ్రామంలో పనిచేసినపుడు అతని పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుండేది. ఎవరితోను మాట్లాడేవాడు కాదు. రైల్వే స్టేషను దగ్గర్లో ఒక చిన్న బజారు గుడిసెలో ఉండేవాడు. సాయంత్రాలు తన గుడిసెలో కిరసనాయిలు దీపం ముందు కూచుని, తన జీవితంలో పోగొట్టుకున్న వాటిని గురించి ఆలోచిస్తుండేవాడు. తన చనిపోయిన భార్య జ్ఞాపకాలు అతన్ని పునర్వివాహం చేసుకోనివ్వలేదు. అలా అతను 23 సంవత్సరాలు గడిపాడు. తన చొక్కాజేబులో ఎప్పుడూ ఒక కాగితాల కట్ట వుండేది. దిండు ప్రక్కన ఎంబ్రాయిడరీ చేసిన ఒక విసనకర్ర వుండేది. అతని



బిభూతి భూషణ్

జేబుల్లో ఉన్న కాగితాలబొత్తి తన భార్య తనకు వ్రాసిన ఉత్తరాలేనని నాకు అర్థమయింది. ఆ వినతకర్ర కూడా ఆమె తయారు చేసిందే. నేను, అతని స్నేహితులు మళ్లీ వివాహం చేసుకుని జీవితాన్ని మళ్లీ క్రొత్తగా ప్రారంభించ మని చెబుతుండేవాళ్లం. తన మిత్రులు కొన్ని పెళ్లి ప్రపోజల్స్ కూడా తీసుకొచ్చారు. అతను వెళ్లి పిల్లను చూసివొచ్చేవాడు. ఒకటి రెండు సార్లు ప్రయత్నాలు ముందుకుసాగాయి. నేనూ అతని మూడు పెళ్లి చూపులకు హాజరయ్యాను. చివరికి అతను ఆ ప్రయత్నాలనించి తప్పించుకునేవాడు. అతని భార్య మరణం అతన్ని ఆధ్యాత్మికత వేపు నడిపించింది.

అతను వైయర్స్, లాడ్జ్, కానన్ డాయిల్‌లని చదివాడు. ఆత్మల ప్రపంచాన్ని గురించి నన్ను వొప్పించే ప్రయత్నం చేశాడు. జర్మన్ రచయిత 'స్కెరెంక్ నాట్జింగ్'ను నా చేత చదివించాడు. కాని నన్ను వొప్పించలేక పోయాడు. నేనూ అతని నమ్మకాన్ని కదిలించలేకపోయాను. చివరికి ఆ సబ్జెక్ట్ గురించి చర్చించకూడదని నిర్ణయించుకున్నాం. అతను 'డెనో ఇంగె' తన చనిపోయిన పాపను గురించి వ్రాసిన పుస్తకాన్ని నా చేత చదివించాడు. ఆ పుస్తకం నన్ను లోతుగా కదిలించింది.

అతను ఆధ్యాత్మికవాది ఎందుకయ్యాడో సులభంగానే గ్రహించాను. అందుకని అతని ఫిలింగ్స్‌ని బాధించదలుచుకోలేదు. అతని మోటివేషన్‌లోని మార్పును గ్రహించాను. తన భార్యవల్లనే అతను మరణం తరువాత జీవితాన్ని నమ్మడానికి అలవాటు పడ్డాడు. అతను మతవాది కాదు. తన వ్యక్తిగత నమ్మకాన్ని ధృఢపరుచుకోవడం కోసమే అతను సైంటిఫిక్ కాస్మోలజీని ఆసరా చేసుకున్నాడు-1950లో యాభయ్యారేళ్ల వయసులో చనిపోయేప్పుడు కూడా తన నమ్మకాన్ని వీడలేదు. అయితే కొన్ని విషయాల్లో చాలా ప్రాక్టికల్‌గా ఉండేవాడు. తన నవలల్లో అద్భుతమైన పరిశీలనా శక్తితో ప్రకృతిని, మానవపాత్రలను సృజించాడు. దానితోబాటు చక్కని హాస్యచతురత, సౌకుమార్యాన్ని ప్రదర్శించాడు. తన జీవిత సమస్యలు అతనిని కఠినంగా, చేదుగా, సినికల్‌గా తయారు చేయలేదు. సామాన్య ప్రజలమీద అతనికి అపారమైన సానుభూతి. వారిని తమ పరిసరాల కట్టుబాట్లు, సంకుచితత్వాల నుండి ఎదిగేట్టు చేశాడు. బెంగాలీ మధ్యతరగతి అలవాట్ల నుండి బైటపడే ప్రయత్నం చేశాడు. బాహ్యమైన అవసరాలను లెక్కచేసేవాడు కాదు. కాని, కొన్ని సందర్భాలలో పరిసరాలు, ప్రకృతిసౌందర్యాల విషయంలో చాల సెన్సిటివ్‌గా ఉండేవాడు. అతని గది ఎప్పుడూ శుభ్రంగా ఉండేది కాదు. మంచి దుస్తులు ధరించేవాడు కాదు. చక్కగా సౌఖ్యంగా జీవించాలని అనుకునేవాడు కాదు.

సంవత్సరాల తరువాత, నేను వివాహం చేసుకున్నాక నా భార్యతో చాలా స్నేహంగా వుండేవాడు. ఇంటికి వొచ్చి ఆమెతో మాట్లాడుతుండేవాడు. సిట్టింగ్ రూములో కూచోకుండా సరాసరి ఆమె బెడ్‌రూములోకే వెళ్లేవాడు. ఎంబ్రాయిడరీ చేసిన దుప్పటిమీద మరకాళ్లు వేసుక్కూచుని బీడీ కాల్చేవాడు. మా ఆవిడ ఆ బీడీలు తాగడం మాన్పించడానికి పనివాణ్ణి పంపించి సిగరెట్లు తెప్పించి ఇచ్చేది.

అతను తన సామాన్య జీవితాన్ని మార్చుకునే ప్రయత్నం చేయలేదు. ధనవంతులంటే అతనికి ద్వేషంలేదు. ఒక ధనవంతుడి ఇంట్లో కొంతకాలం పిల్లలకి ట్యూషన్ మాస్టరుగా పనిచేశాడు. ఆ ధనవంతుని ఇల్లు బ్రిటీషు వారి పద్ధతిలో, అందమైన ఫర్నిచర్‌తో అమర్చబడి వుండేది. ఇంట్లో కారు కూడా ఉండేది. అతను వీటిని పట్టించుకునేవాడు కాదు. ఆ యింటి యజమానిని గురించి మాట్లాడినప్పుడు హాస్యంగా మాట్లాడేవాడు. కాని జెలసీ చూపించేవాడు కాదు.

ఒకరోజు మధ్యాహ్నం తరువాత అతను హఠాత్తుగా నా గదిలో ప్రత్యక్షమయ్యాడు. అతని మెడలో ఒక పుష్పహారం వుంది. తన స్కూల్లో జరిగిన ఫేర్‌వెల్ పార్టీనించి వొస్తున్నట్టు చెప్పాడు. కారణం అడిగితే స్కూల్లో తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు చెప్పాడు. అంతకంటె మంచి ఉద్యోగం చూసుకోకుండానే అతను తన స్కూలు ఉద్యోగానికి రాజీనామా చేయడం ఆశ్చర్యమనిపించింది.



కొన్ని వారాల తరువాత ఏదో పని దొరికినట్టు చెప్పాడు. అన్నిరోజులూ అతను రోజూ భోంచేసేవాడు కాదని తెలిసింది. అతన్ని కోప్పడి అలాంటి పరిస్థితుల్లో మా ఇంటికెందుకు రాలేదని అడిగాను. అందుకతను నన్ను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక రాలేదని చెప్పాడు.

అతని కొత్త ఉద్యోగం ఏమిటంటే గోవధకు వ్యతిరేకంగా, గోసంరక్షణ సొసైటీ వారి తరఫున ఉపన్యాసాలివ్వడం. ఆ సొసైటీలోని 'కిశోరాం పోద్దార్' అనే మార్వాడి ధనవంతుడి ప్రాపకంతో నడుస్తుండేది. అతని ఇంట్లో తనచుట్టూ ఒక అరడజను ఫోన్లు ఏర్పాటు చేసుకుని స్టాక్ మార్కెట్ వార్తలు వినిపిస్తుండేవాడు. ఆ విషయాన్ని హాస్యభరితంగా వివరించేవాడు. తరువాత సాహితీ సమావేశాల్నీ మాట్లాడుతుండే వాడు. ఆ ఉద్యోగాన్ని వొదిలేసి ఒక ప్రసిద్ధుడైన కలకత్తా భూస్వామికి ప్రైవేటు సెక్రటరీ అయ్యాడు. బోర్డింగ్ హౌస్‌లో నాతో ఉండమని అడిగాను. నాకు తెలిసిన ఒక సాహితీవేత్తతో అతను కలిసి వున్నాడు. అప్పుడతను తనెందుకు స్కూలు ఉపాధ్యాయ పదవికి రాజీనామా చేయవలసి వచ్చిందో చెప్పాడు.

మొదట అతను స్కూల్లో పనిచేసేప్పుడు ఆ గ్రామం లోని ఒక బ్రాహ్మల ఇంట్లో ఉంటుండేవాడు. ఆ ఇంట్లో ఒక ఈడొచ్చిన ఆడపిల్ల ఉంది. ఆ అమ్మాయి అతను స్కూలుకు వెళ్లిన తరువాత అతని గదిని శుభ్రం చేసి ఉంచేది. తరువాత అతనికి ఉత్తరాలు వ్రాయడం మొదలెట్టింది. అతనికి వ్రాసిన ఆ పది ఉత్తరాలు నేనూ చదివాను. వాటిలో ఎక్కడా 'ప్రేమ' అనేమాట వ్రాయలేదు. కేవలం అతనికి సేవచేయడమే ధ్యేయంగా ఆ పిల్ల వ్రాసింది. పైగా ఆపిల్ల బ్రాహ్మల్లో అతని శాఖకు చెందింది కాదు. అందుకని వివాహం ప్రసక్తే లేదు. అయినా అతను ఆ పిల్ల నుంచి తప్పించుకోడానికి స్కూలు ఉద్యోగానికి రాజీనామా చేసి వొచ్చేశాడు.

ఇలాంటి సంఘటన ఇదొక్కటే కాదు. చాలమంది ఆడపిల్లలు అతణ్ణి ఆకర్షించారు. ఆ రోజుల్లో బెంగాలీ ఆడపిల్లలు రచయితలంటే ప్రేమ చూపించేవారు. అదొక రకమైన హీరో వర్షిప్. బిభూతి బాబుకి కూడా అలాంటి సందర్భాలెన్నో ఎదురయ్యాయి. కాని, ఆ బంధాల్లో అతను చిక్కుకోలేదు... అప్పుడతను 'త్రిల్లోప్' ని చదువుతుండేవాడు. నేనతన్ని 'జానీఈప్స్'తో పోలుస్తాను.

నేను వివాహం చేసుకునేవరకు అతను నాదగ్గరికొచ్చి ఈ విషయాల్ని గురించి చెబుతుండేవాడు. విని నేనతన్ని తిడుతుండేవాణ్ణి. ఆవిషయాల్నతడు సీరియస్‌గా తీసుకనేవాడు కాదు. నా వివాహం తరువాత అతను తన నమ్మకాన్ని నానించి నాభార్యకు బదిలీచేశాడు. ఆవిడ ఓర్పుతో వింటుండేది. ఒకరోజు అతను ఒక పన్నెండేళ్ల బాలికను తనతో తీసుకొచ్చి, నా భార్య పడకగదిలో బెడ్ మీద ఆబాలిక చిన్న చేతుల్ని తన పెద్ద చేతుల్లో పట్టుకుని కూచున్నాడు. ఒక సంఘటన నాకు కోపం తెప్పించింది. ఒక ఉన్నత చదువు చదివిన ఆధునిక బెంగాలీ బాలిక అతని ప్రేమలో పడింది. ఆ పిల్ల నా భార్యకు బాగా తెలుసు. నా భార్య బిభూతికి సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చింది. కాని అదేమీ అతనిమీద పనిచేయలేదు. ఏమాత్రం ఇష్టం లేకుండానే ఆ పిల్లను చూడ్డానికి మూడువందలమైళ్ల ఇబ్బందుల ప్రయాణం చేశాడు. చివరికి ఎలాగో నలభై ఏడేళ్ల వయసులో పెళ్లి సంబంధంలో చిక్కుకున్నాడు. సంతోషంగానే జీవితాన్ని గడిపాడు. అతను నా భార్య దగ్గరకు రావడం మానలేదు. వొచ్చినప్పుడల్లా తన వివాహ జీవితంలోని సంతోషాన్ని గురించి చెప్పేవాడు. ఉదయం పెందరాడే లేవనీయకుండా అతని భార్య తనపైటచెంగుకు అతని పంచెచెంగుకు ఎలా ముడివేసేదో చెప్పేవాడు. అది బెంగాలీ సాంప్రదాయం. అతన్ని చూడ్డానికి వెళ్లి కాస్సేపు సంభాషించి, ఇక నేను బైలుదేరుతుంటే నా పంచెచెంగును గట్టిగా పట్టుకునేవాడు. ప్రేమలో లేనప్పుడు కూడా స్త్రీలను గురించి తెలుసుకొవాలనే కుతూహలం అతనికుండేది. అందువల్ల నవ్వులపాలవుతూండేవాడు.

అతను అయిదారేళ్ల పిల్లాడిగా ఉన్నప్పుడు వాళ్లనాన్న అతణ్ణి కలకత్తా తీసుకొచ్చి, ఒక అమర్యాదస్తులు నివశించే లాడ్జిలో బస చేశాడు. దాని ప్రక్కనే ఒక మంచి ఇంట్లో ఒక ఉంపుడుగత్తె ఉండేది. ఆమె తనతో మాట్లాడడానికి, ఆడుకోడానికి చిన్న బిభూతిని ఆహ్వానించేది. వాళ్లనాన్న ఒక మామూలు తండ్రి అయి ఉంటే అలాంటిది జరిగి ఉండేదికాదు. అందుకని బిభూతికి ఆమె అంటే ఇష్టం. సాయం సమయానికి ఆమె "బాబూ ఇంటికి వెళ్లు నా యజమాని వస్తాడు" అనేది.

1925లో ఒకరోజు మా అన్నయ్యతో నేనుంటున్న ఇంటికి వొచ్చాడు. అప్పుడు నేను చాలా భయంలో

ఉన్నాను. అతనికి చిన్నప్పుడు చూసిన ఆ యిల్లు గుర్తుంది. ఆ ఇంట్లో అదివరకు ఉన్న స్త్రీని చూడ్డానికి అతనొచ్చాడు. ఆ సమయానికి ఆ ఇల్లు ఒక వేశ్యాగృహంగా మారిపోయింది. అక్కడకి అతను వెళ్లగానే ఆ ఇంట్లో ఉన్న యువతులు అతణ్ణి చూసి ఒక్కసారిగా అతణ్ణి చుట్టు ముట్టారు. అతణ్ణి గదిలోకి లాక్కెళ్లే ప్రయత్నంచేశారు. బిభూతి బాబు తను అమాయకుణ్ణి మొర్రో అని గోలపెట్టి వాళ్ల నవ్వులగోలనించి బైటపడ్డాడు. అదే సమయంలో అతను తను స్కూలు టీచరు ఉద్యోగానికి రాజీనామా ఇవ్వడానికి కారణమైన అమ్మాయిన చూడాలని ఉందనీ, ఆ అమ్మాయి వివాహం చేసుకుందనీ, ఆమె సంతోషంగా ఉందో లేదో తెలుసుకోవాలని ఉందనీ చెప్పినప్పుడు నేను గాభరాపడ్డాను. అతణ్ణి ఆ ప్రయత్నాన్ని విరిమింపజేయాలని చూశాను. అతను వినలేదు. తరువాతతి రోజు అతను మళ్లీ వొచ్చినపుడు అతని కక్కడ ఏం జరిగిందో అతని ముఖం చూస్తే అర్థమయింది. అలనా ఇంటికి వెళ్లినపుడు అతనికి మామూలుగానే ఆహ్వానించారు. కాని, ఆ అమ్మాయిని గురించి అడగ్గానే ఆ ఇంట్లోంచి భయంకరమైన గావుకేక వినిపించింది. తరువాత ఆమె జైలుకెళ్లిన సంగతి చెప్పగానే బిభూతి ఒక్క మాటా ఇక వినకుండా పరుగెత్తుకొచ్చేశాడు. తగిన శాస్తే అయిందనుకున్నాను.

అతని వయసు నలభైఏళ్లు దాటాక, నా రచయిత మిత్రుడొకడు అతని మీద ఒక ప్రాక్టికల్ జోక్ వేశాడు. అందుకతను కోపంతో అతనిమీద కంప్లెయింట్ చెయ్యడానికి నాదగ్గరకొచ్చాడు. ఆ క్రూరుడు తనకొక ఆంగ్లో ఇండియన్ వేశ్యను చూపిస్తానని వాగ్దానం చేశాడు. అందుకోసం అతణ్ణి 'వెల్లింగ్టన్ స్క్వేర్' దగ్గర వెయిట్ చెయ్యమన్నాడు. ఆ నవంబరు చలిరాత్రి ఇతనక్కడికి వెళ్లి రెండుగంటలు కూచున్నా ఆ మిత్రుడుగాని, ఆ అమ్మాయిగాని రాలేదు. 'ఇంతకన్నా మోసం ఇంకేమన్నా ఉందా?' అన్నాడు. అతని ఉత్సాహానికి కారణం ఏమిటంటే ఆరోజుల్లో బెంగాలీయులకి ఆంగ్లోఇండియన్ వేశ్యలంటే విపరీతమైన మోజుండేది. అదేదో తెలుసుకుందామని బిభూతి ఆశించాడు. 'అలాంటి చోటికి వెళ్లడానికి నీకు ఆత్మగౌరవం లేదా' అని చీవాట్లేశాను.

బిభూతి బాబుకు అంతరంగికంగా ఎక్కడో ఆ బలహీనత ఉందనుకుంటాను. అతను అంత ఎత్తు కాదు. కొంచెం లావుగా వుండేవాడు. అతని ముఖంలో తెలివితేటలు ద్యోతకమవుతుండేవి. అతనంత అందగాడేమీ కాదు. అతనప్పుడప్పుడు నావి చాలా చిన్నకళ్లనీ, అవి నత్తకళ్లలా వున్నాయనీ, తనవి పెద్దకళ్లనీ అనేవాడు.

అతనికి తన వ్యక్తిత్వం మీద గట్టి అభినివేశం ఉండేది. అతనికి టాల్‌స్టాయ్ నవల 'వార్ అండ్ పీస్' అంటే చాలా అభిమానం. తాను ఆ నవలలోని "పీటర్ బెజుకావ్" లాంటి వాణ్ణని చెప్పుకునేవాడు. అందుకు 'నేను ప్రిన్స్ ఆండ్రూ బొర్కొన్‌స్కీ లాంటి వాణ్ణి' అనే వాణ్ణి. 'మరి బొరిగ్ డ్రుబెట్‌స్కొయ్' ఎవరు? మీ మిత్రుడా' అనేవాడు.

అతని బాల్య చేష్టల బలహీనత అతన్ని మరింత ప్రేమించదగిన వాడిగా చేసింది. రెండు దశాబ్దాల అతని పరిచయంలో అతని వ్యక్తిత్వం నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసేది. బైటకి అతను మృదుస్వభావిగా అనిపించినా అతనిలో ఎక్కడో కొంత కఠినత్వం దాగి ఉండేది. అందుకే అతను ఎవరితోను గాఢమైన అభిమానం చూపేవాడు కాదు. అతని కథల్లో గాఢమైన సానుభూతి, సౌకుమార్యం వుంది. దానికి కారణం అతనిలోని గాఢమై ఆధిక్యతా భావన, అతనికి తన కుమారుడిమీద విపరీతమైన అభిమానం. అతను చనిపోయే సమయానికి అతను చాలా చిన్న పిల్లవాడు. ఆ పిల్లవాడిమీది ప్రేమ బహుశః తనమీది తన ప్రేమ కావొచ్చు.

అతని అహంతకు ఒక మంచి పార్శ్వం కూడ వుంది. తన తోటి రచయితలు సాధించుకున్న విజయాలమీద, వారి సంపదమీద అతనికెప్పుడూ ద్వేషంగాని, జెలసీగాని లేదు. అతను సోమరితనంతో కొంత వెనకబడి ఉన్నాడనిపించినపుడు తన నవలను త్వరగా పూర్తి చేయమనీ, తనతోటిరచయితలు త్వరగా స్థిరపడుతున్నారనీ, తనకంటె వాళ్లేమీ ఎక్కువ సామర్థ్యం కలవాళ్లేమీకారనీ వ్రాశాను. అందుకతను అవేమీ పట్టించుకోవలసిన విషయం కాదని సమాధానం వ్రాశాడు. అతను ఎవరిని చూసీ స్పర్ధపడలేదు. తన నిదానానికి తనేమీ బాధపడలేదు. అతను తను అనుకున్న వాటిని సాధించుకున్నాడు.

బి.వి. రామిరెడ్డి
రిటైర్డ్ లెక్చరర్, రుద్రవరం,
ఫోన్ : 990 885 6530


బేతవోలు రామబ్రహ్మం
అదిగో శీతాద్రి

– మాకినీడి సూర్య భాస్కర్

శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారి "అదిగో శీతాద్రి" అనే శీర్షికను చదివినప్పుడు ముందుగా మనకు కనిపించేది ఒక చూపు, దూరంగా. దూర దూరంగా కనిపిస్తున్న హిమపర్వతాన్ని ఎవరో చూపిస్తూ–అదిగో!– అంటున్నారు. కానీ బేతవోలు రామబ్రహ్మం గారి పద్యఖండికను పూర్తిగా చదివిన తరువాత తెలుస్తుంది: ఆ "అదిగో" అన్నది పర్వతాన్ని చూపించే చూపు మాత్రమే కాదు; ఒక దృశ్యాన్ని చూపి, దాని వెనుక ఉన్న పురాణాన్ని, సంస్కృతిని, ప్రకృతి రహస్యాన్ని, మానవుని అల్పత్వాన్ని, విశ్వవిస్తృతిని, చివరికి అంతరంగ నిశ్శబ్దాన్ని చూపించే కవిదృష్టికి ఆరంభసూచన. కవి మొదట శీతాద్రిని చూస్తాడు. తరువాత శీతాద్రి కవిని చూస్తున్నట్లవుతుంది. ఈ పరస్పర దర్శనమే ఈ ఖండికకు జీవం. పర్వతాన్ని దర్శించడానికి వెళ్లిన యాత్రికుడి బాహ్య ప్రయాణం క్రమంగా అంతర్యాత్రగా మారుతుంది. అందుకే ఇది కేవలం హిమాలయ ప్రకృతి వర్ణన కాదు. దృశ్యం నుంచి దర్శనానికి, దర్శనం నుంచి అనుభూతికి, అనుభూతి నుంచి తత్వానికి సాగిన కవితా ప్రయాణం.

ఒక పర్వతం ముందు నిలిచిన ఆశ్చర్యం : కవిత ప్రారంభంలోనే కవి తనను తాను ఒక సాధారణ పర్యాటకుడిగా నిలబెట్టుకోడు. "**పాదాలేవపటుత్వముం దెలియ విప్రస్వామి కాశీప్రయాగాదుల్ చూడగబోక**" అంటూ యాత్రికుడి రూపాన్ని తెచ్చి, "హిమగిరీంద్ర" వైభవాన్ని దర్శించిన అనుభూతిని వ్యక్తం చేస్తాడు. అక్కడి నుంచే శీతాద్రి ఒక సాధారణ పర్వతం నుంచి మహత్తర సాంస్కృతిక ప్రతీకగా ఎదుగుతుంది. అందుకే వెంటనే, "**తాదృగ్వైభవసాంద్రమౌ హిమగిరీంద్రమ్మచ్చ గంగాసరిన్నాదావిష్కృతవేద...**" అనే పదచిత్రం వస్తుంది.

"హిమగిరీంద్ర"లో పర్వతపు భౌతిక ఎత్తు ఉంది; "అచ్చగంగానది"లో పవిత్ర ప్రవాహం ఉంది; "నాదావిష్కృతవేద"లో శబ్దం ద్వారా ఆవిష్కృతమయ్యే సాంస్కృతిక స్మృతి ఉంది. అంటే పర్వతం శిల కాదు– గంగ; గంగ కాదు– నాదం; నాదం కాదు–వేదస్మృతి. కవి దృష్టిలో ఒకే దృశ్యం ఎన్నో అర్థస్తరాలను తెరుస్తోంది.



ఈ వర్ధతి మొత్తం ఖండికకు మూల నిర్మాణంగా మారుతుంది. శీతాద్రిని చూస్తున్న కొద్దీ కవి కంటికి కొత్త కొత్త లోకాలు కనిపిస్తాయి.

హిమశైలం – భారతీయ సాహిత్యస్మృతి మాహాత్మ్యం : శీతాద్రి వైభవాన్ని చెప్పడానికి కవి అత్యంత అర్థవంతమైన పదాన్ని ఎంచుకుంటారు: **"భారతసాహితీగగనవాహిని యీ గిరి..."** ఇది సాధారణ ప్రశంస కాదు. భారతీయ సాహిత్యానికి ఆకాశంలో ప్రవహించే గంగ ఒకటుంటే, దాని వాహకుడీ పర్వతమే అన్నంత విస్తృతమైన రూపకం. ఈ ఒక్క భావనతో హిమాలయం భౌగోళికత నుంచి సాహిత్యభూగోళంగా మారుతుంది. "హిమశైలమటన్ననే చాలు"నన్న భావం కూడా గమనించదగినది. ఒక పేరు పలకడమే ఒక సంస్కృతిని మేల్కొలుపుతుంది. భారతీయ మనస్సులో హిమాలయం అంటే గంగ, శివుడు, పార్వతి, ఋషులు, తపస్సు, యాత్ర, పురాణం, ఇతిహాసం–ఇలా అనేక స్మృతుల సమాహారం. కవి ఆ సామూహిక సాంస్కృతిక స్మృతిని తన వ్యక్తిగత దర్శనంతో మేళవిస్తున్నాడు.

ఇక్కడినుంచి కవితలో ఒక అద్భుతమైన పరిణామం మొదలవుతుంది: ప్రకృతి దృశ్యాలు పురాణ దృశ్యాలుగా మారుతాయి.

శిలల్లో దాగిన పురాణాలు : జలపాతాలను చూస్తూ కవి ప్రశ్నిస్తాడు: "**మరి యే రహఃకథల వాగాలమ్ము లాభించునో!**" శిలాహృదయంలోంచి ఉప్పొంగే నీటికి కవి కేవలం భౌతిక కారణాన్ని మాత్రమే చూడడం లేదు; దాని వెనుక ఏదో రహస్యకథ దాగి ఉండడాన్ని అనుభవిస్తున్నాడు. "రహఃకథ" అనే పదం ఇక్కడ ఎంతో శక్తివంతమైనది. ప్రకృతి ఒక తెరిచిన పుస్తకం కాదు; చదివిన కొద్దీ మరిన్ని రహస్యాలను ప్రసాదించే గ్రంథం. రహఃఅంటే రహస్యమనీ, ఏకాంతమనీ చెప్పుకోవచ్చు. ఇక్కడ మొదటి అర్థమే గ్రాహ్యం. లలితా రహస్య నామస్తోత్రం లేదా లలితా త్రిశతీ రహః నామ స్తోత్రం – ఈ సూచిక "అత్యంత పవిత్రమైన, గుప్తమైన జ్ఞానం" అనే అర్థంలోనే చెబుతారు.

ఆ 'రహఃకథ' ... రహస్య గ్రంథంలో కవి వెంటనే భారతీయ సాహిత్యపు అనేక కథలను గుర్తిస్తాడు:

"ఇట శాకుంతలగాధ, యల్లచట గౌరీశానసంపృక్తి,యి చ్చట స్వారోచిషసంభవం బిచట విశ్వామిత్రవృత్తాంత మిచ్చట కుంతీపరిదేవనం..."

ఇది కేవలం పురాణాల జాబితా కాదు. ప్రతి గాథకు ఒక భౌగోళిక స్థలం కేటాయించినట్లు కవి ఊహిస్తున్నాడు. శీతాద్రి ఒకేసారి శకుంతల, గౌరీ-ఈశ్వర, విశ్వామిత్ర, కుంతీ వంటి అనేక భారతీయ కథల రంగస్థలంగా మారుతుంది. చివరకు,**"కథాసర్వస్వసంస్థాన మొక్కట రామాయణ భారతంబులగుబో..."** అంటూ ఆ పరిధిని రామాయణ, మహాభారతాల వరకూ విస్తరించారు. ఇక్కడ కవి చేస్తున్నది పురాణాలను పర్వతంపై అతికించడం కాదు. భారతీయ సంస్కృతిలో ప్రకృతి-పురాణాల మధ్య ఏర్పడిన సహజ సంబంధాన్ని తన అనుభూతిలో తిరిగి సృష్టించడం. అందువల్ల హిమాలయం కవికి భూభాగం మాత్రమే కాదు; అది భారతీయ జ్ఞాపకానికి భౌతిక రూపం.

హేతువును దాటి విస్మయంలోకి : ఇంతటి అనుభూతి ముందు కవి బుద్ధి కూడా ఒక దశలో ఆగిపోతుంది: **"నా హృదయంబు హేతుమధీమహిమంబు గోల్పడియె..."** నంటారు. దీన్ని హేతువును నిరాకరించే ప్రకటనగా చదవాల్సిన అవసరం లేదు. ప్రకృతి మహత్తును పూర్తిగా కొలిచేంతటి బుద్ధి తనకు లేదని కవి అనుభవిస్తున్నాడు. అందుకే తరువాత కనిపించే దృశ్యం మరింత విస్తృత మవుతుంది, చూడండి.

"గంగామృదులాపగా పతనకాలబిలం బగుపించునో, మరుద్భామల రాకపోకల పథంబు లభించునొ!"

జలపాతం సాధారణ కంటికి ఒక మార్గం; కవికల్పనకు అది మరొక లోకానికి వెళ్లే ద్వారం. గాలి సంచారం ఒక సహజ ప్రక్రియ; కవికి అది అదృశ్య జీవుల రాకపోకల పథంలా అనిపిస్తుంది. ఇక్కడే కవిత్వం శాస్త్రీయ పరిశీలనకు భిన్నమైన తన స్వభావాన్ని ప్రకటిస్తుంది. కవి ప్రకృతిని వివరించడు; ప్రకృతితో తన ఊహాశక్తి సంభాషణను నమోదు చేస్తాడు.

గంగ - భౌతిక ప్రవాహం నుంచి పవిత్ర ప్రవాహం వరకు: శీతాద్రి దర్శనంలో గంగకు ప్రత్యేకమైన స్థానం ఉంది. మంచు కరుగుతున్న దృశ్యాన్ని కవి చూపు పురాణకల్పనతో మేళవింపై కనబడుతుంది.

"అగశిఖరాగ్రభాగములయందనపాయిత సూర్యరశ్మి సోకగ హిమశృంగముల్ కరుగగా ప్రభవించెను గంగ యంట..." సూర్యకాంతి మంచును కరిగిస్తుంది-ఇది కేవల భౌతిక ప్రక్రియ. కానీ కవికి అది గంగావతరణం. దృశ్యమానం చేస్తూ వెంటనే శివుని ప్రతీక ... **"రజతశైలనివాసి శిరోవిభూషితాపగ..."** ఇక్కడ సూర్యుడు, మంచు, నీరు, గంగ, శివుడు-ఒకే దృశ్యరేఖలో సమ్మిళితం. ఈ కలయికలోనే కవి సృజనాత్మకత ఉంది. శాస్త్రీయ సత్యాన్ని తొలగించి పురాణాన్ని పెట్టడం కాదు; భౌతిక సత్యంలోనే పురాణానుభూతిని దర్శించడం. మంచు కరుగుదల కవికి గంగావతరణంగా కనిపించడం ప్రకృతి-పురాణ సమన్వయానికి అందమైన ఉదాహరణ.

జలధారల్లో పుట్టింటి ప్రేమ : ప్రకృతి దృశ్యం ఒక్కసారిగా మానవ సంబంధానికి చేరే సందర్భం కవితలో అత్యంత మృదువైన మలుపు:

"దొంగదారుల బడి జారుచున్నవి ఝరుల్ భువిమీదకు, పుట్టినింటి ప్రేమలు గణియింపబోవరు సుమా! మహిళల్ తమ సంతుముందటన్."

పర్వతం నుంచి విడిచి దిగివచ్చే జలధారలు కవికి పుట్టింటి నుంచి బయలుదేరే స్త్రీలను గుర్తుచేస్తాయి. నీటి ప్రవాహం ఒక కుటుంబస్మృతిగా మారుతుంది. పర్వతం పుట్టినిల్లు; జలధారలు దాని నుంచి బయలుదేరిన సంతానం.

బుద్ధుని ప్రశాంతతలో జలపాతం : మరో దృశ్యంలో జలపాతపు తెల్లని ధారలు బుద్ధుని విగ్రహాన్ని తలపిస్తాయి: **"మెచ్చుగ బుద్ధదేవుని యమేయమహోన్నతవిగ్రహంబు ... హిమాద్రివిభుండొనరింప..."** మంచు, జలపాతం, వెండి లోయ- ఇవి కలిసి బుద్ధుని ప్రశాంతతను సూచిస్తాయి. ఇక్కడ కవి భారతీయ ఆధ్యాత్మికతను ఒకే మతపరమైన చట్రంలో బంధించడు. శైవం, వైష్ణవం, వేదం, ఇతిహాసం, బౌద్ధం- ఇవన్నీ ఒకే హిమశైల దృశ్యంలో సహజీవనం చేస్తాయి.

ప్రకృతిలో సంఘస్పృహ : శీతాద్రి దర్శనం క్రమంగా సామాజిక ఆలోచనకు దారి తీస్తుంది. పర్వతశిఖరాలపై నిర్మాణాలను చూస్తూ కవి వాటిని ఒక సామాజిక ప్రతీకగా ఊహిస్తాడు: పర్వతశిఖరాలు సహజదృష్టాంతాలవుతాయి. వాటి మధ్య సంబంధం, వాటి సమూహ నిర్మాణం, వాటి స్థైర్యం- ఇవి కవికి సంఘస్పృహను నేర్పుతున్నట్లు అనిపిస్తుంది. ఇది కవితలో ముఖ్యమైన పరిణామం. ప్రకృతి

ఇక అందమైన దృశ్యం మాత్రమే కాదు; మనిషికి జీవనపాఠం చెప్పే గురువు.

ఈ భావన మరింత స్పష్టంగా : "**స్థావరజంగమాత్మక విశాలజగంబున నెల్ల ప్రాణులం త్యావధి భాగభాక్కుల...**" అనే పంక్తుల్లో వ్యక్తమవుతుంది. సృష్టిలోని ప్రతి ప్రాణికీ భాగస్వామ్యం ఉందని చెప్పడం ద్వారా కవి మానవకేంద్రిత దృష్టిని అధిగమిస్తాడు. మనిషి ప్రకృతికి అధిపతి కాదు; సమస్త జీవరాశులలో ఒక భాగం. అందుకే, "**సృష్టిన్ సహజీవనాభ్యుదయ మామోద్యమ్ము..**" అనే భావం కవిత యొక్క 'సామాజిక-వర్యావరణ తాత్త్వికత'కు కేంద్రబిందువుగా నిలుస్తుంది.

నగరం నుంచి పంజరం దాటి అంతరంగానికి : ప్రకృతి మధ్య నిలిచిన కవి నగరజీవితాన్ని కూడా వెనక్కి చూసుకుంటాడు:

"**నగరములెల్ల దాటిరి, వనాళి గమించిరి,**
పంజరంబులం బగిలిచి రీ నగాగ్రములపై కరుదెంచిరి..."

'పంజరం' ఇక్కడ పక్షుల బంధనానికి మాత్రమే సంబంధించిన పదం కాదు. నగరజీవితంలోని పరిమితులకు కూడా ప్రతీకగా చదవవచ్చు. నగరాన్ని దాటి అడవిలోకి రావడం బాహ్య ప్రయాణం; 'అంతరంగశుద్ధి'తో పిలుపు వినడం అంతర్యాత్ర.

"**అంతరంగశుద్ధిగ నెలుగెత్తి పిల్చిరి, ప్రతిధ్వనులిచ్చె దరీముఖంబులో...**" గుహ ప్రతిధ్వని ఇక్కడ కవి స్వరానికి ప్రకృతి ఇచ్చే ప్రత్యుత్తరం. మనిషి ప్రకృతిని పిలుస్తాడు; ప్రకృతి అతని స్వరాన్నే తిరిగి అతనికి వినిపిస్తుంది. ఈ దశలో పర్వతం బాహ్య వస్తువు కాదు- అంతరంగానికి ప్రతిబింబం అయిపోతుంది.

భయాతివిస్మయం - పర్వతం ముందు మానవుని పరిమాణం : శీతాద్రి శిఖరాల నుంచి కనిపించే దృశ్యం కవిలో సౌందర్యానందంతో పాటు ఒక మహత్తరమైన భయాన్ని కూడా కలిగిస్తుంది :

అంతము లేని లోయలు, ననంతవిహాయసవీథులందు దు ర్దాంత తమోంబుదమ్ములు ... భయాతివిస్మయాంత ముదంబులన్ శబలమయ్యె." ఇక్కడ 'భయాతివిస్మయం' అన్న భావన ఎంతో కీలకం. అనంతత్వాన్ని చూసినప్పుడు మనిషికి కలిగే అనుభూతి కేవలం ఆనందం కాదు. తన పరిమితి తెలిసినప్పుడు కలిగే భయం కూడా అందులో ఉంటుంది. కానీ ఆ భయం విస్మయంతో మిళితమై ఉంటుంది. అందుకే తరువాత :

"**ఇటు పైనున్నది జీవలోకమనగానీ క్రింద వర్తించును త్కటగాఢాంధ్యము మృత్యులోక**"మనునది 'జీవిత-మరణ' ప్రతీక వస్తుంది. పర్వతశిఖరం ఒక మధ్యస్థానం. పైకి జీవలోకం, క్రింద చీకటిలో మృత్యులోకం. కవి భౌతిక ఎత్తును ఒక తాత్త్విక సరిహద్దుగా మార్చారు. శిఖరాన్ని అధిరోహించడం అంటే జీవితాన్ని పైనుంచి చూడటం; చీకటిని కింద చూడటం అంటే మరణాన్ని ఎదుర్కోవడం.

ప్రకృతి నాదం నుంచి ప్రణవానుభూతి : ఈ దశలో కవితలోని శబ్దప్రపంచం మరింత లోతుకు వెళుతుంది: "**ప్రకటచరాచరాత్మక ప్రపంచకమందు మనోజ్ఞనాదవీచిక యొక డాంతరమ్ముగ రసించుచు...**" ఇక్కడ 'నాదవీచిక' అనే పదం అద్భుతమైన శ్రావ్యరూపకం. గాలి, జలపాతం, పక్షులు, అడవి, మేఘాలు- ప్రకృతిలోని అనేక ధ్వనులు కలసి ఒకే నాదతరంగంగా మారుతున్నాయి. ఆ నాదం బయట వినిపించేదే కాదు : "ప్రణవామృతమ్ము రుచి చూచినయట్లనుభూతి" అంటారు. ప్రాకృతిక సంగీతం ప్రణవానుభూతిగా పరిణమించింది. కవిత యొక్క ప్రయాణం బాహ్య దృశ్యం నుంచి అంతర నాదానికి చేరుకుంది. కళ్ళు మూసుకున్నప్పుడు కనిపించిన సమస్తం ఈ పరిణామానికి తదుపరి మెట్టు: "**గిరిశిఖరంబుపై నిలిచి కేల్గవ కన్నులు మూసి**" చూసినప్పుడొక విరుద్ధసౌందర్యం. సాధారణంగా చూడటానికి కళ్ళు తెరవాలి. కానీ కవి కళ్ళు మూసుకుని చూస్తున్నాడు. ఈ 'మూసి-చూడడం'లోనే అంతర్యాత్ర సారాంశం ఇమిడిపోయి ఉంది. బయటి ప్రకృతి దృశ్యం కళ్ళతో కనిపిస్తుంది. కానీ దాని సమగ్రత అంతరంగంలోనే అనుభూతమవుతుంది. అందుకే: "**నేనును మున్గితేలు సుందరపరిణాహ మొక్కడు కనంబడె నేనె సమస్తమున్నటుల్**" అనే భావం వస్తుంది. 'నేను' మరియు 'సమస్తం' మధ్య సరిహద్దు కరిగిపోతున్న అనుభూతి ఇది. పర్వతాన్ని చూస్తున్న వ్యక్తి చివరికి తానే ఆ విశాల దృశ్యంలో భాగమైపోతాడు.

నిశ్శబ్దం శబ్దానికి వ్యతిరేకం కాదు; శబ్దానికి జన్మస్థానం. "ప్రసూతిగేహం" అనే రూపకం ఈ భావాన్ని అసాధారణమైన శక్తితో వ్యక్తపరుస్తుంది. భారతీయ తాత్త్విక చింతనలో మౌనానికున్న ప్రాధాన్యత అందరికీ తెలిసున్నదే. చివరికి, ఆ నిశ్శబ్దం... మౌనం "కోటిశబ్దములకేని న్మించి బోధించెడిన్" అంటారు, కవి రామబ్రహ్మం గారు. ఇది కవితలో నిజంగా ఒక శిఖరానుభూతి. ప్రారంభంలో

జలపాతాల నాదం, గంగాప్రవాహం, పక్షుల కిలకిల, మేఘాల చలనం–అన్నీ శబ్దాలతో నిండిన ప్రపంచం. కానీ ఆ శబ్దాలన్నింటినీ దాటి కవి చేరేది నిశ్శబ్దం. అక్కడ మాటలు అవసరం ఉండవు. అందుకే ఈ కవిత యొక్క అంతర్గత సంగీతాన్ని శబ్దం నుంచి నిశ్శబ్దానికి జరిగిన ప్రయాణంగా కూడా గమనించవచ్చు.

విశ్వాన్ని చూసిన క్షణంలో మానవ అహంకారం : నిశ్శబ్దానుభూతి తరువాత కవి విశ్వపరిమాణాన్ని చూస్తాడు: **"రోదోంత శ్మశానేకభాసురముల్ సౌరకుటుంబముల్, మనది యెచ్చోనుండె? నద్దాన నుర్వర యేపాటిది? దీనిపై మనుజు డల్ప ప్రాణి, వీడెంత?"** విశ్వంలోని అనేక సౌర కుటుంబాల మధ్య మనిషి తన స్థానాన్ని ప్రశ్నించుకుంటే... తర్వాత మరింత సూటిగా: **"దుర్భరవిద్వేషములేలరోరి శిశువా!"** అనే తత్త్వం బోధపడుతుంది. ప్రకృతి దర్శనం నైతిక దర్శనంగా మారింది. విశ్వం ఇంత విస్తారమైనప్పుడు మనిషి తనను తాను కేంద్రంగా భావించుకోవడం ఎంత పరిమితమైన దృష్టి? ఈ ప్రశ్న కవితలోని మానవతా చైతన్యానికి బలమైన ఆధారం. అలాగని కవి మానవుణ్ణి తృణీకరించడం లేదు. "శిశువా! రమ్మీ ప్రపాశాలకున్" అని ఆహ్వానిస్తున్నారు. అహంకారాన్ని విడిచి విశ్వాన్ని చూడమని ఆహ్వానిస్తున్నారు.

పచ్చదనం – ప్రకృతి కల్యాణవేదిక : తరువాతి దృశ్యాల్లో కవి ప్రకృతిని ఒక వివాహ సందర్భంగా ఊహిస్తాడు: **"కల్యాణసందర్భ శోభనమౌ పచ్చదనాల తోరణము, శుంభన్నిరఝరాంభో నిగుంభనమౌ మంగళవాద్య సారణము...** అంటారు. ఇక్కడ పచ్చదనం తోరణం; జలపాతం మంగళవాద్యం. పర్వతం ఒక కల్యాణవేదిక. ఇది కేవలం సౌందర్యోక్తి కాదు. ప్రకృతిని జీవనోత్సవంగా చూసే దృష్టి. పచ్చదనం అంటే జీవం; నీటి ప్రవాహం అంటే చలనం; పర్వతం అంటే స్థైర్యం. ఈ మూడు కలిసినప్పుడు ఒక సమగ్ర జీవనచిత్రం ఏర్పడుతుంది.

మేఘాల్లో కుటుంబసాన్నిహిత్యం : ఒక మేఘాన్ని కవి ఎంతో మానవీయంగా చూస్తారు:

"ఒక గారాబపు మబ్బుకూన గిరిరాజోత్సంగపీఠాన నొ ద్దిక కూర్చున్నది దేవతాత్ముడు నగాధీశుండు చిన్నారి పు త్రిక నాడించుచునుండెనో యనగ..."

పర్వతం తండ్రి; మేఘం చిన్నారి. మహా హిమగిరి ఒక్కసారిగా ఒక కుటుంబంగా మారిపోతుంది. ఇది బేతవోలు వారి కవిత్వంలోని ముఖ్యమైన సృజనాత్మక లక్షణాన్ని వెల్లడిస్తుంది: విశాలమైన ప్రకృతి దృశ్యాన్ని సన్నిహితమైన మానవ సంబంధంగా మార్చడం. పర్వతం ఎంత మహత్తరమైనదైనా, కవి ఊహలో అది గారాబంగా పిల్లను ఒడిలో పెట్టుకున్న తండ్రిగా మారుతుంది.

పర్వతం నుంచి సమాజానికి : పర్వతశిఖరాల నిర్మాణాన్ని చూసి కవి కూలీల గుడిసెలను గుర్తు చేసుకోవడం మరొక విశిష్టమైన దృష్టి: **"తడకల్ గుమ్మాలుగా బెట్టి తీరుగ పాల్మేరల కూలివాండ్ర గుడిసెల్ రూపించే దెందమ్మునన్"**

ప్రకృతి రూపకల్పనకు సామాజిక వాస్తవికత జత చేశారు. పర్వతశిఖరాలు కేవలం సుందర ఆకృతులు కావు; అవి కవికి శ్రమజీవుల నివాసాల రూపాన్ని కూడా గుర్తుచేస్తాయి. అంటే ప్రకృతి దర్శనం కవిని సమాజం నుంచి దూరం చేయలేదు; కవిని 'సామాజిక స్పృహ'కోసం అల్లల్లాడే 'కావ్రేడ్'ను చేసింది–అన్న విషయాన్ని ధ్వనిమయంగా వివరించారు. ఎలాగో చూద్దాం.

హిమాలయ పర్వతరాజం ప్రకృతిచేత ఊహించనలవి కానంత గొప్ప సత్కారాలను పొందుతోంది – అదీ ప్రతిరోజూ! మేఘాలు – యోధులు, ఆకులు – శిరస్త్రాణాలు : మరో చోట కవి మేఘాలను యోధులుగా ఊహిస్తారు: **"దళమౌ ఆకులు కొమ్మలుం దమ శిరస్త్రాణంబులన్ చుట్టి శత్రుల రాకల్ పసికట్టగా నిలుచు యోధుల్వోలె..."** చెట్లు, ఆకులు, మేఘాలు ఒక సైనిక దృశ్యంగా మారాయి. కానీ ఈ యోధత్వం యుద్ధప్రవృత్తి కాదు; ప్రకృతిని కాపాడే సంరక్షణాత్మక శక్తిగా మనం గుర్తించాలి. ప్రకృతిలోని ప్రతి రూపం ఒక మానవ లక్షణాన్ని మేల్కొలుపుతోంది–తండ్రితనం, మాతృత్వం, ప్రేమ, శౌర్యం, సహజీవనం, వినయం, ఆధ్యాత్మికత, వంటివెన్నో!

వెలుగు–చీకటి: సృష్టి రహస్యం : కవితలో ఒక దశలో మేఘాలు సూర్యుణ్ణి కప్పేస్తాయి; మరొక వైపు కాంతి మెరుస్తుంది: **"అటు క్రీగొండలవారి చూపులకు నడై గాఢమేఘంబులుం డుట సూర్యుండగుపించ, డియ్యెడల గాంతుల్జిమ్మి కన్పించు..."**

ఈ దృశ్యాన్ని కవి వెంటనే తాత్త్విక ప్రశ్నగా మార్చేస్తారు. **"...అస్తినాస్తివిచికిత్సాహేతువిన్యాసమొ క్కటియే సృష్టి యనుగ్రహింపక దిదృక్షాపూర్తి యెట్లయ్యెడిన్!"** అంటారు. వెలుగు–చీకటి కేవలం వాతావరణ మార్పులు కావు. 'అస్తి––నాస్తి' అనే తాత్త్విక ప్రశ్నకు అవి ప్రకృతి రూపకాలు. కనిపించేది–కనిపించనిది, ఉన్నది–లేనిది,

వెలుగు-చీకటి ఇవన్నీ సృష్టి రహస్యాన్ని సూచిస్తున్నాయి. ఇంతటి మార్మిక సృష్టి రహస్యంలోనూ హేతువును వదలకపోవడం కవి నిబద్ధపుటాలోచన తీరును పట్టిస్తుంది.

మైనాకుడు-మారుతి-పురాణస్మృతి : పురాణస్మృతి మరోసారి కవితలోకి ప్రవేశిస్తుంది: "**అభివందించి విదేహపుత్రికి సమృద్ధార్జుండనై వచ్చి నిన్నభినందింతునుగాక!... ఓయి మైనాక!**" మైనాక పర్వతాన్ని, మారుతిని గుర్తుచేసే ఈ సందర్భంలో హిమపర్వత దృశ్యం రామాయణ స్మృతితో అనుసంధానమవుతుంది. కానీ ఇది ముందటి పురాణ ప్రస్తావనల పునరుక్తి కాదు. ఇక్కడ పురాణం పర్వతం యొక్క చలనశీలత, ఆకాశసంబంధం, యాత్ర, దూతత్వం వంటి కొత్త భావాలను తెరుస్తుంది.

మేఘాన్ని ఈ కవి కూడా దూతగా చూస్తారు. మేఘం పర్వతం మీద నుంచి మరొక ప్రాంతానికి వెళ్లే సందేశ వాహకుడిలా మారుతుంది. ప్రకృతి వస్తువులన్నీ కవి ఊహలో సంబంధజాలాన్ని ఏర్పరుస్తాయి.

శిఖరంపై సూర్యుడు-సన్నిధి అనుభూతి : పర్వతశిఖరంపై సూర్యుడి ఉనికిని కవి ఇలా అనుభవించి అనుభూతిస్తారు: "**ఉన్నతపీఠినందుకొనుటో మరి సన్నిహితత్వమందిమే మున్న కతాననో తెలియనోపను గాని...**" పర్వతం ఎత్తుకు చేరడంతో సూర్యుడికి దగ్గరైన అనుభూతి కలుగుతుంది. భౌతిక దూరం తగ్గిందా? లేక మానసిక సన్నిహితత్వం పెరిగిందా? కవి ఆ రెండింటినీ స్పష్టంగా విడదీయరు. ఇది మంచి కవనపు ముఖ్యమైన లక్షణం భౌతిక అనుభవం మరియు అంతరానుభూతి మధ్య నరిహద్దును ఉద్దేశపూర్వకంగా అస్పష్టం చేయడం.

మంచుపల్లకి - ప్రకృతి యొక్క రాజసౌందర్యం : మధ్యాహ్న సమయంలో కనిపించే హిమదృశ్యాన్ని కవి అద్భుతమైన రూపకంతో చూపిస్తున్నారు-"**ఋతుశ్రీలక్ష్మి విచ్చేయుచున్నది వ్యాహ్యాళికి మంచుపల్లకి సుదీర్ఘ స్వచ్ఛభూశాచ్చవిన్.**"

మంచు ఒక పల్లకి. ఋతుశ్రీలక్ష్మి అందులో విహరించడానికి వస్తోంది. ప్రకృతి దృశ్యం రాజ సౌందర్యంగా మారింది. మంచు, సూర్యకాంతి, ఆకాశం, పర్వతం-అన్నీ కలసి ఒక దివ్యయాత్రను సృష్టిస్తున్నాయి. ప్రకృతి దృశ్యాన్ని మానవ అలంకారాల ద్వారా అందంగా అనువదించే కవి కల్పనాశక్తికి ఇది ఉదాహరణ.

ఆకాశం-విశాల నీల వియత్సరోవరం : పర్వతాన్ని చూసినప్పుడు కవి చూపు పైకి ఎగిసి ఆకాశాన్ని చేరుతుంది - "విశాల నీల వియత్సరోవరంబున/ప్రతిబింబమో యన నభోమణి..." ఆకాశం ఒక నీలి సరస్సు. సూర్యుడు అందులో ప్రతిబింబం. ఈ రూపకం దృశ్యాన్ని తలకిందులు చేస్తుంది-నరస్సులో ఆకాశం ప్రతిబింబించదు; ఆకాశమే సరస్సుగా మారుతుంది. ఇలాంటి రూపకాల్లో కవిగా బేతవోలు రామబ్రహ్మం గారి దృశ్యకల్పన బలం స్పష్టమవుతుంది. ఆయన ప్రకృతిని "ఇది ఇలా ఉంది" అని చెప్పరు; అది మరొక దృశ్యంగా మారేలా చేస్తారు.

చివరికి కవి తనను తాను వెల్లడించుకున్న క్షణం : ఇన్ని అనుభూతుల తరువాత చివరికి కవి చెబుతారు - "**నిను వీక్షించిన సంబరంబది ననున్ వెంటాడి వెంటాడి నిద్రను కాజేసెను కొన్ని నాళ్లు...**" ఇది కవిత యొక్క అత్యంత మానవీయమైన ముగింపు. ఇంతవరకు మనం శీతాద్రిని, గంగను, పర్వతాన్ని, మేఘాలను, పురాణాలను, విశ్వాన్ని చూశాం. ఇప్పుడు ఆ దర్శనం కవిపై ఎంత ప్రభావం చూపిందో తెలుస్తుంది. ఆ అనుభూతిని మరచిపోలేకపోయారు. నిద్రను కూడా కాజేసింది. చివరికి - "**ఇటు పద్యాలల్లి దివ్యానుభూతిని సాకార మొనర్చితిన్...**" అని చెబుతారు.

ఇదే కవిత పుట్టుకకు మూలకారణం దర్శనం-అనుభూతి-ఆవేదన/ఆనందం-పద్యం. కలిగిన అనుభూతి తనలోనే ఉండిపోలేక పద్యరూపం పొందింది. కవిత్వమంటే కవికి అలంకారప్రయోగం కాదు; అనుభవాన్ని 'సాకారం' చేయడం. అందుకే చివరికి శీతాద్రిని ఉద్దేశించి- "**చూచిన యట్లె- యిది నిక్కమై నెగడ నాశీస్సుల్ ప్రసాదింపుమా**" అని ప్రార్థనాత్మక వినయంతో ఈ దీర్ఘకవితను ముగిస్తారు. ప్రారంభంలో 'అదిగో' అంటూ పర్వతాన్ని చూపిన కవి, చివరికి దాని ఆశీస్సులు కోరుతున్నారు. ఈ రెండు అంచుల మధ్యే మొత్తం కవితా పరిణామం యావత్తూ దాగి ఉంది.

దృశ్యం నుంచి దర్శనానికి : 'అదిగో శీతాద్రి'ని సమగ్రంగా పరిశీలిస్తే, దాని నిర్మాణం ఒకే భావాన్ని పదేపదే చెప్పడం మీద ఆధారపడలేదు. అది అనుభూతి పరిణామంపై ఆధారపడింది. మొదట కన్ను పర్వతాన్ని చూస్తుంది. తరువాత కల్పన పర్వతంలో పురాణాలను చూస్తుంది. తరువాత స్మృతి భారతీయ సాహిత్యాన్ని చూస్తుంది. తరువాత హృదయం ప్రకృతిలో మానవ సంబంధాలను చూస్తుంది.ఆ తరువాత చైతన్యం సహజీవనాన్ని చూస్తుంది. అటు తరువాత ఆత్మ జీవితం-మరణాన్ని చూస్తుంది.

ఆపైన అంతరంగ నాదాన్ని వింటుంది. చివరికి నిశ్శబ్దం బోధిస్తుంది. ఆ చివరాఖరికి మనిషి తన స్థానాన్ని విశ్వంలో గుర్తిస్తాడు.

శబ్దం నుంచి నిశ్శబ్దానికి – కవిత యొక్క అంతర్గత సంగీతం : ఈ ఖండికలో జలపాతాల శబ్దం ఉంది. గంగానాదం ఉంది. పక్షుల ధ్వని ఉంది. మేఘాల గర్జన ఉంది. గుహల ప్రతిధ్వని ఉంది. 'నాదావిష్కృతవేదన' నుంచి 'మనోజ్ఞనాదవీచిక' వరకు శబ్దం కవితను నడిపిస్తుంది. కానీ చివరికి కవి చెబుతారు కదా – "ఈ నిశ్శబ్దంబొక కోటిశబ్దములకేని న్మించి బోధించెడిన్." ఇది కవిత యొక్క అంతర్గత శిల్పానికి కీలకం. ప్రారంభంలో బయట ప్రపంచం మాట్లాడుతుంది; మధ్యలో ప్రకృతి మాట్లాడుతుంది; తరువాత పర్వతం మాట్లాడుతుంది; చివరికి నిశ్శబ్దమే మాట్లాడుతుంది. అందువల్ల 'అదిగో శీతాద్రి'ని ఒక శ్రవణాత్మక కవితగానూ చదవవచ్చు– దాని పరమసంగీతం శబ్దంలో కాదు, శబ్దాన్ని దాటి వచ్చే నిశ్శబ్దంలో ఉంది.

పురాణం: అలంకారం కాదు, సాంస్కృతిక స్మృతి : శకుంతల, గౌరీశాననంపృక్తి, స్వారోచిషసంభవం, విశ్వామిత్రుడు, కుంతీ, రామాయణం, మహాభారతం, మైనాకుడు, మారుతి వంటి సూచనలు కవితలో విస్తారంగా ఉన్నాయి. ఇవి కేవలం పాండిత్య ప్రదర్శనగా పరిగణిస్తే కవితలోని అసలు ప్రయోజనం కనిపించదు. కవి దృష్టిలో పురాణం ప్రకృతి జ్ఞాపకం. శిల ఒక కథను గుర్తుచేస్తుంది; జలధార ఒక పురాణాన్ని మేల్కొలుపుతుంది; మేఘం ఒక దూతగా మారుతుంది; పర్వతం ఒక పాత్రగా నిలుస్తుంది. అందువల్ల ఈ కవితలో పురాణం గతానికి చెందిన మృతస్మృతి కాదు; వర్తమాన దృశ్యాన్ని అర్థవంతం చేసే సాంస్కృతిక భాష.


ప్రకృతి దర్శనంలో ఆధునికత : ఈ కవిత సాంప్రదాయ పద్యభాషలో రాయబడినా, దాని అంతరార్థాల్లో కొన్ని ఆధునిక చైతన్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా 'సహజీవనాభ్యుదయం', 'స్థావరజంగమాత్మక విశాల జగత్', మానవ అహంకారంపై ప్రశ్న, నగరజీవితపు 'పంజరం', ప్రకృతిని జీవవ్యవస్థగా చూడడం వంటి భావాలు ఆధునిక 'పర్యావరణ–మానవతా' దృక్పథాలతో సంభాషించగలవు. అయితే ఈ ఆధునికత సంప్రదాయాన్ని తిరస్కరించడం ద్వారా రాలేదు. విరుద్ధంగా, పురాణం, వేదం, ఇతిహాసం, బౌద్ధం, ప్రకృతి, ఆధునిక సామాజిక చైతన్యం– ఇవన్నీ ఒకే అనుభూతిలో కలిసినప్పుడు ఏర్పడిందన్నది గమనీయాంశం. ఇదే ఈ కవితకు ప్రత్యేకమైన సాంస్కృతిక స్వభావం.

'అదిగో' అనే శీర్షికలోనే దాగిన కవితా రహస్యం : చివరికి శీర్షికను మళ్లీ చదివితే దాని అర్థం మరింత విస్తరిస్తుంది. 'అదిగో శీతాద్రి' అంటే మొదట– అదిగో, ఆ పర్వతం!

కవిత చదివిన తరువాత అది–అదిగో గంగ, అదిగో భారతీయ స్మృతి, అదిగో పురాణం, అదిగో ప్రకృతి, అదిగో సహజీవనం, అదిగో విశ్వం, అదిగో నిశ్శబ్దం, అదిగో నా అంతరంగంగా మారుతుంది. అందువల్ల శీర్షికలోని 'శీతాద్రి' ఒక భౌగోళిక నామం నుంచి ఒక మహత్తరమైన అంతర ప్రతీకంగా పరిణమిస్తుంది.

మాకినీడి సూర్య భాస్కర్
ఫోన్ : 949 150 4045

కమ్మతెమ్మెర



మాన్యులు అశ్వినీ కుమార్ గారికి నమస్కారం.
సెప్టెంబరు **మిసిమి** సంచిక నిజ ప్రతి ఈ నెలలోనే ఉత్సాహంతో అందుకొని,ప్రొఫెసర్ GR కృష్ణ గోగినేని గారి ప్రజ్ఞాపాటవాలను తెలిపే అద్భుత వ్యాసం చదివి ఉబ్బితబ్బిబయిపోయాను. మహానుభావులయిన వారికి నతమస్తక వందనం. ఈ వ్యాసం నాకు ఒక కనువిప్పు. వచనరూప ఈ రచనలో ఎన్నో పద్యపోకడలు, నడకలు నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి.
అభినందనలు.

- రా సత్యనారాయణ, ముంబాయి

రవీంద్ర మానస పుత్రిక - మిసిమి మాస పత్రిక

– తంగెడ కిషన్‌రావు

శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ జననం 4 నవంబర్ 1922, సాంస్కృతిక సంప్రదాయాలకు తావైన తెనాలి వట్టణ నవీవంలోని గోవాడ గ్రామంలో. అలా 2 దశాబ్దాల కాలం తర్వాత అమోఘమైన వ్యాపార దక్షతను సంతరించుకున్నా – కేవలం డబ్బును మాత్రమే ప్రేమించలేదు – రవీంద్ర. అతి సామాన్యులను సైతం, అజ్ఞాతంగా ఆర్థికపరంగా ఆదుకున్న దయాహృదయుడు అతడు. హుందాతనం, రాజసం ఉట్టిపడే రూపంతో, చూపరులను ఇట్టే సమ్మోహితం చేసే గంభీర స్వభావంతో– తెలుగు పత్రికల సంస్థాపనకు తొలినాళ్ల చిరునామాగా నుప్రసిద్ధుడై ఎంతో కీర్తిని గడించినాడు.

1946లో తెనాలిలో **జ్యోతి ప్రెస్**ను ప్రారంభించి – **'జ్యోతి, రేరాణి, సినిమా'** అనే 3 పత్రికలకు జన్మనిచ్చాడు. పత్రికల స్థాపన వెనుక ఈయనకు తొలి దొలుత స్ఫూర్తిని అందించి, ఆదర్శంగా నిల్చిన వ్యక్తి – ఈయన పినతండ్రి ఆలపాటి సూర్యనారాయణ అనే విషయం చాలా మందికి తెలియదు. ఈ సూర్య నారాయణ మద్రాసు వేదికగా **వివారి** అనే వత్రికను ప్రారంభించాడు. స్వయం నిర్ణాయక శక్తి, అభ్యుదయ పోకడల ప్రభావం సూర్య నారాయణలో మెండుగా ఉండేవి. ఆ లక్షణాలను వారసత్వంగా రవీంద్రనాథ్ పుణికి పుచ్చుకున్నాడని మనం భావించవచ్చు.



వెనుక వైట్‌హౌస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి రాజధాని హైద్రాబాద్‌కు మారడంతో, రవీంద్రనాథ్ కూడా తన మకాంను 1957వ సంవత్సరంలో తెనాలి నుండి హైద్రాబాద్‌కు మార్చి వేసి, ఇక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. తన అనుభవాలకు, స్మృతులకు, ఆలోచనలకు ఆయుధంగా 1990లో **మిసిమి**ని పక్ష పత్రికగా ప్రారంభించి, అదే సంవత్సరం మాస పత్రికగా తీర్చిదిద్ది తన పూర్తి కాలాన్ని పత్రికకే వినియోగించాడు. **మిసిమి**ని ఒక ప్రామాణిక పత్రికగా నెలకొల్పేందుకు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను అధ్యయనం చేయడం ఆయనకు దినచర్యగా మారిపోయింది. ఫోనులో ఎందరో వ్యక్తులను వివిధ అంశాలపై నిర్విరామంగా సంప్రదించి, **మిసిమి**ని బాగా పెంపు చేసే కార్యక్రమం చేపట్టినాడు. ఆ చర్యల వల్ల పాఠకులకు **మిసిమి** కొత్త పోకడలను చూపించింది. ఆ విధంగా – **మిసిమి**కి ఒక వ్యక్తిత్వాన్ని కల్పించాడు. రానురాను విజ్ఞుల దృష్టి పడింది. లైబ్రరీలు **మిసిమి**ని తెప్పించడం మొదలు పెట్టినాయి. ఆ నందర్భంలోనే – 1993లో 'హిందూ' పత్రిక **మిసిమి**ని విశిష్ట పత్రికగా ప్రశంసించింది. 1992లో **ఆంధ్రభూమి** దిన పత్రిక, 1995లో **మహా నగర్** దిన పత్రిక **మిసిమి**ని కొనియాడుతూ నంపాదకీయాలు రాశాయి. అలా.... తన స్వయంకృషితో, శ్రమశక్తితో అచిరకాలంలోనే మంచి పేరు గడించిన రవీంద్ర – సత్పురుషుడు, సంస్కారవంతుడు, ప్రియతముడు, ప్రియ బాంధవుడుగా అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేశాడు. ప్రభుత్వంలో ఉన్నత స్థానాన్ని అధిరోహించిన అధికారులు, సమాజంలో సుప్రసిద్ధులు, విజ్ఞాన సమూపార్జనలో తలమునకలయ్యే మేధావులు – రవీంద్ర పరిచయాన్ని అమూల్యంగా భావించేవారు. సామాన్యులకు సైతం తన స్నేహ హస్తాన్ని అందించి, సహృదయతను పాటించే విశాల హృదయం రవీంద్ర

స్వంతం, అనే పేరును కూడా సంతరించుకున్నాడు–పరిమళిస్తున్న రవీంద్ర స్మృతులను అక్షరాలలో పేర్చలేను అని, డా. సి.నారాయణరెడ్డి భావిస్తే–ఆయన స్నేహం అమృత పానం అని, డా. బూదరాజు రాధాకృష్ణ అభిప్రాయపడినాడు. 'తొలి నాళ్లలో నేను బతకడానికీ, ఎదగడానికీ దోహద పడిన దయామూర్తి' అంటూ, రావూరి భరద్వాజ రవీంద్రను ఆరాధించినాడు.

'కాంతులు విరజిమ్మే విలువగల మణులు, చీకట్లను చిమ్మే సముద్ర గర్భంలో దాగున్నాయి. సౌందర్యానికీ, సౌరభానికీ ఆలవాలమైన ఎన్నో పూలు దట్టమైన అడవిలో ఫలితం లేకుండా రాలి పోతున్నాయి' అంటూ, సాగే 'థామస్ గ్రే' కవిత్వానికి అర్థాన్ని కల్పిస్తూ–అజ్ఞాతంలో దాగి ఉన్న ఎందరో ప్రతిభామూర్తులను పసిగట్టి, వెతుక్కుంటూ వెళ్లి **మసిమి** ద్వారా వారిని వెలుగులోనికి తీసుకు వచ్చేందుకు తపించిన విజ్ఞాన మూర్తి–రవీంద్ర.

'సాహితీ, సాంస్కృతిక రంగాలలో ఎక్కడ ఏ మూల చిన్న మెరుపు మెరిసినా, ఆ మెరుపును భూమార్గం పట్టించి, తెలుగువారికి అందించటమే ఆతని ఏకైక తపన' అని, రవీంద్ర నాథ్ గురించి పల్కిన ఏటుకూరి బలరామ మూర్తిగారి అక్షరాలు **మసిమి** పత్రిక స్థాపనకు సంపూర్ణంగా వర్తిస్తాయి. 'ఆయన–పాదు కట్టి పెంచిన మొలక కాదు–భూమిని పెకల్చుకొని ఉద్భవించిన ఒక వటవృక్షం. డిగ్రీలు లేని పాండిత్యం ఆయనది – ఐనా, పాండిత్యానికి సాంఘిక ప్రయోజనాన్ని సమకూర్చిన సమతామూర్తి' అంటూ... రవీంద్ర నాథ్ స్వశక్తి చేతలను దృష్టిలో పెట్టుకొని, జస్టిస్ పి.ఏ. చౌదరి కితాబును అందించారు.

'ఆయన నేస్తాలు పుస్తకాలు. ఆయన తీరని దాహం జ్ఞాన సమూపార్జన. ఆలోచనా పరుల మేధస్సుకు పదునుపెట్టే ఏ శాస్త్ర గ్రంథాన్నీ వదిలిపెట్టక, ఏకాగ్రతతో అధ్యయనం చేసి, ఆ గ్రంథాల సారాంశాన్ని స్నేహితులతో చర్చించడమే ఆయనకు సంతృప్తి' అంటూ, తన మిత్రుల చేత కొనియాడబడిన వ్యక్తి–రవీంద్ర. 'భావాన్ని ప్రేరేపించే ఏ చిన్న వాక్యం దొరికినా నిలువెల్లా పరవశించి, అతీతమైన ఆనందానుభూతిని పొందడం ఆతని నైజగుణం' అని, డా. సినారె తెలియజేసిన అంశం, రవీంద్రనాథ్ పఠనాసక్తికీ, జ్ఞానతృష్ణకూ దర్పణం పడుతుంది.

ఆలోచనాపరులైన పాఠకులకు, జిజ్ఞాసువులకు, పరిశోధకులకు, మేధావులకు **మసిమి** ద్వారా మేలు జరగడం వల్ల–రవీంద్ర బాధ్యత మరింత పెరిగింది. అసలు **మసిమి** అనే పేరును సూచించిన వ్యక్తి ఎవరు? అనే ప్రశ్న వచ్చినప్పుడు–డా. బూదరాజు రాధాకృష్ణ గారు అనే చెప్పాల్సి వస్తుంది. **మసిమి** అనే 3 అక్షరాల పదాన్ని కుడి ఎడమల నుండి ఎటు చదివినా ఒకే విధంగా ఉంటుంది. అది కూడా ఆ పేరులోని ప్రత్యేకతే! **మసిమి** అంటే? 'కాంతి', 'నవనీతం' అనే రెండు అర్థాలున్నాయి. **మసిమి** అనే పదం మన ప్రబంధాల్లో ఇలా పేర్కొనబడింది–**మసిమి** పరసీమ వలరాజు మేనమామ అని, అల్లసాని పెద్దన (క్రీ.శ. 1550) మను చరిత్రలో 'కాంతి' కి మారు రూపంగా కన్పిస్తుంది. **మసిమి** మేతల వాని / మెరుగు చామన చాయ మేని వాని అని, నవనీతానికి (వెన్న) అర్థంగా తెనాలి రామకృష్ణ కవి (క్రీ.శ. 1600), పాండురంగ మహాత్మ్యంలో దర్శనమిస్తుంది – ఈ విధంగా **మసిమి** పేరు రవీంద్రనాథ్ సంపాదకత్వంలో సార్థకమైంది.

'నీవు' నీవుగా బ్రతుకు. అలా జీవించడంలోనే నీ 'అసలుతనం' ఉన్నది, అనే భావాన్ని ఆచరించిన వ్యక్తి – రవీంద్ర. పత్రికా సంపాదకత్వం, ముద్రణాలయ సంస్థాపక నిర్వహణ–అతని వృత్తి. మౌలిక జిజ్ఞాస, నిరంతర పఠనం–అతని ప్రవృత్తి. **మసిమి**ని అర్థవంతంగా, సర్వాంగ సుందరంగా నిర్వహించాడు.

ఏ మాస పత్రికా పాటించని వినూత్న ప్రమాణాలతో నడిపించాడు. విజ్ఞాన సాగర మధనంలో నిరంతరం నిమగ్నమవుతూ పత్రికకు వన్నె తెచ్చాడు. తాపీ ధర్మారావు, త్రిపురనేని రామస్వామి వంటి రచయితల గ్రంథాల పఠనం, తన తాతగారైన దేవయ్య ఆదర్శ భావజాలం రవీంద్రపై ప్రభావాన్ని చూపించాయి. భారతీయ చరిత్ర, సంస్కృతి, తత్వం, బౌద్ధాన్ని శాస్త్రీయ దృక్పథంతో చూడాలని ఎం.ఎన్. రాయ్ చెప్పిన విషయాలను రవీంద్రనాథ్ పాటించాడు. ఇలా–**మసిమి** పత్రికతో సమాజం నిండా కొత్త గాలి వీచింది. కొత్త రచయితలకు అవకాశం వచ్చింది. నూతన మార్గాలకు దోహదం చేసింది. అజ్ఞాత రచయితలకు ఊపిరి పోసింది. ముఖాలతో నిమిత్తం లేకుండా, రచనల్లో 'పస' చూసి ప్రచురించే సంప్రదాయానికి తెరలేచింది.

మసిమిలో వ్యాసాల కోసం–రవీంద్రనాథ్ మనసు పెట్టి, అదే తన జీవిత లక్ష్యంగా పని చేశాడు. అందుకు తగిన గుర్తింపు కూడా సమకాలీనుల నుండి వచ్చింది.

పురాణం సుబ్రహ్మణ్యశర్మ చేత గురజాడ మధురవాణిని విలేకరిగా చేసి 'ఊహాజనిత ఇంటర్వ్యూ'లను రాయించాడు. అవి **మిసిమి**కి ఒక ప్రత్యేకతను ఆపాదించి పెట్టినాయి. సైకాలజీపై రవీంద్రనాథ్‌కు మొదటి నుండీ ఒక ప్రత్యేక దృష్టి ఉండేది. అందులో భాగంగానే సి.నరసింహారావు 'వ్యక్తిత్వ వికాసం' నుండి కొన్ని భాగాలు ప్రచురించాడు. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే.

వాదోపవాదాలను **మిసిమి** ప్రోత్సహించలేదు. కళలు, సాహిత్యంపై విస్తృతమైన వ్యాసాలను రవీంద్రనాథ్ అడిగి రాయించినవే. బరువైన విషయాన్ని తేలికగా చదివించాలనేది రవీంద్రనాథ్ ఉద్దేశం. ముఖచిత్రం, మిగిలిన అట్టలపై చిత్రాల ఎంపికకు కాలాన్ని బాగా వినియోగించి, ప్రత్యేకమైన దృష్టిని ప్రసరింపజేశాడు. కళాత్మకమైన చిత్రాలంటే రవీంద్రనాథ్‌కు ప్రత్యేకమైన అభిమానం. **మిసిమి** వ్యాసాలతో ఈ చిత్రాలు పోటీ పడేవి. వ్యాపార ప్రకటనలకు తలవంచక, అందమైన చిత్రాలకు ప్రాధాన్యత నీయడం ఒక అసాధారణమైన విషయం – రాజా రవివర్మ, దామెర్ల రామారావు, సంజీవ దేవ్, అడవి బాపిరాజు, కొండపల్లి శేషగిరిరావు, ఏలే లక్ష్మణ్ వంటి వారి చిత్రాలతో పాటు, పికాసో వంటి పాశ్చాత్య చిత్రకారుల చిత్రాలు కూడా **మిసిమి**ని అలంకరించేవి.

ఇలా... పట్టుదల, నిరంతర పఠనం, మేధావుల సాంగత్యంలో తన సమయాన్నంతా వెచ్చించి, పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టించి, ఉన్నత శిఖరాలను అధిష్ఠించాడు – రవీంద్రనాథ్. తద్వారా సమాజానికి నూతన వెలుగులను ప్రసరింపచేశాడు. సాంఘిక విప్లవానికి స్వాగతం పలికాడు. తన కృషి, కొత్త ఆలోచనలతో వర్తమాన, భావితరాలకు స్ఫూర్తిని అందించాడు. ఇప్పుడున్న సగటు పత్రికలు ఆయన ఆలోచనా చట్రంలో ఇమడ లేదు. ఏదో చేయాలనే తపన. ఆ పరిణామమే **మిసిమి** ప్రచురణ. **మిసిమి** ఆయన అధ్యయన శీలానికి మేతను అందించింది. సంపాదకునిగా ప్రచురణ కర్తగా సంతృప్తిని ఇచ్చింది. సాహిత్యం, లలిత కళలు, చరిత్ర, తత్త్వశాస్త్రం, మనోవిజ్ఞానం వంటి విభిన్న రంగాలలో లోతైన అధ్యయనం ఆయనది. తాను గ్రహించిన వాటిలో ఉత్తమమైన అంశాన్ని పదుగురి దృష్టికి తేవాలనే తపన ఆయన్ని పత్రికా సంపాదకునిగా నిలబెట్టింది.

మిసిమిలో తమ రచనలు ప్రచురితం కావడం గౌరవ ప్రదమైన విషయంగా రచయితలు భావించారు. అన్ని పత్రికల్లాగా కవిత్వం, కథలు ప్రచురించకుండా చేయి తిరిగిన రచయితలతో **మిసిమి**లో రచనలు చేయించాడు. సంజీవ దేవ్‌తో ఒక మిత్రుడు 'ఇప్పుడు మీరేం చేస్తున్నారు?' అని అడిగితే '**మిసిమి**కి రచనలు చేస్తున్నాను' అని జవాబు ఇచ్చాడట. అంటే, **మిసిమి**కి రచనలు చేయడం అనేది ఒక 'స్టేటస్ సింబల్'గా ప్రముఖ రచయితలు సైతం భావిస్తారనే విషయాన్ని మనం గ్రహించాలి.

ఇక చివరగా... రవీంద్రనాథ్ 'నిజ జీవిత కుమార్తె' ఐన **శ్రీమతి నన్నపనేని దుర్గ** – తన తండ్రి గారి 'మానస పుత్రిక' ఐన **మిసిమి** గురించి పల్కిన– విలువైన, ఎంతో అంతరార్థం దాగి ఉన్న రెండు మాటలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

*'**మిసిమి** పత్రిక నాన్న గారికి గొప్ప సాంత్వన కల్గించింది. విద్యావంతులు, మేధావులనుండి ఆ పత్రిక గురించి వచ్చిన గుర్తింపు ఆయనకు సంతృప్తిని పంచింది. జీవితం చివరి దశలో **మిసిమి** ఆయనకు సర్వస్వం అయింది'.*

ప్రా. తంగెడ కిషన్‌రావు
పూర్వ వైస్‌ఛాన్స్‌లర్, తెలుగు విశ్వ విద్యాలయం,
హైదరాబాదు, ఫోన్: 7702 414 100

కమ్మతెమ్మెర

Good Morning Aswini Garu Just perused Latest soft copy of MISIMI. There some wonderful articles. Please try to send printed copy to All Vice Chancellors in both Telugu States and AP state council of Higher Education and Telangana also.

Your interview with Prof G R Krishna and article by V S Prasad may make them to think what ails universities and how to improve higher education.

There are many private universities now in both Telugu States.

- Devineni Madhusudhana Rao, Tenneru





నయాగర జలపాతం వద్ద

పసిమి కాంతుల మిసిమి
ఆలపాటి రవీంద్రనాథ్

– చెన్నూరి శివరామకృష్ణ ప్రసాద్

మిసిమితో నా తొలి పరిచయం మా బావగారు ఆచార్య రావినూతల వారు 8 సంవత్సరముల పాటు విరామం లేకుండా **మిసిమి** పత్రికకు వ్యాసాలు వ్రాసారు. నేను పలుసార్లు వారితో **మిసిమి** కార్యాలయం వెళ్లడం తటస్థించింది. ఆచార్య రావినూతల వారి వ్యాసాల వల్ల **మిసిమి**లోని ఇతర వ్యాసాలను చదవడం జరిగింది. ఈ పత్రిక మిగతా పత్రికలకు భిన్నంగా వుంది అన్నది నాకు కలిగిన తొలి అభిప్రాయం. ఎటువంటి వాణిజ్య ప్రకటనలు లేకుండా, సాహిత్యం మరియు కళలు, సంస్కృతి, విజ్ఞానానికి సంబంధించిన విషయాల పైన మంచి వ్యాసాలను పాఠకులకు అందించడం సులభతరమైన విషయం కానే కాదు. ఇప్పటికీ **మిసిమి** అదే తీరులో నడుస్తున్నది.

ఆచార్య రావినూతల వారు నన్ను మర్చెంట్ నేవీలో నా అనుభవాలను వ్యాసాలుగా వ్రాయమని ప్రోత్సహించే వారు. **మిసిమి** సంపాదకులు అశ్వినికుమార్ గారు కూడా వత్తాసు పలికేవారు. వారి మాటలను అనుసరించి నేను వ్రాసిన మొదటి వ్యాసం నవంబర్ 2021 సంచికలో ప్రచురితమయ్యింది. కాకతాళీయంగా అది రవీంద్రనాథ్ గారి శతజయంతి ప్రత్యేక సంచిక. అదే సంచికలో చతుర్ముఖ జ్యోతి అన్న పేరుతో ఆచార్య రావినూతల వారు రవీంద్రనాథ్ గారిపై వ్రాసిన వ్యాసం కూడా ప్రచురింపబడింది. ఆ వ్యాసం చదివిన తరువాత రవీంద్రనాథ్ గారు **మిసిమి** వ్యవస్థాపకులని అర్థం అయింది.

అశ్వినికుమార్ గారు ఈ సంవత్సరపు రవీంద్రనాథ్ గారి జన్మదిన సంచికకు వారిపై ఒక వ్యాసం వ్రాయమని అడిగారు. **మిసిమి** వ్యవస్థాపకులుగానే నాకు రవీంద్రనాథ్ గారు తెలుసు. అంతకు మించి వారి గురించిన ఏ వివరాలు తెలియవు. ఆయనతో పరిచయమున్నవారు, ఆయనకు సన్నిహితులు, సాహితీ జగత్తు, సినీరంగం, పరిపాలనా రంగం, మరెన్నో ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు వారి గురించి చాలా విషయాలు మిసిమి పాఠకులకు తెలియచెప్పారు. రవీంద్రనాథ్ గారిని దగ్గర నుండి చూసినవారు వారి గురించి ఎన్నో విషయాలు తెలియచెప్పిన తరువాత ఇంక కొత్తగా నేను చెప్పేది ఏముంటుంది అని నా సంకోచం. చాలామంది ప్రముఖుల అభిప్రాయాలు చదివిన తరువాత నేను కూడా వారిని గురించి రెండు మాటలు వ్రాయగలిగితే బాగుంటుంది అనిపించింది. అందుకే ఈ ప్రయత్నం.

రవీంద్రనాథ్ గారి ఔపచారిక విద్య చిన్నతనంలోనే ముగిసిందని తెలుసుకొని ఆశ్చర్యానికి లోనయ్యాను. ఈ పరిణామానికి కారణాలు ఏవైనా కానీ ఇది ప్రతి సగటు మనిషికి మింగుడు పడని విషయం. రవీంద్రనాథ్ గారిలో ప్రతిభ లేకో, స్తోమత లేకో ఈ పరిస్థితి తటస్థించలేదు. ఊపిరి సలపని కఠినమైన క్రమశిక్షణలో ఇమడలేకపోవడం వల్ల ఈ పర్యవసానం ఎదురయ్యిందని ఆయన సన్నిహితులు చెప్పారు. ఈ సంఘటన తరువాత రవీంద్రనాథ్ గారు ఆయన చుట్టూ వున్న ప్రపంచం, సమాజం విశ్వవిద్యాలయాలుగా జీవితాన్ని అధ్యయనం చేశారు. ఎవరో తీర్చిదిద్దిన విద్యావిధానం బయట వుండి తనకు నచ్చినట్లు విద్యను అభ్యసించారు. ఈ విషయంలో ఆయనను ప్రోత్సహించిన ఆయన తల్లితండ్రులను అభినందించాలి. ఇది ఒక మంచి పరిణామం అని పలువురు ప్రముఖులు వక్కాణించారు. అయ్యుండొచ్చు

కానీ, నాకు మాత్రం ఒక సందేహం వుంది. రవీంద్రనాథ్ గారు ఎవరైనా మంచి గురువు వద్ద విద్యను అభ్యసించి వుంటే మరిన్ని మహత్తర చర్యలు చేపట్టి ఉండేవారేమో? లేక వారి ఆలోచనా విధానం వేరేగా మారి వుండేదా?


20వ శతాబ్దపు 4వ మరియు 5వ దశకంలోని సామాజిక పరిస్థితులు, సాహిత్య పోకడలు సైద్ధాంతిక వాదనలు రవీంద్రనాథ్ గారి వ్యక్తిత్వాన్ని భ్రావితం చేసాయి అనుకోవచ్చు. పలురకాల వాదనలు, ఆలోచనా విధానాలను క్షుణ్ణంగా అర్ధం చేసుకొని తనదైన ఒక విశిష్ట వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్నారు అనిపిస్తుంది. వారిని దగ్గరగా చూసిన వారిలో అధికులు పఠనం పట్ల వారి ఆసక్తి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. వివిధఅంశాలకు సంబంధించిన పాశ్చాత్య పుస్తకాలను కూడా తెప్పించుకుని చదివేవారట. సిగ్మండ్ ఫ్రాయిడ్, ఫ్రాంజ్ మెస్మర్, హావ్‌లాక్ ఎల్లిస్‌లను తెలుగు పాఠకులకు పరిచయం చేసినది రవీంద్రనాథ్ గారేనని చెపుతారు. లైంగిక శాస్త్రాన్ని మొట్టమొదటగా వైజ్ఞానిక పద్ధతిలో తెలుగు పాఠకులకు అందించినది రవీంద్రనాథ్ గారేనని కూడా అంటారు. వీరు తాము నడిపిన జ్యోతి ద్వారా పలు క్రొత్త రచయితలను పాఠక లోకానికి పరిచయం చేశారు. నేను సంపాదకుడను కాను, పాఠకుడనే అని రవీంద్రనాథ్ గారు అనేవారట. బహుశా వారి ఈ లక్షణం క్రొత్త పంథా రచయితలను గుర్తించి, వారిచేత పాఠకులకు నచ్చేటట్లు వ్రాయించడానికి పనికి వచ్చిందేమో.

రవీంద్రనాథ్ గారు వయసు, హోదా వంటి తారతమ్యాలు చూడకుండా ఇతరులతో పరిచయాలు పెంచుకునేవారట. వారి పరిచయస్థుల కథనం ప్రకారం చాలా పరిచయాలు మంచి స్నేహంగా మారేవట. భరోగా గారు నా శ్రమ, ప్రతిభల వల్ల నాకు లభించిన అర్హతల కన్నా, రవీంద్రనాథ్ గారితో బాటు కొంతకాలం ఈ లోకంలో జీవించడం, వారి పరిచయం అనే యోగ్యతలు మిన్న అన్నారు. ఇది వారితో స్నేహానికి వారి స్నేహితులు ఇచ్చే విలువకు ఒక వుదాహరణ. అన్నపరెడ్డి వేంకటేశ్వరరెడ్డి గారితో జరిగిన సంభాషణలో ఆయన నేను నేనే అన్నారట. అందులోని తాత్వికత అర్థం చేసుకోవడం కొంచం కష్టమే. ఆ చిన్న వాక్యంలో వారి ఆలోచనలలో వున్న పరిపక్వత, తన జీవితం తాను అనుకున్నట్లుగా జీవించాను అన్న ఆత్మవిశ్వాసం కనపడతాయి. వారి వారసత్వం **మిసిమి** ద్వారా కొనసాగుతూనే వుంటుందని, వారు చిరస్మరణీయులుగా నిలిచిపోతారని ఆశిస్తున్నాను.

చెన్నూరి శివరామకృష్ణ ప్రసాద్
రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, మర్చెంట్ నావీ,
రచయిత, పరిశోధకులు, ఫోన్ : 991 225 5220

కమ్మతెమ్మెర


సార్ నమస్తే. ఇప్పుడే **మిసిమి** అందింది. రాగానే 'జీవన మకరందం' చదివాను. అందులో మాటలు చాలా బాగున్నాయి. 'మనం ప్రేమలో ఆశ్చర్యంలో జీవించాలి ప్రేమ కోసం మెప్పు కోసం కాదు' అన్న వాక్యం ఒక విలువైన జీవిత సత్యాన్ని చెబుతోంది. ప్రేమించడం ఆశ్చర్యపడడం-రెండింటినీ కూడా మనిషి మర్చిపోతున్నాడు. రాను రానూ జీవితం వ్యాపారం అయిపోతూంది. అచ్చమైన ప్రేమ కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. అలాగే, ఆశ్చర్యపడడం అన్నది ఎక్కడో గాని దొరకడం లేదు. ఆశ్చర్యపడడం అన్నది ఒక అమాయకమైన మనస్సుకి ప్రతీక. అమాయకమంటే మాయలు క్రమ్మని మనస్సు. చిన్న పిల్లల్లో ఆశ్చర్యపడే స్వభావం ఉంటుంది. మహాకవి శ్రీశ్రీ అన్నట్లు-'ఆకసమున హరివిల్లు విరిస్తే' తమ కోసమే అని ఆనందిస్తారు పిల్లలు. ఇన్ని రంగులు ఎలా వచ్చాయి - అని వాళ్ళు ఆశ్చర్యపోతారు. దానిని 'ద ఆర్ట్ ఆఫ్ వండర్' అని రజనీశ్ అన్నాడు. దానికి దూరమై, మనిషి జీవితానికి కూడా దూరం అవుతాడు. మీరు చెప్పిన ఆ వాక్యం ఎన్నో ఆలోచనలను తట్టి లేపుతోంది. ఒక చిన్న వాక్యంలో ఎంతో జీవిత సత్యాన్ని చెప్పారు. 'వసంతమంతా ఒక్క మొగ్గలో దాగి ఉంటుంది' అన్నమాట కూడా మనోహరమైన అభివ్యక్తి. అలాగే, అక్కడ వేసిన బొమ్మ కూడా చాలాబాగుంది. గొడుగు పట్టుకున్న అమ్మాయి, పైనుంచి కురుస్తున్న చినుకులు సంగీత ధారలాగా ఉండడం, ఆ గొడుగు కూడా హార్మోనియం మెట్లలాగా, పియానో మెట్లలాగా ఉండడం ఎంతో కవితాత్మకంగా ఉంది .చాలా బాగుంది సార్. మీకు మనసారా అభినందనలు



- ఆచార్య పి. ఆర్. హరినాథ్, *ఫోన్ : 948 044 3108*

సుబ్రహ్మణ్య భారతి

- యన్.లక్ష్మి అయ్యర్



సుబ్రహ్మణ్య భారతి

భారతదేశపు అతి ప్రాచీన భాషలలో భాష సంస్కృతి సభ్యత ప్రధానమైన తమిళ భాషలో ఆవిర్భవించిన ఒక మహనీయ ప్రకృతి ఆరాధకుడు, జాతీయ, సాంస్కృతిక కవి శ్రేష్ఠ శ్రీ సుబ్రహ్మణ్య భారతి గారు. ఆయన గేయాలు, పద్యాలు, గద్య కావ్యాలు, గద్య రచనలు కో కొల్లలు. ఆయన భారతదేశపు ప్రథమ మహిళావాది కవి గూడా. మాతృభాష తమిళంతో పాటు భారతదేశంలోని ఆరు భాషలలో ప్రావీణ్యం సంపాదించుకున్న భారతి గారు **సుందర తెలుగు** అని మన తెలుగును పొగడడం గమనార్హం. సుబ్రహ్మణ్య భారతి సమస్త గీతాల్లో పద్యాల్లో సనాతన భారతీయ సంస్కృతి, సభ్యత పుష్కలంగా గోచరిస్తుంది.

ఆ మహనీయకవి తమిళనాడుకు చెందిన తిరునల్వేలి జిల్లాలోని ఎట్టేపురం అనే చోట 11 డిసెంబరు 1882 జన్మించారు. పువ్వు పుట్టగానే పరిమళించును కదా అన్నట్లు బాల్యం నుండి ఆయన ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించిన ప్రకృతి యొక్క రమణీయ కవి. తన పదకొండవయేటనే కవిత్వానికి నిదర్శనంగా ఎట్టేపురం మహారాజు యొక్క దర్బారులో కావ్య ఛంద శాస్త్రపు తమిళ జ్ఞానాన్ని ప్రదర్శిస్తూ పండితులతో నిండిన సభలో చర్చించిన అద్భుత బాల కవి. రాజుగారు స్వయంగా ఆయన ప్రతిభను పరికించి ఆయనకు భారతి అంటే సరస్వతి అని బిరుదునిచ్చి సత్కరించారు. తన బాల్యంలోనే తల్లిని పోగొట్టుకున్న సుబ్రహ్మణ్య భారతి గారిని ఆయన పినతల్లి సవతి తల్లిగా కాక చాలా ప్రేమతో పెంచిందని, తనతో దయతో మెలిగేదని ఆయన స్వయంగా తన రచనలో చెప్పి ఉన్నారు. తల్లి మరణం తర్వాత కొన్ని సంవత్సరాలు తాతయ్య గారి దగ్గర (తల్లికి తండ్రి) తన బాల్యాన్ని ఇష్టపడి గడిపారు. ఆయన తాతగారు స్వయంగా వేదపారంగతుడైన తమిళము మరియు సంస్కృత పండితులు, కావున తాత గారి దగ్గర బాల్యాన్ని గడిపిన భారతికి కావ్యాల మీద ఇష్టం ఎక్కువగా పెరిగింది.

ఎట్టేపురములో యవ్వనంలోవున్న భారతికి ఉద్యోగం రాజ దర్బారులో దొరికినప్పటికీ ఇతరులని పొగడి కావ్యం రాయడం ఇష్టం లేక, స్వతంత్రంగా ఆలోచించి స్వతంత్రంగా కావ్యాలు రచించే భారతికి డబ్బు మీద మమకారం అసలే లేదు, అందుకే ఆయన తన 19ఏట తండ్రి మరణం తర్వాత రాజు కొలువును వీడి ఉత్తర భారతదేశంలోని బనారస్ అంటే కాశీకి వెళ్లి హిందీ సంస్కృతము, బెంగాలి మొదలగు భాషలలోని సాహిత్యం మీద మక్కువ పెంచుకొని చక్కగా మాట్లాడేవారు. అనిబిసెంట్ మాటలతో మరియు ఇంగ్లీష్ కవి జాన్ కీట్స్ శైలితో ఈయన చాలా ప్రభావితమయ్యారు. భారతి గారి రచనలలో ఆయన సమగ్ర గీతాలు, నవలలు, గద్య సాహిత్యాలు, పాటలు, చిన పాప పాటలు, ఆధ్యాత్మిక పాటలు, పలు గేయ కావ్యాలు, గీతాలు కనబడుతుంది. భారతి యొక్క భాష జన సాధారణమైన లోక భాష అయిన తమిళము. దక్షిణ భారతం యొక్క సంస్కారాలు, పద్ధతులతో అగ్రహారంలో పెరిగిన భారతికి తన చుట్టూ ఉన్న జనం చూపే సాంప్రదాయకమైన బ్రాహ్మణ అయ్యర్ యొక్క కట్టుబాట్లు సంప్రదాయాలు జాతి, మత, భేదాలు ఇవన్నీ నచ్చలేదు. ఆ కాలంలో బ్రాహ్మణులు మీసాలు

పెట్టుకునే పద్ధతి ఉండేది కాదు. వాటిని ఎదిరించి అగ్రహారాల్లోనే మీసాన్ని పెంచుకొని మొనగాడిలాగా తిరిగే విప్లవ కవి భారతిని చూసి తమిళ ప్రజలు మీసకారప్పులవన్ (మీసాల కవి) అని పిలిచేవారు. వారణాసికి వెళ్లిన తర్వాత జాతీయ భావనలతో నిండిన భారతి హృదయం మీసాలతో పాటు, తలపాగా పంజాబీల లాగా ధరించడం కూడా నేర్చుకుని పెద్ద బొట్టుతో తన వేషధారణలో ఒక ప్రత్యేకతను ఏర్పరచుకొని తనను ధార్మిక పద్ధతుల నుండి, లోకాచారాల నుండి వేరుగా చేసుకొని జాతీయ సమైక్యతకు తన మార్గాన్ని స్వతంత్రంగా ఎన్నుకున్నాడు భారతి.

బాల్య వివాహానికి గురి అయిన ఒక కవి. తన భార్య అయిన చిన్నమ్మాళ్ భుజం మీద చేయి వేసి అగ్రహారంలో పదిమంది ముందు నిర్భయంగా, ఠీవిగా మీసం మెలివేస్తూ తిరిగేవాడు. దీన్ని చూసి అందరూ ఇతను ఒక విచిత్ర పిచ్చి కవి అని అనుకునేవారు. భారతి యొక్క సాహిత్యము సనాతన భారతీయ సంస్కృతితో పాటు వేదాలు పురాణాలు ఉపనిషత్తులతో నిండి వుంటుంది. భగవద్గీతపై కూడా మొగ్గు చూపి కావ్య రచనలు చేశారు. పాశ్చత్య కవి షెల్లీ, వాల్ట్ విట్మెన్, బైరన్ మొదలగు వారి సాహిత్యం యొక్క ప్రభావము భారతిపై పుష్కలంగా నిండి కన్పిస్తుంది. ఇది కాక భారతి యొక్క ఆధ్యాత్మిక దృష్టిలో సనాతన భారతీయ ధార్మిక వేత్తలు, తాత్వికులు రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతి అరవింద్ ఘోష్, రమణ మహర్షి, రాజర్షి తిలక్ వారి ప్రభావం కూడా మెండుగా లభిస్తుంది. స్వామి వివేకానంద, అరవింద ఘోష్ నివేదిత రాజయోగి బాలగంగాధర్ తిలక్ యొక్క సిద్ధాంతాలతో ప్రభావింపబడి ఆయన తన గేయాల్లో ఆధ్యాత్మిక తత్వాలతో పాటు దేశభక్తిని నింపి తన కవి జీవితాన్ని సార్థకం చేసుకున్నారు.

అరవింద్ ఘోష్‌తో కలసి ఎన్నో విషయాలను భారతి చర్చించే వారని కూడా తెలుస్తుంది. ప్రకృతి యొక్క రమణీయ రూపాన్ని ఆరాధించే భారతి ఒక మంచి కృష్ణ భక్తుడు మరియు ఆదిపరాశక్తిని కొలిచే ఆధ్యాత్మికవాది కూడా. ఆయన కవితల్లో ఆదిశక్తి, కార్తికేయుడు (తమిళంలోమురుగన్) వినాయకుడు, కాళీమాత మొదలగు వారిపై స్తోత్రాలు పాటలు కన్పిస్తాయి. ఆయన గేయాలలో ఆదిశక్తి యొక్క మహిమను తెలుపుతూ అనేక గీతాలు ఉన్నాయి. అదేలాగా భారతి ద్వారా ప్రతిపాదింపబడిన శ్రీకృష్ణుడు విభిన్న రూపాలలో మనకు దర్శనమిస్తాడు ఆయన కన్నన్ పాట్టుగళ్ (కృష్ణ గీతాలు) అనే కావ్య సంపుటంలో కృష్ణుడిని తన తండ్రిగా తల్లిగా మహిమను తెలుపుతూ అనేక గీతాలు ఉన్నాయి. అదేలాగా భారతి ద్వారా ప్రతిపాదింపబడిన శ్రీకృష్ణుడు విభిన్న రూపాలలో మనకు దర్శనమిస్తాడు. ఆయన కృష్ణుడిని తన తండ్రిగా. తల్లిగా, గురువుగా ప్రేమికునిగా, ప్రేయసిగా, శిష్యునిగా, గురువుగా, మిత్రుడిగా, శిశువుగా పనిమనిషిగా కూడా చిత్రీకరించి ఆయనతో మాట్లాడినట్లు కవితలు రాశారు. భగవంతుడిగా చిత్రించి సమస్త విధాలుగా ఆయన సౌందర్యాన్ని, ఆయన మహిమను కొనియాడాడు. ఆయన పాటలు రాగబద్ధంగా రచించారు. వాటిని పాడితే మైమరచి వినాలనిపిస్తుంది.

ఆయన పాటల గురించి వ్యాఖ్యానిస్తూ ఆయన తదుపరి కవి ఇలా రాశారు "పాటంటే అంటే భారతినే, గేయ కవి అంటే భారతే. ఆయన ముందు ఎవరూ సాటిరారు. ఆయనకు ఆయనే సాటి. ఆయన పాట వింటుంటే లేగదూడ పాలు తాగడం ఆపి తిరిగి చూస్తుంది. కొండరాళ్ళు కరిగి మెత్తటి మధుర ఫలాలుగా దొర్లుతాయి. పాములు నాట్యం చేస్తాయి. ఇక నెమళ్లు, సరోవరంలోని పుష్పాలు అన్ని మైమరచిపోతాయి ఆ గాన మాధుర్యాన్ని సరోవరలోని పుష్పాలు అన్ని మైమరచి విని వికసిస్తాయి. సృష్టిలో గాన మాధుర్యాన్ని అక్షరాలలో అందింపజేసే వ్యక్తి భారతి మాత్రమే అని వ్యాఖ్యానించారు గోపాలకృష్ణ భారతి తదుపరి కవి (పాట్టుక్కోరు పులవన్ భారతియడా..గీతం)

భారతి కవితలతో బాటు భగవద్గీతను తమిళంలో అనువదించారు. ఇవిగాక ఆయన ఋగ్వేదపు కొన్ని అంశాలను పతంజలి యోగ సూత్రాలు మరియు కొన్ని వేదిక మంత్రాలను కూడా తమిళంలో అనువదించిన వ్యక్తి. పాంచాలి శపథం అనే ఖండకావ్యాన్ని ఆయన రచిస్తూ భారతదేశపు ప్రాచీన గౌరవాన్ని పొగిడారు. పాంచాలి శపథం అనే ఖండ కావ్యము భారతదేశపు సనాతన సంస్కృతికి ఒక గుర్తుగా మిగిలిపోతుంది. అందులోని ముఖ్య పాత్ర అయిన పాంచాలి భారతదేశపు స్త్రీగా కనబడి దేశమాతకు గుర్తుగా మిగిలిపోతుంది. అప్పుడు ఆంగ్లేయుల

పరిపాలనలో భారతదేశము, భారతదేశపు ప్రజలు ఎంతగానో హింసింపబడ్డారో వీటన్నిటినీ ఆయన భారతీయ నారీ యొక్క వేదనలో పురుష పూర్ణ అహంకారంతో కూడిన సమాజంలో సత్యానికై సమాజములో ఆక్రోశంగా ఒంటరిగా పోరాడే ఒక మహిళ పాత్రగా చిత్రీకరించారు. ఆ కావ్యంలో పాండవులు, భారత ప్రజలు, కౌరవులు, ఆంగ్లేయులు. భారతమాత ద్రౌపది. కృష్ణుడికి ఆమె చెరసాల నుండి విముక్తి చేయమని ప్రార్థిస్తూ అనేక శపథాలు చేస్తుంది. ఇది కాక పరాశక్తి, ఆదిశక్తి అయిన దుర్గాదేవిని, కార్తికేయుడైన సుబ్రహ్మణ్యస్వామిని, శ్రీకృష్ణుని గురించి ఎన్నో గేయాలను భారతి రాశారు. భారతి ఒక అద్వైత వాది. సమస్త ప్రపంచంలో నిండి ఉన్న చరాచర వస్తువులలో పశుపక్ష్యాదులలో ఆ భగవంతుని దర్శించిన మహనీయ ఆధ్యాత్మిక కవి సుబ్రహ్మణ్య భారతి. ఆయన కాకిని చూస్తూ రాసిన ఒక కవిత చాలా ప్రసిద్ధము. కవిత యొక్క రెండు పంక్తులు ఇక్కడ ఇవ్వబడుతున్నాయి

కాక్కై సిరిగినీలే నందలాలా

నిందన్ కరియ నిఱశీ తోన్ద్రుదయ్యా నందలాలా

(సినిమా వాళ్ళు భారతి కవితల ద్వారా చాల వరకు డబ్బు సంపాదించారనే చెప్పాలి)

హే నందలాలా (నందుని ముద్దుపాల బాలుడా !) కాకి యొక్క దగదగమెరిసే నలుపు రంగులో నీ నీలమేఘ శ్యామలాన్ని నేను దర్శించుచున్నాను. నీవు ప్రజలకు ఇచ్చే సుఖమైన హరిత జీవనాన్ని పంట చేనులలోని నీ హరిత లీలలను చూసి గుర్తించుకుంటున్నాను. నీ మురళీ గానము కరుణామృతమై మా అందరి జీవితాన్ని నడిపిస్తున్నది. అగ్ని కణికను నా వ్రేలితో స్పృశించి నీ వీరత్వాన్ని, ధీరత్వాన్ని అనుభవిస్తున్నాను.

భారతి ఒక మహా సందేశకుడు. అదికాక ఒక అహింసా వాది కూడా శత్రువును కూడా మన్నించగలిగే గుణం గల సుబ్రహ్మణ్య భారతి తన పాటలలో శత్రువుపై కూడా నీవు ప్రేమను వర్షించు, ఎందుకంటే అతని హృదయంలో కొలువున్నది ఆ పరమేశ్వరుడు. అదే పరమేశ్వరుడు మన హృదయంలో కూడా ఉన్నాడు అని చక్కగా చాటిచెప్పిన వ్యక్తి. ఇంతే కాదు ఆయన జాతివాదాన్ని గురించి ప్రస్తావిస్తూ కాకులు, పిచ్చుకలు అన్ని మా జాతికి చెందినవే అని ఎప్పుడూ చెప్పేవారు. ఈ ప్రపంచం అనే కుటుంబంలో కాకులు, పిచ్చుకలు అన్ని చరచరాలు మనతో పుట్టినవే. అందుకే మతాల పేరిట, కులాల పేరిట, భాషల పేరిట, ప్రదేశాల పేరిట దయచేసి ఇతరులను కించపరచవద్దు అని సౌమ్యంగా ధైర్యంగా వెల్లడించిన వ్యక్తి సుబ్రహ్మణ్య భారతి. జాతివాదము లేక ఇతర మతాల పట్ల విశ్వబంధుత్వము, నారీముక్తి ఇలాంటి విషయాలపై ఎన్నో కవితలు రాసిన మహాకవి సుబ్రహ్మణ్య భారతి అనడంలో కించిత్ కూడా సందేహం లేదు. ఆయన పాప్పా పాట్టుక్కళ్ (పాపాయి పాటలు)లో ఒక పాట అత్యంత ప్రసిద్ధం.(మన సి.నా రే గారి పిల్లలారా.. లాంటిది)

ఓడి విళైయాడుపాప్పా, నీ ఓయిందురుక్క లాగాదు పాప్పా
కూడి విళైయాడు పాప్పా ఒరు కుజ్ఞ్దయై వెయ్యాదే పాప్పా
కాలైయిల్ ఇజ్ఞ్ఞ్ఞవుడన్ పడిప్పు. పిన్బు కనివు కుడుక్కుం నల్ల పాట్టు
మాలై ముజ్ఞ్దుం విళైయాట్టు ఎన పజ్ఞక్క పడిత్తు కొళ్ళు పాప్పా

.....

జాదికళ్ ఇళైయడి పాప్పా, కుల తాజ్ఞ్ఞ్ సొల్లల్ మిగ పావం పాప్పా
నీది ఉయరంద మది కలవి అదై నినైవిల్ వైత్తువిడు పాప్పా

(ఓ పాపా ! పరిగెత్తి ఆటలాడు, నీవు విశ్రమించ కూడదు, అందరితో కలసి మెలసి ఆటలాడు. ఎవ్వరిని తిట్టకుండా తగాదా లేకుండా సంతోషంగా ఆటలాడు. తెల్లవారి లేచిన వెంటనే చదువుకో, తర్వాత కమ్మని చెవులకింపైన పాట పాడుకో, సాయంత్రమంతా ఆటలతో గడుపు, ఇదే నీ దిన చర్య అని గుర్తించుకో. జాతులు లేవు పాపా, కులం కించపరచి మాట్లాడడం పాపం అని తెలుసుకో, నీతులను భోదించేది విద్య మాత్రమే. అందుకై చక్కగా చదువుకో పాప. ఇందులో పాపాయికి చక్కగా ఆమె మీద ఏ అఘాయిత్యం జరుగ కూడదని 18వ శతాబ్దిలోనే చెప్పారు భారతి

పాతకం సేయ్బవరై కండు నీ భయం కొళ్ళలాకాతు పాప్పా
మోది మిదిత్తు విడు పాప్పా అవర్ ముగత్తిల్ ఉమిజ్ఞ్ఞు విడు పాప్పా

(పాతకాలు చేసేవారిని చూసి భయపడకు, వారిపై తిరగబడు ఎదురు తిరుగు కొట్లాడి గెలువు ,కిందవేసి

తొక్కి వారి ముఖాన ఉమ్మి వేసేయి (కాని ఇంతవరకు భారతదేశపు ఏ ప్రభుత్వపాఠశాలలో గూడా స్వీయ రక్షణ కళలు ఇంతవరకు 22వ శతాబ్ది వరకు నేర్పబడలేదు అంటే కవిగారి స్వప్నం ఇంకా నెరవేరలేదు)

సుబ్రహ్మణ్య భారతి యొక్క గేయాలలో అతి ప్రసిద్ధమైన ఒక గేయం సింధు నది ఇన్ మిస్ అన్న చరణం గల గేయంలో సమస్త భారతదేశపు విభిన్న రాష్ట్రాలను తనలో కలుపుకుంటూ చక్కగా భారత ఐకమత్యాన్ని కవి గారు ఇలా వెళ్లబుస్తున్నారు తన గేయంలో .

భారత దేసమేన్రు పేయర్ సొల్లువార్ మిడి
భయం క్కోల్లువార్ .....

భారతదేశమనే పేరు వింటేనే శత్రువులు గడ గడ వణుకుతూ
మనస్సులో భయాందోళనకు గురియై ఓడి పోతారు,
పెంపొదిద్దాం వాడ వాడలో సకల విద్యాలయాలను
ఇదేరా మా భారతం అని భుజాలెగురేస్తూ చాటి చెబుతాం
సింహళ ద్వీపానికి ఓ వంతెన కట్టేద్దాం
సముద్రాన్ని పైకి లేపి వీధులుగా తీర్చి దిద్దుతాం (ఈ రోజు మనకు sea రోడ్స్, seaways వున్నాయి)
బెంగాల్ నుండి ప్రవహిస్తున్న జలధారలన్నింటిని ఏకం చేసి
మధ్య భారతంలో పంటలు పండిద్దాం
త్రవ్వకాల మిషినుల సహాయంతో బంగారంతో బాటు
సకల లోహ సంపదలను భూమి నుండి వెలికి తీద్దాం
అష్ట దిక్కులలో వాటిని పంపి వాణిజ్యం చేసి
సంపదను ద్విగుణీకృతం చేసి కోరిన వస్తువులన్నీ తీసుకొద్దాం
దక్షిణ సముద్రాలలో ముత్యాలను వెలితీసి
వాణిజ్యంలో ఆరితేరి, విదేశీ వ్యాపారుల గుంపు
మన దేశాన్ని ఈగల్లా ముసురుకో నీల దేశాన్ని ముందుకు నడిపిద్దాం
సరుకులు తాముగా తెచ్చిచ్చి విదేశీయులు మన కృపా కటాక్షానికై
గుంపుగా వేచివుండెడురు ఆ భావి భారతంలో
ఆకలితో అలమటిస్తున్న వారికి సకల ఆహార పదార్థాలిద్దాం
పత్తిని పండించి కొండంత బట్టలనిద్దాం మన పేద ప్రజానీకానికి
పెద్ద పెద్ద నిధులను తెచ్చి, మన కాశీలోని వ్యాపారులకిద్దాం
నిధులను పెంచి భారతాన్ని సమృద్ధ దేశంగా వికసింప చేద్దాం
నిండు పూర్ణిమ వెన్నెల కాంతిలో సింధు నదిపై పెద్ద నౌకలో
అందమైన కేరళ యువతులతో మధురాతి మధుర తెలుగు
భాషలో పాటలు పాడుకుంటూ నౌక విహారము చేద్దాం.
జాతులు రెండే (ఆడ మగ)యని తమిళుల అమృత సూక్తిని పాటిద్దాం
ఇతరుల కుపయోగ పడేదే నీతులలో మొదటిదని,
నిజాయితీ గలవాడే అందరిలో మిన్న అని చాటి చెబుదాం
గంగా నది ఒడ్డున పండించే గోధుమలను తీసుకొని బదులుకు
కావేరి ఒడ్డున పండించే తమలపాకుల నిద్దాం.
మరాఠీ కవిసింహాల కవితలను
కేరళ గజ దంతాలతో సత్కరిస్తాము
కాశీ నగర విద్వాశీసుల వేదోక్తులను
కాంచిపురంలో కూర్చొని వినే ఓ పరికరాన్ని కనుగొందాం
వీరులైన రాజపుత్ర రత్నాలకు (రాజస్థాన్)
కర్ణాటకలోని మేలిమి బంగారంతో సత్కరిస్తాము
మంత్ర తంత్ర విద్యలను అభ్యసించి అనేక విద్యలలో
ఆరితేరి ముందుకు సాగుతాం
ఆకాశ యానం సముద్ర యానం చేసిసి సముద్రంలో
గల చేపలను లెక్కబెడదాం
చంద్రమండలాన్ని కనిపెట్టి అందులో షికారు చేద్దాం
వాడ వాడలో వేదశాస్త్రాలను మారుమోగేల చేద్దాం
కావ్యాలను సృష్టిద్దాం, ఆడావులను పెంచుతాం, కళలను నెలకోల్పుతాం
శత్రుకాలాన్ని అంతమొందించే ఆయుధాలు తయారు చేద్దాం
చిత్రాలు కలశీకారీలు నెలకోల్పుతాం, సూదులు వ్యాధులకై ఆవిష్కరిద్దాం
పరిశ్రమలు, విద్యాలయాలను నెలకోల్పుతాం
విశ్వంలో మెరుగైన దేశంగా భారతాన్ని వికసింప చేద్దాం.

ఇలా ఎన్నో కవితల కలలతో భారతి తన దేశభక్తిని వెల్లడించారు. ఈనాడు మన గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు భారతి ఆశించిన భారతాన్ని ఇస్తున్నారనడంలో సందేహం లేదు.

ప్రొఫెసర్ యన్.లక్ష్మి అయ్యర్
హిందీ విభాగం, రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ
ఫోన్ : 968 027 6038



– వేలూరి కృష్ణమూర్తి



మహాత్మాగాంధి

గాంధీజీ తన ఆత్మకథ ప్రారంభించి, తాను వ్రాస్తున్న ఆత్మ కథను వారే గుజరాతి భాషలో నడుపుతున్న 'నవజీవన్' పత్రికలో 1925 నుండి 1929 వరకు కంతులవారీగా ప్రకటించారు. ఇలా విడి విడిగా వచ్చిన వ్యాసాలను ఆంగ్ల భాషకు అనువదింపజేసి గాంధీగారే నడుపుతున్న మరొక ఆంగ్ల పత్రిక 'యంగ్ ఇండియా'లో అదే సమయంలో ప్రకటించేవారు. ఈ ఆత్మకథ ఎక్కువ భాగాన్ని ఆంగ్ల భాషకు అనువాదం చేసినది గాంధీజీగారి ఆప్త కార్యదర్శిగా వుండిన మహదేవ దేశాయి. కాని, కొన్ని భాగాలను మాత్రం గాంధీగారి మరొక అనుయాయి ప్యారేలాల్ నయ్యర్ అనువదించాడు. ఈ ఇద్దరి ఆంగ్లాను వాదాలను కలిపి పుస్తక రూపంలో మొట్టమొదటిసారి 1927లో ప్రకటించబడింది. మొత్తంలో, గాంధీగారి ఆత్మ చరిత్ర, కంతుల రూపంలోనూ, ఒకేమారు పుస్తక రూపంలో ప్రకటించబడి యిప్పటికి నూరేళ్ళు నిండనున్నాయి. ఆ సందర్భంగా ఈ చిన్న వ్యాసం.

గాంధీ తన ఆత్మకథ వ్రాయడానికి ప్రారంభించే సమయానికపుడే వారికి 56 ఏళ్ళు నిండాయి. వారు దక్షిణ ఆఫ్రికానుండి భారతదేశానికి వెనుదిరిగి అప్పటికే పదేళ్ళు గడిచాయి. గాంధీ నేతృత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలోని మొదటి ముఖ్య ఘట్టమైన 'సహాయ నిరాకరణ ఉద్యమం' ముగిసి దేశమంతటా ఒకరకమైన శాంత పరిస్థితి నెలకొన్నది. గాంధీగారి మనసులో దేశ స్వాతంత్ర్యపు తరువాతి పోరాట ఘట్టం దారి అస్పష్టంగా ఏర్పడసాగింది. సహాయ నిరాకరణ పోరాటం జరిగినది 1921లో. గాంధీజీ తన ఆత్మ కథను 1920 తరువాత కొనసాగించలేదు. దానికి కారణం, గాంధీజీ తన ఆత్మకథను స్వాతంత్ర్య సంగ్రామపు చరిత్రగా చేయదలచలేదు. అలా చేయడం వారికి యిష్టముండలేదేమో? 1920 అనంతరపు తన జీవితం గురించి తన ఆత్మ చరిత్రలో దేనినీ తాను దాఖలు చేయనందుకు తనదైన కారణం యిస్తారు.

గాంధీజీ తన ఆత్మకథను వ్రాయడానికి ప్రారంభించి కొద్ది పుటలు వ్రాసి ముగించే సమయానికి బొంబాయిలో దేశ స్వాతంత్ర్య సంబంధమైన అలజడులు ఏర్పడిన కారణంతో తాను వ్రాస్తున్నది ఆపి బొంబాయికి ప్రయాణిస్తారు. అసహకార పోరాటం సమయంలో బంధించబడిన గాంధీజి కారాగారంలో వుంటున్నపుడు వారి ఆప్తుడొకరు ఆత్మకథను వ్రాయడం కొనసాగించమని ఒత్తిడి చేశారు. కారాగారవాసం ప్రారంభమవడానికి మొదలే ఆత్మచరిత్ర వ్రాయడం ప్రారంభించి కొద్ది పుటలు వ్రాసి ముగించినది కూడ కొంతమంది స్నేహితుల ఒత్తిడివల్లనే. స్నేహితులు కోరినట్టు తన ఆత్మకథను రాయడం మరలా ప్రారంభించినపుడు కొందరి స్నేహితుల నుండి దానికి ఆక్షేపణ వచ్చింది. తన ఆత్మకథ ముందు మాటలో గాంధీగారే ఈ విషయం ప్రస్తావిస్తారు. గాంధీగారి ఒక స్నేహితుడికి ఈ విషయంలో సందేహం వుండినది. తను మౌనంలో వున్న ఒక రోజున అతడు తన సందేహం గంధీగారితో యిలా పంచుకొన్నాడు. 'ఈ సాహసం చేయడానికి మీకు ప్రేరణ ఏమిటి?' అని అతను అడిగాడు. 'ఆత్మకథ వ్రాయడం పాశ్చాత్యుల సంప్రదాయానికి చెందిన ఒక పద్ధతి. పాశ్చాత్య ప్రభావానికి లోనైనవారు తప్పా

ఇక్కడివారు ఎవరైనా తమ ఆత్మకథలు వ్రాసినది గురించి నేను వినలేదు. మీరు ఏం వ్రాయడానికి బయలురేరారు? ఈనాటి మీ ఆదర్శాలను రేపు మీరే మార్చుకోవచ్చు లేదా ఇపుడు మీరు పట్టిన ప్రణాళికలను ముందురోజులలో మీరే మార్చవచ్చు. అపుడు మీ మాటల ఆధారంమీద తమ నడవడిని రూపుద్దిద్దుకొన్నవారు తప్పుదారి పట్టే సాధ్యత వుంటుంది కదా? అందువల్ల ఇలాంటి ఆత్మకథ రాయకుండా వుండడమే మంచిది కదా?'

ఈ స్నేహితుడి మాటలు కొద్దివరకూ గాంధీగారిపై ప్రభావాన్ని చూపాయి. కాని, దాని తరువాత గాంధీజీ తన ఆత్మకథ గురించి తమ ఉద్దేశం యిలా స్పష్టం చేస్తారు: 'నిజమైన నా ఆత్మకథ వ్రాయడానికి నేను బయలుదేర లేదు. నేను 'సత్యం' గురించి చేసిన అనేక ప్రయోగాల కథను చెప్పడమే నా ఉద్దేశం. నా జీవితమంతా అలాంటి ప్రయోగాలే అయినందున, ఈ కథ ఆత్మకథ రూపం దాల్చినది సహజమే. కాని, నేను వ్రాసిన ప్రతి ఒక పుటకూడ 'సత్యం' గురించి నేను చేసిన ప్రయోగాల కథమాత్రమేనని చెప్పడంలో నాకెలాంటి అసమాధానం లేదు'.

ఇదొక సుధీర్ఘమైన ఆత్మకథ. మొత్తం 5 భాగాలున్న ఈ కృతి 63 అధ్యాయాలుగా విభజింప బడింది. మొదటి భాగం ఐదు దశాబ్దాల ఆత్మకథను ఆవరించుకొన్నది. ఈ ఐదు దశాబ్దాల కథ నాలుగు మజిలీలుగా మనం గమనించవచ్చు. గుజరాతులో గడిపిన బాల్యం-యవ్వనం (1869-1888) మొదటిది. ఇంగ్లండులో న్యాయశాస్త్రం అభ్యసించేటపుడు (1888-1891) గడిపిన కాలం రెండవ మజిలీ. ఈ రెండూ కలిపిన ఆత్మకథ మూడవది. ఇది మొదటి భాగం. గాంధీ దక్షిణ ఆఫ్రికాలో గడిపిన వృత్తి జీవితం మరియు అక్కడి పోరాట జీవనం (1893-1914) తరువాతది. ఇది రెండవ భాగంలో ప్రారంభమై మొత్తంగా మూడు, నాలుగవ భాగాలలో చిత్రింపబడింది. చివరిగా, గాంధీజీ భారతదేశానికి వెనుదిరిగిన అనంతరం, స్వాతంత్ర్య పోరాట కాలాన్ని (1915-1920) ఐదవ భాగంలో మనం గమనించవచ్చు.

ఈ భాగంలో గాంధీజీ భారతదేశానికి వెనుదిరిగిన మీదట తను ప్రారంభించిన 'చంపారణ్' సత్యాగ్రహం, గుజరాతులోని 'ఖేడ్' సత్యాగ్రహం మొదలైన వివరాలతో 1920 'నాగపుర్ కాంగ్రెస్' అధివేశనంలో పాల్గొన్నది వివరిస్తూ ముగుస్తుంది. కాని, 1920-1948 మధ్యకాలం లోని సుమారుగా మూడు దశాబ్దాల గాంధీగారి జీవితపు చివరి మరియు మహత్వపు మజిలీ వారి ఆత్మచరిత్రలో చోటుచేసుకోలేదు. ఈ దృష్టిలో ఇదొక 'అసంపూర్ణమైన ఆత్మకథ'ని చెప్పవచ్చు.

సత్యాన్ని వెదుకుతూ జరిపిన ప్రయోగాల కథే తన ఆత్మకథని గాంధీజి చెప్పుకొన్నారు. ప్రపంచానికి గాంధీజి కనపడేది ఒక పోరాటగాడుగా. బ్రిటీషు అధికారులు చేస్తున్న వివిధ రకాల అన్యాయాల విరుద్ధంగా గాంధీజి మొదలు దక్షిణ ఆఫ్రికాలో పోరాడుతారు. ఆ తరువాత బ్రిటీషువారి ఆధిపత్యం నుండి భారత దేశాన్ని విముక్తి చేయడానికి పోరాడుతారు. గాంధీగారి ఈ పోరాటాల జీవన కథనం సత్యాన్వేషణ కథ అయినది ఎలా? గాంధీజీ సతతంగా అన్వేషిస్తుండినది దేనిని? ఈ ప్రశ్నలు సహజంగానే పాఠకులను వేధిస్తుంటాయి లేదా వేధించి తీరాలి. ఈ ప్రశ్నలన్నిటికీ ఈ ఆత్మకథలో జవాబులు లభించవు. గాంధీజీ దాఖలుపరిచే తన సత్యాన్వేషణ జీవితం, వారి బ్రతుకులోని వృత్తాంతాల మధ్య ఇముడుకుపోయినందున పై ప్రశ్నలకు జవాబుకోసం పాఠకులు ఈ కృతిని అన్వేషించాలి. అలా అయి, గాంధీజీ ఆత్మకథ ఎలా ఒక అన్వేషణో దానిని చదివే ప్రక్రియ కూడ ఒక అన్వేషణే అవుతుంది.

గాంధీజీ తన ఆత్మ కథలో తన జీవితంలోని వివిధ సంధర్భాలలో జరిగిన ఘటనలను నిర్భావుకంగా, నిర్వేచనతో, అలాగే నిర్భయంగా తెలుపుతూ పోతారు. లౌకిక జగత్తులో గాంధీజీ ఎదుర్కొన్న అన్యాయాల విరుద్ధంగా పోరాటం చేసినది కనపడితే, ఆత్మకథలో వారు తెలిపేది వారి అంతరంగపు పోరాటాలు, తాను గ్రహించిన సత్యానికి నిష్ఠగా వుండడానికి తను కనుగొన్నమార్గాలు. గాంధీగారే చెప్పినట్టు అదోక ప్రయోగం. ఈ దృష్టితో చూచినపుడు, గాంధీజీ ఆత్మకథ ఒక రాజకీయ నాయకుడి ఆత్మకథకంటె ఎక్కువగా ఒక సన్యాసి ఆత్మకథేమో ననిపిస్తుంది. బయట జరిపిన పోరాటాలలో జరిగినట్టు వారి బ్రతుకులోని అంతరంగపు పోరాటాలు కూడ విఫల మయ్యాయి.

అన్ని ప్రయోగాలు విజయమంత మయ్యేవికావు. గాంధీజీ ఈ విఫలతలను గురించి బాధపడరు. కొన్ని

విజయవంతమయ్యాయని ఉబ్బిపోలేదు. అంతరంగపు ప్రయోగాల విజయాలు, విఫలతలు గాంధీజీ వ్యక్తిత్వాన్ని, అలాగే అతని రాజకీయ పోరాటపు స్వరూపాన్ని నిర్ధారించినట్టు కనపడుతుంది. ఈ అన్ని కారణాలవల్ల గాంధీగారి ఆత్మకథ, యిలాంటి ఆత్మకథల వరుసలో విశిష్టమైనదని చెప్పవచ్చు. గాంధీజీ తన ఆత్మకథ ముందుమాటలో వ్రాసిన ఈ క్రింది మాటలు చదివితే ఈ కృతి ఎందుకు రాజకీయ నాయకుల ఆత్మ కథలకంటె భిన్నంగా వుందన డానికి స్పష్టమైన సూచన లభిస్తుంది.

రాజకీయ క్షేత్రంలో తను చేసిన ప్రయోగాలు భారత దేశంలోనే కాక ఇతర నాగరిక ప్రపంచంలో కూడ మన్నన పొందాయి. 'ఇది గొప్ప సంగతని నాకు అనిపించడం లేదు. వీటివల్ల నాకు లభించిన 'మహాత్మ' అన్న బిరుదు ఎన్నో మార్లు నాకు బాధ కలిగించింది. ఈ బిరుదువల్ల నేను ఒక క్షణం కూడ ఉబ్బిపోయినది నాకు జ్ఞాపకం లేదు. కాని, ఆధ్యాత్మ క్షేత్రంలో నేను జరిపిన ప్రయోగాలు వివరించడమే నాకు చాలా యిష్టం. ఈ ప్రయోగాలు నాకు మాత్రమే తెలిసిన విషయాలు మరియు అవి రాజకీయ క్షేత్రంలో పనిచేయడానికి నాకు శక్తినిచ్చాయి. సత్యం తప్ప వేరే దేవుడు లేడన్నది నా అనుభవాలు నాకు నేర్పాయి. ఈ నా కథలో ప్రతి ఒక పుట, ప్రతి ఒక అధ్యాయంలో సత్యం ఆత్మ సాక్షాత్కారానికి వున్న ఒకే సాధనం అహింస అన్నది చదువరులకు తెలిపి చెప్పకుంటే నా యీ ప్రయత్నమంతా వ్యర్థం. అహింస ఆచరణలో నా ప్రయత్నం ఎంత ప్రామాణికంగా వున్నా అవి అపరిపూర్ణమైనవి మరియు అసంపూర్ణమైనవి' అని అంటారు గాంధీజి.

ఇక్కడ ఆధ్యాత్మ అంటె ధ్యానం కాదు, తపస్సు కాదు, పూజ కాదు, యోగ కాదు. అది, సత్యాన్వేషణ, అంటె సత్యం గురించి ఏదో శక్తిని లోబరచుకోవడానికి చేసే వ్రత-నియమాలు కూడ కావు. తన జీవితంలో రోజూ జరిగే సందర్భాలను, సమస్యలను నిభాయించే విధానమే ఆధ్యాత్మ. గాంధీగారి దృష్టిలో సత్యం, నైతికత మరియు వ్యక్తిగత ప్రామాణికత వేరుచేయలేని విలువలు. తన ఆత్మకథ ఆద్యంతం గాంధీజీ సత్యాన్ని ఒక నిరంతర వెదుకులాటగా వివరిస్తారు. ఆహార నియమాలు, బ్రహ్మచర్య పాటించడం, ప్రామాణికత, సేవాభావం మరియు ఆత్మశాసన-వీటిద్వారా తమను తాము పరీక్షించు కోవడమే 'ప్రయోగం' అని అంటారు గాంధీజీ. ఈ అన్ని కారణాలవల్ల గాంధీజీ ఆత్మకథ ఒకేమారు ఒక సన్యాసి ఆత్మకథగాను, ఒక రాజకీయ పోరాటగారుడి ఆత్మకథ గానూ, అలాగే విశ్వమానవుడి ఆత్మకథగానూ రూపు దిద్దుకొని అనావరణమవుతుంది.

విద్యార్థిగా వున్నపుడు గాంధి ఎవరితోనైనా కలుపడానికి సిగ్గుపడేవాడు, తన పుస్తకాలు, చదువు మాత్రమే తన ప్రపంచమని తలచిన ఒక సాధారణ బాలుడు. విద్యార్థి దశలో ఎలాంటి నాయకత్వ గుణాలనూ ప్రదర్శించలేదు. కాని, గాంధి బలిష్ఠమైన నైతిక శక్తిని అతని విద్యార్థి దశలో మనం స్పష్టంగా గమనించవచ్చు. ఉదాహరణకు-హైస్కూలు విద్యార్థిగా వున్నపుడు స్కూళ్ళ ఇన్స్పెక్టర్ గైల్స్ క్లాసులోని విద్యార్థులకు ఇంగ్లీషు పదాల పరీక్ష పెట్టినపుడు Kettle అన్న పదం తాను తప్పుగా రాసినది గమనించిన ఉపాధ్యాయుడు సూక్ష్మంగా హెచ్చరించి ప్రక్క విద్యార్థి వ్రాసిన దానిని చూచి తిద్దుకోమని చెప్పినా గాంధి అలా చేయక తన నైతిక బలాన్ని చాటుకొన్నాడు. అలాగే ఇంగ్లండ్‌లో వకీలు వృత్తి విద్యార్థిగా వున్నపుడు తల్లికి యిచ్చిన మాట ప్రకారం సంపూర్ణ సస్యాహారిగా వుండిపోయాడు. భారతదేశం వెనుదిరిగిన మీదట న్యాయవాది వృత్తిలో వున్నపుడు తనకు నష్టమైనా సహించి తప్పు చేసిన కక్షిదారుడివరంగా వాదించనని చెప్పిన సందర్భాలు జ్ఞాపకానికి వస్తాయి.

వేలూరి కృష్ణమూర్తి
మైసూరు, ఫోన్ : 944 897 7877

కమ్మతెమ్మెర

Thanks Prof. Pardha for sharing the soft version of October 26 Misimi. Thanks for translation of Book Review with add-on value. I am happy that Misimi has published it, making it available to enlightened readers of the journal. Thanks to Sri V. Aswani Kumar, the Editor of Eminence. Regards,

- Prof. V.S. PRASAD



మాలతి చందూర్

నవలా నిర్మాణ శిల్ప విశిష్టత

– కొలకలూరి మధుజ్యోతి

సాహిత్యంలో శిల్ప ప్రాధాన్యం అనన్యం. భిన్న ప్రక్రియలలో శిల్ప వైవిధ్యం ఉంటుంది. శిల్పాన్ని ఆంగ్లంలో టెక్నిక్ అంటారు. నవలా శిల్పం, నాటక శిల్పం, కథాశిల్పం, కవితాశిల్పం ఇలా భిన్న ప్రక్రియలకు భిన్న శిల్ప ధోరణులు ఉంటాయి. ఒక ప్రక్రియలో కూడా ఒకే రకమైన శిల్పరీతి ఉండాలని, ఉంటుంది అని, అనలేము. ఆ నియమమూ లేదు. కథనం, పాత్రలు, సన్నివేశ కల్పన, సంఘర్షణ, ప్రథమ/ఉత్తమ పురుష కోణం, వస్తువు, శైలి ఇవి సాధారణంగా నవలా శిల్ప అంశాలుగా నిలుస్తాయి. ఇవే కాక ఫ్లాష్‌బ్యాక్, సస్పెన్స్, చైతన్య స్రవంతి ఇలా నవలలకు ఎన్నెన్నో జతపడుతూ వచ్చాయి. ఇవి మాత్రమే నవలా శిల్ప రీతులు కాదు. నవలా రచయితలలోని సృజనాత్మకతను బట్టి కొత్త తీరులు జతకూడుతాయి. కొత్త విమర్శనా దృష్టికి అవి దోహదమవుతాయి. వినూత్నత సృజనాత్మకత విశేషంగా ఉన్న రచయిత్రి **మాలతి చందూర్. ఎన్ని మెట్లు ఎక్కినా, కృష్ణవేణి, జయలక్ష్మి, హృదయనేత్రి, శతాబ్ది సూర్యుడు** వంటి ఎన్నో నవలలను రాశారు. వాటిలో ఎన్నో మంచి నవలలు ఉన్నాయి.



మాలతి చందూర్ సృజించిన పాత్రలలో కొన్ని అలాంటివి నా దృష్టిలో 'కలల వెలుగు'లో పద్మలత, 'సద్యోగం' లో సుమిత్ర 'ఆలోచించు'లో లలిత, 'కాంచన మృగం'లో సుందరమ్మ. ఇవి అద్భుతమైన పాత్రలు భిన్న రీతులలో అలా అనిపించేలా చేసింది మాత్రంఆయా నవలల్లోని శిల్పరీతులు. ఇక్కడే మాలతి చందూర్ ప్రత్యేకత సృజన దృష్టి కనిపిస్తాయి. తాను ఎంచుకున్న వస్తువును, దాన్ని మోసే నిర్వహించే పాత్రను నిర్ణయించుకొని, ఆపై పొరలు పొరలుగా సన్నివేశాలు సంఘటనలు నిలిపి, తాననుకున్న విషయాన్ని పాఠకుల మెదళ్ళలో చొప్పించి ఆశ్చర్యపరచటం, భావోద్వేగానికి గురి చేయటం ఆమె నవలా శిల్పం. ఇది ఆమె నవలా నిర్మాణ వ్యూహం. ఆమె పొరలు పొరలుగా మెట్లు మెట్లుగా అల్లిన పేర్చిన అంశాలను గమనిస్తే నవలా నిర్మాణంలో ఇతివృత్తాన్ని ఎంత వకడ్బందీగా వ్యూహాత్మకంగా నిర్మించారో అర్థమవుతుంది. ఆమె నవలా శిల్పం వ్యూహం. సాధారణంగా సరళంగా ఇతివృత్తాన్ని నడిపితే నవల బాగా సాగుతుంది. పాఠకుడు ఆనందిస్తాడు. కానీ వ్యూహాత్మక నిర్మాణంతో ఉన్నప్పుడు భావోద్వేగాల సంబరంతో సంక్షిభిత హృదయంతో తల్లడిల్లిపోతాడు. అస్థిమితత అశాంతి అచ్చెరువు వంటి భావాలతో సంచలించిపోతాడు. పైగా మాలతి చందూర్ ఈ వ్యూహాత్మకతకు ఆయా పాత్రల వాదనా పటిమను చేకూర్చి మరింతగా తన శిల్పానికి బలాన్ని పటిష్టతను చేకూర్చారు.


1. **కలల వెలుగు** నవల నాలుగు ప్రధాన పాత్రలతో సాగింది. నాలుగు పాత్రలు కలలలో చూసిన వెలుగే తప్ప నిజజీవితంలో అది లేకపోవడం బాధాకరం. రచయిత్రి స్త్రీలోని ఆత్మార్పణ తత్వాన్ని ఆవిష్కరించటం ఈ నవలేతివృత్త వస్తువు. ఆ అంశాన్ని ఆవిష్కరించటానికి సినీరంగంలో నిలదొక్కుకోలేని అంద విహీనము, బండ శరీరము ప్రేమించే హృదయము ఉన్న పద్మలతను రూపుదిద్దింది రచయిత్రి. ఈ నవల, పద్మలత పాత్రను ప్రధానంగా తీసుకొని సాగింది. ఆ పాత్ర విషయంగానే నవల ముగిసింది. నవల ఆద్యంతం ఉన్న పాత్ర పద్మలత. నవల రామచంద్ర పాత్రతో ప్రారంభమైంది. డబ్బు పిచ్చి పిసినారి అయిన భార్య రమణమ్మతో అసంతృప్తి; తనను కళాకారుడిగా ఇష్టపడిన యశోదను తన పరిధిలోకి తెచ్చుకోలేని నిస్సహాయత; తను కోరుకొన్న తనను కోరుకొన్న పద్మలత పట్ల జాలి నిరసన వెరసి రామచంద్ర జీవితం. ఈమె సినిమా నటి కావాలని తల్లి తపనపడింది. అది కలిసి రాలేదు, పద్మలతకూ ఇష్టంలేదు. పద్మలత, ఫోటోగ్రాఫర్ అయిన వివాహితుడు అయిన రామచంద్ర పట్ల ప్రేమను కనపరిచింది. రంగుల ప్రపంచమైన

సినిమాలో తన్ని కాదనుకొని రామచంద్ర తోటిదే జీవితంగా భావించి అన్నీ అంతా అతనికి అర్పణ చేసింది.

పురుషుడికి బహు స్త్రీ సాంగత్యపు అనధికార అనుమతిని ఇచ్చిన ప్రపంచాన్ని ప్రశ్నించడం కాదు, భర్త పట్ల ప్రేమని కనపరచలేని భార్య విషయం కాదు, అచ్చంగా పద్మలత విషయం ఈ నవల. ఒక మనిషి తను ప్రేమిస్తే ఎంత అర్పణతత్వంతో ఉంటుందో, ఉండడానికి అవకాశం ఉందో, అంతటి అర్పణతత్వాన్ని పద్మలత పాత్రలో రచయిత్రి చూపించారు. ప్రేమ పంచటం, ఏదో ఆశించి జరగటం కాదు కాకూడదు. అదే తీరు పద్మలత పాత్రలో కనిపిస్తుంది. తాను లైంగికంగా పతనం కాలేదని చాటుకోవడానికి నిరంతరం రామచంద్ర దూషణలను అవమానాలను, ఆత్మన్యూనతలను, తిట్లను, దెబ్బలను భరించిన ఆమె తన ప్రేమను పంచటంలో ఏ మాత్రం తగ్గలేదు. ఇంత నిస్వార్థంగా నిబద్ధతగా అర్పణ చేసుకున్న స్త్రీ పద్మలత. అనేక మలుపులతో నడిచిన నవలలో భిన్నపాత్రల ప్రమేయంతో ఈ పాత్ర ఉద్దీపనం పొందింది. భార్య డబ్బు చుట్టూ తన లోకాన్ని ఏర్పరుచుకొని భర్త పట్ల ప్రేమను చూపటంలో విఫలమైంది. చదువుకొని ప్రిన్సిపల్ అయిన యశోద కళాకారుడిగా రామచంద్రాన్ని ఇష్టపడినా, సమాజ భయంతో అతనితో కలిసి ఉండడానికి వెనకడుగు వేసింది. ఈ రెండు లక్షణాలు–ప్రేమను చూపటం, కళాకారుడిగా గుర్తించటం–పద్మలత పాత్రలో ఉంది. ఏ ప్రేమ అయితే ఇవ్వాలో అది అందించే స్త్రీగాను, ఏ రకంగా పురుషుడిని ఆనందింప చేయాలో ఆ రకంగా అనందింప చేసే స్త్రీగా నిలిచి పాఠకులకు అపురూపమైన పాత్రగా కనిపిస్తుంది. అయాచితంగా వచ్చిన ఈ ప్రేమని రామచంద్ర జాలిగాను, తేలిగ్గానూ, న్యూనంగాను చూశాడే తప్ప సమానంగా గౌరవించలేకపోయాడు. ఈ పాత్ర పట్ల పాఠకులు ఇష్టం కలగడానికి ఇది కూడా కారణమే. వనిత తనంతట తాను వలచి వచ్చిన చులకన అయినట్టే రామచంద్రకు కూడా అయాచితంగా లభించిన ఈ సౌఖ్యానందాలు చులకన అయ్యాయి.

రామచంద్ర చనిపోయేటప్పుడు తను కొన్న ఇల్లు అమాయకురాలయిన పద్మలత పేరిట రాశానని అది ఆమెకే దక్కేలా చేయాలని స్నేహితుడైన మహేశ్వరరావుకు లేఖ రాశాడు. అసలు యజమాని అయిన పద్మలతకు ఆ విషయం తెలియదు. ఇంటి నుంచి కట్టుబట్టలతో గెంటేస్తే పరాశ్రయ అయ్యింది. రామచంద్ర ఆమె పట్ల జాగ్రత్తగా ఉన్నాడు అనేది తెలుస్తూ ఉన్నా, పద్మలత పట్ల కొంత ఆనుకంప అతనికి ఉన్నట్టు కనిపించినా, ఎంతవరకు మహేశ్వరరావు దానిని ఆమెకు ఇప్పించగలడు అనేది ప్రశ్నార్థకమే! రచయిత్రితో పాటు చదువుతున్న వారికీ కలిగే అనుమానమే. తన పేర ఆస్తి రాసినట్టు ఆమెకు తెలియకపోవటం పద్మలతకు కలిగిన నష్టంగానే చెప్పవచ్చు. రచయిత్రి స్త్రీలోని అత్యున్నతమైన ప్రేమ గుణానికి, నిర్భీతిగా ప్రేమను ప్రదర్శించే తీరుకు పద్మలత నిదర్శనం. కుటుంబ సమాజ ఒప్పుదలతో సంబంధం లేకుండా తన ఇచ్ఛను అనుసరించి ప్రేమను ప్రకటించిన పద్మలతలోని అర్పణతత్వానికి గురుతరమైన ఒక పీఠాన్ని ఇచ్చి అధిరోహింప చేశారు రచయిత్రి.

2. స్త్రీలో స్థితప్రజ్ఞతని చాటిన నవల **సద్యోగం**. రాగద్వేషాతీత సుఖదుఃఖాతీత స్థితిని కలిగి ఉండగలగటం, పాలను నీళ్లను వేరు చేసి స్పష్టంగా చూడగల మాలిన్య రహిత మనసు కలిగి ఉండటం. ఇది జీవిత పరమార్థం. ఇది సాధించటానికి మానసిక పరిపక్వత ఎంతో అవసరం. ఈ పరిపక్వతను సుమిత్ర విభిన్న దశల అనుభవాల అనంతరం సాధించటాన్ని రచయిత్రి పేర్కొంది. సుమిత్ర ఎవరి చేతిలో అయితే మోసపోయి జీవితాన్ని నాశనం చేసుకొందో, ఆ వ్యక్తి కేసు తీసుకొని అనుకూలంగా వాదించి నిరపరాధి అయిన ఆ వ్యక్తిని గెలిపించే స్థితికి ఎదిగింది. ఇదే స్థితప్రజ్ఞత. ఆ స్థితి సుమిత్రకు యధాలాపంగా రాలేదు. కాలపరీక్షలో నిలిచి రాటుదేలి పరిణామం చెంది సుమిత్రలో ఏర్పడింది. సద్యోగం –మంచి ఉద్యోగం. ఆ మంచి ఉద్యోగాన్ని సంపాదించిన సుమిత్ర కథ ఇది. మాలతీచందూర్ కథ అల్లిక ఒక పాత్రను ఎలివేట్ చేయడానికి భిన్న భిన్న సంఘటనలు సన్నివేశాలను మెట్లుగా అమర్చి ఆ పాత్రని పైకి కనిపించేలాగా సమున్నతంగా నిలిపేలాగా చేస్తుంది. వెంకట్రామన్ అనే సీనియర్ లాయర్ దగ్గర జూనియర్గా చేరి, మూడేళ్ళలో తనను తాను నిరూపించుకొన్న సుమిత్ర కథ.




సద్యోగం నవలలో సుమిత్ర 30 ఏళ్ల వనిత. ఆ అమ్మాయికి లౌకికమైన ఆసక్తులు లేకపోవడం ఇతివృత్త నడకలో గమనించవచ్చు. ఆనాడు పదో తరగతి అయిన వెంటనే ఆడపిల్లలకి చదువులు మానిపించి వివాహం చేసేవారు. అలా చదువు మానేసి ఇంట్లో కూర్చొన్న సుమిత్ర, ఎదురింట్లో ఉన్న కుర్రాడిని ఇష్టపడి ఒంటినిండా నగలతో ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్ళిపోయి మూడు నెలలు హైదరాబాదు ముంబైలో ఉండి అతడు దొంగ అబద్ధాలకోరు అని తనని అమ్మేయబోతున్నాడు అని గ్రహించి తప్పించుకొని ఇంటికి వచ్చింది. ఇల్లు ఆదరించింది. ఆ వ్యక్తి తన స్నేహితులతో కలిసి ఇంటి మీదకు వచ్చి అవమానకరంగా మాట్లాడినప్పుడు పోలీసుల సమక్షంలో సిగ్గు భయాన్ని దాటి వాడెవరో నాకు తెలీదు నేను వెళ్ళనని, తనని పెళ్లి చేసుకోలేదు వాడికి తనపై ఎలాంటి అధికారం లేదని నిక్కచ్చిగా చెప్పింది. ఇంత అవమానం జరిగిన తర్వాత ఆ ఊర్లో ఉండలేక తండ్రి కాపురాన్ని మద్రాస్‌కి మార్చాడు. బిడ్డని లా చదివించాడు. వివాహానికి ఇబ్బందికరంగా ఉన్న స్థితిలో సుమిత్రకు ఆస్తిలో సగభాగం ఇచ్చి ఆమెకు ఒక ధైర్యాన్ని కల్పించాడు.

నీచుడైన వ్యక్తితో జీవితం ఆమెకు ఉంది. ఆ జీవితంలో నంచి బయటవడి నిలదొక్కుకోవడానికి సహాయం చేసిన తండ్రి సీనియర్ల ప్రమేయం ఉంది. రెండు విరుద్ధాలని అనుభవించిన స్థితిలో, ఏది మంచి ఏది చెడు అనే గ్రహింపుని పొందింది సుమిత్ర. అంతే కాదు చిన్ని చిన్ని విషయాలు, పెద్దపెద్ద నిర్ణయాలు జీవితాలను తలకిందులు చేయకుండా ఉండటం; పెద్ద పెద్ద సంఘటనలు ఒకదాని ప్రభావం మరొక దాని మీద వడకుండా ఉండటం అనే నిర్ణాయక రేఖను నిర్ణయించుకోవడం సుమిత్ర విజయానికి కారణం. నిరపరాధి అయిన నీచుడికి శిక్ష పడకుకూడదు. అలా చేయటానికి అతని పట్ల తనకున్న అనిష్టత అడ్డు కాకూడదు. అతని పట్ల వ్యతిరేకత ఉంది. తండ్రి, సీనియర్ ఇచ్చిన ధైర్యమూ ఉంది. ఈ రెండు ఉన్నా, మానసిక కుంగు బాటుకు కారణమైన స్థితి నుంచి తనను తాను ఎదిగి నిలుపుకోవడం అనేది మాత్రం సుమిత్రలోనే ఉంది.

3. స్త్రీ ఔన్నత్య గొప్పతనాన్ని ప్రకటించిన నవల '**ఆలోచించు**'. స్త్రీలోలత్వాన్ని పురుషుడి బలహీనతగా అంగీకరించే నాటి కాలంలో భర్తకు ఉన్న పర స్త్రీ సాంగత్యాన్ని చూసి చూడనట్టుగా ఉన్న లలిత, అతడి ద్వితీయ వివాహానికి అంగీకరించటం సపత్ని పట్ల ద్వేష భావాన్ని దాటి స్నేహభావంతో మెలగటం తద్వారా నైతికంగా ఉన్నత స్థితికి ఎదగటం ఈ ఔన్నత్యపు నేపథ్యాలు. ప్రేమించి పెళ్లాడిన భర్తకు ఉన్న ఇతర స్త్రీల సాంగత్యాన్ని అంగీకరించటం, సపత్నితో స్నేహంగా మెలిగే స్థితికి ఎదగటం లలిత పాత్ర అయితే అటువంటి స్థితిలో ఎంత తల్లడిల్లినా స్థిరంగా నిలబడగల ఆత్మస్థైర్యాన్ని పొందటం ఏ వివాహితకైనా అంగీకారం కానీ సాధ్యం కానీ విషయం. ఆవిషయాన్ని అంగీకరించి సమ సమాజపు స్త్రీ భావనా పరిధి దాటి ఆలోచించగల ఔన్నత్యపు స్థితిలో ఆ పాత్రను నిలపటం రచయిత్రి నేర్పు.

ఈ నవలలో, లలిత మూర్తి ఇష్టపడ్డారు.ఆడంబరాలు లేని జీవితాన్ని కోరుకొంటూ సంస్కారవంతమైన విప్లవాత్మకమైన వివాహం చేసుకొన్నారు. వారికి ఇద్దరు పిల్లలు. మూర్తి క్రమంగా వ్యాపార విస్తరణలో భాగంగా విలువల నుంచి పతనమై పరాయి స్త్రీల సాంగత్యాన్ని అనుభవిస్తూ లలితకి కొంత దూరమౌతూ వచ్చాడు. వాటిని భరించగలిగింది. క్షమించగలిగింది. ఒకనాడు తాను ఒక స్త్రీని ఇష్టపడ్డాను పెళ్లి చేసుకోవాలనుకొంటున్నానని ఆమె గర్భంతో ఉందని లలిత అనుమతి కావాలని ఆమెను వదిలి ఉండలేనని చెప్పినప్పుడు చాలా కుంగిపోయిన లలిత అతన్ని చంపాలనుకొంది. తనను తాను శారీరకంగా హింస పెట్టుకోవడం మొదలుపెట్టింది. ఆలోచించీ ఆలోచించి తనను తాను నియంత్రణలో పెట్టుకోలేని స్థితిలో ఉన్నప్పుడు ఆమెకు థింక్ అనే పుస్తకం దొరికింది. చిన్న పాంప్లెట్. దానిని చదివి ఆ స్వామిజీ దగ్గరికి వెళ్ళింది. ఆ పరిసరాలు చూసి ఆమెను అక్కడ వదిలి వెళ్ళాడు భర్త. ఆమె పట్ల అతను చూపుతున్న ప్రేమలో లోపం లేదు. స్వామీజీతో మాట్లాడిన తర్వాత లలిత ఆలోచించటం ఆరంభించింది. ఏమి ఆలోచించాలి? ప్రతి విషయం జరగడానికి ఒక కారణం ఉంటుంది. ఆ కారణాన్ని ఆలోచించాలి.




భర్త చేసిన పని తనకు బాధగా అవమానంగా భావించిన లలిత దిగులు పడింది. శిక్షించుకొంది. భర్త ఏ రకమైన మానసిక స్థితిలో ఉన్నాడు ఏ కారణంతో మరో

వివాహానికి పూనుకొన్నాడు అనే విషయం ఏనాడు అనుకోలేదు. అవతలి అమ్మాయి ఏ కారణాల చేత భర్త వివాహితుడైనప్పటికీ పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడిందో!? ఈ విషయాలు ఆలోచించే క్రమంలో ద్వేషాన్ని క్రమక్రమంగా అధిగమించింది. అవతలి వారి ఆలోచన ఏమై ఉంటుందా అని ఆలోచించగలిగే స్థితిని పొందింది. క్రమంగా ఒంటరి స్త్రీ అయిన ఆ అమ్మాయి పట్ల అనుకంప సహానుభూతి ఏర్పరచుకొంది. ఆమె కాన్పు సమయంలో సాయంగా ఉంది. బిడ్డను కోల్పోయిన ఆ తల్లికి అండగా నిలిచింది. పిల్లలు పుట్టే అవకాశం లేకుండా మూర్తి ఆపరేషన్ చేయించుకొన్నాడు అని తెలిసి ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నం చేసినప్పుడు భర్త ఊర్లోలేని ఆ సమయంలో లలితే దగ్గరుండి అమ్మాయికి సపర్యలు చేసింది. ఆపై ఉన్నత చదువులకి విదేశాలకు వెళ్లడానికి సహాయం చేసింది.

ఈ స్థితిని కల్పించడానికి వెనుక రచయిత్రి ఆమె స్వభావంలో ఏ మార్పులని చూపించకుండా పతనమౌతున్న విలువలతో భర్తను చూపించడం ద్వారా ఒక పరిణామాన్ని చూపింది. అతడి బలహీనతల్ని మౌనంగా అంగీకరించిన ఫలితంగా ఆమెతోనే ధైర్యంగా తానేసిన తప్పటడుగును ఫలితంగా మరో స్త్రీ గర్భవతిగా ఉండటాన్నీ చెప్పాడు. ఆమెను వివాహం చేసుకొంటాను అని తెగించి చెప్పగలిగిన పరిస్థితి దాకా రావడం దాని ఫలితమే. దాని వలన కలిగిన వైరాగ్యం నుంచి ఆమె స్వామీజీ వైపు మళ్ళటం, మనసు ఇతర పనులపై లగ్నం చేయటం, తద్వారా తనను తాను ఎదగేలా చేసుకోవడం ఒక అద్భుతమైన నిర్మాణ శిల్పానికి నిదర్శనంగా నిలుస్తుంది. మూర్తి వ్యక్తిత్వ పతనం దానిని ఆపలేని అడ్డుకోలేని అసహాయత నుంచి తన పతనం, ఆ పతనం నుంచి తాను ఎదిగే అవకాశం రావడానికి మార్గాన్ని స్వీకరించింది. రచయిత్రి వివాహ వ్యవస్థ విచ్ఛిన్నం కాకూడదు అనే నాటి ఆలోచనలను కాపాడుతూనే స్త్రీ వ్యక్తిగా ఎదగడాన్ని అద్భుతంగా ఈ పాత్రను మలచింది. భర్తలాగా విలువలను విస్మరించలేని లలిత తాను ఆ విలువలను పోగొట్టుకోలేదు. వ్యక్తిగా ఎదిగింది ఉన్నతంగా నిలిచింది. రాపిడి మీద పదును తేలిన ఔన్నత్యపు శిఖరం లలిత.

4. **కాంచనమృగం** మరో అద్భుతమైన నవల. అద్భుతం అనడం వెనుక కారణం ఇతివృత్త నిర్మాణంలో మాలతీ చందూర్ పొందుపరిచిన వ్యూహాత్మకతే. స్త్రీ సంస్కారం హృదయపు లోతును చాటిన నవల కాంచనమృగం. అవసరమైన చోట చేతి వూతాన్ని ఇవ్వటం; అవసరంలేని విషయాలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం; అనవసరమైన విషయాలను అందరికీ ప్రకటించ నక్కరలేదనే స్పృహ కలిగిన పాత్ర సుందరమ్మ. అన్యోన్య దాంపత్యంలోనూ దంపతుల మధ్య రహస్యాలు ఉంటాయి అని చెప్పింది ఆ పాత్రలోని లోతు. ఇందులో ఎన్ని పాత్రలు ఉన్నా ప్రధానంగా సుందరమ్మ నిలిచి పోతుంది. ఆమె మరణంతో ఆరంభమైంది నవల.



సుందరమ్మ మరణిస్తూ వైకల్యంతో ఉన్న ఒక కుర్రాడిని చూస్తూ అలజడితో తల్లడిల్లిపోతూ తన మెడలోని చంద్రహారాన్ని ఆ 20 ఏళ్ల కుర్రాడికి వేస్తూ మరణించింది. ఆమెని ఆసుపత్రిలో ఒక నెల రోజులుగా రేయింబవళ్ళు జాగ్రత్తగా చూసుకొన్న ఎలిజిబెత్ తమ్ముడు ఆ కుర్రాడు. ఎలిజిబెత్ ఆ నగని ఆ హాస్పటల్ యజమాని అయిన డాక్టర్‌కి జరిగిన విషయం చెప్పి ఇచ్చింది. కథ దానితో ఆరంభమైమది. ఆమె ఇచ్చిన చంద్రహారాన్ని పేనుకొని ఉల్లి పొరల లాంటి విషయాలని ఛేదిస్తూ ఛేదిస్తూ ఆ పిల్లాడు సుందరమ్మ మనవడిగా చివరికి తేల్చారు. సుందరమ్మ భౌతికంగా మరణించినా నవలంతటిలోనూ ఆవిడని సజీవంగా నిలిపారు రచయిత్రి. సజీవంగా మాత్రమే కాదు ఔన్నత్యపూర్వకమైన సంస్కారంతో వ్యక్తిత్వంతో నిలిపారు. తెలిసీ తెలియని వయసులో తొందర పడ్డ కూతురు పంకజం, ఆమె ఇష్టపడిన ఆనందరావు వారికి కలిగిన సంతానం ఈ కుర్రాడు రాఖి. బిడ్డ గర్భాన్ని దాల్చింది. కాన్పు అయి ఆ బిడ్డని తర్వాత తీసుకెళ్లాలనుకొన్న సుందరమ్మకి ఆయా అబద్ధం చెప్పడంతో బిడ్డ చనిపోయాడని అనుకొంది. ఆసుపత్రిలో ఉండగా అధాటుగా ఆ కుర్రాన్ని చూసి గుర్తించగలిగింది సుందరమ్మ. లేదు అనుకున్నవాడు కనిపించడం, తాను చూసిన అవకారాలతో ఈ కుర్రాడు ఉండటం బహుశా ఆమెకి ఆయా చేసిన మోసం అర్థమయి ఉండాలి. తాను ఇంతకాలం గుర్తించని జీవి బతికి ఉండటం, తనలో తప్పు

చేశాననే భావం తలెత్తి దాని నుంచి బహుశా తప్పించు కోవడానికి అన్నట్టు కుర్రాడికి ఇచ్చి ఉండాలి. ఇది ఒక కోణం.

ఎదిగీ ఎదగని వయస్సు-17 ఏళ్ల వయసులో కుమార్తె పంకజం గర్భం ధరిస్తే ఎవరికీ తెలియకుండా, భర్తకి కూడా (ఆ సమయంలో భర్త మూడేళ్లపాటు జర్మనీ వెళ్ళాడు) తెలియకుండా తప్పనిసరి అయి ప్రసవం చేయించింది. వంకజాన్ని చూడడానికి వచ్చిన ఆనందరావుకి నచ్చచెప్పి పంపింది. ప్రమాదంలో వికలాంగుడయితే వెళ్ళి ధైర్యం చెప్పి వచ్చింది. పర్యవసానాలు తెలియని పసివాళ్ళలానే వారిరువురిని చూసింది. దారులు వేరైన ఇరువురు, వారి వారి జీవితాల్లో వివాహితులయి స్థిరపడ్డారు. వారికి ఈ చంద్రహారం సందర్భంలో బిడ్డ గురించి తెలిసినా జరిగిపోయిన దాని తవ్వుకొవటం అనవసరం అనే భావించారు. ఇద్దరికీ అలాంటి వ్యక్తిత్వాల్ని కలిగేలా చేయగలిగింది సుందరమ్మ. అంతే కాదు తాను చేసిన ఈ పని ఎంత గోప్యంగా ఎవరికీ తెలియాల్సిన అవసరం లేకుండా తనలోనే దాచుకొంది. పుట్టిన బిడ్డ మరణించినట్టు ఆయా చెప్పడం మూలాన సుందరమ్మ పంకజం ఆనందరావు ముగ్గురూ బిడ్డ బాధ్యత తీసుకొనే అవసరం లేకుండానే జీవించారు. ఉన్నట్టుండి కనిపించిన బిడ్డని బిడ్డ అవకారాన్ని గుర్తించిన సుందరమ్మ మనసు ఎంత లోతైనదో ఈ నవల తెలుపుతుంది.


ఈ ఇతివృత్తాన్ని పొరలు విడతీసే కొద్దీ వాస్తవాలు వెలికి వస్తూ ఉండటం అనే ఉత్కంఠతను అద్భుతంగా అందించారు రచయిత్రి. తన చుట్టూ ఉన్న వాళ్ళ మీద తన ప్రభావాన్ని చూపగలిగిన సమున్నత మూర్తిగా సుందరమ్మ నిలిచింది. మరణించిన పాత్రకు ప్రాణం పోసింది రచయిత్రి. ఆసుపత్రిలో సుందరమ్మ మరణంతో ఆరంభమయి ఇతివృత్తంలో సుందరమ్మని సజీవంగా ఉంచుతూ సమున్నతంగా నిలిపింది. దానికి కారణం ఆమె సంస్కారవంతమైన హృదయపు లోతు. ఆ లోతుని అద్భుతంగా ఆవిష్కరించిన నవల కాంచనమృగం.

ముగింపు : ఈ నాలుగు నవలలు రచయిత్రి స్త్రీపరంగా ఉద్దేశించిన విలువని వస్తువుగా తీసుకొని దాని చుట్టూ తగిన ఇతివృత్తాన్ని ఏర్పరిచి ముందుగా పేర్కొన్నట్టుగా అనేక సంఘటనలు సన్నివేశాల పొరలలో నుంచి తాను విశ్వసించిన స్త్రీ లక్షణాన్ని రచయిత్రి ప్రదర్శించింది. ఈ వ్యూహాత్మకతకి, మానవ మనస్తత్వాన్ని, సమాజ వైఖరిని ఆదర్శవంతమైన నైతికతను, సంస్కారవంతమైన ఔన్నత్యాన్ని, అద్భుతమైన సస్పెన్స్‌ను, ఫ్లాష్‌బ్యాక్ టెక్నిక్‌లతో వాదనా పటిమతో నిలిపింది రచయిత్రి. ఈ వ్యూహాత్మక నిర్మాణ శిల్పం ఈ పాత్రలకు తిరుగులేని మకుటాలను అమర్చి తెలుగు సాహిత్య ప్రపంచంలో తమదైన ముద్రను వేసే సామర్థ్యాన్ని కలిగించింది. సాహితీ ప్రపంచంలో డా.మాలతీచందూర్‌ను చిరంజీవిని చేసిన రచనలలో ఇవి ప్రధానమైనవి.

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
(పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం)
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి
ఫోన్ : 988 594 0011

కమ్మతెమ్మెర

సెప్టెంబరు **మిసిమి** అందుకున్నాను. **పంపభారతం** వ్యాసం చదివిన నాకు.. తెలంగాణలో తెలుగు, కన్నడ, సంస్కృత భాషలు వాడుకలో ఉండేవని తెలిసింది. మరో విషయం కూడా తెలిసింది. కవి అర్జునుని మహాభారత కథలో హీరో గా చూసాడు. అది అతని దృష్టి కోణం. మహాభారత కథలో ..అర్జునుడు, కర్ణుడు.. వీరే హీరోస్ అనే వాదన చెలామణిలో వున్నది.



విలువలు కథలో ఆమె అతనికి కావలిసింది ఇచ్చింది. అతను ఆమెకు కావలిసింది ఇచ్చాడు. ఇది వ్యాపార సూత్రం. ఇచ్చి పుచ్చు కోవడం అనే సూత్రం ఇమిడి వుంది. అతను ఆమె శీలానికి " విలువ " కట్ట లేదు. ఆమెకు తన మానం "విలువ" తెలియదేమో ! ఆకలికి "విలువ" వుంటుందా..?

ప్రజాస్వామ్య విలువలు పడిపోతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో పవిత్ర గ్రంథంగా భావించే రామాయణంలో పేర్కొన్న **ప్రజాస్వామ్య విలువల** గురించి వెదికి తీసిన రచయిత అభినంద నీయుడు. వాల్మీకి దృష్టిలో అవి రాజ ధర్మాలు. రామాయణం గురించి బోధించే వారు ఈ మర్మం బోధించాలి. రామాయణం కేవలం మత గ్రంథం..అనే తప్పుడు ప్రచారం చేయడం ఆగిపోవచ్చు.


- ప్రొఫెసర్ నరసయ్య పంజాల

నాగేటి చాల్లల్ల

తెలంగాణ నాగేటి చాల్లల్ల – అక్షరాల్లో పండిన మట్టి పరిమళం

కవి నందిని సిధారెడ్డి సాహిత్య విశ్వానికి డాక్టర్ అనుమాండ్ల భూమయ్య నిర్మించిన భావవారధి.

కొన్ని పుస్తకాలు చదివిన తర్వాత ముగుస్తాయి. కొన్ని పుస్తకాలు మనలో మొదలవుతాయి. "తెలంగాణ నాగేటి చాల్లల్ల' అలాంటి అరుదైన గ్రంథం. ఇది కేవలం ఒక కవి రచనలపై విమర్శ గ్రంథం మాత్రమే కాదు. తెలంగాణ మట్టిలో మొలిచిన ఒక సాహిత్య చైతన్యాన్ని, ఒక కవి సృజనాత్మక ప్రపంచాన్ని, ఆయన అక్షరాల్లో నిక్షిప్తమైన మానవీయ విలువలను అత్యంత సమగ్రంగా ఆవిష్కరించిన సాహిత్య దర్పణం. కవి "నందిని సిధారెడ్డి" కవిత్వంలోని మట్టి వాసనను, శ్రమజీవి జీవితపు చెమట చుక్కలను, ప్రకృతితో మమేకమైన జీవన సంస్కృతిని, తెలంగాణ అస్తిత్వాన్ని, సామాజిక చైతన్యాన్ని, భాషా వైశిష్ట్యాన్ని, తాత్విక అంతరార్థాలను ఆచార్య అనుమాండ్ల భూమయ్య అత్యంత లోతైన అధ్యయనంతో, విశ్లేషణాత్మక దృష్టితో పాఠకుల ముందుకు తీసుకువచ్చారు. ఈ గ్రంథం చదువుతుంటే ఒక కవిని మాత్రమే కాదు, ఒక నేలను, ఒక సంస్కృతిని, ఒక సమాజాన్ని, ఒక కాలాన్ని చదువుతున్న అనుభూతి కలుగుతుంది. నందిని సిధారెడ్డి కవిత్వంలో రైతు కేవలం అన్నదాత కాదు. నాగరికతను తన భుజాలపై మోసే మహామనిషి. భూమిని ప్రేమించిన ప్రతి చేతి వెనుక ఒక చరిత్ర ఉందని ఆయన కవిత్వం చెబుతుంది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతు కన్నీటి వెనుక దాగి ఉన్న ఆర్థిక అసమానతలను, వ్యవసాయ సంక్షోభాన్ని, పాలనా వైఫల్యాలను కవి ఎంత సున్నితంగా ఆవిష్కరించారో, భూమయ్యగారు అంతే లోతుగా విశ్లేషించారు. వ్యవసాయం ఒక వృత్తి మాత్రమే కాదు–ఒక జీవన సంస్కృతి. పొలంలో చెమట చిందించే రైతు, ఇంటి పనులతో కుటుంబాన్ని నిలబెట్టే మహిళ, జీవన భారాన్ని పాటగా మోసే పల్లె మనిషి–ఈ ముగ్గురి జీవితం కలిసే తెలంగాణ అసలు స్వరూపమని ఈ గ్రంథం మనకు గుర్తు చేస్తుంది.



నందిని సిధారెడ్డి కవిత్వంలో ప్రకృతి అలంకారం కాదు – ఆత్మ!

చెరువు, చెట్టు, పక్షి, మేఘం, గాలి, నేల, వాన – ఇవి ఆయన కవిత్వంలో కేవలం దృశ్యాలు కావు. మనిషితో సంభాషించే జీవరూపాలు. తెలంగాణ పల్లెలకు జీవనాడిగా నిలిచిన చెరువులు ఎండిపోవడం అంటే కేవలం నీటి కొరత కాదు. మనుషుల మధ్య బంధాలూ ఎండిపోవడమేనని కవి చెప్పిన భావాన్ని భూమయ్య గారు అత్యంత సున్నితంగా వివరించారు. పక్షుల కిలకిలారావాలు, ఆకుల గుసగుసలు, ఆకాశపు నిశ్శబ్దం–ఇవన్నీ ఆధునిక మనిషి కోల్పోతున్న సహజత్వాన్ని గుర్తు చేస్తాయని ఆయన విశ్లేషణ స్పష్టం చేస్తుంది.

నందిని సిధారెడ్డి కవిత్వంలో సౌందర్యం ఉన్నంతగా బాధ కూడా ఉంది. ప్రేమ ఉన్నంతగా ప్రతిఘటన కూడా ఉంది. మానవత్వం ఉన్నంతగా ప్రశ్నించే ధైర్యమూ ఉంది. అణగారిన వర్గాలు, బాధిత మహిళలు, సామాజిక అన్యాయం, వలసలు, ఆకలి, నిరాశ, మరణం, స్మృతి–ఇవన్నీ ఆయన కవిత్వంలో వ్యక్తిగత అనుభూతులుగా కాకుండా సామాజిక చరిత్రగా రూపుదిద్దుకున్నాయి.

భూమయ్య గారి విశ్లేషణ ఈ కవిత్వంలోని అంతర్లీన మానవీయ దృక్పథాన్ని అత్యంత స్పష్టంగా పాఠకుడికి అందిస్తుంది. కవిత్వం వినోదం కోసం కాదు. సమాజాన్ని ప్రశ్నించడానికి, మనిషిని మనిషిగా నిలబెట్టడానికి అని ఈ గ్రంథం నిరూపిస్తుంది. భాష అనేది కేవలం సంభాషణ సాధనం కాదు. అది ఒక జాతి జ్ఞాపకం. నందిని సిధారెడ్డి తెలంగాణ మాండలికాన్ని కేవలం ఉపయోగించలేదు. దానికి సాహిత్య గౌరవాన్ని తీసుకొచ్చారు.

ఆ మాండలికంలో ఉన్న మట్టి వాసనను, భావసంపదను, జీవన సత్యాలను భూమయ్య గారు ఎంతో ప్రేమతో విశ్లేషించారు. తెలంగాణ పలుకుబడి కవిత్వంలో ఎలా శాశ్వతమవుతుందో ఈ గ్రంథం అత్యంత సమర్థంగా చూపిస్తుంది. డాక్టర్ అనుమాండ్ల భూమయ్య గారు ఈ గ్రంథంలో కేవలం విమర్శకుడిగా వ్యవహరించలేదు. ఆయన

ఒక సహృదయ పాఠకుడిగా, ఒక పరిశోధకుడిగా, ఒక సాహిత్యానురాగిగా కవి అంతరంగాన్ని పాఠకునికి చేరువ చేశారు. ప్రతి కవిత వెనుక ఉన్న తాత్వికతను, సామాజిక నేపథ్యాన్ని, చారిత్రక సందర్భాన్ని, మానవీయ స్పందనను ఆయన ఓర్పుతో, వ్యవస్థీకృతంగా, విశ్లేషణాత్మకంగా వివరించారు.

'పక్షులు', 'బాధిత స్త్రీ', 'చెరువు', 'రైతు', 'ప్రకృతి', 'స్మృతి' వంటి అంశాలను ప్రత్యేక అధ్యాయాలుగా తీసుకొని వాటి అంతరార్థాన్ని సుస్పష్టంగా వివరించిన తీరు ఈ గ్రంథానికి ప్రత్యేకమైన శాస్త్రీయ విలువను తీసుకొచ్చింది.

ఈ విశ్లేషణలో ఎక్కడా పాండిత్య ప్రదర్శన కనిపించదు. కనిపించేది సాహిత్యానుభవం మాత్రమే. ఎక్కడా సంక్లిష్టత కనిపించదు.కనిపించేది పాఠకుడిని చేయి పట్టుకుని కవిత్వంలోకి తీసుకెళ్లే ఒక సహృదయ గురువు మాత్రమే. నందిని సిధారెడ్డి గారి నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రయాణాన్ని, ఆయన కవిగా, కథకుడిగా, విమర్శకుడిగా, ఉద్యమకారుడిగా, తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతినిధిగా ఈ గ్రంథం అత్యంత సమగ్రంగా నమోదు చేసింది.

ఈ పుస్తకం ఒక వ్యక్తి సాహిత్యాన్ని మాత్రమే విశ్లేషించదు. తెలంగాణ సమాజ పరిణామాన్ని, ఉద్యమ చరిత్రను, పల్లె జీవన సంస్కృతిని, భాషా పరిణామాన్ని కూడా పాఠకుడి ముందుంచుతుంది.

"తెలంగాణ నాగెటి చాల్లల్ల"మట్టిలో మొలిచిన మనిషిని తెలుసుకోవాలనుకునే వారికి...

రైతు చెమట విలువను అర్థం చేసుకోవాలనుకునే వారికి...

తెలంగాణ భాష అందాన్ని ఆస్వాదించాలనుకునే వారికి...

నందిని సిధారెడ్డి సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశించాలనుకునే వారికి... ఈ గ్రంథం ఒక అపూర్వ మార్గదర్శి.

డాక్టర్ అనుమాండ్ల భూమయ్య గారు ఈ గ్రంథం ద్వారా కేవలం ఒక కవిని విశ్లేషించలేదు. ఒక యుగాన్ని అర్థం చేసుకునే దృష్టిని మనకు అందించారు. సాహిత్య విమర్శ అంటే కేవలం లోపాలను వెతకడం కాదని, కవిత్వంలోని జీవన సత్యాలను వెలికితీయడం అని ఆయన తన రచనతో నిరూపించారు. అందుకే "తెలంగాణ నాగేటి చాల్లల్ల" సాహిత్యాభిమానుల గ్రంథాలయంలో ఉండాల్సిన మరో పుస్తకం కాదు. మళ్లీ మళ్లీ చదవాల్సిన, ప్రతి పఠనంలో కొత్త అర్థాలను ఆవిష్కరించే అరుదైన సాహిత్య నిధి. ఇది కవి నందిని సిధారెడ్డి అక్షరాల్లో పండిన తెలంగాణ మట్టి పరిమళాన్ని, డాక్టర్ అనుమాండ్ల భూమయ్య విశ్లేషణలో మరింత సుగంధభరితంగా పాఠకుని హృదయంలో నిలబెట్టే శాశ్వత సాహిత్య సాక్ష్యం.

- ఆర్వీ ఎన్

కమ్మతెమ్మెర

మిసిమి.... "నూతన కాంతి" అని నైఘంటికార్థం. అన్నట్లుగానే చక్కని శీర్షికలతో విలువైన వ్యాసాలతో పరిశోధకాంశాలతో ప్రతినెలా మన చేతుల్లోకి వస్తూ ఉంటుంది. దానితో పాటు వచ్చే నాలుగు బొమ్మలు పది కాలాలపాటు దాచుకోదగినవి. మాటలు అమూల్యమైనవి. సెప్టెంబరు నెల సంచికలో "జీవన మకరందం" ద్వారా అశ్వినీ కుమార్ గారు అందించిన మాటలు హృదయాన్ని పట్టుకున్నాయి. వాటి వెనకాల ఎంతో అనుభవం, ఆలోచన ఉంది. వాటిని ఆచరించడంలో ఫలితం కూడా ఉంది. వాటిని సూక్తులు అనడం కన్నా కవితాత్మక ప్రబోధాలు అనొచ్చు. బోధన అన్నప్పుడు ఒక విషయాన్ని విశ్లేషించటం. ప్రబోధన అన్నప్పుడు ప్రకృష్టమైన బోధన అవుతుంది. చదువుతున్న, వింటున్న వ్యక్తి ప్రరోచన చెందగలిగే స్థాయి ఆ మాటలకు ఉంటుందని అర్థం. జీవన మకరందంలో ఒక మాట...



"గుండెకు గాయాలైనప్పుడే బ్రతుకు పండుతుంది. జీవితం నిండుగా ఉంటుంది."ఇలా అనడానికి చాలా అనుభవం కావాలి. జీవితం నిండుగా ఉంటుంది అనే ఫలితం కూడా అందులో ఉంది. ఇలా జీవన మకరందం ద్వారా మంచి విషయాల్ని, మాటల్ని హృదయాన్ని తాకేవి, మనసును కదిలించేవి అందిస్తున్న అశ్వినీ కుమార్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.


- డా. తలారి వాసు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

రంగుల్లో రాసిన తత్వగ్రంథం

రమణీయం

కుంచె పలికిన వేదాంతం : కోన రమణారావు కళా విశ్వానికి అక్షర నీరాజనం.

ఏదైనా ఒక మంచి రంగు రంగుల చిత్రాలున్న పుస్తకం కనిపిస్తే బొమ్మల పుస్తకాల్లా పేజీలు తిప్పుతూ చూసి మురిసిపోతాం. కానీ కొద్ది పుస్తకాలు మాత్రమే మన మనసు లోపలికి దిగి, "అసలు ఒక కళను ఎలా చూడాలి? ఒక దృశ్యం వెనుక దాగిన జీవన సత్యాన్ని ఎలా చదవాలి?" అని నేర్పిస్తాయి.



ప్రముఖ చిత్రకారుడు, కవి శ్రీ కోన రమణారావు గారి కళాతపస్సు నుంచి జాలువారిన పుస్తకం'రమణీయం' అరుదైన కళారత్నం. ఇది కేవలం చిత్రాల సంకలనం మాత్రమే కాదు. అలాగని శుష్క తాత్విక సూత్రాల వ్యాఖ్యాన గ్రంథమూ కాదు. భారతీయ సనాతన ధర్మం, తెలుగు ప్రబంధ సాహిత్య సౌరభం, గ్రామీణ సంస్కృతి, ఆధునిక పర్యావరణ వేదన, అద్వైత తాత్విక చింతనల కలబోతగా సాగిన ఒక బహుళ కళా విజువల్ సింఫనీ (Multi-artform Experience). బాపట్ల జిల్లా చీరాలకు చెందిన కోన రమణారావు కళారంగానికి చేసిన సేవకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి విశిష్టమైన 'ఉగాది పురస్కారం' అందుకున్న కళాతపస్వి. రాజా రవివర్మ, పింగళి వెంకయ్య, బాపు, వడ్డాది పాపయ్య, దామెర్ల రామారావు వంటి మహామహుల స్ఫూర్తితో తీర్చిదిద్దిన ఈ గ్రంథం, 222 పేజీల నిండైన వర్ణరూపంతో 2026లో వెలువడింది.

ఈ గ్రంథానికి సమకూరిన వ్యాఖ్యానాలు గ్రంథానికి నాలుగు స్తంభాలుగా నిలిచాయి:

చింతగుంట సుబ్బారావు : ఆంగ్లంలో ప్రతీకాత్మక, తాత్విక, సామాజిక విశ్లేషణను లోతుగా అందించారు.

వెల్లంపల్లి దాశరథి : భారతీయ సంప్రదాయ, ఆధ్యాత్మిక భావనలను హృద్యమైన తెలుగు వచనంలో ఒలికించారు.

పొన్నపల్లి శ్రీరామారావు : తెలుగు సాహిత్య చరిత్ర, ప్రబంధ కావ్య వైభవం, ఛందోబద్ధ కవితలతో చిత్రాలకు జీవం పోశారు.

కొంపల్లి శ్రీనివాసమూర్తి : పురాణాల లోపలి ఆధునిక అంతరార్థాలను, మానసిక విశ్లేషణను సమన్వయం చేశారు.

ఈ నలుగురు వ్యాఖ్యాతల బహుభాషా స్వరాలు చేరడం వల్ల, ఇక్కడ ప్రతి చిత్రం ఒక్కొక్కరి దృష్టిలో ఒక్కో రసగుళికగా రూపాంతరం చెందింది.

అక్షర-నాద సంయోగం : రేఖల్లో ప్రణవ, శ్రీకార నాదాలు గ్రంథ ప్రవేశమే ఒక అలౌకిక అనుభూతి. సాధారణంగా చిత్రకారులు దేవతారూపాలను గీసేటప్పుడు బాహ్య సౌందర్యంపై దృష్టి పెడతారు. కానీ రమణారావు గారు రూపం వెనుక ఉన్న 'మంత్ర-యంత్ర-తంత్ర' తత్త్వాలను రేఖలుగా మలిచారు.

ప్రణోదేవి సరస్వతి (ఓంకార స్వరూపం) : పోతనగారి "భావాంబర వీధి విశ్రుత విహారిణి" భావనను తీసుకుని, సరస్వతీదేవి పైటకొంగును 'ఓంకారం' పైభాగంగా, పద్మాసనం-హంసల కలయికను దిగువ భాగంగా, ఆమె కేశపాశాన్ని వెనుక వంపుగా, శిరస్సుపై నిలిచిన చంద్రుడిని బిందువుగా అమర్చి... మొత్తం రూపాన్ని సాక్షాత్తు ఓంకార ప్రణవ ప్రతిమగా తీర్చిదిద్దిన తీరు అద్భుతం.

శ్రీ లక్ష్మీదేవి (శ్రీకార తేజస్సు) : లక్ష్మీదేవి కిరీటం చుట్టూ వెలిగే ప్రభామండలం, ఇరువైపులా తొండాలెత్తి అభిషేకిస్తున్న గజరాజుల అమరిక నడుమ ఏర్పడిన ఖాళీ ప్రదేశాన్ని (శూన్యాన్ని) దర్శిస్తే, అక్కడ ప్రకాశవంతమైన 'శ్రీ' కారం ఆవిష్కృతమవుతుంది. సంపద అంటే లౌకిక ధనమే కాదు, అది ఆత్మజ్ఞానమనే పరమార్థాన్ని ఈ చిత్రం పట్టి చూపుతుంది.

సాహిత్య-చరిత్రల సజీవ దృశ్యీకరణ : గతం వర్తమానానికి అద్దం: తెలుగు సాహిత్య చరిత్రలోని చిరస్మరణీయ ఘట్టాలకు రమణారావు గారు వేసిన రంగులు కేవలం చరిత్రను గుర్తుచేయవు, నేటి మనిషి అంతరంగాన్ని నిలదీస్తాయి.

కాటుక కంటి నీరు : "సిరికిం జెప్పడు..." తరహాలోనే భాగవతాన్ని రాజులకిచ్చి లౌకిక భోగాలు అనుభవించవచ్చన్న ఆలోచన రాగానే, కంటతడి పెట్టిన సరస్వతీమాత ఆర్తిని చూసి పోతన నిశ్చల ప్రతిజ్ఞ చేసే ఘట్టమిది. ఒకవైపు వాకిట్లోకి వచ్చిన రాచరికపు ధనరాశులు, నల్లటి మోహచ్ఛాయ... మరోవైపు నాగలి, గొడ్లకొట్టం, గిలక బావితో కూడిన స్వచ్ఛమైన కర్షక వాతావరణం! "కళను మార్కెట్ విలువలకు బలిపీఠం ఎక్కించకూడదు" అనే శాశ్వత విలువను ఈ చిత్రం చాటుతుంది.

పోతన - శ్రీనాథులు : రాజసంతో పల్లకీలో సాగిపోయే శ్రీనాథుడి పాండిత్య ప్రదర్శన ఒకవైపు,చేనుగట్టున మట్టిలో ఒదిగి భాగవతం రాస్తున్న పోతన నిగర్వ భక్తిభావం మరోవైపు. పోతన వెనుక ఉన్న వృక్షాల కొమ్మలే ఆంజనేయస్వామి అభయహస్తాలుగా మారి రక్షించడాన్ని చిత్రించిన కళాత్మకత అనితరసాధ్యం.

వరూధినీ-ప్రవరాఖ్య & నలదౌత్యము : ప్రబంధ యుగపు శృంగార సంఘర్షణలను, వరూధిని కామతృష్ణను, ప్రవరుని నిగ్రహాన్ని ఎదురెదురుగా నిలిపి 'స్వేచ్ఛ-స్వాతంత్ర్యాల' మధ్య గీతను ఆవిష్కరించారు. అలాగే నలదౌత్యంలో దమయంతి సతీధర్మాన్ని, సంస్కారాన్ని అత్యంత నాజూకైన వర్ణాలలో నిక్షిప్తం చేశారు.

అద్వైత వేదాంతం & సాకార-నిరాకార సమన్వయం

ఈ పుస్తకపు అత్యున్నత తాత్విక శిఖరాలు :

సాకార నిరాకారములు : త్యాగరాజస్వామి అంతరంగ ఆవిష్కరణ. ఒకవైపు దేవాలయానికి వెళ్లే భక్తులు, బిందెతీర్థం (సాకారార్చన), మరోవైపు ఆకాశంలోని మేఘాలు శంఖచక్రాలుగా, వింధ్య పర్వతాలు వక్షస్థలంగా, ఎగిరే పక్షులు నయనాలుగా రూపుదిద్దుకుని, క్రింది జలపాతంలో దక్షిణ భారతదేశ పట రూపంలో శ్రీమహావిష్ణువు విశ్వరూపం ప్రతిబింబించడం (నిరాకార తత్వం)! భక్తి, భూగోళం, వేదాంతాలను ఇంతగా సమన్వయించిన దృశ్యం భారతీయ చిత్రకళలో అరుదు.

శిఖర దర్శనం (Advaita Peak) : శివలింగం, దాని ఎదుట నంది. కొమ్ముల నడుమ నుంచి శివుడిని చూడటం అంటే మానవుడు తనలోని రాగద్వేషాలు, సుఖదుఃఖాలనే ద్వంద్వాలను దాటి ఏకత్వాన్ని దర్శించడమే. లింగం నుంచి పైకెగసే జ్యోతి జ్ఞానోదయానికి, చిన్ముద్రలోని వేళ్లు అహంకార-కర్మ-మాయల త్యాగానికి ప్రతీకలై "శివోహం" అనే నాదాన్ని నిశ్శబ్దంగా ప్రతిధ్వనింపజేస్తాయి.

పౌరాణిక ప్రతీకలు - ఆధునిక మానవీయ కోణాలు

పురాణ కథల్లోని మానసిక, సామాజిక విలువలపై సరికొత్త ప్రయోగం జరిగింది :

బుద్ధుని జీవకారుణ్యం & బుద్ధధరణి : దెబ్బతిన్న హంసను సేదదీర్చే సిద్ధార్థుడి చిత్రం-"ప్రాణం పోయడం చేతకానప్పుడు ప్రాణం తీసే హక్కు ఎవరిచ్చారు?" అన్న నిత్యసత్యమైన ప్రశ్నను రేకెత్తిస్తుంది. అలాగే సర్పం పడగ నీడన సేదదీరే కప్ప దృశ్యం ద్వారా అహింస యొక్క మహోన్నత స్థితిని నిరూపించారు.

సీతాన్వేషణ & అంగుళీయక ప్రదానం : హనుమంతుని లంకాగమనం కేవలం శారీరక శక్తి మాత్రమే కాదు. అది తీవ్రమైన వేగం, వినయం, బాధ్యతల సమన్వయం. సీతమ్మకు ఉంగరం ఇచ్చే సన్నివేశం నిరాశా నిస్పృహల్లో మునిగిన ప్రాణికి దైవం అందించే భరోసా.

గరుడుని దాస్యవిముక్తి : తల్లి విముక్తి కోసం అమృతాన్ని సాధించిన గరుత్మంతుని కథ ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని, కర్తవ్య నిష్ఠను కళాకారుడు ప్రబోధించారు.

ప్రకృతి : కేవలం నేపథ్యం కాదు... నిత్యసహనటి 'రమణీయం'లో ప్రకృతి మూగగా ఉండదు. అది పాత్రలతో కలిసి నవ్వుతుంది, పలవరిస్తుంది, విలపిస్తుంది.

సంధ్యా సుందరి (గిరిగీత ముఖచిత్రం) : సూర్యుడు తిలకంగా, కొండల వంపులు కనుబొమ్మలుగా, నదీ ప్రవాహం నాసికగా, అలల కదలికలు అర్ధనిమీలిత నేత్రాలుగా మారి కొండల నడుమ ఒక స్త్రీ ముఖం (Pareidolia శైలిలో) రూపుదిద్దుకోవడం చిత్రకారుని సృజనాత్మక ప్రతిభకు పరాకాష్ట!

లతా తన్వీ పరిష్వంగము & స్వాతిముత్యం : ప్రకృతిలోని స్త్రీ-పురుష తత్వాల కలయికను, ముత్యపు చిప్పలో పడిన వర్షపు బిందువు ఆణిముత్యంగా మారే క్రమాన్ని మానవ జీవన వికాసానికి అన్వయించిన తీరు అత్యంత రమణీయం.

పర్యావరణ వేదన & గ్రామీణ సంస్కృతి (సమకాలీన స్పృహ) ఈ గ్రంథం కేవలం దేవాలయాలు, పురాణాలకే పరిమితమైపోలేదు, నేటి వాస్తవాల్లోకి అడుగుపెట్టింది.

గుండెగూటి గువ్వలు : అభివృద్ధి పేరుతో చెట్లను నరికేస్తూ, కొండలను పిండి చేస్తూ, కాంక్రీట్ అడవులను నిర్మిస్తున్న ఆధునిక మనిషి స్వార్థంపై వేసిన దృశ్య కొరడా ఇది. విషణ్ణ వదనంతో కన్నీరు కారుస్తున్న ధరిత్రీమాత చిత్రం నేటి పర్యావరణ సంక్షోభాన్ని కళ్లకు కడుతుంది.

కాలుష్య రహిత లోకానికి స్వాగతం : జల, వాయు, ధ్వని కాలుష్యాలతో పాటు మనుషుల అంతరంగాల్లో పేరుకుపోతున్న 'మానసిక కాలుష్యాన్ని' ప్రక్షాళన చేయాలని ఆకాంక్షించే చిత్రం.

పల్లె జీవనం-జాతర & సంక్రాంతి : సంక్రాంతి వేళ హరిదాసులు, గంగిరెద్దులు, పిట్టలదొరలు, కోడిపందేలతో పాటు అట్లతద్దె నాటి ఉయ్యాలలు, జానపద జాతరల్లోని **సిడిమాను** సంప్రదాయాలను రమణారావు గారు కాన్వాస్‌పై సజీవంగా నిలిపారు.

స్వయంప్రభ : చిత్రకారుడే కవిగా, వాగ్గేయకారుడిగా... కోన రమణారావు గారిలోని అరుదైన విశేషం ఏమిటంటే- ఆయన కేవలం కుంచె పట్టిన చిత్రకారుడు మాత్రమే కాదు. ఆయన స్వయంగా కవి, గేయ రచయిత, స్వరకర్త!

రాధాకృష్ణుల ప్రణయ తత్వాన్ని వివరిస్తూ ఆయన రాసిన "ఆలకించు నాస్వామీ, ఆపకు ఆలాపనా..." గేయం, ఉదయించే భానుడిని జాగృతం చేస్తూ పలికిన "హాయి జోలలు...",

సంధ్యావేళ చిన్న ప్రమిద వెలిగించిన యువతి వేదనగా సాగిన "జ్ఞానజ్యోతి" (చిన్నారి ముంగిళ్ల చిరుదివ్వెనే నేను...), అస్తిత్వ శోధనగా సాగిన "కో-హం (కః అహం)" దార్శనిక గేయం.... ఇవన్నీ ఆయనలోని వాగ్గేయకార ప్రతిభకు నిదర్శనాలు. ఆయన వేసిన ప్రతి రంగు వెనుక ఒక సాహిత్య పల్లవి నిశ్శబ్దంగా దాగి ఉంది!

'రమణీయం' పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నప్పుడు మనం మొదట బొమ్మలను చూస్తాం. కొద్ది పేజీలు తిప్పగానే ఆ బొమ్మల వెనుక ఉన్న కథను చదువుతాం. గ్రంథం ముగిసేసరికి, ఆ చిత్రాల ద్వారా మనల్ని మనమే చదువుకోవడం ప్రారంభిస్తాం! కోన రమణారావు గారు రంగులతో దృశ్యసృష్టి చేస్తే, వ్యాఖ్యాతలు తమ అక్షరాలతో ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆ ప్రాణానికి తెలుగు సంస్కృతి, భారతీయ వేదాంతం అమరత్వాన్ని ప్రసాదించాయి.

రమణీయం ఒక పుస్తకం కాదు-కళ్లతో చదివే కళ, మనసుతో అనుభవించే సాహిత్యం, ఆలోచనతో దర్శించే తత్వం. ఇంతటి దృశ్య-సాహిత్య సంపదను అందించే ఈ అపూర్వ కళాగ్రంథం వెల రూ. 1,500/- మాత్రమే."

- ఎన్వీఆర్

---

50 సంవత్సరాల క్రితం వివాహం ఒక వేడుక ఒక మహోత్సవం
ఇప్పుడది ఫంక్షన్ హాలులో ఒక ఆడంబరాల తంతు.
అప్పుడు ప్రజలు పాతవైన వస్తువులను పారేయకుండా వాటిని బాగు చేసుకొని మళ్లీ ఉపయోగించుకునేవారు
ఇప్పుడు మార్కెట్లోకి వచ్చిన ప్రతిదీ ఇంటికి వచ్చిన మరునాడే మాయమవుతుంది.
అప్పుడు మనం చెట్ల నీడలలో ఆడుకునే వాళ్ళం, పుస్తకాలు చదువుతూ కలలు కంటూ ఉండేవాళ్ళం. ఇప్పుడు చిన్న చిన్న తెరలపై (సెల్ ఫోన్) వేళ్ళతో స్క్రోల్ చేస్తూ ఆనందం కోసం వెంపర్లాడుతున్నాం.




అన్నీ తేలికగా మారాయి కానీ ఏదో వింతగా జీవితం మాత్రం భారంగా గడుస్తుంది.
ఈనాడు ప్రపంచం మొత్తం మన ముందే ఉంది కానీ చుట్టూ ఉన్న దాన్ని చూడడం మరిచిపోయాం. 50 సంవత్సరాల క్రితం పెద్దలు మాట్లాడితే పిల్లలు శ్రద్ధగా వినేవారు ఇంటి ముందు వరండాలో కాఫీలతో కమ్మని కబుర్లు కథలు చెప్పుకునే వారం.
50 సంవత్సరాల క్రితం మన దగ్గర తక్కువ వస్తువులు ఉండేవి కానీ ఒక విధమైన సంతృప్తి ఉండేది. అరుగు చుట్టూ కేరింతలు నవ్వులు అతిథుల రాక ఆనందోత్సాహాలే!
ఇప్పుడు ప్రతిదీ నిమిషాల మీద వెంటనే జరుగుతుంది కానీ ఏది ఎక్కువ కాలం నిలవడం లేదు.

- కమ్మారి అలెగ్జాండర్, నల్లగొండ.

మనిషి అంతరంగాన్ని ప్రశ్నించిన చలం

గుడిపాటి వెంకట చలం గారు ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన, విభిన్నమైన, ప్రశ్నించే స్వరం. ఆయన రచయిత మాత్రమే కాదు; సమాజాన్ని లోతుగా పరిశీలించిన ఆలోచనాపరుడు. వ్యక్తి స్వేచ్ఛను సమర్థించిన వారు;మానవ సంబంధాలపై తీవ్రమైన ఆత్మపరిశీలన చేసిన తాత్వికుడు. ముఖ్యంగా స్త్రీ జీవితాన్ని, ఆమెకు సమాజం విధించిన ఆంక్షలను, ప్రేమను, వివాహ వ్యవస్థను, వ్యక్తిగత స్వేచ్ఛను ఆయన తన రచనల ద్వారా ప్రశ్నించిన ఆధునికుడు! చలం రచనలను చదివేటప్పుడు ముందుగా మనకు కనిపించేది ఆయన తిరుగుబాటు. కానీ ఆ తిరుగుబాటు కేవలం సంప్రదాయాన్ని వ్యతిరేకించడానికి చేసిన తిరుగుబాటు కాదు. దాని వెనుక ఒక మౌలికమైన ప్రశ్న ఉంది: "మనిషి తన జీవితాన్ని నిజంగా తనకు తానుగా జీవిస్తున్నాడా?"




ఈ ప్రశ్నే చలం సాహిత్యానికి కేంద్రబిందువుగా కనిపిస్తుంది, స్త్రీని ఒక వ్యక్తిగా చూడాలనే పిలుపు చలం సాహిత్యంలో స్త్రీ ఒక భార్యగా, తల్లిగా, కోడలిగా, కుమార్తెగా మాత్రమే కనిపించదు. ఆమెకు తనకంటూ ఒక మనసు ఉంది; తనకంటూ కోరికలు ఉన్నాయి; తనకంటూ స్వప్నాలు ఉన్నాయి; తన జీవితంపై తనకు సంపూర్ణ హక్కు ఉంది. ఈ దృష్టి ఆయన ప్రసిద్ధ నవల **మైదానం**లో బలంగా కనిపిస్తుంది. ఆ రచన వెలువడిన కాలాన్ని దృష్టిలో పెట్టుకుంటే, స్త్రీ-పురుష సంబంధాల గురించి, వివాహ వ్యవస్థ గురించి, స్త్రీ స్వేచ్ఛ గురించి ఇంత బహిరంగంగా ప్రశ్నించడం, అప్పటి సమాజంలో తీవ్రమైన చర్చకు దారితీసింది. "మైదానం" చలానికి ప్రశంసలతో పాటు తీవ్ర విమర్శలను కూడా తెచ్చిన రచనగా, సాహిత్య సదస్సులలో చర్చనీయాంశమైంది. అయితే **మైదానం**ను కేవలం ఒక ప్రేమకథగా చదవడం చలం ఆలోచనను చాలా చిన్న పరిధిలోకి తీసుకురావడమే అవుతుంది.

ఆ రచన వెనుక ఉన్న ప్రధాన ప్రశ్న : ఒక స్త్రీ తన జీవితాన్ని తన ఇష్టానుసారం నిర్ణయించుకునే హక్కు కలిగి ఉందా? చలం సమాజాన్ని ఈ ప్రశ్న ఎదుట నిలబెట్టాడు! అతని దృష్టిలో స్త్రీ స్వేచ్ఛ అంటే కేవలం బాహ్య స్వేచ్ఛ కాదు. ఆమె ఆలోచనకు, శరీరానికి, ప్రేమకు, జీవిత నిర్ణయాలకు ఆమెకే అధికారం ఉండాలి అనే భావన ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ కారణంగానే చలం రచనలు స్త్రీల జీవితాలపై, వారి స్వేచ్ఛపై, వారి మానసిక సంఘర్షణలపై విస్తృతమైన చర్చకు దారితీశాయి. "స్త్రీ" – ఒక సిద్ధాంతాత్మక ప్రశ్న. చలం రచనల్లో "స్త్రీ" అనే గ్రంథానికి ప్రత్యేక స్థానం ఉంది. స్త్రీ-పురుష సంబంధాలపై తన ఆలోచనలను సిద్ధాంతపరంగా వ్యక్తం చేసిన రచనగా దీనిని చూడవచ్చు. అందులో స్త్రీ స్థానం, స్వేచ్ఛ, పురుషాధిక్య సమాజం, వివాహం, ప్రేమ వంటి అంశాలపై ఆయన తన అభిప్రాయాలను ముందుకు తెచ్చారు. చలం అడిగిన ప్రశ్న ఇప్పటికే అసౌకర్యకరమైనదే : స్త్రీని రక్షించాల్సిన వ్యక్తిగా మాత్రమే ఎందుకు చూడాలి? ఆమె తన జీవితానికి తానే నిర్ణయకర్త ఎందుకు కాకూడదు? ఇది కేవలం స్త్రీ విముక్తికి సంబంధించిన ప్రశ్న కాదు. ఇది వ్యక్తి స్వాతంత్ర్యానికి సంబంధించిన ప్రశ్న. అందుకే చలం సాహిత్యాన్ని కేవలం స్త్రీ సమస్యల సాహిత్యంగా చూడడం కూడా పూర్తిగా సరిపోదు. ఆయన అసలు ప్రశ్న వ్యక్తి మీద సమాజానికి ఎంత అధికారం ఉండాలి? అన్నది. **ప్రేమ లేఖలు** వంటి రచనల్లో ప్రేమ, వ్యక్తిత్వం, అనుబంధం, భావోద్వేగం వంటి అంశాలపై ఆయన ఆలోచన కనిపిస్తుంది. చలం దృష్టిలో ప్రేమ కేవలం సామాజిక ఒప్పందం కాదు; అది మనిషి అంతరంగాన్ని నిజాయితీగా ఎదుర్కొనే అనుభవం. అయితే ఇక్కడే ఆయన రచనలు ఒక ముఖ్యమైన సమస్యను ముందుకు తెస్తాయి: ప్రేమ పేరుతో మనం మరొక మనిషిని సొంతం చేసుకోవాలనుకుంటున్నామా? లేక వారి స్వేచ్ఛను గౌరవిస్తూ ప్రేమించగలుగుతున్నామా? ఈ ప్రశ్న నేటికీ తన unique identityని కోల్పోలేదు. సమాజపు కపటత్వంపై చలం తిరుగుబాటు. చలం తిరుగుబాటులో మరో ప్రధాన అంశం సామాజిక కపటత్వం.

బయట ఒక నీతి, లోపల మరో జీవితం–ఈ ద్వంద్వాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. సమాజం కొన్ని విషయాలను బహిరంగంగా పవిత్రమైనవిగా ప్రకటిస్తూ, అదే విషయాలను వ్యక్తిగత జీవితంలో వేరే విధంగా ఆచరించడాన్ని చలం సహించలేదు. అందుకే ఆయన రచనలు పాఠకుడిని సౌకర్యవంతమైన నైతికతలో నిద్రపోనివ్వవు. అవి అడుగుతాయి : నువ్వు నమ్ముతున్నది నిజంగానే నీ నమ్మకాన్నేనా? లేక సమాజం నీకు నేర్పిన ఒక నటనా? ఈ ప్రశ్నే చలం సాహిత్యంలోని తిరుగుబాటు స్వభావానికి మూలం.

దైవమిచ్చిన భార్య–సంబంధాల మరో కోణం: **దైవమిచ్చిన భార్య** వంటి రచనల్లో కూడా చలం కుటుంబ సంబంధాలను సాధారణమైన మంచీ-చెడుల కొలమానాలతో కాకుండా, వ్యక్తుల అంతరంగ సంఘర్షణల ద్వారా పరిశీలిస్తాడు.



చలం పాత్రలు తరచుగా మనకు అసౌకర్యం కలిగిస్తాయి. ఎందుకంటే అవి పూర్తిగా మంచివి కావు, పూర్తిగా చెడ్డవీ కావు. అవి కోరికలు, భయాలు, బలహీనతలు, ప్రేమలు, సంఘర్షణలతో కూడిన మనుషులు. ఇదే చలం రచనలకు మానసిక లోతును ఇస్తుంది.

మ్యూజింగ్స్-బయటి తిరుగుబాటు నుంచి లోపలి అన్వేషణకు చలం జీవితాన్ని మొత్తంగా పరిశీలించినప్పుడు ఒక ఆసక్తికరమైన పరిణామం కనిపిస్తుంది. ఈ ప్రారంభ దశలో ఆయన ప్రశ్న ఎక్కువగా సమాజాన్ని ఉద్దేశించి ఉంటుంది. తరువాతి దశలో అదే ప్రశ్న మనిషి అంతరంగం వైపు తిరుగుతుంది. ఈ మార్పును అర్థం చేసుకోవడానికి "మ్యూజింగ్స్" ముఖ్యమైన రచన. ఇందులో జీవితం, ప్రేమ, మానవ సంబంధాలు, స్వేచ్ఛ, ఆధ్యాత్మికత, వ్యక్తి అంతరంగం వంటి అనేక అంశాలపై ఆయన ఆలోచనలు కనిపిస్తాయి. ఇక్కడ చలం ప్రశ్న సమాజాన్ని మాత్రమే ఉద్దేశించి ఉండదు. అది తనను తాను కూడా ప్రశ్నించుకోవడం ప్రారంభిస్తుంది. మనిషి బయట ఉన్న బంధాలను తెంచుకున్నంత మాత్రాన నిజంగా స్వేచ్ఛ పొందుతాడా? లేక తనలోని భయాలు, కోరికలు, అహంకారం, అసూయ, మమకారాల నుంచి కూడా విముక్తి పొందాలా? ఈ ప్రశ్న చలం ఆలోచనను ఒక సామాజిక సంస్కరణ దశ నుంచి ఆత్మాన్వేషణ దిశకు తీసుకెళ్తుంది. తిరుగుబాటు నుంచి ఆధ్యాత్మికత వైపు చలం జీవితంలోని చివరి దశలో అరుణాచలానికి వెళ్లి ఆధ్యాత్మిక జీవనానికి దగ్గరయ్యారు. రమణ మహర్షి ప్రభావం ఆయన ఆలోచనలపై పడింది. ఆయన జీవితంలో ఈ దశను పరిశీలిస్తే, ప్రారంభంలో సమాజంలోని బాహ్య బంధాలను ప్రశ్నించిన చలం, తరువాత మనిషి అంతరంగంలోని బంధాలను ప్రశ్నించే స్థితికి చేరుకున్నట్లు కనిపిస్తుంది. ఇది చలం జీవితంలో ఒక గొప్ప పరిణామం. సమాజాన్ని మార్చాలని కోరిన తిరుగుబాటు, చివరికి తనను తాను తెలుసుకోవాలనే అంతర్యానంగా మారింది. ఇక్కడే చలం రచయితగా మరింత విశాలంగా కనిపిస్తాడు. ప్రజాబాహుళ్యానికి చలం ఇచ్చిన సందేశం. చలం రచనలన్నింటినీ ఒకే వాక్యంలో సంక్షిప్తం చేయడం కష్టం. అయినప్పటికీ ఆయన సాహిత్యం ప్రజలకు అందించిన ప్రధాన సందేశాలను ఇలా చెప్పవచ్చు :

మొదటిది - వ్యక్తి స్వేచ్ఛ : మనిషి తన జీవితాన్ని తనకు తానే అర్థం చేసుకుని జీవించాలి. సమాజం పెట్టిన ప్రతి నియమాన్ని ప్రశ్నించకుండా అనుసరించడం జీవితం కాదు.

రెండవది-స్త్రీ గౌరవం : స్త్రీని ఒక సంబంధం ద్వారా మాత్రమే నిర్వచించకూడదు. ఆమె స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, ఆలోచనను, కోరికలను, నిర్ణయాధికారాన్ని గౌరవించాలి.

మూడవది-ప్రేమలో నిజాయితీ : ప్రేమ పేరుతో స్వార్థం, స్వాధీన భావం, కపటత్వం పెరగకూడదు. నిజమైన అనుబంధం వ్యక్తిత్వాన్ని అణచకూడదు.

నాలుగవది-సామాజిక కపటత్వాన్ని ప్రశ్నించడం : సమాజం అంగీకరిస్తున్నదంతా సత్యం కాదు. ఆచారం పేరుతో అన్యాయం జరుగుతుంటే దాన్ని ప్రశ్నించాలి.

ఐదవది- మానవ సంబంధాల్లో సున్నితత్వం : మనిషిని తీర్పు చెప్పే ముందు అతని అంతరంగాన్ని అర్థం చేసుకోవాలి.


ఆరవది-చివరికి ఆత్మాన్వేషణ : బయటి ప్రపంచాన్ని ప్రశ్నించడం ఎంత ముఖ్యమో, ఒక దశలో మనల్ని మనం ప్రశ్నించుకోవడం కూడా అంతే ముఖ్యం.

చలం-ఇంకా ఎందుకు చదవాలి? : చలం కాలం మారిపోయింది. సమాజం కూడా ఎంతో మారింది. స్త్రీ విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాల్లో భారతీయ సమాజం గత శతాబ్దంతో పోలిస్తే ముందుకు వచ్చింది. అయినా చలం అడిగిన కొన్ని ప్రశ్నలు పూర్తిగా గతానికి చెందినవి కావు. స్త్రీని మనం నిజంగా స్వతంత్ర వ్యక్తిగా చూస్తున్నామా? ప్రేమలో స్వేచ్ఛను గౌరవిస్తున్నామా? వివాహంలో వ్యక్తిత్వానికి స్థానం ఇస్తున్నామా? మన నైతికత నిజమైనదా, లేక సామాజిక ప్రదర్శనా? మన జీవితం మనదేనా, లేక ఇతరుల అంచనాల ప్రతిరూపమా? ఈ ప్రశ్నలు ఇంకా మన ముందే ఉన్నాయి. అందుకే చలం రచనలు పాత పుస్తకాలుగా మాత్రమే మిగలలేదు. అవి మనల్ని మనం పరిశీలించుకునే అద్దాలుగా ఇప్పటికీ పనిచేస్తున్నాయి. చలం గొప్పతనం ఆయన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడనడంలో లేదు. ప్రశ్నించడానికి భయపడని ధైర్యాన్ని తెలుగు పాఠకుడికి అందించడంలో ఉంది.

- డా. మునగా రామమోహన రావు, ఫోన్ : 9840091400

నాగరకత అస్తిత్వానికి నిశ్శబ్ద దర్పణం- కళ - నాడు-నేడు

మనిషి తన అంతరంగాన్ని ఆవిష్కరించుకోవడానికి భాష కంటే ముందే ఎంచుకున్న సహజ వ్యక్తీకరణ రూపం ' కళ '. ఆదిమ మానవుడు గుహల గోడలపై గీసిన బొగ్గు గీత మొదలుకొని, నేటి డిజిటల్ తెరలపై వెలుగులు చిమ్మే అల్గారిథమిక్ సృష్టి వరకు–మానవ పరిణామ క్రమంలో కళ ఎల్లప్పుడూ ఒక సమాంతర ప్రయాణాన్ని సాగిస్తూనే ఉంది. రాజ్యాలు కూలిపోయినా, యుగాలు మారినా, నాగరికత తాలూకు ఆత్మను చెక్కుచెదరకుండా తరతరాలకు మోసుకెళ్లిన అద్భుత వారధి కళ. ఈ నేపథ్యంలో, కళను కేవలం సౌందర్యారాధనగానో, సాంప్రదాయ విద్యగానో కాకుండా ఒక సంపూర్ణ మానవీయ తత్వంగా ఆవిష్కరించే ఆలోచనాత్మక పుస్తకమే "కళ' నాడు–నేడు".



ఈ పుస్తకం ప్రారంభంలోనే కళను ఒక బిగుతైన చట్రంలో బంధించకుండా, పాఠకుడి అంతరంగాన్ని తట్టిలేపే మౌలిక ప్రశ్నతో పయనం మొదలుపెడుతుంది. కళ అంటే కేవలం కుంచె, ఉలి, తాళం, అభినయం మాత్రమేనా? లేక మనిషి దైనందిన ఉనికిలోనే అది లీనమై ఉందా?

రచయిత ఈ విభాగాన్ని విస్తరించిన తీరు అభినందనీయం. రంగులు, శిల్పం, గానం వంటి సాంప్రదాయ లలితకళలతో పాటుగా–వంటలోని నైపుణ్యం, వాస్తు నిర్మాణ కౌశలం, తోటల పెంపకం, అలంకరణ, నేతపని, చివరకు నేటి గ్రాఫిక్ డిజైన్ వరకు మానవుడి ప్రతి సృజనాత్మక శ్రమను కళగా గుర్తించమని ఈ పుస్తకం ప్రతిపాదిస్తుంది. కళ అనేది ఒక ప్రత్యేక వర్గానికో లేదా గ్యాలరీలకో పరిమితమైనది కాదని, అది నిత్యజీవితంలో శ్రద్ధతో చేసే ప్రతి పనిలోనూ అంతర్లీనంగా ప్రవహిస్తుందని నిరూపించడమే ఈ గ్రంథపు తొలి విజయం. భారతీయ సంస్కృతిలో చతుష్షష్టి (64) కళల ప్రస్తావన చిరపరిచితమే అయినప్పటికీ, చాలావరకు అవి గ్రంథస్థ జాబితాలకే పరిమితమైపోయాయి. రచయిత ఈ 64 కళలను కేవలం ఒక చారిత్రక అంశంగా కాక, ఒక జీవద్భాషగా పాఠకుల ముందుంచారు. చిత్రలేఖనం, శిల్పం, నాటకం, మాయాజాలం వంటి వాటితో పాటు ముగ్గులు, ఎంబ్రాయిడరీ, కుండల తయారీ, వడ్రంగం, కాలిగ్రఫీ, ఆభరణాల రూపకల్పన, మైక్రో ఆర్ట్ వంటి విభిన్న ప్రయోగాలను ఒకే సమగ్ర వేదికపైకి తీసుకువచ్చారు. అయితే ఈ పుస్తకం గతాన్ని కీర్తించడంతోనే ఆగిపోలేదు :

ప్రాచీన కాలంలో పేర్కొన్న ఈ నైపుణ్యాలు నేటి డిజిటల్ యుగంలో ఏ రూపం సంతరించుకున్నాయి? సాంకేతిక విప్లవం నేపథ్యంలో ఈ కళలను మనం ఏ విధంగా పునర్నిర్వచించుకోవాలి? అనే ఆలోచనను రేకెత్తించడం ద్వారా ప్రాచీన జ్ఞానాన్ని సమకాలీన దృక్పథంతో సమన్వయం చేసిన పద్ధతి గ్రంథానికి విస్తృతమైన పరిణతిని ఇచ్చింది.

కళను ఆస్వాదించడం ఒక ఎత్తయితే, దాని నిర్మాణాన్ని లోతుగా అర్థం చేసుకోవడం మరొక ఎత్తు. ఈ గ్రంథం కళాప్రియులకు అవసరమైన ప్రాథమిక విద్యా పరిభాషను ఎంతో సహజంగా సమకూరుస్తుంది.

* చిత్రకళలో డ్రాయింగ్, పెయింటింగ్, ప్రింట్‌మేకింగ్, ఇలస్ట్రేషన్ వంటి అంతర్గత విభేదాలను వివరించడం,

* శిల్పకళలో సంపూర్ణ రూపాలు మొదలుకొని రిలీఫ్ శిల్పం, హై రిలీఫ్, లో రిలీఫ్ వంటి వర్గీకరణలను పదార్థాల ఆధారంగా విశ్లేషించడం, పాఠకుడికి ఒక గ్యాలరీని లేదా చారిత్రక ప్రదేశాన్ని చూసే దృష్టిని మారుస్తుంది. ఒక చిత్రాన్ని కేవలం 'చూడటం' వేరు, రంగుల కలయికలో కళాకారుడి ఆలోచనను 'చదవడం' వేరు.అలాగే రాతిని చూడటం వేరు, ఆ రాయిలో నిక్షిప్తమై ఉన్న శిల్పి అంతరంగాన్ని స్పృశించడం వేరు అనే సత్యాన్ని ఈ పుస్తకం ఎంతో సున్నితంగా పంచుతుంది. "నాడు" నుంచి "నేడు" వరకు అనే శీర్షికకు తగినట్లే, పుస్తకంలోని కాలస్పృహ అత్యంత

ప్రశంసనీయం. ఆధునికత రాకతో సాంప్రదాయం ప్రమాదంలో పడుతుందనే సంకుచిత వాదనను తోసిపుచ్చుతూ, సాంకేతికతను మానవ ఊహాశక్తికి విస్తరణగా చూడాలనే సమతుల్య దృక్పథాన్ని రచయిత ప్రదర్శించారు.

సాధనాలు మారవచ్చు, మాధ్యమాలు సాంప్రదాయ కాన్వాస్ నుంచి డిజిటల్ స్క్రీన్‌లుగా రూపాంతరం చెందవచ్చు... కానీ సృష్టించాలనే మానవ తపన, భావోద్వేగాలను పంచుకోవాలనే అంతరంగిక దాహం ఎప్పటికీ శాశ్వతం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఆర్ట్, యానిమేషన్ వంటి సమకాలీన ఆవిష్కరణల మధ్య కూడా మానవ మేధస్సు, అనుభూతి ప్రాధాన్యతను నిలబెట్టడం నేటి పాఠకులకు అత్యవసరమైన ఆలోచన. ఈ పుస్తకం కేవలం సౌందర్య విశ్లేషణతో ముగియదు.సమాజాన్ని ఒక ఆత్మపరిశీలనకు ఆహ్వానిస్తుంది. నేటి తరానికి ఆధునిక గ్రాఫిక్స్, స్క్రీన్‌ల గురించిన పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులో ఉన్నప్పటికీ, మన నేల నుంచి పుట్టిన కళారూపాల వెనుక ఉన్న శ్రమ, తత్వశాస్త్రం ఎంతవరకు చేరుతున్నాయి? ముగ్గుల వెనుక ఉన్న సంక్లిష్ట జ్యామితి, జానపద బాణీల వెనుక దాగిన సామూహిక జీవనవేదన, చేనేత మగ్గం వెనుక ఉన్న తరం నైపుణ్యం క్రమంగా మరుగున పడిపోతున్న తరుణంలో, కళను పరిరక్షించడం అంటే కేవలం కొన్ని వృత్తులను కాపాడటం కాదు–జాతి తాలూకు సాంస్కృతిక జ్ఞాపకాలను, జీవన మూలాలను నిలబెట్టుకోవడమే అనే సత్యాన్ని రచయిత బలంగా వినిపించారు.

విషయ పరిజ్ఞానం, అధ్యయన శైలి, మానవీయ స్పర్శల సమ్మేళనంగా తీర్చిదిద్దిన ఈ పుస్తకం విద్యార్థులకు, కళాకారులకు, సాహిత్య అధ్యయనకారులకు మాత్రమే కాక, జీవన సౌందర్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరికీ ఒక అద్భుతమైన మార్గదర్శిగా నిలుస్తుంది. కళను చూడటానికి రెండు కళ్ళు ఉంటే చాలు, కానీ దాని వెనుక ఉన్న జీవాన్ని అనుభూతి చెందడానికి కళా దృష్టి కావాలి. ఆ విశాలమైన అంతర్దృష్టిని ప్రతి పాఠకుడిలో జాగృతం చేసే సజీవ అక్షర ప్రయాణమే "కళ నాడు–నేడు". ఈ పుస్తకం కళా చరిత్రకు సమర్పించిన ఒక అపురూప గౌరవం.

- విజయ, ఫోన్ : 9393620448

మీకు తెలుసా?

1. బెంగుళూరు నాగరత్నమ్మ గారి ఔదార్యం : *దేవదాసి వంశంలో జన్మించిన బెంగుళూరు నాగరత్నమ్మ ఒక అసాధారణ స్త్రీమూర్తి. సంగీత, సామాజిక రంగాల్లో ఆమె చూపిన ప్రతిభ, తెగువ విలక్షణమైనవి. చిన్నతనంలో బీదరికం అనుభవించి ఎన్నో కష్టాలుపడినా, సంగీత, సాహిత్య నృత్య కళలలో ఎంతో నైపుణ్యం సాధించి, పండితుల మన్ననలు పొందింది. తన కళా ప్రదర్శనలతో సంపన్నురాలు అయి తన జీవితాన్ని త్యాగరాజ సేవకి అంకితం చేసిన విదుషీమణి. ఈ రోజున మనం చూస్తున్న తిరువయ్యారులోని శ్రీ త్యాగరాజ స్వామి ఆలయశోభ అంతా ఈ కళాకారిణి త్యాగఫలితమే! తిరువయ్యారులో ఉన్న త్యాగరాజస్వామివారి సమాధి దిక్కుమొక్కు లేకుండా, ముళ్ళూ–తుప్పలూ, పాము–పుట్రల మధ్య పడి ఉంటే, నాగరత్నమ్మ చూసి చలించిపోయింది. త్యాగరాజస్వామి వారి మీద ఉండే భక్తితో తన నగలు, సంపద, సర్వస్వం అర్పించి, ఆయన సమాధి మీద ఆలయం కట్టించడానికి పూనుకుంది. ఈమె సంకల్పంతో అక్టోబరు 27, 1921న సమాధి మీద ఆలయ నిర్మాణం మొదలయ్యింది. ఈ నిర్మాణానికి ఇంకా అదనంగా చాలా సొమ్ము అవసరమయింది. దాంతో నాగరత్నమ్మ వీలైనన్ని ఎక్కువ కచేరీలు ఒప్పుకుని, వచ్చిన ప్రతి రూపాయినీ ఆలయ నిర్మాణానికే ఖర్చు చేసింది. ముళ్ళ కంచెల స్థానంలో చక్కటి ప్రహారీ గోడ వచ్చింది. గుండ్రటి గోపురంతో చతురశ్రాకారపు గుడి తయారయింది. ఎటువంటి విఘ్నాలూ కలగకుండా భోగగణపతి ఆలయం, యోగ ఆంజనేయస్వామి ఆలయం కూడా కట్టించింది. జనవరి 7, 1925న దేవాలయాన్ని శుద్ధి చేసి ఘనంగా త్యాగరాజ విగ్రహ ప్రతిష్ఠ చేశారు.*

ఆ మహావాగ్గేయకారుడు సమాధి చెందిన ఇన్నేళ్ళకి ఆయనకి ఒక ఆలయం ఏర్పడటంతో కర్ణాటక సంగీత ప్రపంచం ఆనందంతో పొంగిపోయింది. మిగిలిన నిర్మాణం నవంబరు 1938 నాటికి పూర్తయింది. వాకిలి పక్కన పాలరాతి ఫలకం మనం ఇప్పటికీ చూడవచ్చు.

(ప్రణవం - జనవరి 2011)

మిసిమి
మాసపత్రిక

చందా వివరాలు:

₹ 720/- (సంవత్సర చందా),
₹ 1440/- (రెండు సంవత్సరాలకు),
₹ 2,160/- (మూడు సంవత్సరాలకు),

Misimi A Unit of Kalajyothi Process Pvt. Ltd.,

మూడు సంవత్సరాల చందాకి ప్రత్యేక బహుమతి

మీరు రూ. 2,160/- మూడు సంవత్సరాల చందాగా పంపండి. మీకు నాలుగు వందల రూపాయలు విలువగల పుస్తకాలు బహుమతిగా ఇస్తాము. వివరాలకు ఫోన్ చేయండి. (ఫోన్ : 994 951 6567)


HDFC Current Account No. 50200091136242
A/C : Misimi A Unit of Kalajyothi Process Pvt. Ltd.,
IFC Code : HDFC0000472
Account Branch : RTC X Roads

మిసిమి ప్రచురణలు


ఉపనిషత్ ఉద్యానవనమ్


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం


దూరతీరాలలో...


బహుముఖ బనారస్


ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం


సప్తపర్ణి



వ్యాస మంజూష


ప్రవాస సాహిత్యం


చార్లీ చాప్లిన్


రజ్జు సర్ప భ్రాంతి


భైరన్


యాత్రా కథనాలు


షెల్లీ జీవిత కథ


కొత్త కెరటాలు


నృత్యభారతి


పారిజాతం


సిద్ధార్థ

ప్రతులకు: మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.
ప్లాట్ నెం. 196, రోడ్ నెం. 13, జూబిలీ హిల్స్, హైదరాబాద్-500 033.

Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.,** Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**